గురువారం
27•6•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 2
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






బుధవారం జలవిహార్‌లో జరిగిన కార్యక్రమంలో శారదాపీఠానికి కేటాయించిన రెండెకరాల భూమికి సంబంధించిన పత్రాలను విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి అందజేస్తున్న సీఎం కేసీఆర్

## రుగ్మతలను పోగొట్టేవి పీఠాలే

2

సీఎం కేసీఆర్ గౌరవించడం ఆనందంగా ఉన్నది..

స్వాత్మానందేంద్రను సమాజానికి అంకితమిచ్చా: శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

జలవిహార్‌లో ఘనంగా శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర పరిచయ కార్యక్రమం

## మేలైన విత్తనక్షేత్రం తెలంగాణ

రైతాంగ అభివృద్ధికి విత్తనమే కీలకం.. ఆహార భద్రతకూ అదే ముఖ్యం

పత్తి విత్తనోత్పత్తిలో భారత్‌దే అగ్రస్థానం.. ఇస్టా సదస్సులో కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరి

విత్తనరంగ అభివృద్ధికి బాటలు వేశారంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందన

దేశ విత్తనరంగంలో తెలంగాణది పెద్దన్న పాత్ర.. ఐరోపా దేశాలకు త్వరలో విత్తనాల ఎగుమతి

రాష్ట్ర వ్యవసాయ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి



3

బుధవారం హైదరాబాద్ హెచ్ఐసీసీలో 'ఇస్టా' సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరి. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, మహమూద్‌అలీ, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రధానకార్యదర్శి పార్థసారథి, ఇస్టా ప్రెసిడెంట్ క్రెగ్ మెక్‌గ్రిల్ తదితరులు కూడా ఉన్నారు.

## వైద్యశాఖలో 1036 పోస్టులు మంజూరు



ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ

సూర్యాపేట, నల్లగొండ బోధన దవాఖానలకు చెరో 518 పోస్టులు

3

## ఎస్-400 క్షిపణులపై రాజీ లేదు!

- వివిధ దేశాలతో సంబంధాల విషయంలో జాతి ప్రయోజనాలకే పెద్దపీట
- అమెరికా విదేశాంగమంత్రి పాంపియోతో భేటీలో విదేశాంగమంత్రి జైశంకర్ స్పష్టీకరణ
- ముడిచమురు దిగుమతుల్లో భారత్‌కు సహకరిస్తామన్న పాంపియో

9



బుధవారం ఢిల్లీలో అమెరికా విదేశాంగ మంత్రి పాంపియోతో సమావేశమైన ప్రధాని నరేంద్రమోదీ

## నూతన సచివాలయం, అసెంబ్లీ భవనాలకు

# భూమిపూజ నేడే

పది గంటలకు కొత్త సచివాలయానికి..

పదకొండు గంటలకు కొత్త అసెంబ్లీకి భూమిపూజ చేయనున్న సీఎం కేసీఆర్

పూర్తి సౌకర్యాలతో నిర్మాణాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సీఎం కేసీఆర్ ఉదయం తొమ్మిది గంటలకు సచివాలయానికి వస్తారు. కొద్దిసేపు తన చాంబర్‌లో ఉండి.. అనంతరం సచివాలయ ప్రాంగణంలో కలియదిరుగుతారు. ఏపీ ఆధ్వర్యంలోని పలు బ్లాకులను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఉదయం పది గంటలకు డీ బ్లాక్ వెనుక భాగంలో పోర్టికో ఎదురుగా ఉన్న గార్డెన్‌లో నూతన సచివాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అనంతరం ఉదయం 11 గంటల సమయంలో ఎర్రమంజిల్‌లోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయం పాత భవనం దగ్గర నూతన అసెంబ్లీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. ఈ కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు బేగంపేటలోని ప్రగతిభవన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లకు సీఎం కేసీఆర్ విందు ఇస్తారు.

**భూమిపూజ స్థలాలను పరిశీలించిన సుద్దాల సుధాకర్‌తేజ**

సచివాలయం, ఎర్రమంజిల్‌లో సీఎం కేసీఆర్ భూమిపూజ చేయనున్న స్థలాలను ప్రముఖ వాస్తు నిపుణుడు సుద్దాల సుధాకర్‌తేజ బుధవారం పరిశీలించి, సలహాలు, సూచనలు ఇచ్చారు. భూమి పూజ నిమిత్తం సచివాలయానికి రానున్న సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్‌అండ్‌బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి స్వాగతం

మిగతా 5వ పేజీలో

## నేటినుంచి టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు

- తొలి సభ్యత్వం స్వీకరించనున్న పార్టీ అధినేత కేసీఆర్
- తెలంగాణభవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం
- పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి చైర్మన్లకు ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభంకానున్నది. తెలంగాణభవన్‌లో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తొలి సభ్యత్వం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు కేసీఆర్ అధ్యక్షతన

మిగతా 2వ పేజీలో

## యజ్ఞంలా హరితహారం

ఆకుపచ్చ తెలంగాణలో భాగస్వాములు కండి

ఐదో విడుత హరితహారం నిర్వహించండి

ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, ప్రజలకు మంత్రి అల్లోల పిలుపు

అరణ్యభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష

5





11

## మెరుపు తగ్గిన పసిడి

రూ.300 తగ్గిన తులం ధర

మూడేండ్ల కనిష్ఠ స్థాయికి డిమాండ్

## ప్రభుత్వ సలహాదారుగా టంకశాల అశోక్

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

నేడు పదవీ బాధ్యతల స్వీకరణ

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సీనియర్ జర్నలిస్టు

2






## ఓడిన జవాను!

భూమి కోసం 14 ఏండ్లపాటు పోరాటం

అధికారుల చుట్టూ తిరిగి తిరిగి ప్రాణాలు వదిలిన బాధితుడు

పోరాటాన్ని కొనసాగిస్తున్న బాధితుడి భార్య




భూమి పత్రాలు చూపుతున్న మాజీ సైనికుడు, దివంగత సూర్యప్రకాశ్ భార్య శశిప్రకాశ్

**మాతృభూమి** కోసం సరిహద్దుల్లో పోరాడిన సైనికుడు.. తన సొంత భూమి కోసం రెవెన్యూ అధికారులపై పోరాడి గెలువలేకపోయాడు. ప్రభుత్వం తనకు ఇచ్చిన భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని సంపాదించలేకపోయాడు. ప్రభుత్వం కేటాయించిన భూమికి అధికారులు కనీసం హద్దులు కూడా చూపించలేకపోయారు. రెవెన్యూ అధికారుల చుట్టూ పద్నాలుగేండ్ల పాటు తిరిగి తిరిగి.. ఆ మాజీ సైనికుడు ప్రమాదవశాత్తు మరణించాడు. ఇప్పుడు ఆయన భార్య తన భర్త భూమి కోసం పోరాడుతున్నారు. రెవెన్యూ అధికారులకు మాత్రం వారి బాధ పట్టడమే లేదు. వీఆర్వో నుంచి కలెక్టర్ దాకా ఏ ఒక్కరూ సమస్యపై దృష్టిసారించిన పాపాన పోలేదు. ఒక సైనికుడు దేశానికి అందించిన సేవలకుగాను సైన్యం నుంచి విరమించిన తర్వాత గౌరవప్రదంగా జీవించడం కోసం ప్రభుత్వం కొంత భూమిని అసైన్ చేస్తుంది. కానీ.. మహబూబ్‌నగర్ జిల్లా చేగూరు గ్రామంలో ఓ మాజీ సైనికుడు ఆ భూమి కోసం శేషజీవితాన్నంతా రెవెన్యూ అధికారులకు సమర్పించుకోవాల్సి వచ్చింది.

4

## తెలంగాణ ఠాణాలు భేష్!

దేశంలోనే 14వ స్థానంలో నిలిచిన సంస్థాన్‌నారాయణపురం

24వ స్థానంలో చింతపల్లి.. 41వ స్థానంలో బెజ్జంకి

దేశంలోని 86 అత్యుత్తమ పోలీస్‌స్టేషన్ల జాబితా విడుదలచేసిన కేంద్ర హోంశాఖ

5

## మరో రెండురోజులు తేలికపాటి వానలు

30న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

బుధవారం పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం

మెదక్‌జిల్లా టేక్మాల్‌లో 29.5 మి.మీటర్లు నమోదు

7





బుధవారం సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగిన కోలేటి దామోదర్ గుప్తా కుమార్తె వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో గవర్నర్ నరసింహన్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కూడా ఉన్నారు.

## ఘనంగా కోలేటి కుమార్తె వివాహం

గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్‌తోపాటు పలువురు ప్రముఖుల హాజరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా కుమార్తె స్నేహ, సందీప్‌కుమార్ వివాహం బుధవారం సికింద్రాబాద్ క్లాసిక్‌గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. వివాహవేడుకలకు గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు మహమూద్‌అలీ, ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ సీఎం రోశయ్య, ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సినీనటుడు ఆర్ నారాయణమూర్తి తదితరులు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.

## రెండోవివాహానికి కల్యాణలక్ష్మి సాయం

- గతంలో లబ్ధిపొందనివారికే వర్తింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళ ఇబ్బందికర పరిస్థితుల్లో రెండో వివాహానికి సిద్ధమైతే కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద గతంలో లబ్ధిపొందనివారికే రెండో వివాహానికి ఆర్థికసహాయం వర్తిస్తుందని పేర్కొంటూ బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.1,00,116 ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. సిద్దిపేట జిల్లా పోతపల్లికి చెందిన పీ చిరంజీవి ప్రభుత్వానికి చేసిన వినతి మేరకు మహిళ రెండో వివాహానికి ఆర్థిక సహాయం అందించే విషయంపై విధివిధానాలను రూపొందించినట్టు చెప్పారు.





ప్రగతిభవన్‌లో సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్‌ను అభినందిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు కూడా ఉన్నారు.

## ప్రభుత్వ సలహాదారుగా టంకశాల అశోక్

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- నేడు పదవీ బాధ్యతల స్వీకరణ
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సీనియర్ జర్నలిస్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీనియర్ జర్నలిస్టు, రచయిత, సాహితీవేత్త టంకశాల అశోక్‌ను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున టంకశాల అశోక్ అంతర్రాష్ట్ర సంబంధాల వ్యవహారాలు చూస్తారు. సచివాలయం డీ బ్లాక్‌లోని కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ సలహాదారుగా అశోక్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వ సలహాదారుడిగా నియమించిన వెంటనే బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములుతో కలిసి అశోక్ ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తానని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర సంబంధాలు చాలా ముఖ్యమైనవని, వాటిని అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తానన్నారు.

### జర్నలిస్టుగా వివిధ హోదాల్లో..

టంకశాల అశోక్ 1950 జూన్‌లో వరంగల్ జిల్లా మడికొండలో నరసింహారావు, నాగేశ్వరమ్మ దంపతులకు జన్మించారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీలో బీఏ, ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ (హిస్టరీ), జేఎన్‌యూలో ఎంఫిల్ చదివారు. అంతర్జాతీయ వ్యవహారాలపై పీహెచ్‌డీలో చేరినా.. వివిధ కారణాల వల్ల పూర్తిచేయలేకపోయారు. జర్నలిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించిన అశోక్.. 1967-72 మధ్య జనధర్మ, ఆంధ్రజనత, నవ్యాంధ్ర, ఈనాడు, ఆంధ్రభూమి పత్రికల్లో విధులు నిర్వర్తించారు. ఉదయం, ఆంధ్రప్రభ, వార్త, హన్స్ ఇండియా దినపత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. రచయితగా, అనువాదకుడిగా అనేక అవార్డులు అందుకున్నారు.

### టంకశాల అందుకున్న పురస్కారాలు

పాములపర్తి సదాశివరావు పురస్కారం, కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు పురస్కారం, ఏటుకూరి బలరామమూర్తి పురస్కారం, తాపీ ధర్మారావు పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం జీవనసాఫల్య పురస్కారం, తెలంగాణ ప్రభుత్వ ఉత్తమ పాత్రికేయ పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ ఉత్తమ అనువాద పురస్కారం, మాదాల వీరభద్రరావు పురస్కారం అందుకొన్నారు.

### తెలంగాణ భావజాలం వైపే 'టంకశాల': అల్లం నారాయణ

'తెలంగాణ ఉద్యమాన్ని అవగాహన చేసుకుని, విశ్లేషించి, తెలంగాణ భావజాలం వైపు నిలబడ్డ పక్కా తెలంగాణవాది టంకశాల అశోక్' అని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ కొనియాడారు. ఉద్యమంలో క్రియాశీలపాత్ర పోషించిన అశోక్‌కు సలహాదారు పదవి రావడం తెలంగాణ జర్నలిస్టులకు దక్కిన గౌరవంగా భావించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారుగా టంకశాల అశోక్ నియామకంపై టీయూడబ్ల్యూజే నాయకులు మారుతిసాగర్, ఇస్మాయిల్ హర్షం వ్యక్తంచేశారు. అశోక్‌కు కీలక బాధ్యతలు అప్పగించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# రుగ్మతలను పోగొట్టేవి పీఠాలే

- సీఎం కేసీఆర్ గౌరవించడం ఆనందంగా ఉన్నది
- విశాఖ శారదాపీఠాధిపతి స్వామీ స్వరూపానంద
- జలవిహార్‌లో ఘనంగా శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర పరిచయ కార్యక్రమం
- స్వాములిద్దరికీ పుష్పాభిషేకం చేసిన సీఎం కేసీఆర్



బుధవారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిని గజమాలతో సత్కరిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మనిషిలోని మానసిక రుగ్మతలన్నింటినీ దూరంచేసి ప్రశాంతతను కల్పించే ఆరోగ్య కేంద్రాలే పీఠాలు, మఠాలు అని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. భారతదేశానికి ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదించే పీఠాలు అవసరమని.. వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం కే చంద్రశేఖర్‌రావుకు తమ శారదాపీఠంపై ఎంతో గౌరవం ఉన్నదని, తెలంగాణలో ధర్మ ప్రచారం చేయాలని, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారన్నారు. ఉన్నతమైన భావాలతో అందరికీ ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టేందుకు శారదాపీఠానికి స్థలాన్ని ఇవ్వడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో దాని చైర్మన్ రామరాజు నేతృత్వంలో బుధవారం శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వీ శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, శారదాపీఠం ట్రస్టు సీఈవో కామేశ్వరశర్మ, ట్రస్టు సభ్యులు సుబ్బారావు, మిరియాల రాఘవరావు పాల్గొన్నారు. స్వరూపానందేంద్ర సరస్వతికి సీఎం కేసీఆర్ వేద నాదాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలనచేశారు. స్వరూపానంద, స్వాత్మానందలకు సీఎం కేసీఆర్ పుష్పాభిషేకంచేశారు. తులసిమాల, నూతన వస్త్రాలు, ఫలాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం శారదాపీఠానికి కేటాయించిన రెండెకరాల భూమికి సంబంధించిన పత్రాలను స్వరూపానందకు సీఎం కేసీఆర్ అందజేశారు. అనంతరం స్వరూపానంద మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉన్నదన్నారు. హిమాలయాల నుంచి గంగాప్రవాహంలా పుట్టుకొచ్చిన పీఠం శారదాపీఠమని, ఆది శంకరులు ఏ అద్వైత తత్వాన్ని బోధించారో ఆ అద్వైత తత్వాన్ని ప్రచారం చేస్తున్న పీఠం తమదని తెలిపారు. యావత్‌దేశం కులం, మతం, జాతి, వర్గభేదాలు లేకుండా మమేకమవ్వాలని తెలిపారు. కృష్ణాతీరాన తెలంగాణ, ఏపీ సీఎంలు కేసీఆర్, జగన్ సమక్షంలో స్వాత్మానందేంద్రను సమాజానికి అంకితం చేసింది రాజశ్యామల అమ్మవారని స్వరూపానంద తెలిపారు. ప్రతి ఒక్కరిలో పరమాత్మ ఒక్కడేనని బోధించే శారదా పీఠాన్ని సీఎం కేసీఆర్ గౌరవించడం ఆనందంగా ఉన్నదన్నారు.

### ఆస్తులకోసం ఆశపడలేదు

**విశాఖ పీఠం** ఏనాడు కూడా ఆస్తుల కోసం కానీ, కీర్తి కోసం కానీ, ప్రతిష్ఠల కోసం కానీ ఆశపడలేదని స్వరూపానంద తెలిపారు. గత 25 ఏండ్లుగా ధర్మం కోసం ప్రచారం చేయడమే తప్ప, ఆస్తులు సంపాదించలేదన్నారు. తాను ఎక్కువగా ఉండేది తెలంగాణలోనే అన్నారు. కార్తీకమాసంలో ప్రతి సంవత్సరం 15 రోజులపాటు ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంట్లో ఉంటానన్నారు. ఇకపై స్వాత్మానందే అందరికీ జ్ఞానబోధ చేస్తారని చెప్పారు. మూడునెలలు గంగానది తీరాన రాజశ్యామల తపస్సు, ఉపాసనచేసి, మొదటి చాతుర్మాస్యం పూర్తయిన తర్వాత రాజశ్యామల అమ్మవారి దర్శనం చేసుకొని.. వెనువెంటనే వరంగల్‌లోని కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంట్లో దేవీనవరాత్రులు ప్రారంభిస్తారని, అక్కడినుంచి మిగిలిన జిల్లాల్లో ధర్మప్రచారం చేయాలని ఆదేశిస్తున్నట్లు చెప్పారు. శారదాపీఠం ఉత్తరాధికారిని పరిచయం చేయడానికి ఇంత గొప్పవేదికను ఏర్పాటుచేసినందుకు సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజానీకానికి ఆయన రాజశ్యామల అమ్మవారి అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని ఆశీర్వదించారు. శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర మాట్లాడుతూ శంకర అద్వైతాన్ని తెలుగునాటే కాకుండా భారతదేశమంతటా ప్రచారంచేయాలని తమ గురువు స్వరూపానంద ఆదేశించారన్నారు. సన్యాసం స్వీకరించిన తరువాత తపస్సు చేయాలని నిర్ణయించామని, సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో పరిచయసభ ఏర్పాటుచేస్తున్నారని, ఆ సభకు హాజరైన తర్వాత వెళ్లాలని తమ గురువు ఆదేశించడంతో తాను ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత రుషికేష్‌కు పయనమవుతున్నట్లు స్వాత్మానందేంద్ర తెలిపారు.



టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద

## టీఆర్‌ఎస్ కార్యాలయాలకు విరాళాలు

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అందించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ జిల్లా కార్యాలయాల నిర్మాణానికి విరాళాలు అందించడానికి పలువురు ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును బుధవారం కలిసి ఒక్కొక్కరు తమ నెల వేతనం రూ.2.5 లక్షల చెక్కులను విరాళంగా అందించారు. విరాళాలు అందించినవారిలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్ ఉన్నారు.





కేటీఆర్‌ను కలిసి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్

### ముహూర్తం

సూర్యోదయం: 5.48 గంటలకు

సూర్యాస్తమయం: 6.50 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, కృష్ణపక్షం, దశమి, నక్షత్రం: రేవతి ఉదయం 7.44 వరకు, తదుపరి అశ్విని, అమృత ఘడియలు: తె.జా. 5.08 నుంచి ఉదయం 6.44 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.57 నుంచి 3.35 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.22 నుంచి సాయంత్రం 5.06 వరకు, వర్జ్యం: లేదు.

### లోకం పోకడ




# ప్రధాన ఎజెండా గోదావరి!

- ఏటా సముద్రంలోకి వృథాగా వేల టీఎంసీలు
- కృష్ణాబేసిన్‌కు తరలింపునకు ప్రతిపాదనలు
- చర్చించనున్న ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్
- రేపు ప్రగతిభవన్‌లో ఇద్దరు సీఎంల సమావేశం
- రెండురోజులపాటు కొనసాగనున్న భేటీ
- జూలై మూడున గవర్నర్ సమక్షంలో ఇరు రాష్ట్రాల సీఎస్‌ల సమావేశం





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒకవైపు కృష్ణా నదిలో జలాల లభ్యత సంక్లిష్టంగా మారుతుంటే.. మరోవైపు గోదావరి నుంచి ఏటా మూడు వేల టీఎంసీలకుపైగా జలాలు సముద్రం పాలవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గోదావరి జలాల సమగ్ర వినియోగంపై ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టిసారించనున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణం నేపథ్యంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం కేసీఆర్, జగన్.. ప్రగతిభవన్‌లో సమావేశమై అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలు, ఇతర అంశాలపై చర్చించనున్నారు. రెండ్రోజులపాటు జరిగే ఈ భేటీలో ప్రధానంగా జలవనరులకు సంబంధించి.. ప్రత్యేకించి గోదావరి జలాల సమగ్ర వినియోగంపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. కృష్ణా బేసిన్‌లో రెండు రాష్ట్రాలకు తగినంత జలాలు లభ్యం కావటంలేదు. దీంతో వచ్చిన నీటిని రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు క్లిష్టంగా పంపిణీ చేసుకోవాల్సి వస్తున్నది. మరోవైపు గోదావరి జలాల్లో ఏటా మూడు వేల టీఎంసీలకు పైగా నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి జలాల వినియోగంపై ప్రత్యేకంగా దృష్టిసారించిన సీఎం కేసీఆర్.. తెలంగాణ వాటాకు లోబడి అత్యధిక జలాల్ని వినియోగించుకునేందుకు కాళేశ్వరం, సీతారామ, తుపాకులగూడెం వంటి ప్రాజెక్టులను చేపట్టారు. ఈ ఏడాది నుంచి కాళేశ్వరంతో గోదావరి జలాల వినియోగం గణనీయంగా పెరుగనున్నది. అయినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాలకు ఉన్న వాటాను బేరీజు వేసుకుంటే వినియోగం చాలా తక్కువ ఉన్నది. ఈ పరిస్థితుల్లో నీటి లభ్యత ఆధారంగా ప్రాజెక్టులను చేపడితే రెండు రాష్ట్రాల్లోనూ ప్రతి ఎకరాకు సాగునీరు అందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనేది సీఎం కేసీఆర్ ఉద్దేశం. అందుకే ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధానంగా గోదావరిజలాలను కృష్ణా బేసిన్‌కు తరలించే ప్రతిపాదనలపైనే విస్తృతంగా చర్చించే అవకాశమున్నది. అవసరమైతే నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌కు కూడా గోదావరి జలాల తరలింపునకు చర్యలు చేపడితే రెండు రాష్ట్రాల్లోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు వీలవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పోలవరం కుడికాల్వ నుంచి కృష్ణా డెల్టా.. తద్వారా వ్యతిరేక దిశలో పులిచింతల, నాగార్జునసాగర్.. అక్కడినుంచి శ్రీశైలానికి గోదావరిజలాల తరలింపు అనే ప్రతిపాదన కూడా వినిపిస్తున్నది.

### విభజన సమస్యలతోపాటు పలు అంశాలపైనా..

**ఢిల్లీలోని** ఏపీభవన్, విభజన చట్టంలో అపరిష్కృత సమస్యలపైనా చర్చించే అవకాశం ఉన్నది. తొమ్మిదో షెడ్యూల్లో 91 సంస్థలు, పదో షెడ్యూల్లో 142 సంస్థల వివాదాలు అపరిష్కృతంగా ఉన్నాయి. తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విషయంలో షీలాబిడే కమిటీ సిఫారసులపై తెలంగాణ సంతృప్తిగా లేదు. తొమ్మిదో షెడ్యూల్ సంస్థల ప్రధాన కార్యాలయాల విషయంలో ఏపీ గతంలో వివాదాస్పదంగా వ్యవహరించింది. పదో షెడ్యూల్ సంస్థల విభజనపైనా వివాదాలను పరిష్కరించుకోవాల్సి ఉన్నది. మరోవైపు.. పౌరసరఫరాలశాఖ నుంచి కేంద్రం ఇచ్చే లెవీలో వాటాగా రూ.1775 కోట్లు రావాలని ఏపీ వాదిస్తున్నది. ఇప్పటికే లెవీలో వాటాను కొంత మేరకు ఏపీ వాడుకున్నదని, ఇక వాళ్లకు వచ్చే మొత్తం రూ.650 కోట్లు మాత్రమేనని తెలంగాణ చెప్తున్నది. ఇక.. విద్యుత్‌శాఖలో ఉద్యోగుల విభజన, ఆర్థిక లావాదేవీలు వివాదాస్పదంగా ఉన్నాయి. తెలంగాణకు కేటాయించిన ఉద్యోగులకు అప్పట్లో వర్క్ ఆర్డర్ ఇవ్వలేదు. విధులు నిర్వర్తించకున్నా కోర్టు ఆదేశాల మేరకు వారికి జీతభత్యాలు చెల్లిస్తున్నది. ఫలితంగా విద్యుత్‌శాఖపై అదనపు ఆర్థికభారం పడుతున్నది. అలాగే.. తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి తమకు రూ.3378 కోట్లు రావాలని ఏపీ, ఆ మొత్తం చెల్లింపులు జరిగిపోగా ఏపీ నుంచే తమకు రూ.2405 కోట్లు రావాలని తెలంగాణ చెప్తున్నాయి. ఈ విషయంలోనూ ఒక నిర్ణయం వెలువడుతుందని అధికారులు భావిస్తున్నారు. సీఎంల సమావేశం అనంతరం రెండు రాష్ట్రాల సీఎస్‌లు గవర్నర్ నరసింహన్ సమక్షంలో జూలై 3న చర్చలు జరుపనున్నారు.

## ఒరవడి పెంచిన గోదావరి

- కన్నెపల్లి వద్ద ఆరువేల క్యూసెక్కుల వరకు ప్రవాహం
- నీటి ఎత్తిపోతకు మోటర్లను సిద్ధంచేస్తున్న ఇంజినీర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గోదావరిలో వరద ప్రవాహం నెమ్మదిగా పెరుగుతున్నది. ప్రాణహిత నుంచి ఇన్‌ఫ్లో పెరుగడంతో మేడిగడ్డ బరాజ్ వైపు వచ్చే వరద ఒరవడి ఎక్కువైంది. కన్నెపల్లి పంపుహౌస్ వద్ద గోదావరిలో సుమారు ఆరువేల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం ఉన్నట్టు ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. నీటి ప్రవాహం పెరుగుతుండటంతో కాళేశ్వరం మోటర్లను ఇంజినీర్లు సిద్ధం చేస్తున్నారు. కన్నెపల్లి పంపుహౌస్‌లో ఆరు మోటర్లను నడిపేందుకు గతంలోనే నిర్ణయించిన ఇంజినీర్లు.. ఆ మేరకు అన్ని రకాల సాంకేతిక జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఆరు మోటర్ల ద్వారా దాదాపు ఒక్క టీఎంసీకి పైగా ఎత్తిపోసేందుకు వీలవుతుంది. ఈ నేపథ్యంలో కన్నెపల్లి నుంచి జలాల్ని ఎత్తిపోసి అన్నారం బరాజ్‌కు తరలించనున్నారు. అక్కడ కూడా నీటి లభ్యత పెరిగిన తర్వాత ఆపై సుందిల్ల పంపుహౌసుల్లోనూ మోటర్లను నడిపి ఎల్లంపల్లి జలాశయానికి జలాల్ని తరలించాలని అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఈ మేరకు మూడు పంపుహౌసుల్లోని మోటర్లను ఇంజినీర్లు పరిశీలించారు.



## బోనాల పండుగకు రూ.15 కోట్లు

మంజూరుచేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే బోనాల పండుగ ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులిచ్చింది. నిధుల మంజూరుతో బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు.

# నేటినుంచి టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు

మొదటిపేజీ తరువాయి...

టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు, పార్టీ తరపున ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, మేయర్లను కూడా ఆహ్వానించారు. ఈ సమావేశంలో ప్రధానంగా సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణంపై సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. సభ్యత్వ నమోదును పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పర్యవేక్షించనున్నారు. సమావేశానికి వచ్చిన ముఖ్యులందరూ సభ్యత్వాలను స్వీకరించడానికి తెలంగాణభవన్‌లో 11 కౌంటర్లు ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. సాధారణ సభ్యత్వానికి రూ.30, క్రియాశీల సభ్యత్వానికి రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. సభ్యత్వం తీసుకున్న వారికి రెండు లక్షల ప్రమాదబీమా ఉంటుంది. ఈసారి మరింత పకడ్బందీగా పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించనున్నారు. సభ్యత్వం తీసుకున్నవారి వివరాలను కంప్యూటరీకరిస్తారు. సభ్యుల ఆధార్, ఫోన్ నంబర్ సేకరిస్తున్నారు. వాటన్నింటినీ కంప్యూటర్‌లో భద్రపర్చటంద్వారా భవిష్యత్తులో వారితో నేరుగా ఫోన్‌లో మాట్లాడటం, టెలికాన్ఫరెన్సుల్లో భాగస్వాములను చేయటం తదితరాలకు వినియోగిస్తారు. జూలై నెలాఖరుకల్లా గ్రామ కమిటీలను ఎన్నుకోనున్నారు. గతానికి భిన్నంగా ఈసారి గ్రామస్థాయిలో కూడా సామాజికవర్గాలవారీగా కమిటీలను నియమించాలని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ గ్రామ, మండల కమిటీల ఎన్నికల పరిశీలకులుగా ఒకటి లేదా రెండు నియోజకవర్గాలకు ఒకరి చొప్పున నియమించనున్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగా ఇప్పటికే ప్రతి జిల్లాలో శాశ్వత కార్యాలయాలకు శంకుస్థాపన పూర్తిచేశారు. దసరానాటికి కార్యాలయాల నిర్మాణం పూర్తికావాలని సీఎం కేసీఆర్ లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు అవసరమైన నిధులను కూడా కేటాయించారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌ను అన్ని ఎన్నికల్లోనూ ప్రజలు ఆదరించారు. ఈ నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోనున్నారు. గతంకంటే ఎక్కువగా సభ్యత్వం నమోదు అవుతుందని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే సభ్యత్వ నమోదు పుస్తకాల ముద్రణ పూర్తి అయింది.

# మేలైన విత్తన క్షేత్రం తెలంగాణ

విత్తనోత్పత్తికి అనుకూలమైన ప్రాంతం.. రైతాంగ అభివృద్ధికి విత్తనమే కీలకం

పత్తి విత్తనోత్పత్తిలో భారత్‌దే అగ్రస్థానం: ఇస్టా సదస్సులో కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరి

విత్తనరంగ అభివృద్ధికి బాటలు వేశారంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందన

- **దేశ విత్తనరంగంలో తెలంగాణది పెద్దన్న పాత్ర**
- **ఐరోపా దేశాలకు త్వరలో విత్తనాల ఎగుమతి**
- **రాష్ట్ర వ్యవసాయ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో విత్తనాల ఉత్పత్తికి అనువైన వాతావరణం తెలంగాణలోనే ఉందని, అందుకే దేశవ్యాప్తంగా 500కుపైగా విత్తనోత్పత్తి సంస్థలుంటే ఒక్క తెలంగాణలోనే 400కుపైగా ఉన్నాయని కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి కైలాశ్‌చౌదరి అన్నారు. తెలంగాణలో విత్తనరంగ అభివృద్ధికి బాటలు వేశారంటూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కేంద్రమంత్రి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో బుధవారం విత్తన పరిశోధన అథారిటీ- 2019 (ఐఎస్‌టీఏ- ఇస్టా) 32వ సదస్సును కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతాంగ అభివృద్ధికి, దేశ ఆహార భద్రతకు విత్తనమే కీలకమని చెప్పారు. ఆసియాలో తొలిసారి విత్తన సదస్సు భారతదేశంలో జరుగడం గర్వకారణమన్నారు. ప్రపంచంలో పత్తి విత్తన ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉన్నదని చెప్పారు. వరి, గోధుమ, మొక్కజొన్న, శనగ, వేరుశనగ, కూరగాయలలో మేలైన విత్తనాల ఉత్పత్తి దేశంలోనే జరుగుతున్నదన్నారు.




**నాణ్యమైన విత్తనాలతోనే ఉత్పాదకత పెంపు**

దేశంలో 60% మంది ఆధారపడిన వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే దేశం ఆర్థిక పరిపుష్టి సాధిస్తుందని కేంద్రమంత్రి కైలాశ్‌చౌదరి చెప్పారు. వ్యవసాయ ఉత్పాదకత పెంచాలంటే నాణ్యమైన విత్తనాలను రైతులకు సరఫరా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో భారతీయ విత్తన పరిశ్రమ వేగంగా ఎదుగుతున్నదని చెప్పారు. రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కేంద్రప్రభుత్వం కృషిచేస్తున్నదని తెలిపారు. దేశంలో వందకు పైగా వ్యవసాయ పరిశోధనాసంస్థలు, 60కి పైగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు విత్తనాలు, పంటల అభివృద్ధిపై రైతులకు సహకారం అందిస్తున్నాయని చెప్పారు. ఒక జాతీయస్థాయి, 16 రాష్ట్రస్థాయి విత్తన కార్పొరేషన్లు, 26 రాష్ట్ర విత్తన ధ్రువీకరణ ఏజెన్సీలు, విత్తన లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీ ద్వారా విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్నట్టు తెలిపారు. 1966లోనే దేశంలో దేశానికి విత్తన చట్టం రూపొందించుకుని, నాణ్యమయిన విత్తనాలు రైతులకు అందించేందుకు కృషి జరుగుతున్నదని, దానిని కొనసాగిస్తామని చెప్పారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ కింద ఏడాదికి ఐదెకరాలకు రూ.6వేలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఎరువులను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో ఇస్టా ప్రెసిడెంట్ క్రెగ్ మెక్‌గ్రిల్, జాతీయ విత్తన సంయుక్త కార్యదర్శి అశ్వనీకుమార్, రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జా, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌కుమార్, ఇస్టా కోఆర్డినేటర్ డాక్టర్ కే కేశవులు, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు, ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్, ఇస్టా కోఆర్డినేటర్ కేశవులు వందన సమర్పణతో తొలిరోజు సదస్సు ముగిసింది. గురువారం సదస్సులో కీలకమయిన విత్తనోత్పత్తి రైతుల సమావేశం జరుగనుంది.



బుధవారం హెచ్‌ఐసీసీలో అంతర్జాతీయ విత్తన సదస్సును ప్రారంభించిన సందర్భంగా సేంద్రియ కూరగాయలను చూపుతున్న కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి కైలాస్ చౌదరి, హోంమంత్రి మహమూద్ అలీ, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, రైతు సమన్వయ సంఘం అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

**నాణ్యతకు ఆదరణ ఉంటుంది: మహమూద్ అలీ**

నాణ్యమైన ఉత్పత్తులకు ఎల్లప్పుడూ ఆదరణ ఉంటుందని, తెలంగాణ విత్తనాలు దేశవ్యాప్తంగా ఆదరణ పొందడానికి అదే కారణమని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. అంతర్జాతీయ విత్తన సదస్సుకు గౌరవ అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇస్టా సదస్సుతో విత్తన పరీక్షా ప్రమాణాలు మన రైతులకు, నిపుణులకు తెలుస్తాయని, దానికి అనుగుణంగా పంటలు పండించి విత్తనాలను రూపొందించడం మూలంగా జాతీయంగా, అంతర్జాతీయంగా తెలంగాణ విత్తనాలకు మరింత డిమాండ్ పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అమలుచేయడమే కాకుండా వ్యవసాయాభివృద్ధికి ఎంతో దోహదంచేసే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామన్నారు. వివిధ దేశాల విత్తన అవసరాలు, ప్రమాణాలు పరస్పరం తెలుసుకునేందుకు అంతర్జాతీయ విత్తన సదస్సు ఉపయోగపడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రధానకార్యదర్శి పార్థసారథిచెప్పారు. తెలంగాణ విత్తనబ్రాండ్‌ను అంతర్జాతీయంగా మార్కెట్ చేయటాని ఈ సదస్సు దోహదం చేస్తుందని చెప్పారు.

## ఇస్టాసదస్సులో సాంస్కృతిక వైభవం

ఇస్టా సదస్సు సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ, తెలంగాణ కళా ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. 80 దేశాల నుంచి వచ్చిన 800 మంది ప్రతినిధులు ఈ నృత్యాలకు ఫిదా ఆయ్యారు. అంతర్జాతీయ విత్తన సదస్సు వేదికపై ఒగ్గుడోలు తదితర తెలంగాణ కళారూపాలు ప్రతినిధులను విశేషంగా ఆక్టుకున్నాయి. చర్చల మధ్యలో ప్రతినిధులకు మానసికోల్లాసం కలిగించేందుకు సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ సారథ్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.


తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శనలో అలరించిన కళాకారులు

## ఇస్టా సర్టిఫికేషన్ సీడ్ పాస్‌పోర్ట్

- విత్తన నాణ్యతతోనే అధిక దిగుబడి
- కల్తీ విత్తనాల వల్లే రైతుల ఆత్మహత్యలు
- ఇస్టా సెక్రటరీ జనరల్ ఆండ్రూవాయిస్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగడంలో విత్తన నాణ్యతే ప్రధానమని ఇస్టా సెక్రటరీ జనరల్ ఆండ్రూ వాయిస్ అన్నారు. బుధవారం ఇస్టా కాంగ్రెస్ సమావేశాలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. అధిక దిగుబడులు సాధించడానికి మెరుగైన విత్తనాలు అందేందుకు నాణ్యత పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ అందించడమే తమ బాధ్యతని చెప్పారు. తాము ఇచ్చే సర్టిఫికెట్ ఒకరకంగా సీడ్‌పాస్‌పోర్టు లాంటిదన్నారు. అంతర్జాతీయ విత్తన వ్యాపారంలో ఇస్టా సర్టిఫికేషన్ కీలమని చెప్పారు. అమెరికా, యూరప్ తదితర 80 దేశాల్లో విత్తన రవాణాకు ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో ఇస్టా సర్టిఫికేట్ అవసరని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ల్యాబ్‌లలో విత్తనాల నాణ్యతను గుర్తించి, అవి సర్లైన ప్రమాణాలతో ఉన్నాయని తేలితేనే ఆ విత్తన కంపెనీలకు సర్టిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ఏ విత్తనాల ద్వారా ఎలాంటి లబ్ధి చేకూరుతుందో ప్రభుత్వాలకు , రైతులకు వివరించి ఆహార భద్రతపై అవగాహన కల్పించడమే ఇస్టా లక్ష్యమని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు ఉపయోగిస్తే పంట దిగుబడి అధికంగా వస్తుందని అన్నారు. సరైన విత్తనాలు వినియోగించకపోవడం వల్ల భారతదేశంలో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. వాటిని అరికట్టాలంటే నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలో రైతులు ప్రతి ఒక్కరు వానల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉన్నదని, ప్రాజెక్టులు నిర్మించి, నీటిని వ్యవసాయం కోసం వినియోగిస్తే రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. భారతదేశంలో కల్తీ విత్తనాలను రైతులు కొనుగోలు చేసి, వినియోగించడం వల్ల విపత్తులు సంభవిస్తున్నాయని అన్నారు. రైతులు ఎక్కువ పెట్టుబడులు పెట్టి పండించినా సరైన దిగుబడులు రాక నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితి ప్రభుత్వాలకు క్లిష్టంగా మారుతున్నదని పేర్కొన్నారు. ప్రతి మూడేండ్లకోసారి వార్షిక సమావేశాల్లో ఎన్నికలు నిర్వహించి, ఇస్టా అధ్యక్షుడిని, కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు.

## విత్తనోత్పత్తికి చిరునామా తెలంగాణ

- **వ్యవసాయ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి**

భారతదేశ విత్తన పరిశ్రమలో తెలంగాణ పెద్దన్న పాత్ర పోషిస్తున్నదని, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కృషితో గత ఐదేండ్లలో తెలంగాణ విత్తనోత్పత్తికి చిరునామాగా మారిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ విత్తన భాండాగారంగా తెలంగాణ ఎదిగేందుకు అంతర్జాతీయ విత్తన సదస్సు దోహదపడుతుందని చెప్పారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో జరుగుతున్న అంతర్జాతీయ విత్తన సదస్సుకు ఆయన గౌరవ అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రైవేటు విత్తనరంగ సంస్థలకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తూనే, ప్రభుత్వ విత్తనరంగ సంస్థలను బలోపేతం చేస్తామని చెప్పారు. విత్తన నాణ్యత, సరఫరా పెరిగేందుకు మరిన్ని పరిశోధనలు నిర్వహించాలని నిరంజన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆధునిక శాస్త్రీయతను విత్తనానికి ఆపాదించి, నాణ్యమైన విత్తనాలను రూపొందించాలని శాస్త్రవేత్తలను కోరారు. తెలంగాణ నుంచి ఏడాదికి 65 లక్షల క్వింటాళ్ల విత్తనాలు ఉత్పత్తి అవుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) విత్తన ధ్రువీకరణ వ్యవస్థ ద్వారా పలు దేశాలకు తెలంగాణ నుంచి విత్తనాల ఎగుమతి కొనసాగుతున్నదని చెప్పారు. ఐరోపా దేశాలకు కావాల్సిన విత్తనాలను దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా దేశాలు ఉత్పత్తి చేస్తున్నాయని, అయితే.. భారత దేశం నుంచి విత్తనాల ఎగుమతికి అన్ని రకాల పరీక్షలు పూర్తి చేసుకున్నామని తెలిపారు. త్వరలో అనుమతులు రాగానే తెలంగాణ నుంచి విత్తనాల ఎగుమతి ప్రారంభిస్తామన్నారు. విత్తనోత్పత్తిపై రైతాంగానికి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, వారికి మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం విత్తనోత్పత్తిలో కీలకంగా ఎదిగేందుకు ప్రభుత్వ విధానాలు, ఇక్కడి అనుకూల వాతావరణం, తెలంగాణ రైతుల శ్రద్ధతోపాటు పరిశోధన సంస్థల సహకారం ఉన్నదని చెప్పారు. మానవ మనుగడకు ఆహార పంటల సాగు అత్యంత కీలకమని మంత్రి అన్నారు. నాణ్యమైన విత్తనాలు లేకుంటే ఇది సాధ్యం కాదన్నారు.




నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
(రాష్ట్ర చట్టం క్రింద స్థాపించబడిన విశ్వ విద్యాలయం), పంజాగుట్ట::హైదరాబాద్
ఫైల్ నం. AC2/136/2019/B.Sc(N)/BPT నోటిఫికేషన్ తేది: 25.06.2019
2019 సం||కొరకు B.Sc (నర్సింగ్)-100 సీట్లు మరియు బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపి (BPT)- 50 సీట్ల నందు ప్రవేశం కొరకు తెలంగాణ రాష్ట్రం యొక్క అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నవి. ఆన్‌లైన్ దరఖాస్తు, ప్రాస్పెక్టస్ కొరకు మరియు ఏవేని అప్‌డేట్స్ కొరకు కూడా వెబ్‌సైట్: www.nims.edu.in చూడవల్సిందిగా అభ్యర్థుల్ని కోరడమైనది. ప్రాస్పెక్టస్ (అనెగ్జర్I) నందు వివరించబడిన విధంగా సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటుగా ఆన్‌లైన్ దరఖాస్తు యొక్క హార్డ్ కాపీని అసోసియేట్ డీన్, అకడమిక్-2, 2వ అంతస్తు, ఓల్డ్ OPD బ్లాక్, NIMS, పంజాగుట్ట, హైదరాబాద్-500082, తెలంగాణ వారికి స్వయంగా దాఖలు చెయ్యగలరు లేదా తపాల ద్వారా (ప్రత్యేకించి భారత తపాలసేవల ద్వారా) తేది: 12.07.2019న సా. 5.00 గం||ల లోగా చేరు విధంగా పంపగలరు.
సం/- I/C డీన్
DIPR RO. No. 443-DP/CL/Advt/1/2019-20, Dt: 26/06/2019

## నేటితో ముగియనున్న ఈసెట్ కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి కొనసాగుతున్న ఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారంతో ముగియనున్నదని కన్వీనర్ నవీన్‌మిత్తల్ తెలిపారు. ఈ నెల 28న ఫ్రీజింగ్ డేగా ప్రకటించారు. 29న ఈసెట్- 2019 సీట్లను కేటాయిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 16,603 మంది విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయి, వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి నమోదు చేసుకున్నట్టు తెలిపారు.

## వైద్యశాఖలో 1036 పోస్టులు మంజూరు

- ఉత్తర్వులు జారీచేసిన ఆర్థికశాఖ
- సూర్యాపేట, నల్లగొండ బోధన దవాఖానలకు చెరో 518 పోస్టులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిరుద్యోగులకు రాష్ట్ర సర్కారు శుభవార్త వినిపించింది. వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో భారీ సంఖ్యలో పోస్టుల భర్తీకి సిద్ధమైంది. వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో పలు విభాగాలకు సంబంధించిన 1036 పోస్టులను మంజూరుచేస్తూ ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం భర్తీ చేయనున్న మొత్తం 1036 పోస్టుల్లో 132 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 904 పారామెడికల్, నాన్‌మెడికల్, గెజిటెడ్‌స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇవి కొత్తగా ఏర్పాటుచేసిన నల్లగొండ, సూర్యాపేట బోధన దవాఖానలకు సంబంధించి చెరో 518 పోస్టులని వెల్లడించారు.

### ఆర్థికశాఖ అనుమతించిన పోస్టులు.. క్యాటగిరీలవారీగా

| పోస్టు క్యాటగిరీ | సూర్యాపేట, నల్లగొండ బోధన రెండు వైద్య కళాశాలల్లో పోస్టుల సంఖ్య (విడివిడిగా) |
|---|---|
| అసిస్టెంట్ ప్రొఫెసర్ | 66 |
| ల్యాబ్‌టెక్నీషియన్/టెక్నీషియన్ | 37 |
| స్టోర్‌కీపర్/క్లర్క్/కంప్యూటర్ ఆపరేటర్ | 22 |
| ఈసీజీ టెక్నీషియన్ | 1 |
| చైల్డ్ సైకాలజిస్ట్ | 1 |
| ఫిజియోథెరపిస్ట్ (జోనల్) | 2 |
| ఆడియోమెట్రిక్ టెక్నీషియన్ | 1 |
| స్పీచ్ థెరపిస్ట్ | 1 |
| రెఫ్రాక్షనిస్ట్/ఆప్టిషియన్ | 1 |
| రేడియోగ్రఫిక్ టెక్నీషియన్ | 8 |
| అనస్థీషియా టెక్నీషియన్ | 6 |
| డెంటల్ టెక్నీషియన్ | 4 |
| లైబ్రేరియన్ | 1 |
| ఆడియో విజువల్ టెక్నీషియన్ | 3 |
| ఫొటోగ్రాఫర్ | 1 |
| స్టాఫ్‌నర్స్ (జోనల్) | 328 |
| బయోమెడికల్ ఇంజినీర్ | 1 |
| బయోమెడికల్ టెక్నీషియన్ | 1 |
| ఫార్మసిస్ట్ | 12 |
| జూనియర్ అసిస్టెంట్ | 21 |
| మొత్తం | 518 |

## ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్ జూలై 1కి వాయిదా

**నేటినుంచి యథావిధిగా సర్టిఫికెట్ల పరిశీలన.. జూలై 6న తొలి విడుత సీట్ల కేటాయింపు**

**ఎంసెట్ కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులుచేసిన ఉన్నత విద్యామండలి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గురువారం నుంచి ప్రారంభంకావాల్సిన ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ జూలై ఒకటో తేదీకి వాయిదాపడింది. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఎంసెట్ కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులుచేస్తూ ఎంసెట్ అడ్మిషన్ కమిటీ నిర్ణయించింది. వెబ్ కౌన్సెలింగ్‌ను జూలై ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తాజా షెడ్యూల్ ప్రకారం గురువారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుంది. జూలై 4న వెబ్‌ఆప్షన్లకు ఫ్రీజింగ్‌డేగా ప్రకటించారు. జూలై 6న ఎంసెట్ - 2019 తొలి విడత సీట్ల కేటాయింపు చేపడుతారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించిన ట్యూషన్ ఫీజుల నిర్ణయం ఖరారుకాలేదు. దీంతో వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులకు ఏయే కాలేజీల్లో.. ఎంతెంత ఫీజులు ఉంటాయన్న వివరాలు ప్రస్తుతం ఎవరికీ తెలిసే అవకాశాలులేవు. ట్యూషన్‌ఫీజులపై ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన కొన్ని యాజమాన్యాలు హైకోర్టుకు వెళ్లాయి. ప్రైవేట్ కాలేజీలు ప్రతిపాదించిన ఫీజులనే వసూలుచేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని, అందుకు సంబంధించిన కాపీ తమకు అందలేదని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ తీర్పు ప్రతి రావడం, ట్యూషన్‌ఫీజులు ఖరారుచేసే ప్రక్రియ కొంత ఆలస్యం కానున్న నేపథ్యంలో ఈ నెల 27 నుంచి ప్రారంభం కావాల్సిన ఎంసెట్ వెబ్‌కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాల్సి వచ్చిందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు.






నమస్తే తెలంగాణ

ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



# ఓడిన జవాను!

- భూమి కోసం 14 ఏండ్లపాటు పోరాటం
- అధికారుల చుట్టూ తిరిగి తిరిగి ప్రాణాలు వదిలిన బాధితుడు
- పోరాటాన్ని కొనసాగిస్తున్న బాధితుడి భార్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూరు మండలం చేగూరు గ్రామంలో మాజీ సైనికోద్యోగి డీ సూర్యప్రకాశ్‌కు 2003, సెప్టెంబర్ 23న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మూడెకరాల భూమిని కేటాయించింది. ఈ భూమికి సంబంధించి స్థానిక రెవెన్యూ అధికారులు పొజిషన్ ఇచ్చి ఆర్వోఆర్ పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలి. కానీ సూర్యప్రకాశ్‌కు చేగూరు గ్రామం సర్వే నంబర్ 474లో మూడెకరాలు కేటాయిస్తున్నట్టు ఓ కాగితమిచ్చారే తప్ప.. ఆ భూమి ఎక్కడున్నది.. దాని హద్దులేమిటన్నది అధికారులు ఖరారు చేయలేదు. పాస్‌పుస్తకమూ ఇవ్వలేదు. ఇప్పటికి పదహారేండ్లయింది. కలెక్టర్లు వచ్చి పోతున్నారు. ఆర్డీవోలూ, తాసిల్దార్లు, వీఆర్వోలు వస్తున్నారు.. బదిలీలపై వెళ్తున్నారు. ఈ వ్యవహారాన్ని పరిష్కరించే తీరికా, ఓపికా ఎవ్వరికీ లేకుండాపోయింది. 2003లో భూ కేటాయింపు జరిగినప్పటికీ, ఒక కాగితం ఇచ్చి వదిలేశారే తప్ప సదరు సైనికుడికి భూమి ఎక్కడ



భూమి కేటాయిస్తూ 2003లో ప్రభుత్వం ఇచ్చిన జీవో

ఉన్నదో చూపించలేదు. పాస్‌బుక్ ఇవ్వలేదు. రెండేండ్లపాటు ఎదురుచూసిన ఆ మాజీ సైనికుడు సూర్యప్రకాశ్ తనకు భూమిని కొలిచి హద్దులు నిర్ధారించాలని, పాస్‌బుక్ ఇప్పించాలని.. 2005, జనవరి 12 కొత్తూరు మండల రెవెన్యూ అధికారికి అర్జీ పెట్టుకొన్నారు. ఆ అర్జీ బుట్టదాఖలైంది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా కలెక్టర్‌ను, ఆర్డీవోను, తాసిల్దార్‌ను కలుస్తూనే వచ్చారు. భూమి కోసం విజ్ఞప్తులు చేస్తూనే వచ్చారు. తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగడమే తప్ప పని జరిగింది లేదు. అప్పట్లో భూ సమస్యల పరిష్కారం కోసం ఆడంబరంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించేవారు. అందులో భాగంగా 2012లోనూ అప్పటి ప్రభుత్వం రెవెన్యూ సదస్సును నిర్వహించింది. ఆ సదస్సుకు కూడా సూర్యప్రకాశ్ వెళ్లి అర్జీ పెట్టుకొన్నారు. ఆ అర్జీ కూడా ఏమైందో తెలియదు. 2016 జూలై 18న సూర్యప్రకాశ్ ప్రమాదవశాత్తూ మరణించారు. ఈ ఘటనతో ఆయన భార్య శశిప్రకాశ్ భూపోరాటం మొదలుపెట్టాల్సి వచ్చింది.

### సమస్యను పరిష్కరిస్తా

నేను కొత్తగా వచ్చాను. మాజీ సైనికుడు, దివంగత డీ సూర్యప్రకాశ్ భార్య శశిప్రకాశ్ భూమికోసం దరఖాస్తు చేసుకుంటే అసైన్‌మెంట్ అమలుచేయడానికి చర్యలు తీసుకుంటా. **-దేవుజ, తాసిల్దార్, నందిగామ**

### పోరాటాన్ని కొనసాగిస్తున్న సూర్యప్రకాశ్ భార్య



భూమి కోసం తిరిగి తిరిగి భర్త చనిపోతే, ఆ దుఃఖాన్ని దిగమింగిన సూర్యప్రకాశ్ భార్య శశి ప్రకాశ్ పోరాటాన్ని ప్రారంభించారు. జీవనోపాధికోసం ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తూనే, తన భర్తకు ప్రభుత్వం కేటాయించిన భూమికి పట్టా ఇవ్వాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం చేపట్టిన జిల్లాలు, మండలాల పునర్విభజనలో కొత్తూరు మండలం రంగారెడ్డి జిల్లా పరిధిలోకి రాగా.. భూమి కేటాయించిన చేగూరు గ్రామం నందిగామ మండలంలోకి వచ్చింది. అధికారులు మారారు. కానీ శశి ప్రకాశ్ విజ్ఞాపనను మాత్రం పట్టించుకోలేదు. కొత్త మండలంలోని తాసిల్దార్‌ను భూమికి సంబంధించిన పట్టాలు ఇవ్వాలని కోరగా.. అవమానకరంగా మాట్లాడారని శశి ప్రకాశ్ ఆవేదన వ్యక్తంచేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులను కలిసి సమస్యను విన్నవించగా.. వారు మండలంలోని అధికారులను కలువాలని సూచించారు. కలెక్టర్ పంపిన లేఖ నంబర్‌ను తీసుకొచ్చి తాసిల్దార్‌కు ఇచ్చినా ఆయన పట్టించుకోవడం లేదని శశిప్రకాశ్ వాపోయారు. చివరకు బాధితురాలు ధర్మగంటను ఆశ్రయించి తన గోడు వెల్లబోసుకున్నారు.

# ఇద్దరు వీఆర్వోల సస్పెన్షన్

### ఉత్తర్వులు జారీచేసిన సూర్యాపేట జిల్లా కలెక్టర్

**తిరుమలగిరి, నమస్తే తెలంగాణ/చింతలపాలెం:** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం చింత్రియాల వీఆర్వో షేక్ జిలానీ, తిరుమలగిరి మండలం జలాల్‌పురం వీఆర్వో కనగంటి అర్వపల్లిని సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం చింతలపాలెంలో కలెక్టర్ అమయ్‌కుమార్ భూసమస్యల పరిష్కారానికి నిర్వహించిన ముఖాముఖిలో వీఆర్వో రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో కలెక్టర్ వీఆర్వోను సస్పెండ్ చేస్తున్నట్టు అక్కడే ఉత్తర్వులు జారీచేశారు. జలాల్‌పురం వీఆర్వో అర్వపల్లి భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా రైతుల నుంచి లంచం తీసుకున్నట్టు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించిన కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేశారు.





తాసిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ముత్యాల రాజిరెడ్డి, ముత్యాల సరోజన

# భూమి కోసం తాసిల్ ఎదుట ధర్నా

- రికార్డుల్లో భూమి మాయమైందని ఆవేదన
- న్యాయంచేయాలని కరీంనగర్ జిల్లా చెంజర్ల రైతుల వేడుకోలు

**మానకొండూర్ రూరల్:** రికార్డుల్లో తన భూమి మాయమైందని పేర్కొంటూ కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన రైతు ముత్యాల రాజిరెడ్డి తాసిల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. చెంజర్లకు చెందిన ముత్యాల రాజిరెడ్డికి 5.18 ఎకరాల వారసత్వ భూమి ఉన్నది. ఈ భూమికి సంబంధించి పాత పాస్‌పుస్తకం కూడా ఉన్నది. కానీ సమగ్ర భూసర్వే తర్వాత తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగడంతో కేవలం 3.25 ఎకరాలను మాత్రమే రికార్డుల్లో ఎక్కించినట్టు బాధితుడు రాజిరెడ్డి తెలిపారు. ఇందులో కూడా 656 సర్వే నంబర్‌లోని 0.21 గుంటలను రివోక్ చేసినందున, ఇంకా రావాల్సిన 1.32 ఎకరాలను ఇప్పటివరకు రికార్డుల్లో నమోదుచేయనందున విసిగిపోయి బుధవారం తాసిల్ కార్యాలయంలోనే ధర్నాకు దిగినట్టు బాధితుడు వివరించారు. బ్రోకర్ల రాజ్యం నడుస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా, ఇదే గ్రామానికి చెందిన ముత్యాల చిన్న భూంరెడ్డి కుమార్తె సరోజన కూడా రాజిరెడ్డితోపాటు ధర్నాలో పాల్గొన్నారు. తన తండ్రి భూంరెడ్డి పేరిట ఉన్న రెండెకరాల భూమిని తన చిన్న నాన్న అయిన ముత్యాల రాజిరెడ్డి కొడుకులైన సంపత్‌రెడ్డి, చంద్రారెడ్డి పేరిట ఎక్కించుకొన్నారని వాపోయారు. ఈ విషయమై మూడు నెలల క్రిందట తాసిల్ కార్యాలయంలో దరఖాస్తు చేశామని తెలిపారు. ఇప్పటివరకు తనకు న్యాయం జరుగలేదనీ, ఇప్పటికైనా తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేర చేయాలని కోరారు.

### రికార్డులను సరిచేస్తాం

బాధితుడు ముత్యాల రాజిరెడ్డి తండ్రి నర్సింహారెడ్డి పేర ఉన్న రికార్డులను యథావిధిగా సరిచేస్తాం. బాధిత ప్రత్యర్థి అయిన ముత్యాల రాజిరెడ్డి తండ్రి రంగారెడ్డి పేరిట భూమి ఏ విధంగా నమోదు అయిందో కూడా పరిశీలిస్తాం. బాధితుడు తెలిపిన సర్వే నంబర్‌లో ఇంతకు ముందు కొంత వివాదం ఉన్నది. ఆ రికార్డులను సైతం పరిశీలించి ఇటీవలే నమోదు చేశాం. బాధితుడికి నమోదు అయిన సర్వే నంబర్ల భూమిని ఎవరూ రివోక్ చేశారో, ఎందుకు చేశారో రికార్డులను పరిశీలిస్తాం. బాధితుడికి న్యాయం చేస్తాం. సరోజన వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఏమైనా ఆధారాలుంటే తీసుకొస్తే పరిశీలిస్తాం. **- శ్రీనివాస్, తాసిల్దార్**

# దొంగసంతకాలతో తారుమారు!

- అమ్మిన భూమికి అన్యాయంగా విరాసత్
- 35 ఏండ్లుగా మోఖాలో ఉన్నా పట్టించుకోని అధికారులు
- పెద్దపల్లి జిల్లా పిట్టల ఎల్లయ్యపల్లె రైతు మల్లేశం ఆవేదన

**ఓదెల:** చేయి తడిపితే చాలు ఎవరి భూమి మరెవరికైనా రాసిచ్చేస్తారు రెవెన్యూ అధికారులు. మూడున్నర దశాబ్దాల కిందట కొన్న భూమికి పత్రాలు అన్నీ ఉన్నా.. భూమిని సాగుచేసుకుంటూ బతుకువెళ్లదీస్తున్నా.. తమకు అడ్డెవరంటూ అక్రమాలకు తెగబడి రైతు దంపతులకు అన్యాయం చేశారు అధికారులు. తండ్రి అమ్మిన భూమిని మూడు దశాబ్దాల తర్వాత గుడ్డిగా కుమారులకు విరాసత్ చేశారు. కొన్న భూమి పత్రాలు చూపించి, తప్పు సరిదిద్దాలని మోఖామీదున్న రైతు అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఐదేండ్లుగా కాలయాపన చేస్తున్నారు. చివరికి బాధితుడు ధర్మగంటను ఆశ్రయించారు.



మల్లేశం దంపతులు

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పిట్టల ఎల్లయ్యపల్లెకు చెందిన కందుల మల్లేశం, సత్తమ్మ దంపతులు సర్వే నంబర్ 372లో 3.12 ఎకరాల భూమిని ఆది వెంకటయ్య, జగ్గయ్య, రామయ్య, ఐలయ్య వద్ద 1984లో కొన్నారు. నేటికీ మోఖాపై మల్లేశం దంపతులే ఉన్నారు. సత్తమ్మ పేరిట కొన్న ఈ భూమిపై గతంలో పంట రుణాలు కూడా తీసుకున్నారు. భూమిని అమ్మిన వారి కొడుకులు 2014లో దొంగసంతకాలతో విరాసత్ చేయించుకున్నట్టు బాధితులు ఆరోపించారు. 35 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూమిని అధికారులు తప్పుడు పట్టా చేసినట్టు వాపోయారు. అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. భూమి వివాదం కోర్టులో ఉండగానే రెవెన్యూ అధికారులు అమ్మిన వారి వారసులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. తమ వద్ద ఉన్న ఆధారాల పరిశీలించాలని, మోఖాపై విచారణ జరిపి న్యాయంచేయాలని మల్లేశం దంపతులు కోరుతున్నారు.

# వారసత్వ భూమిని కాజేశారు

### అనుభవంలో ఒకరు, పట్టాలు మరొకరికి

### ఏజెన్సీ చట్టం అమలులో ఉన్నా 48 ఎకరాలు ఇతరులకు పట్టా

### ధర్మగంటను ఆశ్రయించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లచ్చాపురంవాసులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వారసత్వంగా వచ్చిన భూమిపై కబ్జాదారులు కన్నేశారు. రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని కొంచెం కొంచెంగా మింగేశారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా వివిధ సర్వే నంబర్లలోని 48 ఎకరాల భూమిని కాజేశారు. ఏజెన్సీలోని 1/70 చట్టం అమలులో ఉన్నా పాత రికార్డుల భూముల దస్తావేజులను మార్చివేసి పట్టాదారుగా కొందరు పేర్లెక్కించుకున్నారు. అధికారులు సైతం చట్టాలను పక్కన పెట్టేశారు. దీనిపై ఏండ్లుగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లచ్చాపురం గ్రామంలోని ఎస్కే కరీంసాహెబ్ వారసులు ఎస్కే పాషా, మహ్మద్ బీబీ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమకు న్యాయంచేయాలని వేడుకుంటూ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.



అగ్రిమెంట్ పత్రాలను చూపుతున్న బాధితులు

**అధికారులకు ముట్టజెప్పి..**

దమ్మపేట మండలం లచ్చాపురంలోని 36, 37,43, 44 సర్వే నంబర్లలో ఖాసీం సాహెబ్‌కు సుమారు 48 ఎకరాల భూమి ఉన్నది. 1964-65 సంవత్సరం నుంచి ఖాసీం సాహెబ్ కుమారుడు కరీంసాహెబ్.. ఆయన ద్వారా ఎస్కే పాషాకు వారసత్వంగా వచ్చింది. భూములైతే ఉన్నాయి కానీ, వాటికి పట్టాలు నేటికీ రాలేదు. తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి 1 బీలు చూసినా పూర్వకాలంలో ఉన్న కరీం సాహెబ్, పాషా పేరుతోనే ఉన్నాయి. రెవెన్యూ అధికారులకు కొందరు లంచాలు ముట్టజెప్పి అనుభవదారుల కాలంలోకి రంగ ప్రవేశంచేశారు. పట్టాలు చేయించుకున్నారు.

**కలెక్టర్, ఆర్డీవోకు వినతులు**

సమస్యను పరిష్కరించాలని ఎస్కే పాషా, ఆమె సోదరి బీబీ.. 2018 అక్టోబర్‌లో కలెక్టరేట్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదును ఆర్డీవోకు కూడా అందజేశారు. 2010 నుంచి సమస్యపై పోరాడుతున్నామని, కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదని, తమకు న్యాయంచేయాలని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### ఏండ్ల నుంచి తిరగుతున్నాం

కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి 48 ఎకరాలను కాజేశారు. సుమారు 16.9 ఎకరాల భూమిని పసుమర్తి అన్నపూర్ణ పేరుతో పాస్‌బుక్ ఇప్పించుకోగలిగారు. చనిపోయిన వారి క్రయ అగ్రిమెంట్‌లో నిశానీ పేరుతో వేలిముద్రలు ఉన్నాయి. 36, 37 సర్వే నంబర్లలో 16.24 ఎకరాలు ఇతరుల పేరుతో పట్టా అయింది. వారు రైతుబంధు కూడా అందుకుంటున్నారు. కానీ, ఆ 16.24 ఎకరాల కాస్తులో ఇప్పుడు మేమే ఉన్నాం. మిగతా భూమిని 13 మంది పంచుకొని పట్టాలు తెచ్చుకున్నారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే అనుభవదారుల కాలంలో వాళ్లే ఉన్నారని, అది మీదెలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. పేదవాళ్లం కావడంతో మమ్మల్ని గ్రామంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. **- మహ్మద్ బీబీ, బాధితురాలు**

### విచారణ చేసి పట్టాలిస్తాం

లచ్చాపురంలో ఇద్దరు రైతులకు నోటీసులు అందజేశాం. గతంలో పనిచేసిన తాసిల్దార్ కొందరు రైతులకు 16 ఎకరాలకు పాస్‌పుస్తకాలు అందజేశారు. ఈ విషయంపై కొత్తగూడెం ఆర్డీవో నుంచి సమాచారం వచ్చింది. పూర్తి వివరాలను ఆయనకు మెయిల్ చేశాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన అనంతరం అర్హులకు పాస్‌పుస్తకాలు అందజేస్తాం. **- శిరీష, తాసిల్దార్ దమ్మపేట**

# పట్టాదారును మార్చేశారు

- ఇతరుల పేర్లపై నమోదుచేసిన రెవెన్యూ అధికారులు
- 2.17 ఎకరాలు కోల్పోయిన సంగారెడ్డి జిల్లా తాలెల్మవాసి
- న్యాయం చేయాలంటూ అధికారులకు బాధితుడి వేడుకోలు

**అందోల్, నమస్తే తెలంగాణ:** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం సామాన్యులకు కష్టాలు తెచ్చిపెడుతున్నది. వారసత్వంగా వస్తున్న భూమిని యజమానికి తెలియకుండానే అధికారులు వేరేవారి పేర్ల మీదకు మార్చేశారు. అదేమని అడిగితే అధికారుల్లో చలనంలేదని, తన భూమి తనకు ఇప్పించి న్యాయంచేయాలని సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం తాలెల్మకు చెందిన వాముకాడి నర్సింలు కోరుతున్నారు. తాలెల్మకు చెందిన నర్సింలు తండ్రి కిష్టయ్య పేరు మీద సర్వే నంబర్లు 42/ఆ/3లో 1.34 ఎకరాలు, 103 లో 23 గుంటలు.. మొత్తం 2.17 ఎకరాల భూమి ఉన్నది. ప్రభుత్వం చేపట్టిన భూప్రక్షాళనలో భాగంగా 'వన్ బీ' తీయించి, కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం రాకపోవడంతో మరోసారి వన్ బీ తీయించగా, అతని పేరు మీదనున్న సర్వే నంబర్ 42/ఆ/3లోని 1.34 ఎకరాల భూమి అదే గ్రామానికి చెందిన వాముకాడి విఠల్ పేరు మీదకు మారింది. సర్వే నంబర్ 103లోని 23 గుంటల భూమి వాముకాడి శివయ్య పేరు మీదకు వచ్చింది. కంగుతిన్న నర్సింలు సంబంధిత రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి ఆరా తీశారు. అధికారుల సూచన మేరకు వన్ బీ, పాత పట్టాదారు పాస్‌పుస్తకం, పహాణీలను జతచేసి దరఖాస్తు చేశారు.



బాధితుడు వాముకాడి నర్సింలు

వీటిలో 103 సర్వే నంబర్‌లోని 23 గుంటల భూమిని మార్పు చేసేందుకు అధికారులు ఆర్డీవోకు నివేదించి, రైతుబంధు మంజూరు కాకుండా నిలుపుదల చేయించారు. సర్వే నంబర్ 42/ఆ/3లోని 1.34 ఎకరాల భూమికి సంబంధించిన రైతుబంధు.. వాముకాడి విఠల్ పేరు మీదనే వస్తున్నది. ఇప్పటివరకు రెండు విడుతలుగా రైతుబంధును అతనే తీసుకున్నారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని బాధితుడు నర్సింలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

# మ్యుటేషన్ కోసం ముప్పుతిప్పలు

- వీఆర్వో ఆకస్మిక మృతితో ముప్పైఏండ్లుగా ఆగిన మ్యుటేషన్
- అన్ని డాక్యుమెంట్లున్నా ఆ తర్వాత పట్టించుకోని అధికారులు
- ఏ తాసిల్దార్‌ను అడిగినా గతంలో ఏం చేశారంటూ చీత్కరింపులు!
- నాగర్‌కర్నూల్ జిల్లా కంటోనిపల్లి రైతుల ఆవేదన

'పొలం కొనుగోలు జరిగినట్టు తెల్ల కాగితంపై రాసి (సాదాబైనామా) ఉండి.. మోఖాపై ఉంటే సదరురైతు పేరిట రిజిస్ట్రేషన్ చేసి, పట్టాదారు పాస్‌పుస్తకం అందించండి' ఇది ప్రభుత్వం నుంచి రెవెన్యూ అధికారులకు అందిన ఆదేశాలు. కానీ, ఈ ఆదేశాలు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ రెవెన్యూ అధికారులకు అందలేదా? లేక వాటిని పట్టించుకోవడం లేదా? అని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, భూమిని అమ్మినట్టు యాభై రూపాయల బాండ్ పేపర్‌పై ఉన్నప్పటికీ ఎకరం పొలాన్ని రైతుల పేరిట చేయడానికి వెల్దండ రెవెన్యూ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. తాము కొనుగోలుచేసిన ఎకరం పొలానికి మ్యుటేషన్ చేయండంటూ ముగ్గురు రైతులు ముప్పైఏండ్లుగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో చివరికి నమస్తే తెలంగాణ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

**వెల్దండ:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కంటోన్‌పల్లి గ్రామ రైతులు మట్ట లింగయ్య, మట్ట నాగయ్య, మట్ట జంగయ్య వెల్దండ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 525లో ఎకరం పొలాన్ని 1989లో గ్రామానికే చెందిన పెద్ది చిన్న జంగయ్య నుంచి కొనుగోలుచేశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు వచ్చాక మ్యుటేషన్ కోసం వాటిని అప్పటి వీఆర్వో కిషన్‌రావుకు అప్పగించారు. వీఆర్వో కిషన్‌రావు కొన్నిరోజులకే మ్యుటేషన్ చేయకుండానే ఆకస్మికంగా మరణించారు. ఏడాది తర్వాత రైతులకు వీఆర్వోకు అప్పగించిన పత్రాలు దొరికాయి. అప్పటినుంచి ఆ పత్రాలను తీసుకొని తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఎన్ని అర్జీలు పెట్టుకున్నా అధికారులు కనికరించడం లేదు. కొనుగోలు చేసిన నాటినుంచి ఆ ఎకరం భూమిని ముప్పై ఏండ్లుగా ఆ ముగ్గురు రైతులే సాగుచేసుకొంటున్నారు. అమ్మిన రైతు మృతిచెందడంతో ఆయన పేరిట ఉన్న భూమి అతని కుటుంబసభ్యుల పేరిట విరాసత్ అయింది. రైతులు అర్జీలు పెట్టుకొన్న ప్రతిసారీ వీఆర్వో, గిర్దావర్ మోఖాపైకి వచ్చి పంచనామాచేస్తున్నారు. కానీ, ఆ తర్వాత



కొనుగోలు చేసిన భూమి పత్రాలను చూపుతున్న రైతులు

పట్టించుకోవడం లేదు. ముప్పై ఏండ్లుగా కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తాసిల్దార్లు మారుతున్నారు కానీ.. తమ పేరిట భూమి ఎక్కడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న వెల్దండ తాసిల్దార్ నాగవీరేశంకు సమస్యను వివరించి పరిష్కరించాలని కోరగా.. 'ఇంతకుముందు ఉన్న తాసిల్దార్ చేయాల్సిన పని నేను ఎందుకు చేస్తా. ఆర్డీవో దగ్గరికి వెళ్లండి' అని గద్దించాడని రైతులు తెలిపారు. ఆర్డీవో దగ్గరికి వెళ్తే ఇందులో నేను చేసేదేమీ లేదు.. తాసిల్దార్‌నే కలువండి అంటూ తిప్పుకొంటున్నారని చెప్తున్నారు. కొనుగోలు చేసిన అన్ని డాక్యుమెంట్లు ఉన్నా ఎందుకు అమలుచేయడం లేదని, అసలు ఎవరు చేస్తారో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వీఆర్వో కృష్ణయ్యను వివరణ అడగ్గా 'భూమిని అమ్మిన యాజమాని మృతిచెందాడు. ఆ భూమి అతడి మనుమడి పేర విరాసత్ అయింది. దీంతో కొన్నవారి పేర చేసేందుకు వీలులేకుండాపోయింది. మా చేతుల్లో ఏమీలేదు' అని సమాధానంచెప్పారు.

# 13 బీ ఇచ్చారు.. పాస్‌బుక్ మరిచారు



**నాగారం:** నా పేరు వంగూరి అంజయ్య. మాది సూర్యాపేట జిల్లా నాగారం. మా తండ్రి అవిలయ్య 2008లో గ్రామంలోని కన్నెబోయిన లింగయ్య వద్ద సర్వే నంబర్ 424/2లో 20 గుంటల భూమి కొన్నారు. 2014లో ఆర్వోఆర్ కోసం దరఖాస్తుచేసుకోగా అధికారులు పట్టించుకోలేదు. ఆ తర్వాత సాదాబైనామాలో పట్టా కోసం కూడా దరఖాస్తు చేసుకొన్నాను. దీంతో అధికారులు 13 బీ ఇచ్చారుగానీ పాస్‌పుస్తకం ఇవ్వలేదు. ఆన్‌లైన్ చేయలేదు. ఎన్నిసార్లు తాసిల్ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో నాకు రైతుబంధు పెట్టుబడి సాయం రాకుండాపోయింది.

### విచారించి పరిష్కరిస్తాం

రైతు అంజయ్యకు 13 బీ ఇచ్చినమాట వాస్తవమే. పాస్‌పుస్తకం ఇచ్చి, ఆన్‌లైన్ చేద్దామంటే తనకు భూమిని విక్రయించిన రైతు సర్వే నంబర్‌లో తేడా ఉన్నది. తాము ఇరువురం పరిష్కరించుకుంటామని రైతు అంజయ్య, అమ్మినవ్యక్తి చెప్పడంతో పాస్‌పుస్తకం ఇవ్వడం ఆలస్యమైంది. ఇద్దరు రైతులను విచారించి వెంటనే సమస్యను పరిష్కరిస్తాం. **- శ్రీకాంత్, డిప్యూటీ తాసిల్దార్, నాగారం**

# విరాసత్ చేస్తలేరు

- ఎనిమిది నెలలుగా తిప్పుకొంటున్న అధికారులు
- ధర్మగంటను ఆశ్రయించిన మహబూబాబాద్ జిల్లా మునిగలవీడు గ్రామ రైతు తుప్పతురి సోమేశ్

**నెల్లికుదురు:** కుటుంబ పెద్ద చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతు కుటుంబం పట్ల రెవెన్యూ అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గత సంవత్సరం ఆగస్టులో చనిపోయిన ఓ రైతుకు చెందిన భూమిని ఆయన భార్య, కుమారుడి పేరిట.. విరాసత్ చేయడానికి ఎనిమిది నెలలుగా తిప్పుకొంటున్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామానికి చెందిన బాధితుడు తుప్పతురి సోమేశ్ చెప్పిన వివరాల ప్రకారం.. మునిగలవీడుకు చెందిన తుప్పతురి రామ్మూర్తికి సర్వే నంబర్ 783/బీలో 35 గుంటలు, 498/ఏలో ఎకరం, 487/బీలో ఎకరం భూమి ఉన్నది. రామ్మూర్తి 2018, ఆగస్టు 14వ తేదీ తెల్లవారుజామున (రైతు బీమా పథకం అమల్లోకి వచ్చినరోజే) గుండెపోటుతో మృతిచెందారు. దీంతో జిల్లాలో తొలిసారిగా ఆయన కుటుంబానికి రైతుబీమా పథకం కింద రూ.5 లక్షల సాయం కూడా అందింది. అయితే రామ్మూర్తి పేరు మీద ఉన్న 2.35 ఎకరాలను విరాసత్ ద్వారా ఆయన భార్య సుజాత పేరు మీద ఎకరం, కుమారుడు సోమేశ్ పేరు మీద 1.35 ఎకరాలు పట్టాచేసి, పాస్‌పుస్తకాలు ఇవ్వాలని 2018, నవంబర్‌లో రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. నేటి వరకు పట్టామార్పిడి జరుగలేదు.



బాధితురాలు తుప్పతురి సుజాత

### వారానికోసారి కలిసినా ఫలితంలేదు



విరాసత్ ద్వారా మా నాన్న పేర ఉన్న భూమిని నా పేర మార్చాలని దరఖాస్తు పెట్టుకొని, ఎనిమిది నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. వీఆర్వోను వారానికోసారి కలిసినా ఫలితం లేదు. ఎలక్షన్లు అని, మరెదో పనిఉన్నదని దాటవేస్తున్నారు. ఆలస్యమవుద్ది ఏం చేసుకుంటారో చేసుకోండని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 2.35 ఎకరాల భూమిని నాపేరున, మా అమ్మ పేరున పట్టాచేసి పాస్‌పుస్తకం ఇవ్వాలి. **- తుప్పతురి సోమేశ్, బాధితుడు**

# హమ్మయ్య.. చిరుత చిక్కింది

- ఇక్రిశాట్‌లో నాలుగు నెలలుగా అలజడి
- నల్లమల అడవిలో వదిలేందుకు అటవీశాఖ చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/పటాన్‌చెరు రూరల్:** అటవీ సిబ్బందిని ముప్పుతిప్పలు పెట్టిన చిరుత.. ఎట్టకేలకు బోనుకు చిక్కింది. హైదరాబాద్ శివారులోని ఇక్రిశాట్‌లో నాలుగు నెలలుగా అలజడి సృష్టిస్తున్న చిరుత పులిని సురక్షితంగా బంధించేందుకు అధికారులు చేపట్టిన 'ఆపరేషన్ లెపర్డ్' ఫలించింది. మంగళవారం అర్ధరాత్రి 1.15 గంటలకు ఇక్రిశాట్‌లో ఆహారం వేటకు బయలుదేరి అటవీశాఖ అమర్చిన బోనులో అమర్చిన మేకను తినేందుకు వెళ్లి పట్టుబడింది. ఏడేండ్ల వయసున్న చిరుతపులిని మార్చి 6న సంచరించడాన్ని చూసి ఇక్రిశాట్ అధికారులు అటవీశాఖకు సమాచారమిచ్చారు. చిరుతను పట్టుకోవడానికి ఇక్రిశాట్ క్యాంపస్‌లో 40 కెమెరాలు, నాలుగు బోన్లు అమర్చారు. పట్టుబడిన చిరుతను జూపార్క్‌కు తరలించి పర్యవేక్షిస్తున్నారు. కొన్నిరోజుల తర్వాత నల్లమల అడవుల్లో వదిలేందుకు అటవీశాఖ చర్యలు తీసుకొంటున్నది.



# యాదాద్రికి జయ విజయుల విగ్రహాలు వచ్చేశాయ్!

**యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ప్రధాన ద్వారానికి ఇరువైపులా ప్రతిష్ఠించేందుకు తిరుమలలోని శిల్ప కళాశాలలో రూపుదాల్చిన జయ, విజయుల విగ్రహాలను బుధవారం యాదాద్రికి తీసుకువచ్చారు. వీటిని ముఖ మండపంలో భద్రపర్చారు. ఒక్కో విగ్రహం టన్ను బరువు ఉంటుందని స్థపతులు కే సుందరరాజన్, డాక్టర్ ఆనందాచారివేలు తెలిపారు. ఈ విగ్రహాలను పూర్తిగా కృష్ణశిలతో శిల్పి వెంకటేశం రూపొందించారని చెప్పారు. తిరుమలలో రూపుదిద్దుకునే సమయంలో స్థపతి డాక్టర్ ఆనందవేలు అక్కడికి వెళ్లి తుది మెరుగులుదిద్దారు. వైష్ణవ సంప్రదాయంలో ప్రధాన గర్భాలయ ప్రవేశద్వారం వద్ద కుడి, ఎడమల ద్వారపాలకులను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. ఆలయ ప్రారంభోత్సవం సమయంలో వీటిని ప్రతిష్ఠిస్తారు.



యాదాద్రికి చేరుకొన్న విగ్రహం



క్రేన్ సాయంతో విగ్రహాన్ని వాహనం నుంచి దింపుతున్న దృశ్యం





హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

# యజ్ఞంలా హరితహారం

- ఆకుపచ్చ తెలంగాణలో భాగస్వాములు కండి
- ఐదో విడుత హరితహారం నిర్వహించండి: మంత్రి అల్లోల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలను భాగస్వాములుగా చేయడం ద్వారా ఐదో విడుత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వంద కోట్ల మొక్కలను నాటాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయం ఫలించాలంటే హరితహారాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఐదో విడుత హరితహారం సన్నాహాలపై అటవీశాఖ కేంద్ర కార్యాలయం అరణ్యభవన్‌లో బుధవారం మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 83 కోట్ల మొక్కలను నాటాలే ప్రజలను ఆకుపచ్చ తెలంగాణలో ప్రజలను భాగస్వాములుగా చేయాల్సిన అవసరమున్నదన్నారు. ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్ కంపెనీల సహకారం తీసుకోవాలన్నారు. ఏయే నర్సరీలో ఏ రకం మొక్కలు దొరుకుతాయో తెలిసేలా జిల్లాలవారీగా బుక్‌లెట్లు విడుదలచేయాలని ఆదేశించారు. సమీక్షలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా, అధికారులు శోభ, మునీంద్ర, ఆర్‌ఎం డోబ్రియాల్ పాల్గొన్నారు.

**కాలుష్యాన్ని నివారించాలి**

జల, వాయు, శబ్ద కాలుష్యంపై జాతీయ నిర్దేశిత పరిధి లక్ష్యంగా పనిచేసి మంచి వాతావరణాన్ని అందించి ప్రజలకు మేలుచేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశించారు. టీఎస్‌పీసీబీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో మాటాడుతూ.. కాలుష్యకారక పరిశ్రమలపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

# తెలంగాణ పోలీస్‌స్టేషన్లు భేష్!

- దేశంలోనే 14వ స్థానంలో నిలిచిన సంస్థాన్‌నారాయణపురం
- 24వ స్థానంలో చింతపల్లి.. 41వ స్థానంలో బెజ్జంకి
- దేశంలోని 86 అత్యుత్తమ పోలీస్‌స్టేషన్ల జాబితా విడుదల చేసిన కేంద్ర హోంశాఖ

**హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన దేశంలోని 86 అత్యుత్తమ పోలీస్‌స్టేషన్ల జాబితాలో తెలంగాణలోని మూడు పోలీస్‌స్టేషన్లకు టాప్ 50లో స్థానం లభించింది. బుధవారం కేంద్ర హోంశాఖ విడుదలచేసిన అత్యుత్తమ పోలీస్‌స్టేషన్ల జాబితాలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం పోలీస్‌స్టేషన్‌కు జాతీయస్థాయిలో 14వ స్థానం దక్కింది. నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీస్‌స్టేషన్ 24వ స్థానంలో, సిద్దిపేట జిల్లా బెజ్జంకి పోలీస్‌స్టేషన్ 41వ స్థానంలో నిలిచాయి. పార్ట్- ఏ, పార్ట్- బీ కింద వివిధ అంశాలను పరిగణలోనికి తీసుకొని దేశవ్యాప్తంగా ఉత్తమ పోలీస్‌స్టేషన్లను ఎంపికచేశారు. పార్ట్-ఏలో నేరాల నియంత్రణ, నేరాల నియంత్రణకు అత్యుత్తమ చర్యలు, కేసుల దర్యాప్తు, కేసుల పరిష్కారం, సంఘవిద్రోహశక్తుల కట్టడికి చర్యలు, కమ్యూనిటీ పోలీసింగ్, పార్ట్-బీలో పోలీస్‌స్టేషన్లలో మౌలిక వసతుల కల్పన, పోలీస్‌స్టేషన్‌కివచ్చే పౌరుల పట్ల స్పందన అన్న అంశాలను పరిగణనలోకి తీసుకొన్నారు.



సంస్థాన్ నారాయణపురం పోలీస్‌స్టేషన్

**మాపై మరింత బాధ్యత పెరిగింది: రాచకొండ సీపీ మహేశ్‌భగవత్**

దేశంలోని ఉత్తమ పోలీసుస్టేషన్ల జాబితాలో సంస్థాన్‌నారాయణపురం పోలీసుస్టేషన్‌కు 14వ స్థానం దక్కడంపై రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్ హర్షం వ్యక్తంచేశారు. దేశంలోనే టాప్-20లో స్థానం దక్కడం ఆనందంగా ఉన్నదన్నారు. 2016లో ప్రారంభమైన కమిషనరేట్‌కు మూడేండ్లలోనే ఉత్తమ పోలీసుస్టేషన్ ఖ్యాతి దక్కడం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. రాచకొండ పోలీసులు శాంతిభద్రతల నిర్వహణతోపాటు ప్రజల సమస్యల పరిష్కారానికి అందించిన సేవలు.. ఉత్తమ పోలీసుస్టేషన్‌గా గుర్తింపు తెచ్చిపెట్టాయని వివరించారు. పోలీసుస్టేషన్ అధికారులను, చౌటుప్పల్ ఎస్‌హెచ్వో, ఏసీపీ, యాదాద్రి-భువనగిరి జోన్ డీసీపీలను ఆయన అభినందించారు.

## గిరిజన పల్లెల్లో వికాసం

**యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సంస్థాన్‌నారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుమూల గిరిజన పల్లెల్లో వికాసం సాధించేందుకు సీపీ మహేశ్‌భగవత్ ప్రత్యేక శ్రద్ధకనబరిచారు. రాచకొండ గ్రామాన్ని దత్తత తీసుకొని మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. సమాచార వ్యవస్థను పటిష్టపర్చేందుకు సెల్‌టవర్‌ను ఏర్పాటుచేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేయడంతోపాటు వివిధ పోటీపరీక్షలకు హాజరయ్యే యువతకు ఉచితంగా కోచింగ్ ఇచ్చారు. దాదాపు 50 మంది యువతను ప్రతిరోజూ రాచకొండ, నారాయణపురం గ్రామాల నుంచి చౌటుప్పల్‌కు తీసుకెళ్లి శిక్షణ ఇప్పించారు. మారుమూల గ్రామాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌కు దేశంలోనే 14వ స్థానం దక్కడం పట్ల సంస్థాన్‌నారాయణపురం పోలీసులు హర్షం వ్యక్తంచేశారు. ఇది మరింత బాధ్యత పెంచిందని ఎస్‌ఐ నాగరాజు పేర్కొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాలకు చెక్కుల పంపిణీ 29న

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఇచ్చే ఆర్థిక సాయానికి ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 29న మధ్యాహ్నం 12 గంటలకు చెక్కులను పంపిణీ చేయనున్నట్టు మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలవారీగా లబ్ధిదారుల జాబితాను పొందుపర్చామని , ఎంపికైన జర్నలిస్టు కుటుంబసభ్యులు, జిల్లా బాధ్యులు మాసాబ్‌ట్యాంక్‌లోని మీడియా అకాడమీ కార్యాలయానికి చేరుకోవాలని విజ్ఞప్తిచేశారు.

## మాంసం ఉత్పత్తుల తయారీపై శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐసీఏఆర్- జాతీయ మాంస పరిశోధన సంస్థ (ఎన్‌ఆర్‌సీఎం) మాంసం ఉత్పత్తుల తయారీ పద్ధతులపై ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని జూలై 8 నుంచి 12 వరకు ఎన్‌ఆర్‌సీఎం చెంగిచర్ల క్యాంపస్‌లో నిర్వహించనున్నారు. మాంసం రంగంలో సొంత వ్యాపార సంస్థలను ప్రారంభించడానికి ఆసక్తి ఉన్న ఏ వ్యక్తయినా కార్యక్రమంలో పాల్గొనవచ్చని, ఇందుకు రూ.3వేల వరకు ఫీజు ఉంటుందని ఎన్‌ఆర్‌సీఎం డైరెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## లీగల్ సెల్ అథారిటీ ఈసీగా జస్టిస్ సంజయ్‌కుమార్

- ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌ను గవర్నర్ నరసింహన్ నియమించారు. గవర్నర్ ఆదేశాల మేరకు న్యాయశాఖ కార్యదర్శి వీ నిరంజన్‌రావు నియామక ఉత్తర్వులను జారీచేశారు.

## శివాజీ క్వాష్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీవీ 9 షేర్ల కొనుగోళ్లకు సంబంధించి పోలీసులు తనపై పెట్టిన కేసులను కొట్టేయాలని సినీనటుడు శివాజీ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులను బుధవారం హైకోర్టు పొడిగించింది. శివాజీకి వ్యతిరేకంగా తీవ్రమైన చర్యలు తీసుకోరాదని గతంలో పేర్కొన్న కోర్టు.. ఆ ఆదేశాలను జూలై 9 వరకు పొడిగిస్తూ విచారణను వాయిదా వేసింది.

# భూమిపూజ నేడే

మొదటిపేజీ తరువాయి...

పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

**400 కోట్లతో నూతన సచివాలయం**

రూ.400 కోట్లతో నూతన సచివాలయ భవనాన్ని, రూ.100 కోట్లతో ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించనున్నట్లు ఇదివరకే సీఎం కేసీఆర్ ప్రకటించారు. సచివాలయం భవన నమూనాను కూడా మీడియాకు విడుదలచేశారు. అధికారులతో సమీక్షలకు వీలుగా కాన్ఫరెన్స్ హాల్‌తోపాటు, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను ముఖ్యమంత్రి సచివాలయంలోనే నిర్వహించేలా నిర్మాణాలు రాబోతున్నాయి. దాదాపు ఆరు లక్షల చదరపు అడుగుల్లో నిర్మించే కొత్త సచివాలయంలో మంత్రులు, సంబంధిత శాఖల కార్యదర్శులు, సెక్షన్లు అన్నీ ఒకేచోట వచ్చేలా ఏర్పాట్లు చేయనున్నారు. కొత్త సచివాలయాన్ని చరిత్రలో నిలిచిపోయేలా, అన్ని సౌకర్యాలతో పూర్తి వాస్తు ప్రకారం నిర్మించనున్నారు. సచివాలయ కార్యాలయాలను ఎక్కడకు తరలించాలనే విషయంపై క్యాబినెట్ సబ్ కమిటీ అన్నింటినీ పరిశీలించి, నివేదిక ఇస్తుంది. దాని ఆధారంగా తరలింపు ప్రక్రియ చేపడుతారు. ఇప్పటికే సచివాలయ కార్యాలయాన్ని తరలించడానికి బూర్గుల రామకృష్ణారావు భవన్, సంక్షేమ భవన్, హజ్ భవన్‌లను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది.






ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ ఆఫీస్ వద్ద కొత్త అసెంబ్లీ భవనం భూమి పూజకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం.. సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ సచివాలయంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఢిల్లీలో వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, వెంకటేశ్ నేతకాని, బండా ప్రకాశ్, ఎమ్మెల్యే బాల్క సుమన్

## హైవేను మందమర్రి వరకు విస్తరించండి

- కేంద్రమంత్రి గడ్కరీకి ఎంపీల విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 63వ జాతీయ రహదారిని విస్తరించాలని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, వెంకటేశ్ నేతకాని, బండా ప్రకాశ్, ఎమ్మెల్యే బాల్క సుమన్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. 63వ జాతీయ రహదారిని ఎన్‌హెచ్ 363 మీదుగా మందమర్రి వరకు విస్తరించాలని కోరారు. చెన్నూరు ప్రాంత అభివృద్ధికి ఈ జాతీయ రహదారి నిర్మాణం కీలకమని ఎమ్మెల్యే బాల్క సుమన్ వివరించారు. దీనిపై గడ్కరీ సానుకూలంగా స్పందించారని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

## అభ్యసన నైపుణ్యాల మెరుగుదలకు చర్యలు

- పిల్లల సాధనస్థాయి మదింపునకు ప్రత్యేక సిబ్బంది అవసరంలేదు
- హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పాఠశాల విద్యాశాఖ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొంటున్నామని విద్యాశాఖ పేర్కొన్నది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన ఫలితాలు రోజురోజుకూ పడిపోతున్నాయని 2018లో దాఖలైన ప్రజాప్రయోజనం వ్యాజ్యం(పిల్)పై ప్రభుత్వం కౌంటర్‌దాఖలు చేసింది. విద్యార్థుల్లో సాధనస్థాయిలను పెంపొందించేందుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపింది. పేదలు, వెనుకబడినవర్గాలవారి కోసం ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలను ఏర్పాటుచేసినట్టు, తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగి విద్యానాణ్యత కూడా పెరిగిందని పేర్కొన్నది. ఎస్‌సీఈఆర్టీ నిర్దేశించిన ప్రకారం నిరంతర, సమగ్ర మూల్యాంకన (సీసీఈ) విధానం విజయవంతంగా పనిచేస్తున్నదని, టీచర్లకు కూడా ఉత్తమ శిక్షణ అందజేస్తున్నట్టు తెలిపింది. ప్రతి విద్యార్థి అకాడమిక్ ప్రదర్శనను ఆన్‌లైన్ ద్వారా విశ్లేషించి, విద్యార్థుల సమస్యలను టీచర్లు, అధికారులు పరిష్కరిస్తారని, ఈ నేపథ్యంలో ప్రత్యేక సిబ్బందిని నియమించాల్సిన అవసరంలేదని పేర్కొన్నది. వెనుకబడిన విద్యార్థుల కోసం స్కూల్ రెడీనెస్, 3ఆర్ (రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్) వంటి కార్యక్రమాలను అమలుచేస్తున్నట్టు తెలిపింది. ప్రభుత్వ నిధులతో సెల్ఫ్ లెర్నింగ్, ఇంటరాక్టివ్ మెటీరియల్ అందజేస్తున్నట్టు వివరించింది.

## ఇంటర్ మూల్యాంకనంలో సంస్కరణలు

- పాఠశాలవిద్యలో సెమిస్టర్ పద్ధతిపై పరిశీలన
- త్వరలో ఉపాధ్యాయులకు పదోన్నతులు: విద్యాశాఖ కార్యదర్శి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్ పరీక్షలు, మూల్యాంకనం విధానంలో సంస్కరణలు తీసుకొస్తామని విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి వెల్లడించారు. మూల్యాంకనం చేసేవారికి నిబంధనలు, విధులు, బాధ్యతలు తెలుపుతూ తయారుచేసిన అంగీకారపత్రంపై సంతకంచేయించే విధానాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. దీని వల్ల బాధ్యతగా జవాబుపత్రాలను దిద్ది, సరైన మార్కులు వేయడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. బుధవారం తనను కలిసిన విలేకరులతో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పాఠశాలవిద్యలో సెమిస్టర్ విధానాన్ని అమలుచేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, దీనిపై ఇప్పటికే సీఎం కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. దీని వల్ల విద్యార్థుల్లో వార్షికపరీక్షల ఒత్తిడి తగ్గిపోతుందని.. ప్రతి ఆరునెలలకు ఒకసారి పరీక్షలకు ప్రిపేర్‌కావడం వల్ల చదువులపట్ల ఆసక్తి పెరుగుతుందని వివరించారు.

**త్వరలో ఉపాధ్యాయులకు పదోన్నతులు**

పాఠశాల విద్యాశాఖలో త్వరలోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం అంగీకరించిందని జనార్దన్‌రెడ్డి తెలిపారు. పదోన్నతులు పాత జిల్లాల ప్రకారం ఇవ్వాలా? కొత్త జిల్లా ప్రకారం కల్పించాలా? అన్న అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. పది జిల్లాలకు సంబంధించిన అంశంపై కోర్టులో కేసు ఉన్నదని, దీనికి పరిష్కారం చూపించి, పదోన్నతులు ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు.

# ప్రాజెక్టులతో అధిక దిగుబడులు

- కాళేశ్వరంతో రైతులకు మేలు.. రైతుబంధు మంచి నిర్ణయం
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఐఎఫ్‌పీఆర్‌ఐ సౌత్ ఏషియా డైరెక్టర్ షాహిదుర్ రషీద్



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** 'ప్రపంచ దేశాల్లో రైతులు నీళ్ల లేక చాలా ఎకరాల భూమిని నిరుపయోగంగా ఉంచుతున్నారు. ఈ పరిస్థితిల్లో ప్రాజెక్టుల నిర్మాణం అద్భుతమైనది. సాంకేతికతను మరింత ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రాజెక్టులతో పంట ఉత్పత్తి పెరుగుతుంది. జీవనప్రమాణాలు కూడా మెరుగవుతాయి' అని అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధన సంస్థ (ఐఎఫ్‌పీఆర్‌ఐ) సౌత్ ఏషియా డైరెక్టర్ షాహిదుర్ రషీద్ అన్నారు. సాగుకు యోగ్యమైన భూమి ఉన్నప్పటికీ.. నీటి లభ్యత లేని కారణంగా ఆహార ఉత్పత్తి కుంటుపడటం దేశ ప్రగతికి విఘాతమని పేర్కొన్నారు. తెలంగాణలో ఇటీవల ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు.. రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకం మంచి నిర్ణయమని ప్రశంసించారు. బుధవారం షాహిదుర్ రషీద్ 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**కాళేశ్వరంపై ఏమంటారు?**

సాగుకు యోగ్యంగా ఉన్న భూమిని పూర్తిగా వినియోగించుకొనేందుకు ప్రాజెక్టులు నిర్మించాలి. ఇటీవల తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమైన విషయం తెలుసు. చాలా మంది దీనిగురించే చర్చించుకుంటున్నారు.

**రైతుల సాగుపై..?**

ప్రజలు ఎటువంటి సమతుల ఆహారం తీసుకోవాలో ప్రభుత్వం వద్ద ఓ పాలసీ ఉండాలి. అటువంటి ఆహార ఉత్పత్తులను లాభసాటిగా చేస్తే.. రైతులు ఆ పంటలనే ఉత్పత్తి చేస్తారు.

## కూలీ వేతనం కంటే.. పోషకాల ధరలే ఎక్కువ

ఓ కూలీ దినసరి వేతనం కంటే పోషకాల ధరలే ఎక్కువగా ఉన్నాయని శాస్త్రవేత్త కల్యాణి తెలిపారు. పోషకాహార లోపంతో పిల్లలు, రక్తహీనతతో తల్లులు బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. లండన్ స్కూల్ ఆఫ్ హైజనిక్ అండ్ ట్రోపికల్ మెడిసిన్స్ (ఎల్‌ఎస్‌హెచ్‌టీఎం), ఎన్‌ఐఎన్ (జాతీయ పోషకాహార సంస్థ), అగ్రికల్చర్ ఫర్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఆధ్వర్యంలో హైటెక్‌సిటీలోని వెస్టిన్ మైండ్‌స్పేస్ సెంటర్‌లో ఏఎన్‌హెచ్ (అగ్రికల్చర్, న్యూట్రిషన్స్, హెల్త్) అకాడమీ వీక్ సదస్సు నిర్వహించారు. ఇందులో 30 దేశాల నుంచి 350 మంది శాస్త్రవేత్తలు, స్కాలర్స్ పాల్గొన్నా రు. వ్యవసాయాన్ని లాభసాటిగా ఎలా మార్చాలి, పోషకాలు అందరికీ చేరాలంటే ఏంచేయాలి తదితర విషయాలపై చర్చించారు. ఈ సదస్సు శుక్రవారం వరకు కొనసాగనున్నది.

# అర్హులందరికీ న్యాయం

- స్పోర్ట్స్ కోటా ఎస్సై, కానిస్టేబుల్ నియామకాలపై టీఎస్‌ఎల్పీఆర్బీ చైర్మన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియలో అపోహలకు తావులేదని, అర్హులందరికీ న్యాయం జరుగుతుందని టీఎస్‌ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు చెప్పారు. క్రీడాకోటా కింద భర్తీచేసే రెండుశాతం పోస్టులను టీఎస్‌ఎల్పీఆర్బీ నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులను, పూర్తి పారదర్శకతతో ఎంపికచేస్తున్నట్టు తెలిపారు. మెరిటోరియస్ స్పోర్ట్స్‌పర్సన్స్ కోటా నిబంధనలపై అభ్యర్థులు గందరగోళానికి గురికావాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. నోటిఫికేషన్‌తోపాటు జీవో నంబర్ 74లో పేర్కొన్న ప్రకారం.. క్యాటగిరీ-1 (అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన లేదా పాల్గొన్న), క్యాటగిరీ-2 (జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన, లేదా పాల్గొన్న క్రీడాకారులు)లో క్రీడాకారులు మాత్రమే ఎంఎస్పీ కింద అర్హులని తెలిపారు. ఈ రెండు క్యాటగిరీల క్రీడాకారులకు సంబంధించిన ఫార్మ్-1, ఫార్మ్-2 సర్టిఫికెట్లు మాత్రమే అనుమతిస్తామన్నారు. ఏదైనా వర్సిటీ నుంచి అంతర్ యూనివర్సిటీ పోటీల్లో జాతీయ, జోనల్, రీజినల్ ఏ స్థాయిలో పాల్గొన్నా ఆ అభ్యర్థులు అర్హులు కారని స్పష్టంచేశారు. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర జట్టు తరపున జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న వారు మాత్రమే ఫార్మ్-1, ఫార్మ్-2 ధ్రువపత్రాలకు అర్హులని చెప్పారు. క్రీడాకోటాలో ఎంపికలో కూడా సదరు అభ్యర్థి దేహదారుఢ్య పరీక్షల్లో, తుది రాతపరీక్షల్లో సాధించిన మెరిట్ ఆధారంగా, క్రీడా ధ్రువపత్రాలను అర్హతగా భర్తీ చేస్తామని తెలిపారు. తుది రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయిందన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పెరిగిన సీట్లు

- ఈడబ్ల్యూఎస్ కోటాలో తెలంగాణకు 190 సీట్లు మంజూరు

**పోచమ్మమైదాన్ (వరంగల్ అర్బన్):** ఆర్థికంగా వెనుకబడినవర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. ప్రభుత్వ మెడికల్, దంత వైద్య కళాశాలల్లో అవి అమలయ్యేలా వరంగల్ కాళోజీ హెల్త్‌వర్సిటీ అధికారులు నోటిఫికేషన్ జారీచేశారు. ఎంసీఐ నిబంధనల ప్రకారం ఆర్థికంగా వెనకబడినవర్గాల కోటాలో భాగంగా మెడికల్ కళాశాలల్లో 10శాతం రిజర్వేషన్లు అమలుచేసేందుకు 25శాతం చొప్పున అదనంగా సీట్లను మంజూరుచేశారు. తెలంగాణలో తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా వీటిలో ఆరు కళాశాలలకు ఈడబ్ల్యూఎస్ కోటాలో 190 సీట్లు మంజూరయ్యా యి. మిగిలిన 23 ప్రైవేట్ కళాశాలకు ఈడబ్ల్యూఎస్ కోటాపై ఎంసీఐ స్పష్టత ఇవ్వలేదు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఇప్పటికే 250 సీట్లు ఉన్నందున అదనంగా సీట్లు పెరుగవు. నల్లగొండ, సూర్యాపేట మెడికల్ కళాశాలలకు, హైదరాబాద్‌లోని ప్రభుత్వ దంతకళాలలో సీట్లు పెరిగే అవకాశంలేదని అధికారులు చెప్తున్నారు.

**ఈడబ్ల్యూఎస్ కోటాలో పెరిగిన సీట్ల వివరాలు:**

- గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల్లో సీట్ల సంఖ్య ఒక్కోచోట 250కి చేరింది.
- నిజామాబాద్ గవర్నమెంట్ మెడికల్‌లో సీట్ల సంఖ్య 120కి పెరిగింది.
- ఆదిలాబాద్ రిమ్స్‌లో సీట్ల సంఖ్య 120కి పెరిగింది.
- సిద్దిపేట గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్య 175కి పెరిగింది.
- మహబూబ్‌నగర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్య 175కి పెరిగింది.

## ఉదారత చాటిన ఓయూ లా విద్యార్థి

- వినియోగదారుల ఫోరం అందజేసిన మొత్తం నిరుపేద వైద్యానికి విరాళం
- అభినందించిన పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్



అనారోగ్యంతో బాధపడుతున్న దేవయ్యకు చెక్కును అందజేస్తున్న అకున్ సబర్వాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఓయూ లా విద్యార్థి ఆకాశ్‌కుమార్ ఉదారత చాటుకున్నారు. హక్కుల కోసం పోరాడగా వచ్చిన మొత్తానికి మరికొంత కలిపి ఓ నిరుపేద రోగికి అందజేశారు. అనుమతి లేకుండా హీరోయిన్ శృతిహసన్ ఫొటోను అమ్మకాల ప్రచారం కోసం వాడుకున్నారంటూ ఆకాశ్ కుమార్ గతంలో చేసిన ఫిర్యాదుపై వినియోగదారుల ఫోరం స్పందించి షాపు యజమానులకు నోటీసులు జారీచేసింది. షాపు యజమానులు తప్పు ఒప్పుకోవడంతో రూ.7 వేల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని ఈనెల 22న వినియోగదారుల సలహా కేంద్రం.. బీ ఆకాశ్‌కుమార్‌కు అందజేసింది. పరిహారంగా లభించిన రూ.7 వేలకు మరో రూ.4 వేలు కలిపి మొత్తం 11 వేలను అనారోగ్యంతో బాధపడుతున్న పీ దేవయ్యకు విరాళంగా ఇవ్వాలని ఆకాశ్ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో దేవయ్యకు రూ.11 వేల చెక్కును ఆ శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అకున్ సబర్వాల్ మాట్లాడుతూ.. తోటి మనిషి వైద్యసాయం కోసం ఆకాశ్‌కుమార్ విరాళంగా అందజేయడం అభినందనీయమని చెప్పారు. వినియోగదారుల హక్కులపై మరింత అవగాహన కల్పించాలని కోరారు. తెలంగాణ వినియోగదారుల పరిష్కార సెల్ టోల్‌ఫ్రీ నంబర్ 180042500333 ద్వారా, consumerinformation redressal centre ద్వారా ఫేస్‌బుక్‌లో, telangana consumer info and redressal center ద్వారా ట్విట్టర్‌లో తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చన్నారు.



సంకుచిత బుద్ధితోనే విపరీత ఆలోచనలు చేస్తారు. ప్రజల తీర్పును ఒప్పుకోకపోవటం అలాంటిదే. 'బీజేపీ గెలిచింది కానీ దేశం ఓడిపోయింద'న్న వాదన చేయటం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయటమే. 17 రాష్ర్టాల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలువలేదు. ఓటమిపై ఆత్మపరిశీలన చేసుకోండి.

**నరేంద్ర మోదీ, ప్రధాని**

బీజేపీకి మద్దతు పలికితే ఏమి జరుగుతుందో బెంగాల్‌లోని భాత్పర సాక్ష్యంగా నిలుస్తున్నది. కాంగ్రెస్, సీపీఎం కలిసి బీజేపీతో టీఎంసీ చేస్తున్న పోరాటంలో కలిసిరావాలి. అంటే ఇది రాజకీయ ఐక్యత కాదు. ఏకాభిప్రాయ సమస్యలపై పోరాటం చేయటానికి కాంగ్రెస్, సీపీఎం ముందుకు రావాలి.

**మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1693**

మొట్టమొదటి మహిళా పత్రిక 'లేడీస్ మెర్క్యూరి' లండన్‌లో ప్రారంభం.

**1954**



మొదటి అటామిక్ పవర్ స్టేషన్ రష్యాలోని ఒబినిన్స్క్‌లో ప్రారంభం.



**1964**

ప్రపంచంలోనే మొదటి ఏటీఎం లండన్‌లో ప్రారంభం.

జార్ఖండ్‌లో తాబ్రేజ్ అన్సారీపై జరిగిన మూకదాడి కేసులో 11 మంది నిందితులను అరెస్టు చేసి, ఇద్దరు పోలీస్ అధికారులను సస్పెండ్ చేశారు. దొంగతనం చేశాడన్న కారణంతో అన్సారీని ఓ విద్యుత్‌స్తంభానికి కట్టేసి 12 గంటల పాటు కొట్టారు. చివరికి సొమ్మసిల్లి పడిపోవటంతో పోలీసులకు అప్పజెప్పగా వారు కూడా అతనికి చికిత్స అందించటానికి బదులు కేసు నమోదు చేసి విచారణ పేరుతో తాత్సారం చేశారు. దీంతో అన్సారీ చనిపోయాడు. ఈ ఘటన తీవ్ర దుమారం రేపింది. ఇప్పటికైనా పోలీసులు, ప్రభుత్వాలు సరైన సమయంలో స్పందించాలి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

చెన్నై నగరాన్ని 'గ్లోబల్ ఎకనామిక్ హబ్'గా చూడాలనుకుంటున్న వారి ఆశలపై చెన్నైలో నెలకొన్న నీటి కరువు నీళ్లు చల్లుతున్నది. గత కొన్నేండ్లుగా చెన్నై నీటి కరువును ఎదుర్కొంటున్నా ఈ ఎండకాలం మరింత తీవ్రమై ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. నిద్రాహారాలు మాని ప్రజలు రాత్రింబవళ్లు నీటికోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా సీఎం పళనిస్వామి మాత్రం నీటి కరువు అంత తీవ్రంగా ఏమీ లేదని దాటవేసున్నారు. ఏదేమైనా ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యూహం, కార్యాచరణతో నీటి కరువును తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకుపోవాల్సిన అవసరం ఉన్నది.

**ది హిందూ**



# స్వాతంత్ర్యోద్యమ విలువలు

ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు బదులిస్తూ భద్రమైన, ఆధునిక, సమ్మిళిత భారతమనే స్వప్నాన్ని నెరవేర్చడానికి ఏకంగా ముందుకుపోవాలని పిలుపునివ్వడం హర్షణీయం. అయితే ప్రధాని మిగతా ప్రసంగం తీరు, బుధవారం రాజ్యసభలో చేసిన ప్రసంగం ఇదే స్ఫూర్తిని కనబరుచకపోవడం ఆశ్చర్యకరం. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను విమర్శించే క్రమంలో ఇంతకాలం నిజమైన లౌకికవాదం అమల్లో లేదనే విధంగా మాట్లాడటం సరికాదు. పార్టీ ఏది అధికారంలో ఉన్నా లౌకికవాద విలువలకు మన దేశం కట్టుబడి ఉన్నది. బీజేపీ రెండవసారి అధికారంలోకి వచ్చిన అనతికాలంలో జార్ఖండ్‌లో అల్పసంఖ్యాకవర్గానికి చెందిన యువకుడు మూకదాడిలో ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరం. రాజ్యసభలో చేసిన ప్రసంగంలో ఆయన ఈ దాడిని ఖండించినప్పటికీ, 2014 నుంచి మూకదాడులు పెరిగిన క్రమాన్ని గుర్తించినట్టు కనబడలేదు. బీజేపీ రెండవసారి సొంత మెజారిటీతో అధికారం చేపట్టిన నేపథ్యంలో తమ పరిపాలనకు ప్రజలు మద్దతు ఇచ్చారని మోదీ చెప్పుకోవడానికి ఆస్కారం ఏర్పడిన మాట వాస్తవం. అయితే తొలి పర్యాయం పాలనను అన్ని విధాలా ప్రజలు సమర్థిస్తున్నారని మోదీ భావించి ఉంటే అది సరైన విశ్లేషణ కాదు. ప్రతిపక్షాల బలహీనత వంటి అనేక కారణాల వల్ల బీజేపీ తిరిగి అధికారంలోకి రాగలిగింది. అంతే కానీ రాజ్యాంగ విలువలకు భంగం కలుగుతూ పోతే తదనుగుణమైన ప్రతిస్పందన ప్రజలలో కనిపిస్తుందని గ్రహించాలె.

75 ఏండ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని, మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవాన్ని దేశ ప్రజలను ఏకంచేసే విధంగా జరుపుకోవాలని ప్రధాని మోదీ తమ ప్రసంగంలో పిలుపునివ్వడం హర్షించదగినది. స్వాతంత్ర్యం కోసం పోరాడినట్టే దేశ వెనుకబాటుతనాన్ని నిర్మూలించుకునే విధంగా ఈ దినోత్సవాలను జరుపుకోవాలని సూచించారు. గాంధీజీ స్వాతంత్ర్యోద్యమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేశారని కూడా గుర్తుచేశారు.

> **స్వాతంత్ర్యోద్యమ కాలమంతా హక్కుల కోసం పోరాడిన భారత ప్రజలు ఇక మీదట తమ విధులను కూడా గుర్తించాలని, మన విధులను విస్మరిస్తే హక్కులను కోల్పోతామని నెహ్రూ 1951 నాటి ప్రసంగంలో చెప్పిన బోధనలను మోదీ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. నెహ్రూ వ్యాఖ్యలు ఏదో ఒక సందర్భంలో వెలువరించినవే తప్ప ఆయన ఆదర్శాలను ప్రతిబింబించేవి కావు. వాటిని మోదీ సమయానుకూలంగా ఉపయోగించారు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించకుండా, రాజ్యాంగ విలువలను పరిరక్షించకుండా హక్కులను బోధించడం వల్ల ఫలితం ఉండదు. కానీ నెహ్రూ ప్రసంగాలన్నీ పరిశీలిస్తే ఆయన భావజాలమేమిటో బోధపడుతుంది.**

గాంధీ సిద్ధాంతం అనగానే ఒక చెంప మీద కొడితే మరో చెంప చూపించడమే రీతిలో ప్రచారం సాగింది. గాంధీవాదం అహింసామార్గానికే పరిమితం కాలేదు. గ్రామ స్వావలంబనను కోరుకున్నారు. కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. నిరాడంబర జీవన శైలిని అనుసరించారు. ధార్మిక జీవనాన్ని బోధించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ వెంట నడిచిన కాంగ్రెస్ పార్టీ మాత్రమే లేదు. మతవాదులున్నారు, వామపక్షాలున్నాయి. స్వేచ్ఛా ఆర్థికవాదులున్నట్టే, సామ్యవాదులూ ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే భిన్న భావజాలాల వారున్నారు. ఒకవైపు జిన్నా నాయకత్వంలోని ముస్లిం లీగ్ ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీలోనే ఆ భావజాలంతో ప్రభావితులైన అబుల్ కలాం ఆజాద్ వంటి ముస్లిం నాయకులున్నారు. కానీ స్థూలంగా స్వాతంత్ర్యోద్యమం ప్రజాస్వామ్యం, సామ్యవాదం, అహింస, లౌకికవాదమనే విలువలను ప్రతిబింబించింది. భారతీయ సమాజంలోని బహుళత్వాన్ని గుర్తించింది. స్వాతంత్ర్యం సాధించిన తరువాత– నెహ్రూ ప్రభుత్వం స్వాతంత్ర్యోద్యమ విలువలనే ఆచరణలో పెట్టింది. గాంధీని, నెహ్రూను, స్వాంతంత్ర్యోద్యమ విలువలను గుర్తుచేసుకోవడంతోనే సరిపోదు. ఇటువంటి ఉత్సవాలు గత డెబ్బయి అయిదేండ్లుగా సాగుతూనే ఉన్నాయి. ఆ విలువలను ఆకళింపు చేసుకొని ఆచరణలో పెట్టడమే నేటి అవసరం.

స్వాతంత్ర్యోద్యమ కాలమంతా హక్కుల కోసం పోరాడిన భారత ప్రజలు ఇక మీదట తమ విధులను కూడా గుర్తించాలని, మన విధులను విస్మరిస్తే హక్కులను కోల్పోతామని నెహ్రూ 1951 నాటి ప్రసంగంలో చెప్పిన బోధనలను మోదీ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. నెహ్రూ వ్యాఖ్యలు ఏదో ఒక సందర్భంలో వెలువరించినవే తప్ప ఆయన ఆదర్శాలను ప్రతిబింబించేవి కావు. వాటిని మోదీ సమయానుకూలంగా ఉపయోగించారు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించకుండా, రాజ్యాంగ విలువలను పరిరక్షించకుండా హక్కులను బోధించడం వల్ల ఫలితం ఉండదు. కానీ నెహ్రూ ప్రసంగాలన్నీ పరిశీలిస్తే ఆయన భావజాలమేమిటో బోధపడుతుంది. మత కలహాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి దెబ్బతింటుందని బోధించారు. 'మన మెదడుకు సంకెళ్ళు వేసుకున్న క్షణాన, సంకుచితత్వం పెరిగిపోతుంది, దేశాభివృద్ధి ఆగిపోతుంది' అని హెచ్చరించారు. కొత్తగా స్వాతంత్ర్యం వచ్చిన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు పాదుకోవడానికి నెహ్రూ విధానాలే కారణం. ఇప్పుడు ఆ వ్యవస్థలను కాపాడుకోవాలసిన అవసరాన్ని మోదీ గుర్తించాలె. నెహ్రూ బాట మూలంగానే నేడు భారత్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది. ఆ ప్రజాస్వామ్య భారతంలో పెరిగిన వారే నేడు అన్ని రంగాల్లో వ్యవస్థలను నడుపుతున్నారు. ఇప్పుడు విద్వేష భావజాలాన్ని అరికట్టలేకపోతే, ఆ ప్రభావం కొత్త తరాలపై పడుతుంది. ఇప్పటి విద్వేష దాడుల ఫలితాలను భవిష్యత్తులో అనుభవించవలసి వస్తుంది. మతోన్మాదం, సైనిక పాలనలో మగ్గిన దేశాలకు ఏ గతి పట్టిందో చూస్తూనే ఉన్నాం. రెండవ పర్యాయం పాలనలో అయినా మోదీ విద్వేష భావజాలాన్ని అరికట్టి ప్రజాస్వామ్య బాటలో దేశాన్ని నడిపించాలె.

**జనగళం**

### జోరు కొనసాగించాలె

వరుస విజయాలతో భారత జట్టు జోరు మీదున్నది. ప్రపంచకప్ గెలువాలంటే ఇదే జోరు కొనసాగించాలి. ఇప్పటికే ఐదు మ్యాచ్‌లాడిన భారత జట్టు నాలుగింటిలో గెలువగా, ఒక మ్యాచ్ రద్దయిన విషయం తెలిసిందే. ఇప్పటికే 9 పాయింట్లతో సెమీస్‌కు చేరువలో ఉన్న భారత జట్టు మిగితా నాలుగు మ్యాచ్‌లలో కూడా గెలిసి సెమీస్ ప్రత్యర్థులకు దీటైన సవాల్ విసురాలె. పసికూన అఫ్ఘనిస్థాన్‌తో కష్టంగా గెలిచిన విషయం తెలిసిందే. చిన్న జట్లని తేలికగా తీసుకోకుండా లోటుపాట్లను సరిద్దికోవాల్సిన అవసరం ఉన్నది. ఈరోజు జరిగే వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లో భారత్ గెలిస్తే దాదాపు సెమీస్ అవకాశాలను సుస్థిరం చేసుకున్నట్లే. కాబట్టి వెస్టిండిస్‌తో భారత జట్టు విజయం సాధిస్తుందని ఆశిద్దాం.

**- కొలిపాక శ్రీనివాస్, సముద్రాల, హుస్నాబాద్**

### క్షణిక ఉద్యమాలు

ఈ మధ్య పసిపిల్లలపై వరుసగా జరిగిన లైంగికదాడుల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా, ప్రజా సంఘాలు, విద్యార్థులు రోడ్లపైకి వచ్చి తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. పలు పట్టణాల్లో కొవ్వొత్తుల ప్రదర్శనలతో నిరసనలు వ్యక్తంచేశారు. పైశాచిక అకృత్యాలకు పాల్పడిన వారిని బహిరంగంగా ఉరితీయాలనీ, లేదా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధమైన నిరసనోద్యమాలు జరుగుతున్న ఘోరాల పట్ల ప్రజల ఆగ్రహానికి ప్రతీకలుగా గుర్తించాలి. కానీ నేరానికి పాల్పడిన వ్యక్తిని ఉరితీయటమో, కాల్చిచంపటమో చేసినంత మాత్రాన నేరాలు సమసిపోతాయన్నది అపోహ మాత్రమే. మనుషుల్లో నేరప్రవృత్తి పెరుగటానికి కారణమైన సామాజిక విషయాన్ని, లేదా సామాజిక మాధ్యమాల్లో విరివిగా అందుబాటులో ఉంటున్న విశృంఖల, అశ్లీల చిత్రాలను లేకుండా చేసినప్పుడే ఇలాంటి ఘోరాలకు ముకుతాడు పడుతుంది. కాబట్టి నేరస్తులను శిక్షించటమొక్కటే సామాజిక హింస నిర్మూలనకు పరిష్కారం ఎప్పటికీ కాదు. ఏ సమాజంలోనైనా నేరాన్ని రూపుమాపాలంటే తప్పుచేసిన వారిని నిర్మూలించటం కాదు, నేరాలకు కారణమవుతున్న సామాజిక విషయాన్ని అంతం చేయాలని సామాజిక శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో చెబుతున్నారు. కాబట్టి హింసాదౌర్జన్యాలను వ్యతిరేకిస్తున్న వారు ఈ దిశగా ఆలోచించాలి.

**- ఉప్పల ఉదయ్‌కుమార్, యాదాద్రి భువనగిరి జిల్లా**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# జీవితపు మూలాల్లోకి కాళేశ్వరం

కాళేశ్వరం ప్రాజెక్టు మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రభావం ఏవిధంగా ఉండగలదన్నది ఎంత చెప్పినా కేవలం మాటలలో, అంకెలలో అర్థమయ్యేది కాదు. ఆ బహుళార్థక సాధక పథకం బహుముఖాలుగా సాగుతూ ఫలితాలు ప్రజల అనుభవంలోకి వచ్చే కొద్దీ, కాళేశ్వరాన్ని ఆవరించుకొని ఒక కొత్త ప్రపంచమే ఆవిష్కారమవుతుంది. దానిని 'కాళేశ్వర ప్రపంచ'మనవచ్చు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప నీటిపారుదల పథకాలు నిర్మితమైన చోట నల్లా ప్రజల ఆర్థిక-సామాజిక-సాంస్కృతిక-రాజకీయ జీవితాలు సమూలంగా మారాయి. శాశ్వతంగా మారాయి. ఇప్పుడు తెలంగాణలోనూ అదే జరుగనున్నది.

ప్రస్తుతం తెలంగాణలో పాక్షికంగానో, పూర్తిగానో నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, మానేరు, నిజాంసాగర్, సింగూరు వంటి నీటిపారుదల పథకాలున్నాయి. వాటి ప్రభావం ఏమిటన్నది ఆయా ప్రాజెక్టుల ఆయకట్టు రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలకు తెలుసు. ఆ ప్రాజెక్టులు నిర్మాణం కాకముందు అక్కడి వ్యవసాయాలతో పాటు ఆర్థిక–సామాజిక–సాంస్కృతిక–రాజకీయ స్థితిగతులు ఏ విధంగా ఉండేవో, ఆ తర్వాత ఏ విధంగా పెను మార్పులకు గురయ్యాయో వాటిని అధ్యయనం చేసినవారు చెప్పగలరు. నీటి అందుబాటు వల్ల, నేల తడియటం వల్ల, అది కూడా సరైన వర్షాలకు నోచుకోక నెర్రెలు బాసిన భూములలో జరుగటం వల్ల, జీవితాలు ఎల్లప్పుడూ కరువుల అంచున కొట్టమిట్టాడినప్పుడు, ప్రాజెక్టులు చేసే అద్భుతాలు ఏమిటో అనుభవించి పలువరించవలసిందే తప్ప అది మాటలకు అందని విషయం.

అటువంటి తెలంగాణలో, పైన పేర్కొన్న కొద్దిపాటి మధ్యమ స్థాయి పథకాలు, అవి కలిగించిన పరిమిత ఫలితాల తర్వాత, ఇప్పుడు కాళేశ్వరం రూపంలో ఒక కార్తవీర్యార్జున పథకం సగానికి సగం రాష్ర్టాన్ని నీళ్లతో ముంచెత్తనున్నది. గోదావరి, కృష్ణలలో చాలినంత నీరు అందుబాటులో ఉండి కూడా వినియోగించుకోక సముద్రం పాలవుతుండిన నికృష్టస్థితికి కాళేశ్వరం చరమ వాక్యం పలుకనున్నది. పాలమూరు–రంగారెడ్డి, సీతారామ వంటి ఇతర పథకాలతో కలసికట్టుగా సాగి త్వరలోనే యావత్ తెలంగాణనే ఆర్థికంగా–సామాజికంగా–సాంస్కృతికంగా–రాజకీయంగా సమూలమైన రీతిలో మార్చనున్నది. దాదాపు 19 లక్షల ఎకరాలలో ఆయకట్టు స్థిరీకరణతో పాటు మరొక 18 లక్షలకు పైగా ఎకరాలలో, 13 జిల్లాల వ్యాప్తంగా కొత్త ఆయకట్టు సృష్టి అన్నది అత్యంత అసాధారణమైన విషయం. అది కూడా పొరుగు రాష్ర్టాలతో గల దీర్ఘకాలిక వివాదాలను నేర్పుగా పరిష్కరించుకొని, అహర్నిశల శ్రమతో, సర్వ వనరుల సమీకరణ ద్వారా కనురెప్ప మూసి తెరిచేలేగా ఫలితాలను అనుభవంలోకి తేవటం గురించి ఎంతరాసినా తక్కువే. దీనంతటి సూత్రధారి ముఖ్యమంత్రి కేసీఆర్.

యథాతథంగా ఈ నీటి పారుదల ప్రభావమే పైన అనుకున్నట్లు తెలంగాణ ఆర్థిక–సామాజిక–సాంస్కృతిక–రాజకీయ ప్రపంచాన్ని సమూలంగా మార్చి వేయనున్నది. ఇక ఇది బహుళార్థ సాధకమైన ప్రాజెక్టు కాబోతున్నందున ఆ మార్పు మరెంత సమూలంగా ఉండనున్నదో ఊహించేందుకు మనం ప్రయత్నించవచ్చు. ఇందులో బహుళార్థకతను కొద్దిసేపు పక్కన ఉంచి నీటి విషయానికి వద్దాము. ప్రాజెక్టులు కొత్తగా నిర్మించిన ఇతర వెనుకబడిన ప్రాంతాలలో ఏ పరిణమాలు సంభవించాయో వాటిని అనుసరించి చూస్తే జరిగేది ఏమిటి? అవి ఆర్థికంగా, సామాజికంగా సాంస్కృతికంగా రాజకీయంగా కూడా ఉన్నాయి. ఆ విధంగా అన్నింటికన్న మొదట జరిగేది వ్యవసాయం బాగుపడటం. ఆ రంగం అంతకుముందువలె వర్షాధారితం, చెరువులపైనా, బావులపైనా ఆధారపడేది కాకపోవటం వల్ల నికరంగా సాగుతుంది. ప్రాజెక్టులకు కూడా అంతిమంగా వర్షాలు తప్పనిసరి. కానీ ప్రాజెక్టుల కారణంగా ఆ నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకొని అవసరం కొద్దీ వినియోగించుకునే పద్ధతి రావటం వల్ల నీటి సరఫరాకు భరోసా ఏర్పడింది. ఆ విధంగా వ్యవసాయం, ఆయకట్టు నికరంగా మారటమన్నది మొట్టమొదటి మార్పు అయింది. అది మౌలికమైన, విప్లవాత్మకమైన మార్పు. ఆ ప్రభావంతో దానిని వెన్నంటి తక్కిన మార్పులు వస్తాయి. అదే పద్ధతిలో ఇప్పుడు కాళేశ్వరంతో తెలంగాణలో అందుకు రాష్ట్రవ్యాప్త నాంది, గతంలో ఎన్నడూ లేని విధంగా జరిగింది.

నికరమైన సాగువల్ల మొదట జరిగేది రైతుల ఆకలి బాధ పోవటం. ఆ వెనువెంట రైతు కూలీలకు సంవత్సరం పొడవునా పనులు దొరుకటం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై, లేదా రైతు ఆర్థిక వ్యవస్థపై ఆధారపడే వృత్తిపనుల వారికి పనులు సాగటం. ఇది తొలి దశ మార్పు. ప్రాజెక్టుల నిర్మాణం జరిగిన వెనుకబడిన ప్రాంతాలన్నింట ఇదే జరిగింది. మరొకవిధంగా చెప్పాలంటే, నిర్మాణ ఫలితాలు ప్రజల జీవితపు మూలాలలోకి ప్రవేశించటమన్నమాట. ఈ మొదటి దశ తర్వాత జరిగేది వ్యవసాయదారునికి కొద్దికొద్దిగా మిగులు సంపద ఏర్పడటం. అప్పుడు రైతు తన అప్పులు తీర్చటం, ఇక అప్పులకు వెళ్లకుండా ఉండటం ధాన్యాన్ని వీలైన మేర విక్రయించి ఆ డబ్బుతో పిల్లలకు చదువులు చెప్పించటం, వైద్య అవసరాలకు ఖర్చు చేయటం, ఇతర కుటుంబ ఖర్చులకు వినియోగించటం వంటివి జరుగుతాయి. జీవన ప్రమాణాలు పలు విధాలుగా మెరుగుపడటం కన్పిస్తుంది. మూడవ దశలో మరింత వ్యవసాయ మిగులు అందుబాటులోకి వచ్చినా కొద్దీ వ్యవసాయ విక్రయాలు స్థానికాన్ని మించి బయటి ప్రాంతాలకు విస్తరించసాగాయి. ఇదే మూడవ దశ రైతుల వద్ద, వ్యాపారుల వద్ద మిగులును మరింత పెంచటం, వ్యాపారాలు, మిల్లులు, రవాణా, బ్యాంకింగ్, కమ్యూనికేషన్లు, వినోదం, విద్య, వైద్యం దైవభక్తి ఎగుమతి దిగుమతులు, మీడియా, ప్రచురణలు, కొత్త శాస్త్రసాంకేతిక పరికరాలు, ఆధునిక నిర్మాణాలు, ఆహారపు అలవాట్లు, పర్యాటకం, వినిమయ రంగం వృద్ధి చెందటం, వీటన్నింటికి తగిన లిటిగేషన్లు మొదలైనవి ఆరంభం కావటమో విస్తరించటమో జరుగుతుంది.

> **ఒక్క కాళేశ్వరం పథకం వల్ల వ్యవసాయికంగా, పారిశ్రామికంగా, ఇతరత్రా, ఆర్థిక, సామాజిక-సాంస్కృతిక-రాజకీయ రంగాలలో మార్పులు జీవితపు మూలాలకు ఏ విధంగా విస్తరించగలవో దీనిని బట్టి గ్రహించవచ్చు. వీటిలో కొన్ని మార్పులు స్వల్పకాలంలోనే మొదలై మధ్య కాలాలకు, దీర్ఘకాలానికి విస్తరిస్తాయి. ఇవి క్రమంగా ఒక సుభిక్ష రైతాంగాన్ని సమాజాన్ని, సంపన్న సమాజాన్ని ఆవిష్కరించగలవు.**

మరొకస్థాయిలో ఈ మార్పుల ప్రభావాలతో కుటుంబాల సంబంధాలు, మానవ సంబంధాలు, సామాజిక దృష్టి, సామాజిక సంబంధాలు మారుతాయి. వ్యక్తులు, వర్గాల ఆలోచనలు, లక్ష్యాలు, వ్యవహరణా పద్ధతులు కూడా మారుతాయి. వ్యాపారాలు, పరిశ్రమలు, వృత్తులు విస్తరిస్తాయి. స్థానిక రాజకీయాలు, రాష్ట్ర, జాతీయస్థాయి రాజకీయాలు అందరినీ తమ పరిధిలోకి లాగి వేస్తాయి. అది ప్రత్యక్షం కావచ్చు, పరోక్షం కావచ్చు. గుర్తించవలసిందేమంటే నదీప్రవాహంలో నీటితోపాటు కొంత తాలూతరకా కూడా ఉన్నట్లు ఈ పరిణామాలలో అవాంఛనీయమైనవి కొన్ని ఉండవచ్చు గాక. కానీ, ప్రాజెక్టుల నిర్మాణం కన్న ముందునాటి సమాజాలు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా ఆ తర్వాత దశలుదశలుగా మారి తీరుతాయన్నది ఇందులో గుర్తించవలసిన ప్రధాన విషయం. ఇది అంతటా జరిగింది. మన పొరుగున గల ఆంధ్రప్రదేశ్‌లో 19వ శతాబ్దం మధ్యకాలంతో ఆరంభించి జరుగుతూ వచ్చింది ఇదే అయినట్లు ఆ విషయాలు అధ్యయనం చేసినవారు వివరించిన విషయం. ఇటువంటివే ఇంకా అనేకానేకం ఉంటాయి.

ఇంతవరకు చెప్పుకున్నవన్నీ వ్యవసాయ, గ్రామీణ సంబంధమైనవి కాగా, గ్రామీణ సమాజానికి, పట్టణ సమాజానికి ఉండే సంబంధాల దృష్ట్యా ఈ ప్రభావాలు పట్టణ సమాజాలపై కూడా కన్పిస్తాయి. పోతే, కాళేశ్వరం పథకం కేవలం నీటి పారుదల ప్రాజెక్టు కాకుండా బహుళార్థసాధకం అయినందువల్ల ఈ నిర్మాణ ఉపయోగాలు, ప్రభావాలు తెలంగాణపై ఇంకా అనేక విధాలుగా ఉండనున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన దానిని బట్టి ఈ తరహా ప్రాజెక్టుల వల్ల సాధారణంగా జరిగే జలవిద్యుత్ ఉత్పత్తితో పాటు పరిశ్రమల అవసరాల కోసం పది శాతం నీటిని, హైదరాబాద్ నగరంతో సహా ప్రజల మంచినీటి అవసరాలను లేదా మిషన్ భగీరథ అవసరాలను తీర్చనున్నారు. ఇతర బహుళార్థ ప్రయోజనాలలో మత్స్య పరిశ్రమాభివృద్ధి, చెరువులలో నీళ్లు నింపటం, భూగర్భ జలాల మట్టాల పెరుగుదల, నీరు నిలువ ఉండే పొడవైన కాలువ ప్రాంతాలు, నదీ ప్రవాహ ప్రాంతాలలో జల రవాణా అవకాశం, టూరిజం మొదలైన వాటికి వీలుంటుంది. ఒక్క కాళేశ్వరం పథకం వల్ల వ్యవసాయికంగా, పారిశ్రామికంగా, ఇతరత్రా, ఆర్థిక, సామాజిక–సాంస్కృతిక–రాజకీయ రంగాలలో మార్పులు జీవితపు మూలాలకు ఏ విధంగా విస్తరించగలవో దీనిని బట్టి గ్రహించవచ్చు. వీటిలో కొన్ని మార్పులు స్వల్పకాలంలోనే మొదలై మధ్య కాలాలకు, దీర్ఘకాలానికి విస్తరిస్తాయి. ఇవి క్రమంగా ఒక సుభిక్ష రైతాంగాన్ని సమాజాన్ని, సంపన్న సమాజాన్ని ఆవిష్కరించగలవు.

పోతే కాళేశ్వరంపై జరిగే 80 వేల కోట్ల రూపాయల ఖర్చు ఎక్కువని, ఆ మొత్తాలు తిరిగి రానివని కొందరు పొరపాటుగా భావిస్తున్నారు. ప్రాజెక్టుల లాభాలు ఎక్కడ కూడా ఛార్టర్డ్ అకౌంటెన్సీ లెక్కల రూపంలో ఉండజాలవు. లక్షల ఎకరాలలో రెండు పంటల రూపంలో వచ్చే సంపదలు, పైన పేర్కొన్న పరిశ్రమలు ఇతర అనుబంధ కార్యకలాపాల రూపంలో ఒనగూరే ప్రయోజనాలు ప్రత్యక్ష పరోక్ష రూపాలలో ప్రభుత్వ కోశాగారానికి క్రమమైన రీతిలో గణనీయమైన ఆదాయాన్ని తెచ్చిపెట్టగలవు. ఇక రైతులకు, పరిశ్రమల వారికి, సామాజికులకు కలిగే ఇతర నికరమైన లాభాలు లెక్కగట్టలేనివి. కనుక ఈ విస్తృత దృక్పథంతో కాళేశ్వరం ఒక వెలగట్టలేని సంపద.

# గురుకులాలు గుబాళిస్తున్నాయి!

**విశ్లేషణ**



**కె. బాలకిషన్ రావు**

పేద, దిగువ మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వెనుకబడిన తరగతుల వారి కోసం మరో 119 గురుకులాలను ప్రారంభించింది. దీన్ని సామాజిక సంక్షేమంలో, విద్యా వికాసంలో విప్లవాత్మక మార్పుగా పరిగణించాలి. ఇది సీఎం కేసీఆర్ తన నిబద్ధతకు నిదర్శనం. బీసీ సంక్షేమంపై ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు ఎన్ని శుష్క వాగ్దానాలు చేశాయో చూశాం. తెలంగాణ సమాజంలో బీసీల జనాభా ఎక్కువ. దాదాపు 54 శాతానికిపైగా ఉన్నట్లు లెక్కలు తెలుపుతున్నాయి. వీరికి అవసరమైన విద్యా పథకాలు అంతంత మాత్రమే. అందుకే వీరి విద్యావికాసం కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒకటి (బాలురు, బాలికలు) చొప్పున 119 బీసీ గురుకులాలను నెలకొల్పింది.

తెలంగాణ ఏర్పడక ముందు బీసీ గురుకులాలు కేవలం 19 మాత్రమే. విద్యార్థుల సంఖ్య ఎనిమిది వేలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017–18లో 119 బీసీ గురుకుల పాఠశాలలు, ఈ ఏడాది కొత్తగా మరో 119 నెలకొల్పారు. వీటిలో బాలికలకు 63, బాలురకు 56 కేటాయించారు. దీంతో మొత్తం బీసీ గురుకుల పాఠశాలల సంఖ్య 280కి చేరింది. అదనంగా 28,560 మందికి ప్రవేశాలు లభించాయి. మొత్తం మీద 91,680 మంది విద్యార్థులు వీటిలో చదువుకుంటున్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వ నినాదమైన కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యాపథకంలో భాగంగా వీటిని విస్తృత విద్యావసతుల కల్పనకు ఉద్దేశించారు. వీటిలో చదువుకున్న విద్యార్థులు ఆణిముత్యాల్లా రాణిస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధనలో ప్రమాణాలు కలిగిన ఈ గురుకులాల్లో ఏటా పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు.

ఒక్కో నియోజకవర్గంలో పది గురుకుల పాఠశాలల చొప్పున మొత్తం 1190 గురుకులాలను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశించారు. మొత్తంమీద అన్ని సామాజిక వర్గాలకు కలిపి 906 గురుకుల పాఠశాలలు (కళాశాలలు 53 కలిపితే 959) పనిచేస్తున్నాయి. వీటిలో కొన్ని జూనియర్ కాలేజీలకు అప్‌గ్రేడ్ అయ్యాయి, మరో రెండుమూడేండ్లలో అన్నిటినీ జూనియర్ కళాశాలల స్థాయికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రం ఏర్పడకముందు అన్ని సామాజికవర్గాల గురుకులాల్లో 1,45,254 మంది మాత్రమే విద్యనభ్యసించేవారు. ప్రస్తుతం ఇది 4,19,370 మందికి చేరుకున్నది. అంటే నాలుగింతలు పెరిగింది. వచ్చే కొన్నేండ్లలో మరో 284 గురుకులాలు ఏర్పాటుకానున్నాయి. అప్పుడు విద్యార్థుల సంఖ్య ఏడు లక్షలకు చేరుకుంటుందని తెలుస్తున్నది.

సమాజంలో పేద అణగారినవర్గాలు నాణ్యమైన విద్యకు దూరంగా ఉంటున్నాయి. అందుకోసం ప్రత్యేకంగా వీరిలో విద్యావికాసానికి కృషిచేయాలని 1971లో సర్వోదయ నాయకుడు మద్ది నారాయణరెడ్డి బెంగాల్లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ స్థాపించిన శాంతినికేతన్ తరహా పాఠశాలను స్థాపించాలని నాటి విద్యామంత్రి పీవీ నరసింహారావును కోరారు. వాటి ఏర్పాటుకు భూమి, భవనాలు అవసరమని, ఖర్చుతో కూడుకున్నదని ప్రభుత్వం నుంచి పీవీ నిస్సహాయతను వ్యక్తం చేశారు. అయితే దీనికి నారాయణరెడ్డి సర్వోదయ ట్రస్టు నుంచి 44 ఎకరాల భూమిని విరాళంగా ఇవ్వడంతోపాటు కొన్ని సర్వోదయ ట్రస్టు భవనాలను కూడా ప్రభుత్వానికి అందించడానికి ముందుకువచ్చారు. అదే సమయంలో ముఖ్యమంత్రిగా పీవీ బాధ్యతలు చేపట్టారు. అలా ఉమ్మడి నల్గొండ జిల్లా సర్వేల్‌లో తొలి గురుకులాన్ని 1971 నవంబరు 23న పీవీ ప్రారంభించారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎందరో ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణిస్తున్నారు. అక్కడి విద్యార్థులు చదువులో చూపిస్తున్న ప్రతిభ, సాధిస్తున్న ర్యాంకులు, అఖిల భారత సేవలకు ఎంపికలు వంటివి ఆ తర్వాత క్రమంలో రాష్ట్రంలో గురుకుల విద్యావ్యాప్తికి దోహదం చేసింది. విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇవ్వడంతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, విజ్ఞాన విషయాలు బోధిస్తూ ఉత్తమ ప్రమాణాలు సాధించడం.. మరెన్నో పాఠశాలల ఏర్పాటుకు దోహదమైంది. జనరల్ కేటగిరీ గురుకులంలో అందరూ చేరడానికి అవకాశం ఉండటంవల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు సీట్లు లభించడం తక్కువ. ఈ కారణంతో ఆయా సామాజికవర్గాల వారీగా గురుకులాలను ప్రారంభించడం మొదలైంది. ఇప్పుడు గురుకులం ఇంతింతై వటుడింతై అన్నట్లుగా తెలంగాణలో భారీగా విస్తరిస్తున్నది. భవిష్యత్తులో వీటిని పీజీ వరకు విస్తరించిన తర్వాత విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ కేంద్రాలు కూడా నెలకొల్పాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. దీనివల్ల ఉత్తమ విద్యతో పాటు అవి మానవ వనరుల తయారీ కేంద్రాలుగా ఇవి రూపు దాల్చనున్నాయి. అప్పుడు దేశానికి రాష్ర్టానికి వన్నె తెచ్చే విద్యావంతులు మన రాష్ట్రం నుంచే వస్తుంటారు.

> **తెలంగాణ సమాజంలో వివిధ సామాజిక వర్గాల్లో తరతరాల నుంచి ఉన్న సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని రూపుమాపాలంటే చదువు ముఖ్యం. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు ప్రారంభిస్తే సరిపోదు. ఆయా వర్గాలు సమీకృతంగా అభివృద్ధి చెందాలంటే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ముఖ్యం. అందుకే విద్యను గురుకులంగా అందిస్తూ ఆర్థికంగా తల్లిదండ్రులపై భారం పడకుండా వివిధ సామాజిక వర్గాలను మంచి స్థితికి తీసుకురావడానికి ప్రభుత్వమే ఈ వ్యయమంతా భరిస్తున్నది.**

**వసతుల కల్పనలో రాజీలేదు:** విద్యార్థుల వికాసం కోసం ప్రభుత్వం అన్నివిధాల వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. ఆశ్రమ విధానంలో ప్రభుత్వమే పూర్తిగా ఉచిత వసతి, మంచి పోషకాలతో కూడిన భోజనం, పాఠ్యపుస్తకాలు, ఒక్కో విద్యార్థికి ఏడాదికి మూడు జతల ఏకరూప దుస్తులు (యూనిఫారం), ఆటల కోసం ట్రాక్‌సూట్, రెండు జతల షూస్, 3 జతల సాక్సులు, పడుకునేందుకు బెడ్డింగ్ మెటీరియల్ అందిస్తున్నది. వీటితోపాటు కాస్మొటిక్ ఛార్జీలు కూడా విద్యార్థులకు ప్రతి నెలా రూ.345 నుంచి 420 వరకు చెల్లిస్తున్నది. ఒక్కోవిద్యార్థికి సగటున ఏడాదికి రూ.లక్ష నుంచి లక్షా 25 వేల వరకు వ్యయం చేస్తున్నది. ప్రభుత్వం గతేడాది మొత్తంగా గురుకులాల మీద చేసిన వ్యయం 2,404 కోట్లు ఉండగా, ఈ ఏడాది ఇది 3000 కోట్లు దాటనున్నదని అంచనా.

తెలంగాణ సమాజంలో వివిధ సామాజిక వర్గాల్లో తరతరాల నుంచి ఉన్న సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని రూపుమాపాలంటే చదువు ముఖ్యం. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు ప్రారంభిస్తే సరిపోదు. ఆయా వర్గాలు సమీకృతంగా అభివృద్ధి చెందాలంటే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ముఖ్యం. అందుకే విద్యను గురుకులంగా అందిస్తూ ఆర్థికంగా తల్లిదండ్రులపై భారం పడకుండా వివిధ సామాజిక వర్గాలను మంచి స్థితికి తీసుకురావడానికి ప్రభుత్వమే ఈ వ్యయమంతా భరిస్తున్నది. లక్షల కుటుంబాల్లో విద్యా దీపాలు వెలిగించడమే కాదు ఆర్థికాభివృద్ధి, సామాజిక స్థితి పెరుగుదలకు గురుకులాలు దోహదపడుతున్నాయి. ఈ విద్యాసంస్థల్లో చదువుకొని ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ఎన్‌ఐటీలు, ఎయిమ్స్‌తో పాటు ప్రభుత్వ ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధిస్తున్నారు. యూపీఎస్సీ ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్, ఇతర కేంద్ర సర్వీసుల ఉద్యోగాలు పొందుతున్నారు. ఇదంతా నాణ్యమైన గురుకుల విద్యా పీఠాల వల్లనే జరుగుతున్నది. రాబోయే రోజుల్లో వివిధ రంగాల్లో ఘనాపాఠీలైన యువతను గురుకులాలు తెలంగాణ రాష్ర్టానికి కానుకగా సమర్పిస్తాయనడంలో సందేహం లేదు.

**(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# 'కాళేశ్వరం'ను సందర్శించిన విదేశీ ప్రొఫెసర్లు

**కాళేశ్వరం(జయశంకర్ భూపాలపల్లి):** రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును విదేశీ ప్రొఫెసర్ల బృందంబుధవారం సందర్శించింది. బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలకు చెందిన ఐదుగురు ప్రొఫెసర్ల బృందం ముందుగా అన్నారం ప్రాజెక్టు వద్దకు రాగా వారికి ఈఎన్సీ వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అనంతరం వ్యూ పాయింట్ వద్ద నుంచి విదేశీ ప్రొఫెసర్లకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన తీరు, వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టువల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించారు. ఇలాంటి ప్రాజెక్టును తామెక్కడా చూడలేదనీ, ఇంతటి గొప్ప ప్రాజెక్ట్ నిర్మించిన తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.



భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంపహౌస్‌ను పరిశీలిస్తున్న విదేశీ ప్రొఫెసర్లు



వేములవాడ రాజన్న సన్నిధిలో భక్తులరద్దీ నెలకొన్నది. బుధవారం వేకువజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించుకొని క్యూలైన్లలో బారులు తీరారు. రాజన్నను సుమారు 3 వేల మంది భక్తులు దర్శించుకోగా.. 2 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయాధికారులు వెల్లడించారు. - వేములవాడ కల్చరల్

# ఎంపీ సోయం బాపురావుపై కేసు

- గాదిగూడ విజయోత్సవ సభలో అనుచిత వ్యాఖ్యలు
- ఏఎస్పీకి ఫిర్యాదు చేసిన మైనార్టీ నాయకులు



**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:** ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుపై పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై గుణవంత్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. గాదిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన విజయోత్సవసభలో ఎంపీ సోయం బాపురావు ఓ వర్గాన్ని కించపరిచే విధంగా అనుచిత వాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాంగ్రెస్‌పార్టీకి చెందిన మైనార్టీ నేత షాజిద్‌ఖాన్‌తోపాటు పలువురు నాయకులు ఏఎస్పీ కంచె మోహన్‌కు ఫిర్యాదు చేశారు. సభలో ఎంపీ మాట్లాడిన రికార్డును పరిశీలించిన పోలీసులు ఆయనపై 29 4, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆదివాసులను కించపరిచే విధంగా వాయిస్ మెసేజ్‌లు పంపిన గుర్తు తెలియని వ్యక్తిపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా 294, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



## ఆర్మూర్‌లో వందడుగుల

# మువ్వన్నెల జెండా

ప్రారంభించిన ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఆర్మూర్ నిజాంసాగర్ కెనాల్ చౌరస్తా వద్ద రెపరెపలాడుతున్న భారీ మువ్వన్నెల జెండా

**ఆర్మూర్, నమస్తే తెలంగాణ :**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 100 అడుగుల ఎత్తున్న జాతీయ జెండా రెపరెపలాడింది. పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ వద్ద మున్సిపల్ 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.57 లక్షలతో చేపట్టిన క్లాక్‌టవర్, ఫౌంటెన్, 100 అడుగుల జెండాను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కశ్యప్ స్వాతిసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన హేమాహేమీలకు సాధ్యం కాని పనిని టీఆర్‌ఎస్ హయాంలో చేసి చూపించామని తెలిపారు. జాతీయజెండా ప్రారంభోత్సవానికి పట్టణ ప్రజలు, మహిళలు, విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ఆర్మూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## జూలై 15 నాటికి

# భగీరథ పనులు పూర్తవ్వాలి

- ఇంటింటికీ నల్లా నీరు అందితేనే బిల్లులు మంజూరు
- వచ్చే నెల 1 నుంచి పెంచిన పింఛన్లు అమలు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వరంగల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, అరూరి రమేశ్

**వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ :** ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్‌భగీరథ పనులు జూలై 15 నాటికి పూర్తిచేయాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హన్మకొండ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వందశాతం పనులు పూర్తై, ఇంటింటికి నల్లా ద్వారా తాగు నీరు సరఫరా అవుతున్నట్టు గ్రామసభ తీర్మానం పంపినప్పుడే బిల్లులు చెల్లిస్తామన్నారు. తప్పుడు నివేదికలిచ్చిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు కల్పించినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, వసతిగృహాలు, డబుల్ బెడ్రూం ఇండ్లకు, కేజీబీవీలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ పొడిగింపునకు ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. సక్రమంగా పనిచేయని ఇంజినీరింగ్ అధికారులను బాధ్యతల నుంచి తప్పించాలని కలెక్టర్లకు సూచించారు. మేడారం జాతరకు వచ్చే భక్తుల కు సమృద్ధిగా నీటినిసరఫరా చేసేందుకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టనున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సామాజిక వనరుల అభివృద్ధికి గరిష్ఠంగా పనిదినాలను కల్పించాలని తెలిపారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, ఫారెస్ట్, పోలీస్ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. జూలై 1 నుంచి 57 ఏండ్లకు కుదించిన వయోపరిమితి ప్రకారం నెలకు రూ.2016 ఆసరా పింఛన్లను ప్రజాప్రతినిధుల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాకు గరిష్ఠ లబ్ధి కలుగుతుందని, దేవాదుల పనులను పూర్తి చేసేందుకు చొరువ తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు పొందినందుకు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, డీఆర్‌డీవో టీ రాముకు మెమొంటోను, ప్రశంసా పత్రాలను అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, సత్యవతి రాథోడ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, టీ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, వీ సతీశ్‌కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# 'కాళేశ్వరం'తో జీవనదిలా వరదకాలువ

- మూడేండ్లలోనే ప్రాజెక్టును నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్
- వరద కాలువకు తూముల నిర్మాణ పనులు ప్రారంభం



కరీంనగర్ జిల్లా షానగర్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే రవిశంకర్ తదితరులు

**రామడుగు:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రాబోయే రోజుల్లో వరద కాలువ జీవ నదిలా మారనుందని వైద్య ఆరోగ్య శాఖమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్ శివారులోని వరద కాలువకు తూముల ఏర్పాటు కోసం మంత్రి ఈటల బుధవారం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల బాధలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రాజెక్టుల నిర్మాణమే సరైనదని గ్రహించి గోదావరి నదిపై కాళేశ్వరం నిర్మించి, ప్రారంభించారన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణానికి 21 ఏండ్లు, నాగార్జునసాగర్‌కు 15, ఎస్సారెస్పీ కట్టి పంటపొలాలకు నీళ్లిచ్చేందుకు 30 ఏండ్లు పట్టిందనీ, మూడేండ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి సీఎం కేసీఆర్ రికార్డు సృష్టించారన్నారు. కాళేశ్వరం పూర్తయిన తర్వాత భూగర్భ సొరంగ మార్గాల ద్వారా నీళ్లు కాలువల్లోకి వచ్చి పారేది కరీంనగర్ జిల్లాలోనేనని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞం పేరుతో కాలం వెళ్లదీశారనీ, టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే మిడ్‌మానేర్, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు మోక్షం కలిగిందన్నారు. దేశంలోనే గొప్ప వ్యవసాయక రాష్ట్రంగా తెలంగాణ మారబోతున్నదని గర్వంగా ప్రకటిస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల హక్కులను పరిరక్షించాలి

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

**మామిళ్లగూడెం:** ఎస్సీ ఎస్టీల హక్కుల పరిరక్షణకు అధికారులు నిబద్ధతతో పని చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కోరారు. ఖమ్మం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్ష బుధవారం టీటీడీసీ భవనంలో జరిగింది.ఉమ్మడి రాష్ట్రంలో కేవలంలో పదవులు, పైరవీలకు హైదరాబాద్‌లో తిష్ఠ వేసి ప్రజల సమస్యలు పట్టించుకోకుండా కమిషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక కమిషన్‌ను బలోపేతం చేశారన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో 6 వేల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని తెలంగాణ వచ్చినంక 5 వేల కేసులు పరిష్కరించి బాధితులకు రూ. 25 కోట్లు పరిహారం అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఎగువమానేరుకు మహర్దశ

- పూడికతీతతో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం
- సిరిసిల్ల, కామారెడ్డి కలెక్టర్లు కృష్ణభాస్కర్, సత్యనారాయణ
- ఖనిజ అభివృద్ధి సంస్థ మేనేజర్ మయ్యూర్‌తో కలిసి సందర్శన



రాజన్న సిరిసిల్ల జిల్లా నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులో పర్యటిస్తున్న కలెక్టర్లు, అధికారులు

**గంభీరావుపేట:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు మహర్దశ పట్టనుందని రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి కలెక్టర్లు కృష్ణభాస్కర్, సత్యనారాయణ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తొమ్మిదో ప్యాకేజీలో భాగంగా మధ్య మానేరు జలాశయం నుంచి నీటిని ఎగువ మానేరుకు తరలించనున్నారు. 1940లో నిజాం నవాబులు నిర్మించినా.. ఆ తరువాత పూడిక తీయకపోవడంతో ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో పూడికతీత చేపట్టి నీటినిల్వ సామర్థ్యం పెంపొందించాలని కేటీఆర్ ఆదేశించగా కలెక్టర్లు, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ మేనేజర్ మయ్యూర్, మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి ప్రాజెక్టును బుధవారం సందర్శించారు. ప్రయోగాత్మకంగా మానేరు ముంపులో జేసీబీ సహాయంతో అక్కడక్కడ కొన్ని ప్రదేశాలలో పూడిక తీశారు. పూడిక మట్టి, ఇసుక నమూనాలను పరిశీలించారు. మానేరు విస్తీర్ణం, పరిధి, నీటి నిల్వ తదితర అంశాలను రికార్డుల ద్వారా పరిశీలించి తెలుసుకున్నారు. పూడికతీతలో ఎక్కువగా ఇసుక లభ్యమైతే స్థానిక అవసరాలకే ఉపయోగించాలని, సారవంతమైన నల్ల మట్టి వెలుబడితే రైతుల పొలాలకు తరలిస్తామని స్పష్టం చేశారు.



మీలా సత్యనారాయణ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# మీలా సత్యనారాయణకు కన్నీటి వీడ్కోలు

- సూర్యాపేటలో ముగిసిన అంత్యక్రియలు
- మీలా మరణం సూర్యాపేటకు తీరని లోటు : మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట, నమస్తేతెలంగాణ :** అనారోగ్యంతో మృతి చెందిన సుధాకర్ గ్రూప్స్ అధినేత, సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ మీలా సత్యనారాయణ అంత్యక్రియలు బుధవారం సూర్యాపేటలోని గాంధీనగర్‌లో ముగిశాయి. మీలా మృతితో సూర్యాపేట పట్టణం శోకసంద్రంలో మునిగింది. ఆయన మృతికి సంతాప సూచకంగా పట్టణంలోని వ్యాపార వాణిజ్య సంస్థలు బంద్ పాటించాయి. జమ్మిగడ్డలోని ఆయన నివాసంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచిన మీలా పార్థివ దేహానికి పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు నివాళులర్పించారు. విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మీలా సత్యనారాయణ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్న మీలా మృతి సూర్యాపేటకు తీరని లోటని మంత్రి అన్నారు. శాసనమండలి తాత్కాలిక చైర్మన్ నేతి విద్యాసాగర్, ప్రత్యేక న్యాయమూర్తి డీ నర్సింహచారి, భువనగిరి ఎంపీ వెంకటరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ మంత్రులు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రవళికాప్రకాశ్, మాజీ మున్సిపల్‌చైర్మన్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# బాసర ట్రిపుల్‌ఐటీలో ముగిసిన కౌన్సెలింగ్

1,320 మంది హాజరు.. 84 మంది గైర్హాజరు

**బాసర:** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాలలో 2019-20 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ముగిసింది. తొలిరోజు 800 మందికి 745 మంది హాజరు కాగా.. రెండోరోజు 575 మంది హాజరయ్యారు. మొత్తం 84 మంది గైర్హాజరయ్యారు. ఈ నెల 28న రెండో దశ జాబితాను విడుదల చేసి జూలై 3న వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్‌సీసీ, క్యాప్ విద్యార్థులకు ఈ నెల 29న, గ్లోబల్ సీట్లకు జూలై 4న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, జూలై 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

# ఆసిఫాబాద్‌లో భారీ చోరీ

**ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాపునగర్‌లో చోరీ జరిగింది. వ్యాపారి ఉత్తం సింగ్ రాజ్‌పురోహిత్ ఇంట్లో దుండగులు రూ.15 లక్షలు ఎత్తుకెళ్లారు. స్థానిక గాంధీ చౌక్‌లో ఎలక్ట్రికల్ షాపు నిర్వహించే ఉత్తం సింగ్ మంగళవారం రాత్రి 10.30 గంటలకు ఇంటికి వెళ్లాడు. అప్పటికే ఇంటి తాళం తీసి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా, బీరువా పగుల గొట్టి ఉంది. అందులో ఉన్న రూ.15 లక్షలు కనిపించ లేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## మరో రెండురోజులు

# తేలికపాటి వానలు

- 30న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- బుధవారం పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం
- మెదక్‌జిల్లా టేక్మాల్‌లో 29.5 మి.మీటర్లు నమోదు



వరంగల్ నగరంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర తీరానికి దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 3.1 నుంచి 7.5 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. జూన్ 30న ఉత్తర బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖాధికారి రాజారావు తెలిపారు. రాగల 48 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోతేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశముందని తెలిపారు.

**వరంగల్ / మెదక్ కలెక్టరేట్ :** ఉమ్మడి వరంగల్ తోపాటు మెదక్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. వరంగల్ జిల్లా వేలేరు మండలం, జనగామ జిల్లా తరిగొప్పుల మండలాల్లో వర్షం పడింది. వరంగల్ నగరంలో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. మెదక్ జిల్లాలోని టేక్మాల్ మండలంలో అత్యధికంగా 29.5 మీ.మీల వర్షం నమోదైంది. కొల్చారం, పాపన్నపేట, మెదక్ మండలాల్లోని పలు గ్రామాలలో బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురిశాయి.

**ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి**

**హైదరాబాద్, సిటీబ్యూరో నమస్తే తెలంగాణ:** గాలిలో తేమ తగ్గడంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. పగటి పూట ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వాతావరణం స్వల్పంగా వేడెక్కింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 35.2డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 25.8 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 49 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాగల 24 గంటల్లో గ్రేటర్ పరిధిలోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.

## పాము కాటుతో నవవధువు మృతి

**మానవపాడు:** పాము కాటుతో నవ వధువు మృతి చెందిన విషాద ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా బోరవెల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఫకీరప్ప కూతురు శ్రీలతకు వనపర్తి జిల్లా మదనాపురం మండలం ద్వారకానగర్‌కు చెందిన అశోక్‌తో ఈనెల 23న వివాహం జరిపించారు. పెండ్లి అనంతరం వధూవరులు అమ్మాయి పుట్టిల్లు బోరవెల్లికి చేరుకున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఉక్కపోతగా ఉండటంతో నవ దంపతులు ఆరుబయట నిద్రించారు. తెల్లవారు జామున శ్రీలతకు పాము కాటు వేసింది. దీంతో మొదట నాటు వైద్యం చేయించి అనంతరం పరిస్థితి విషమించడంతో చికిత్సనిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా శ్రీలత ప్రాణాలు వదిలింది.

## 3 నెలల పాపను హోటల్‌లో వదిలేసిన తల్లి

- వెతుక్కుంటూ వచ్చిన తండ్రి
- ఆధారాలు ఉంటే అప్పగిస్తామన్న అధికారులు

**మణుగూరు రూరల్:** మూడు నెలల పసి పాపను ఓ తల్లి హోటల్‌లో వదిలి వెళ్లిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో చోటుచేసుకున్నది. ఐసీడీఎస్, పోలీస్ అధికారుల వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లికి చెందిన ఓ మహిళ మంగళవారం 3 నెలల పసి పాపను మణుగూరు బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో వదిలేసి వెళ్లింది. హోటల్‌లో పనిచేసే గంగమ్మ పాపను గమనించి తన ఇంటికి తీసుకెళ్లి అంగన్‌వాడీ టీచర్‌కు విషయం తెలిపింది. పాప తల్లి బుధవారం తన భర్తకు ఫోన్‌చేసి చిన్నారిని బస్టాండ్ సమీపంలోని హోటల్‌లో వదిలేసి హైదరాబాద్ వెళ్లిపోయానని చెప్పడంతో పాప తండ్రి బుధవారం అన్నారం వెళ్లి చిన్నారిని అప్పగించాలని కోరారు. మణుగూరు ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీ అక్కడకు చేరుకొని.. ఆధారాలు తీసుకొస్తే అప్పగిస్తామని చెప్పారు.

## విప్‌ను ధిక్కరించిన ఇద్దరు ఎంపీటీసీలపై వేటు

**ఇచ్చోడ :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికలో విప్‌ను ధిక్కరించిన ఇద్దరు ఎంపీటీసీల పదవులను రద్దు చేస్తూ ప్రిసైడింగ్ అధికారి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పరిషత్ ఎన్నికల్లో ఇచ్చోడ మండలం బోరిగామ నుంచి సింగారపు లచ్చన్న, మాన్కాపూర్ నుంచి మడావి రాములు ఎంపీటీసీలుగా గెలుపొందారు. కాగా ఈ నెల 7న స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడి ఎన్నికల్లో టీఆర్‌ఎస్ విప్‌ను ధిక్కరించి స్వతంత్ర అభ్యర్థి నిమ్మల ప్రీతమ్‌రెడ్డికి మద్దతు తెలిపారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని వారికి నోటీసులు పంపించారు. వారు ఇచ్చిన సంజాయిషీ పరిశీలించిన అధికారులు ఆమోదయోగ్యంగా లేనందున విప్‌ను ఉల్లంఘించినట్లు రుజువు కావడంతో ఎంపీటీసీ పదవులకు అనర్హులుగా భావిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. త్వరలోనే బోరిగామ, మాన్కాపూర్ ఎంపీటీసీ స్థానాలకు మళ్లీ ఎన్నికలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

## ఇక్కడ అడ్మిషన్లు లేవు..



పూర్తిస్థాయిలో 301 మంది విద్యార్థులు చేరడంతో నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసిన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖేడ ప్రభుత్వ పాఠశాల




రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు లేవని ఏర్పాటుచేసిన బోర్డు

# ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా

**మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపెల్లిలో ప్రియుడు మోసం చేశాడంటూ ప్రియురాలు బుధవారం ధర్నాకు దిగింది. బాధితురాలు గాజుల మంజుల తెలిపిన ప్రకారం.. తక్కళ్లపెల్లికి చెందిన మంజులకు అదే గ్రామానికి చెందిన మ్యాకల అనిల్‌తో సంబంధం ఏర్పడి 12 ఏండ్లుగా సహజీవనం చేశారు. అప్పటికే మంజులకు వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇటీవల అనిల్‌కు అతడి కుటుంబసభ్యులు రహస్యంగా మరో వివాహం చేశారు. దీంతో అనిల్ తనతో 12 ఏండ్లు సహజీవనం చేసి ఇప్పుడు మోసం చేశాడంటూ ఆమె అనిల్ ఇంటి ఎదుట బైఠాయించింది. విషయం తెలుసుకున్న పోలీసులు తక్కళ్లపెల్లి గ్రామానికి చేరుకొని మంజులతో మాట్లాడి అనిల్‌కు కౌన్సిలింగ్ నిర్వహించి చట్టపరంగా మంజులకు న్యాయం చేస్తామని సూచించడంతో ఆందోళన విరమించింది.

# ముస్లింల శ్మశాన వాటికకు హిందువుల భూ విరాళం

యూపీలో వెల్లివిరిసిన సోదరభావం

**ఫైజాబాద్:** ఉత్తర్‌ప్రదేశ్‌లో మతసామరస్యం వెల్లివిరిసింది. ఎనిమిది మంది హిందువులు తమకు చెందిన 1.25 ఎకరాల భూమిని ముస్లింల శ్మశాన వాటిక కోసం విరాళంగా ఇచ్చారు. ఫైజాబాద్‌లోని బెలారిఖాన్ గ్రామంలో ముస్లింల శ్మశాన వాటికను ఆనుకొని 8 మంది హిందువులకు 1.25 ఎకరాల భూమి ఉన్నది. అయితే కొంత కాలంగా ముస్లింలు తమ వారికి చెందిన మృతదేహాలను హిందువుల భూమిలో కూడా ఖననం చేస్తున్నారు. దీంతో హిందువులు, ముస్లింల మధ్య విభేదాలు తలెత్తాయి. తమ భూమిలో ముస్లింల మృతదేహాలను ఖననం చేయవద్దంటూ హిందువులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విభేదాల విషయం స్థానిక ఎమ్మెల్యే ఇంద్రప్రతాప్ తివారీ దృష్టికి వెళ్లడంతో సమస్య పరిష్కారానికి ఆయన చొరవ చూపారు. ఈ భూమిని ముస్లింలకు విరాళంగా ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు అందరం అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉన్నామని, ఇకపైనా ఇలాగే ఉందామని సర్దిచెప్పారు. దీంతో హిందువులు తమ భూమిని ముస్లింలకు అప్పగించారు. ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ కూడా పూర్తి అయ్యింది. రిజిస్ట్రేషన్ పత్రాలపై సంతకాలు చేసిన వారిలో ఒకరైన రుషి సూర్యకుమార్ జింకన్ మహారాజ్ మాట్లాడుతూ 'పలుసార్లు మా భూమిలోనూ ముస్లింలు మృతదేహాలను ఖననం చేశారు. కొన్ని సార్లు అభ్యంతరం చెప్పాం. అయినా వాళ్లు ఖననం చేయడం ఆపలేదు. చివరికి మానవతాదృక్పథంతో మా భూమిని ముస్లింలకు ఇచ్చేశాం' అని చెప్పారు.

# పేద పిల్లలకు 'పాలామృతం'

గిరిజనుల స్ఫూర్తితో సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ సామాజిక సేవ

ఘట్‌కేసర్, సిరిసిల్లలో విద్యార్థులకు పాలు సరఫరా


శేఖర్ మారవేని

**హైదరాబాద్:** మావోయిస్టుల దాడి లో గాయపడిన తనను కాపాడిన గిరిజనుల సేవా దృక్పథానికి ఆకర్షితుడైన ఓ సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ శేఖర్ మారవేని పేద విద్యార్థులకు 'నిత్య పాలామృతం' పేరుతో రోజూ పాలందిస్తున్నారు. అతను తెలంగాణవాసి కావడం విశేషం. 2017 డిసెంబర్ 12న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు సమాచారం రావడంతో సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ శేఖర్ మారవేని బృందం బయల్దేరింది. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో శేఖర్ మెడకు, ఇతర సభ్యులకు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న కొందరు గిరిజనులు శేఖర్‌తోపాటు ఆయన బృంద సభ్యులకు సపర్యలు చేసి, చికిత్స అందించారు. ప్రమాదంలో ఉన్న తమకు సాయం చేసిన ఆ గిరిజనుల సేవా దృక్పథానికి ఆకర్షితుడైన శేఖర్.. సమాజానికి తానూ ఏమైనా చేయాలనుకున్నారు. ఈక్రమంలో.. తినడానికి తిండి లేని పేద పిల్లలకు రోజూ 150 మి. లీ. చొప్పున ఒక్కో చిన్నారికి పాలు ఇవ్వాలని భావించారు. 200 మంది వలంటీర్లతో 'వైట్ వలంటీర్స్ ఫౌండేషన్' స్థాపించా రు. దాని ఆధ్వర్యంలో 'నిత్య పాలామృతం' పేరుతో ఘట్‌కేసర్‌లో పిల్లాయిపల్లిలోని 2 అంగన్‌వాడీలలో, సిరిసిల్ల జిల్లాలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగుతున్నది. 'గాయాలతో పడి ఉన్న మమ్మ ల్ని తొలిసారి స్థానిక గిరిజనులు చూసి, చికిత్స అందించారు. వారి సాయం మరిచిపోలేను' అని ప్రస్తుతం జమ్ములో పని చేస్తున్న హైదరాబాద్ వాసి శేఖర్ మారవేని అన్నారు. శేఖర్ మంచి పనులకు ఆయన భార్య లత మారవేని, ఆయన సహచరులు తమ వంతు సాయాన్ని అందిస్తున్నారు.



భద్రతా మండలిలో భారత్ అభ్యర్థిత్వానికి..

# ఆసియా ఫసిఫిక్ కూటమి మద్దతు

తాత్కాలిక సభ్యదేశాల ఎన్నికకు

వచ్చే ఏడాది జూన్‌లో ఎన్నికలు



**ఐరాస:** భారత్‌కు దౌత్య విజయం లభించింది. ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలిలో రెండేండ్ల తాత్కాలిక సభ్యత్వానికిగాను భారత్‌కు చైనా, పాకిస్థాన్ సహా 55 సభ్యదేశాలు గల ఆసియా ఫసిఫిక్ కూటమి ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించింది. 2021-22 మధ్యకాలానికి ఐదు తాత్కాలిక సభ్య దేశాల ఎన్నిక కోసం వచ్చే ఏడాది జూన్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ అభ్యర్థిత్వానికి ఆసియా ఫసిఫిక్ కూటమి ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించింది. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ బుధవారం ట్విట్టర్ ద్వారా ఈ విషయం వెల్లడించారు. మద్దతు తెలిపినందుకు 55 సభ్య దేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఆసియా ఫసిఫిక్ కూటమిలో ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, చైనా, ఇండొనేషియా, ఇరాన్, జపాన్, కువైట్, కిర్గిస్థాన్, మలేసియా, మాల్దీవులు, మయన్మార్, నేపాల్, పాకిస్థాన్, కతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, సిరియా, టర్కీ, యూఏఈ, వియత్నాం తదితర దేశాలు ఉన్నాయి. భద్రతా మండలిలో 15 సభ్యదేశాలు ఉన్నాయి. అందులో ఐదు శాశ్వత సభ్యదేశాలు, మిగిలిన 10 తాత్కాలిక సభ్య దేశాలు. శాశ్వత సభ్య దేశాలైన చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్, అమెరికాకు వీటో అధికారం ఉంటుంది. తాత్కాలిక సభ్య దేశాల పదవీకాలం రెండేండ్లు. ఆఫ్రికన్, ఆసియన్ దేశాలకు ఐదు, తూర్పు యూరోపియన్ దేశాలకు ఒకటి, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలకు రెండు, పశ్చిమ యూరోపియన్, ఇతర దేశాలకు రెండు చొప్పున వీటిని విభజించారు. ప్రతిఏటా ఐదు తాత్కాలిక సభ్యదేశాలను ఐరాస సాధారణ సభ ఎన్నుకుంటుంది. గతంలో 1950-51, 67-68, 72-73, 77-78, 84-85, 91-92, 2011-12 మధ్య కాలంలో భారత్ తాత్కాలిక సభ్య దేశంగా ఎన్నికైంది. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తున్నది.

# ఇరాక్‌లో రాముడి ఆనవాళ్లు!

క్రీ.పూ.2000 ఏండ్లనాటి కుడ్యచిత్రాన్ని గుర్తించిన భారత బృందం


ఇరాక్‌లోని బెలూలా కొండపై రాముడి కుడ్య చిత్రం

**లక్నో:** ఇరాక్‌లోని ఓ కొండపై రాముడి కుడ్యచిత్రాన్ని భారత ప్రతినిధుల బృందం గుర్తించింది. ఉత్తర్‌ప్రదేశ్ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో పనిచేసే పరిశోధన సంస్థ 'అయోధ్య శోధ్ సంస్థాన్' విజ్ఞప్తి మేరకు ఇరాక్‌లోని భారత రాయబారి ప్రదీప్ సింగ్ రాజ్‌పురోహిత్ సారథ్యంలో భారత బృందం బార్‌బంద్-ఈ-బెలులా కొండపై అన్వేషణ చేపట్టింది. సుమారు క్రీ.పూ. 2000 ఏండ్ల నాటికి చెందిన రాముడి కుడ్యచిత్రాన్ని వారు గుర్తించారు. చేతిలో విల్లు, పక్కన అమ్ములపొది, నడుముకు చిన్న కత్తిని కట్టుకున్న రాజు, కింద మోకాళ్లపై ఓ వ్యక్తి కూర్చొని ఉన్న ఈ చిత్రం శ్రీరాముడు, హనుమంతుడికి చెందినదని అయోధ్య శోధ్ సంస్థాన్ భావిస్తున్నది. అయితే అది బెలూలా కొండపై నివసించే ఆదిమ తెగ రాజు టర్‌డొని చిత్రమని ఇరాక్ నిపుణులు చెబుతున్నారు. 'బెలులా పాస్‌లో రాముడి జాడకు సంబంధించి పురాణ ఆధారాలు ఉన్నాయి. అయితే భారత, మెసపటోమియన్ సంస్కృతుల మధ్య సంబంధంపై విస్తృత పరిశోధన చేసేందుకు భారత బృందం ప్రత్యక్ష ఆధారాలు సేకరించింది' అని అయోధ్య శోధ్ సంస్థాన్ డైరెక్టర్ యోగేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. ఆ కుడ్యచిత్రంలోని బొమ్మలు.. శ్రీరాముడిని, హనుమంతుడిని మనకు గుర్తుకు తెస్తున్నాయని చెప్పారు. 'ఇరాక్ ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మరింత అన్వేషించేందుకు వీలవుతుంది. ఇప్పటికే అనుమతి కోరాం' అని ప్రతాప్ సింగ్ తెలిపారు. సింధు, మెసపటోమియా నాగరికతల మధ్య సంబంధాన్ని విశదీకరించేందుకు ఇదే తొలి అధికారిక ప్రయత్నమని పేర్కొన్నారు. క్రీ.పూ. 4500- 1900 మధ్య కాలంలో లోయర్ మెసపటోమియాను సుమేరియన్లు పరిపాలించారని, వీరు భారత్ నుంచి వచ్చారనేందుకు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇరాక్‌లో ఉన్న కుడ్యచిత్ర నమూనాను అయోధ్యలో ఏర్పాటుచేసేందుకు యూపీ సాంస్కృతిక విభాగం ఇప్పటికే ఓ ప్రతిపాదన సిద్ధం చేసింది. 'రాముడి పాదముద్రలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. వాటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేలా అయోధ్యలో వాటి నమూనాలను ఏర్పాటుచేయనున్నాం' అని సింగ్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మంత్రి కుమారుడి మృతి

- అతడి స్నేహితుడు కూడా దుర్మరణం
- సంతాపం తెలిపిన యూపీ, ఉత్తరాఖండ్ సీఎంలు

**బరేలీ/డెహ్రాడూన్, జూన్ 26:** ఉత్తరాఖండ్ విద్యా శాఖ మంత్రి అరవింద్ పాండే కుమారుడు అంకుర్ (24) రోడ్డు ప్రమాదంలో మరణించారు. అతడి స్నేహితుడు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన మంగళవారం రాత్రి ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో చోటుచేసుకుంది. ఓ పెండ్లికి హాజరుకావడానికి అంకుర్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో గోరఖ్‌పూర్‌కు వెళ్తుండగా.. బరేలీ జిల్లాలోని ఫరీద్‌పూర్ ప్రాంతానికి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న ఓ లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో అంకుర్, అతడి స్నేహితుడు మున్నిగిరి (26) మరణించారు. తీవ్ర గాయాలపాలైన మరో స్నేహితుడు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు వీరి మరణంపై ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ సంతాపం తెలిపారు.

## రెండేండ్లలో బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్ విద్యుదీకరణ పూర్తి

రైల్వే మంత్రి పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ:** రెండేండ్లలో దేశంలోని బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్‌నంతా విద్యుదీకరించనున్నామని రైల్వే శాఖ మంత్రి పీయూష్‌గోయల్ చెప్పారు. లోక్‌సభలో బుధవారం ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ 'ఇప్పటికే కొంత భాగాన్ని విద్యుదీకరించాం. ఇంకా 28,810 కి.మీ. మార్గాన్ని విద్యుదీకరించాల్సి ఉన్నది. దీన్ని 2021-22 నాటికి పూర్తి చేస్తాం' అని తెలిపారు. తాము విద్యుదీకరించే వాటిలో ఈశాన్య రైల్వే పరిధిలోని 2,779 కి.మీ, నైరుతి రైల్వే పరిధిలోని 2,702 కి.మీ, పశ్చిమ రైల్వే పరిధిలో 2,633 కి.మీ. కూడా ఉన్నాయని పేర్కొన్నారు. 100 శాతం విద్యుదీకరణను పూర్తి చేయాలని 2018 సెప్టెంబర్‌లో నిర్ణయం తీసుకున్నామని, ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత డీజిల్ ఇంజిన్ల తయారీ కోసం రైల్వే నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని చెప్పారు.

## హిందీ కోసం వర్సిటీలపై ఒత్తిడి లేదు: యూజీసీ

**న్యూఢిల్లీ:** విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలని, వాటిలో ఒక ప్రత్యేక సబ్జెక్టును బోధించమని ఒత్తిడి చేయలేమని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) బుధవారం తెలిపింది. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో హిందీని తప్పనిసరిగా బోధించాలని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణల నేపథ్యంలో యూజీసీ ఈ ప్రకటన చేసింది. 'విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తిగల సంస్థలు. ఏ సబ్జెక్టులు బోధించాలన్న నిర్ణయాల్ని వాటికవే తీసుకోగలవు. ఆ నిర్ణయాల్లో ఎలాంటి ఒత్తిడి ఉండదు' అని యూజీసీ కార్యదర్శి రజనీశ్ జైన్ పేర్కొన్నారు. 'విశ్వవిద్యాలయాల్లో హిందీని (తప్పనిసరికాదు) బోధించే అంశంపై సలహాలు కోరే ఉద్దేశంతో అక్టోబర్ 2018న అన్ని విశ్వవిద్యాలయాలకు లేఖలు పంపాం' అని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అండర్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో హిందీని తప్పనిసరిగా బోధించాలని.. తమ వర్సిటీ అధికారులు ప్రయత్నిస్తున్నారని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్(జేఎన్‌యూఎస్‌యూ) సోమవారం ఆరోపించింది.


తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No. 05-09,11,13,155 & 16,12,14,18,19,22/TUFIDC/UNIT-II/HSNB/2019-20. హుస్నాబాద్ మున్సిపాలిటీలోని వివిధ లొకేషన్లలో CC రోడ్ల నిర్మాణం, మిషన్ భగీరథ పనుల క్రింద దెబ్బతిన్న CC రోడ్లు, డ్రెయిన్‌ల పునరుద్ధరణ చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుతున్నవి. 15 పనుల కొరకు మొత్తం ECV: రూ. 9,70,53,652/-, బిడ్ దాఖలుకు ముగింపు తేదీ: 02.07.2019. సెల్ నం. 9849905730. తదుపరి వివరాల కొరకు www.eprocurement.telangana.gov.in దర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, (PH) TUFIDC, యూనిట్-III (FAC)
DIPR RO. No. 442-DP/CL/Advt/1/2019-20, Dt: 26/06/2019

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ, మిర్యాలగూడ
నం. HD/TENDERS/02/2019-20 సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 21-6-2019
PR డివిజన్, మిర్యాలగూడలో ఇ-పంచాయతీరాజ్ కేంద్రాల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్ళు నిర్మాణం, పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణం మొ|| పనులు (11) చేపట్టుటకు దిగువ సంతకందారు టెండర్లు కోరుతున్నారు. మొత్తం అంచనా విలువ: రూ. 85.50 లక్షలు. దరఖాస్తు దాఖలుకు నిర్ణయించిన ఆఖరి తేదీ: 3-7-2019. టెండరు షెడ్యూలు జారీ తేదీ: 5-7-2019. టెండర్ల స్వీకరణ తేదీ: 6-7-2019న మ.3.00గం. వరకు. టెండర్లు తెరుచు తేదీ: 6-7-2019న మ. 3.30గం.కు. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, PR డివిజన్, మిర్యాలగూడ.
DIPR RO No.451-DP/CL/Advt/1/2019-20, Dt: 26/6/2019

తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
డైరెక్టర్ ఆఫ్ మెడికల్ & హెల్త్ సర్వీసెస్ క్యాంపస్, సుల్తాన్ బజార్
హైదరాబాద్-95, ఫోన్ నెం.040-24656688, ఫ్యాక్స్ నెం. 040-24745510,
email:gmdrugs-msidc@telangana.gov.in
Short Tender Notice No. 1/TSMSIDC/Medicine wing/2019-20, తేది: 26-06-2019.
A) ఒక సంవత్సర కాలానికి రేటు కాంట్రాక్టు క్రింద 2019-20 సం||నికి తయారీదార్లు, అధీకృత డిస్ట్రిబ్యూటర్లు మరియు స్వయం దిగుమతిదార్ల నుండి సర్జికల్ & కన్స్యూమబుల్స్, (యాంటీ మలేరియల్ ఐటంలు) సేకరించుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం (ఆన్‌లైన్) ద్వారా టెండరు కోరబడినది.
B) ఒక సంవత్సర కాలానికి రేటు కాంట్రాక్టు క్రింద 2019-20 సంవత్సరానికి స్వయం తయారీదార్ల నుండి మెడిసిన్స్ (Albendazole) ట్యాబ్‌లెట్లు (నమిలేవి) 400mg) సేకరించుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం ద్వారా టెండరు కోరబడినది.
ఏకారణమూ తెలుపకనే, ఏ సమయంలోనైనా టెండర్‌ని రద్దుచేయు హక్కు మేనేజింగ్ డైరెక్టర్, TSMSIDC వారు కలిగియున్నారు. దయచేసి పూర్తి వివరాలకు 27-06-2019 తరువాత https://tender.telangana.gov.in వెబ్‌సైట్ చూడగలరు.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO No.193-pp/CL/Advt/1/2019-20, Dt: 26/6/2019

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ, నిజామాబాద్
సవరణ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేదీ: 10-6-2019కు సవరణ నం.1 తేదీ: 20-6-2019- NIT నం. 65, 69, 71, 73, 74, 75, 78, 82,84-88,91,92,94,97-102,104, 10.8-113, 116-122, 123/2019-20 తేది: 10-6-2019. సవరణ నం.1 తేదీ: 20-6-2019. PR రీజియన్, నిజామాబాద్‌లో కమ్యూనిటి హాళ్ళు, మైనారిటి కమ్యూనిటి హాళ్ళు నిర్మాణం, కళ్యాణ మండపాల నిర్మాణం, CC రోడ్లు మొ||వాటి నిర్మాణం చేపట్టుట కోసం దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. (1వ పిలుపు) మొత్తం అంచనా విలువ: రూ. 1117.07 లక్షలు. టెండరు షెడ్యూళ్ళు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్‌లో 26-6-2019 ఉ.10.30 గం. నుండి 3-7-2019న మ. 3.00గం. వరకు అప్‌లోడ్ చేయబడతాయి. ఫోన్ నం. 08462-239502. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in చూడండి.
సం/- రీజినల్ ఆఫీసర్ PR రీజియన్, నిజామాబాద్
DIPR RO No.445-DP/CL/Advt/1/2019-20, Dt: 26/6/2019

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదార్ల మంత్రిత్వ శాఖ
భారత జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ
B/1178/2017 తేదీ.11-06-2019
బహిరంగ ప్రకటన
జాతీయ రహదారుల నిర్మాణ నిమిత్తము భూసేకరణ అవార్డు ప్రకటించిన విషయము లబ్ధిదారులకు తెలియజేయుట గురించి
జాతీయ రహదారి చట్టము1956లోని3(A) సెక్షన్ అనుసారము ప్రచురించబడిన రాజపత్రము నెం.3331, తేది. 01-12-2017 మరియు సదరు చట్టములోని 3(D) సెక్షన్ అనుసారము ప్రచురించబడిన రాజపత్రము నెం.1927, తేది. 25-05-2018 ప్రకారము జాతీయ రహదారి 163 (మన్నెగూడ నుండి రావులపల్లి) నిర్మాణము గురించి సేకరించిన, భూ వివరములు క్రింద పేర్కొన్న దినపత్రికలలో ప్రచురించబడినవి.

| క్ర.సం | నోటిఫికేషన్ | ప్రచురించిన దినపత్రికల వివరములు | తేది |
|---|---|---|---|
| 1. | సెక్షన్ 3(A) | 'నమస్తే తెలంగాణ' తెలుగు దినపత్రిక 'దక్కన్ క్రానికల్' ఆంగ్ల దినపత్రిక | 03-01-2018 |
| 2. | సెక్షన్ 3(G) | 'నమస్తే తెలంగాణ' తెలుగు దినపత్రిక 'ది హిందూ' ఆంగ్ల దినపత్రిక | 30-06-2018 |

పై సేకరించిన భూమి అవార్డులు పూడూర్ మండలంలోని గ్రామముల ఉత్తర్వులసంఖ్య 1. మన్నెగూడ నర్సెంకాస్ B/1178/2017-PDR-1; 2. గంగుపల్లి B/1178/2017-PDR-2; 3. పూడూర్ B/1178/2017-PDR-3; 4. రాకంచెర్ల B/1178/2017-PDR-4; 5. సోమనగుర్తి B/1178/2017-PDR-5; తేది 20-03-2019 మరియు పరిగి మండలంలోని గ్రామముల ఉత్తర్వుల సంఖ్య 1.పరిగి B/1178/2017-PRG-1; 2. గడిసింగాపూర్ B/1178/2017-PRG-2; 3.రంగాపూర్ B/1178/2017-PRG-3; 4.సొండేపూర్ B/1178/2017-PRG-4; 5.సుల్తాన్‌పూర్ B/1178/2017-PRG-5; 6.రంగంపల్లి B/1178/2017-PRG-6; తేది 20.03.2019. జాతీయ రహదారుల చట్టము 1956లోని సెక్షన్ 3(G) ప్రకారము దిగువ సంతకము చేసిన అధికారి ప్రకటించియున్నారు. తదుపరి, భూసేకరణకు సంబంధించిన ఏజెన్సీ వారు తగు నష్టపరిహారము పై తెలిపిన అధికారి వద్ద జమచేసి యున్నారు. జాతీయ రహదారి చట్టము 1956 లోని సెక్షన్ 3E అనుసారము సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయడమైనది. అట్టి నోటీసులో సంబంధిత లబ్ధిదారులు వారికి జామీలు చేసిన నోటీసు తేది నుండి 60 దినములలో నష్టపరిహారము సదరు అధికారి గారి నుండి తీసుకుని సేకరించబడిన భూమిని స్వాధీనపరచవలసినదిగా కోరడమైనది.
కావున అందరు లబ్ధిదారులు వారి వారి నష్టపరిహారమును సదరు అధికారి గారి నుండి ఏ పనిదినములలోనైనా ఉ.11.00 గం.ల నుండి సా.5.00 గం. వరకు నోటీసు జామీలు చేసిన తేది నుండి 60 రోజులలో తీసుకుని సేకరించబడిన భూమిని స్వాధీనపరచవలసినదిగా కోరడమైనది ఆ విధముగా భూమిని స్వాధీనపరచనిచో పోలీసు సహకారముతో స్వాధీనము చేసుకొనబడును.
సం|| అధీకృత అధికారి (భూసేకరణ) మరియు రాజస్వ మండలాధికారి వికారాబాద్ డివిజన్


## పునర్విభజన చట్టంలోని చాలా సమస్యలు పరిష్కరించాం!

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన చాలా సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ర్టాల విభజన సమస్యలపై బుధవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ సమాధానమిచ్చారు. 2014 ఏపీ పునర్విభజనకు సంబంధించి పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కొన్ని సమస్యలు రెండు రాష్ర్టాల ఏకాభిప్రాయంతో తేల్చుకోవాల్సినవి ఉన్నాయని, వారు ముందుకొస్తే పరిష్కారమవుతాయని చెప్పారు.

## మోదీ, అమిత్‌షా ప్రతిభతోనే మళ్లీ అధికారం

- మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రధాని మోదీ, అమిత్‌షా నాయకత్వ ప్రతిభతోనే కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చామని మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. బీజేపీ సభ్యత్వ జాతీయ ప్రముఖ్ హోదాలో బుధవారం మొదటిసారి తెలంగాణకు వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ.. మునిగిపోతున్న కాంగ్రెస్ పడవను చివరివరకు ఉండి కాపాడాల్సిందిపోయి ఆయనే దూకేశాడని రాహుల్‌గాంధీని ఉద్దేశించి చౌహాన్ ఎద్దేవాచేశారు. బెంగాల్, ఏపీ, తమిళనాడు, కశ్మీర్, తెలంగాణ రాష్ర్టాల్లో అధికారమే లక్ష్యంగా పనిచేయబోతున్నామని తెలిపారు. జూలై 6న ప్రధాని నరేంద్రమోదీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

## 'మైనార్టీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యూపీఎస్సీ, టీఎస్పీఎస్సీ, గేట్ వంటి జాతీయస్థాయి పోటీపరీక్షలకు మైనార్టీ విద్యార్థులను సిద్ధంచేసేలా విద్యాబోధన ఉండాలని మైనార్టీ కమిషన్ చైర్మన్ మహ్మద్ ఖమరుద్దీన్ జేఎన్‌టీయూ వీసీని కోరారు. బుధవారం జేఎన్టీయూ యూనివర్సిటీని ఖమరుద్దీన్ సందర్శించారు. యూనివర్సిటీలో బోధన, బోధనేతర ఉద్యోగుల్లో మైనార్టీ శాతం గురించి వీసీ వేణుగోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎన్ యాదయ్యను ఆరా తీశారు.

## ఫీజుల పెంపుపై ప్రతిపాదనలు పంపించాం: సీబీఐటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీబీఐటీ కోకాపేటలోని ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి వార్షిక ట్యూషన్‌ఫీజును రూ.3,19,784గా,ఎంజీఐటీ కోకాపేటలోని ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి వార్షిక ట్యూషన్‌ఫీజును రూ.2,28,148గా నిర్ణయించడానికి టీఏస్ఎఫ్ఆర్సీకి ప్రతిపాదనలు పంపించామని సీబీఐటీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంకా తమను విచారణకు పిలువలేదని, 2019-2022 బ్లాక్‌పీరియడ్‌కు సీబీఐటీలో వార్షికఫీజును రూ.2,20,000గానూ, ఎంజీఐటీలో 1,70,00గానూ నిర్ణయిస్తూ.. ఎంసెట్ వెబ్‌సైట్‌లో వివరాలు ఉంచాలని ఎంసెట్-2019 కన్వీనర్‌ను కోరినట్టు ఆ ప్రకటనలో వెల్లడించింది.


బుధవారం సచివాలయంలో మైనార్టీ అధికారులతో సమావేశమైన మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం తదితరులు ఉన్నారు.

# మైనార్టీల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలి

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పెండింగ్‌లో ఉన్న మైనార్టీల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులకు సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశించారు. బుధవారం సచివాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల్లోని నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. పోలీసు, రెవెన్యూ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసి ఆక్రమణకు గురైన వక్ఫ్ భూములను గుర్తించాలన్నారు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు. మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలో ఇంచార్జి అధికారు లు విధులు నిర్వర్తిస్తున్న స్థానంలో పూర్తిస్థాయి అధికారుల నియామకంపై చర్చించారు. సబ్సిడీ రుణాలు, ఈ-శిక్షణ కార్యక్రమాలు, కుట్టుమిషన్ల పంపిణీ ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డ్రైవర్ ఎంపవర్‌మెంట్ స్కీంకింద పంపిణీ చేసే 67 కార్లను శుక్రవారంలబ్ధిదారులకు అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ అన్సారీ, మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ షానవాజ్‌ఖాసీం, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతి వెస్లీ, వక్ఫ్‌బోర్డు సీఈవో అబ్దుల్‌హమీద్ తదితరులు పాల్గొన్నారు.

**మన హజ్ క్యాంపు అత్యుత్తమం**

హజ్ యాత్రికులకు కల్పిస్తున్న సౌకర్యాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యుత్తమమని ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసిఉల్లాఖాన్ చెప్పారు. హజ్‌హౌస్‌లో ఏర్పాటుచేస్తున్న హజ్ క్యాంపు ప్రారంభ వసతులను వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీంతో కలిసి వారు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యాత్రికుల సంక్షేమం కోసం హజ్ కమిటీ కృషిచేస్తున్నదని చెప్పారు. జూలై 26నుంచి ఆగస్టు నాలుగు వరకు హజ్ యాత్రికులకు విమానాలు కేటాయించామని, కర్ణాటక, మహారాష్ట్ర హజ్ యాత్రికుల కోసం జూలై 18న ప్రత్యేక విమాన సదుపాయాన్ని కల్పించామని తెలిపారు.

# పంజాగుట్టలో నడిరోడ్డుపై హత్య

- పోలీస్‌స్టేషన్‌కు కూతవేటులో ఘటన
- పీఎస్‌లోనే కుప్పకూలిన బాధితుడు
- దవాఖానకు తరలిస్తుండగా మృతి


మీర్ రియాసత్ అలీ మృతదేహం. నిందితుడు అన్వర్ (ఇన్‌సెట్)

**ఖైరతాబాద్:** పంజాగుట్టలో పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో నడిరోడ్డుపై ఓ ఆటో డ్రైవర్‌ను మరో ఆటో డ్రైవర్ కత్తితో పొడిచి హతమార్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట నాగార్జునహిల్స్ పంజాపహాడ్‌కు చెందిన మీర్ రియాసత్ అలీ సజ్జు (35), బడా సాహెబ్ మసీదులో ఉంటున్న మహ్మద్ అన్వర్ (32) ఆటోడ్రైవర్లు. పంజాగుట్టలోని వైటూకే రెస్టారెంట్ వద్ద అడ్డా నుంచి ఆటోలు నడుపుతారు. కొన్నేండ్లుగా ఇద్దరి మధ్య ఉన్న గొడవ ఘర్షణకు దారితీసింది. బుధవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ఆటో అడ్డాకు వచ్చిన రియాసత్ అలీ వెంట తెచ్చుకొన్న కత్తితో అన్వర్ కడుపులో పొడిచాడు. అన్వర్ కేకలు వేస్తూ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని రిసెప్షన్‌లో కుప్పకూలిపోయాడు. పోలీసులు వెంటనే 108లో గాంధీ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. రియాసత్‌అలీ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అన్వర్‌కు భార్య శర్వీన్‌బేగం, ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అన్వర్ తన భార్య, పిల్లలకు హెచ్ఐవీ రక్తం ఎక్కించే ప్రయత్నం చేస్తున్నాడని నిందితుడు రియాసత్ అలీ చెప్పినట్టు పోలీసులు తెలిపారు.

**పక్కా స్కెచ్ వేసి మర్డర్**

రియాసత్ అలీ, అన్వర్ మధ్య చాలాకాలంగా గొడవలు జరుగుతున్నట్టు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో రియాసత్ అలీ పలుసార్లు అన్వర్‌పై దాడిచేసినట్లు సమాచార.ం అన్వర్‌ను అడ్డుతొలగించుకోవాలన్న పక్కాస్కెచ్‌తో పొడవాటి కత్తితో కడుపు లోపలి భాగం వరకు పొడవడంతో పేగులు బయటకు వచ్చాయి. అంతబాధలోనూ అన్వర్ పేగులను చేతులతో అదిమిపట్టి పోలీస్‌స్టేషన్ వైపు పరుగు తీశాడు.

# పేదల ఇండ్లల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

**నర్సంపేట, నమస్తే తెలంగాణ** పేదల ఇండ్లల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో మంజూరైన 456 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిత్యం పాటుపడుతున్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పెద్ద మనసుతో కల్యాణలక్ష్మి, శాదీముబారక్ పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతీ పేద కుటుంబానికి కల్యాణలక్ష్మిలో వచ్చే మొత్తం ఎంతో అవసరాలను తీర్చుతున్నదని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ చెట్టుపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఫైనల్‌కు చేరిన జేఆర్ వారియర్స్, ఎంకే సైక్లోన్ జట్లు

**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్:** పాలమూరు జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో మహబూబ్‌నగర్ ప్రీమియర్ లీగ్-5 టీ-20 టోర్నమెంట్ కొనసాగుతున్నది. బుధవారం సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగగా.. జేఆర్ వారియర్స్, ఎంకే సైక్లోన్స్ జట్లు ఫైనల్‌కు చేరాయి. మొదటి సెమీఫైనల్‌లో మ్యాచ్‌లో జేఆర్ వారియర్స్ జట్టు ఎంఎస్ఎన్ బ్రదర్స్ జట్టుపై 21 పరుగుల తేడాతో గెలిచింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఎంకే సైక్లోన్స్ జట్టు 5 వికెట్ల తేడాతో వీఎస్‌జీ ఇండియన్స్ జట్టుపై గెలిచింది. పోటీలను తెలంగాణ బార్‌కౌన్సిల్ చైర్మన్ అనంత నర్సింహారెడ్డి ప్రారంభించారు. గురువారం జేఆర్ వారియర్స్, ఎంకే సైక్లోన్స్ నడుమ తుదిపోరు జరుగనున్నది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, టెబుల్ టెన్నిస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింహారావు, క్రికెట్ సంఘం సభ్యులు సురేశ్‌కుమార్, గోపాలకృష్ణ, అబ్దుల్లా, క్రీడాకారులు పాల్గొన్నారు.

## '53 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం'

**హుజూరాబాద్, నమస్తే తెలంగాణ:** హరితహారంలో భాగంగా రాష్ట్రంలో 53 కోట్ల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నామని హరితహారం రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ ఆశ పేర్కొన్నారు. బుధవారం ఆమె కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం మందాడిపల్లి, సింగాపూర్‌లో నర్సరీలు, గత ఏడాది హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం హుజూరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రహదారులకు ఇరువైపులా చింత మొక్కలు నాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. ఇంటి ఆవరణలో పెంచేందుకు నిమ్మ, దానిమ్మ, మునగ, బొప్పాయి, కరివేపాకు, గోరింట మొక్కలను నర్సరీల్లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. రైతులు గట్ల వెంట నాటేందుకు రాష్ట్రం మొత్తం మీద 12 కోట్ల టేకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

## తెలంగాణ ఉద్యమకారుడు రవిరాజు హఠాన్మరణం



**బోధన్, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, టీఆర్ఎస్ నాయకుడు నీలకంఠం రవిరాజు(55) బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందారు. రవిరాజు హఠాన్మరణంతో తెలంగాణ ఉద్యమకారులు, టీఆర్ఎస్ నాయకులు దిగ్భ్రాంతి చెందారు. రవిరాజుకు భార్య చంద్రకళ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రవిరాజు బుధవారం మధ్యాహ్నం ఇంట్లో గుండెపోటుకు గురికాగా.. కుటుంబసభ్యులు ఒక ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. బోధన్‌లో గురువారం ఉదయం 11 గంటలకు రవిరాజు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

## పెండ్లి కావడం లేదని యువతి ఆత్మహత్య

**సిరికొండ:** పెండ్లి కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం సోంపల్లిలో చోటుచేసుకున్నది. సోంపల్లికి చెందిన గడ్డం కిషన్ - కళవతి దంపతులకు నలుగురు కుమార్తెలు. ముగ్గురు కూతుర్లుకు పెండ్లి కాగా.. చిన్నకుమార్తె అనసూయకు (30)కు పెండ్లి సంబంధాలు వచ్చినా నిశ్చయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు గమనించి ఇచ్చోడలోని ప్రైవేటు దవాఖానకు.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌లోని ఒక ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అనసూయ మంగళవారం రాత్రి మృతిచెందింది.



బ్యాట్‌తో అధికారులపై దాడి చేసేందుకు వెళ్తున్న ఆకాశ్

## బీజేపీ ఎమ్మెల్యే దాదాగిరీ!

క్రికెట్ బ్యాట్‌తో అధికారులపై దాడి.. అరెస్ట్

మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఘటన

**ఇండోర్:** బీజేపీ సీనియర్ నేత కైలాశ్ విజయ్ వర్గీయ కుమారుడు, మధ్యప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్‌వర్గీయ రెచ్చిపోయారు. ఇండోర్ నగరంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపడుతున్న మున్సిపల్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. క్రికెట్ బ్యాట్‌తో సిబ్బందిని విచక్షణారహితంగా కొట్టారు. దీంతో ఆకాశ్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఇండోర్‌లోని గంజి కంపౌండ్ ఏరియాలో మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే ఆకాశ్, ఆయన అనుచరులు సదరు కార్యక్రమాన్ని ఆపాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. కొద్ది నిమిషాల్లోనే వివాదం ముదరడంతో.. ఆకాశ్ తన చేతిలోని క్రికెట్ బ్యాట్‌తో అధికారులపై దాడి చేశారు. ఆకాశ్‌ను పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. ఘటనపై ఆకాశ్ మీడియాతో మాట్లాడుతూ.. 'బీజేపీలో మేము నేర్చుకున్నది ఏమిటంటే.. 'పహ్లే ఆవేదన్, ఫిర్ నివేదన్ ఔర్ ఫిర్ ధనాధన్' (మొదట ఆవేదన, తర్వాత అభ్యర్థన.. ఆ తర్వాత దాడి)' అని చెప్పారు. మున్సిపల్ అధికారులు ప్రజలపై దాదాగిరీ చేశారని, ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత తనపై ఉందన్నారు. ఆకాశ్ పెట్టుకున్న బెయిల్ అభ్యర్థనను స్థానిక కోర్టు తోసిపుచ్చడంతో ఆయన్ని జైలుకు తరలించినట్టు ఓ పోలీసు అధికారి తెలిపారు.

## చైనాపై ట్రంప్ సుంకాలు.. పెరుగనున్న బైబిల్ ధరలు!

అమెరికాలో మత సంస్థల అసంతృప్తి



**వాషింగ్టన్, జూన్ 26:** చైనాతో వాణిజ్య యుద్ధానికి తెరతీసిన డొనాల్డ్ ట్రంప్.. అనుకోకుండానే తనకు బలమైన మద్దతుదారులుగా ఉన్న క్రైస్తవ వర్గ అసంతృప్తికి కారకుడయ్యారు. చైనా ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించిన కారణంగా అమెరికాలో బైబిల్ ధరలు భారీగా పెరుగనున్నాయని మత సంస్థలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గతేడాది జూన్‌లో చైనా నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీ సుంకాలు విధించడం ద్వారా ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీశారు. 250 బిలియన్ డాలర్ల విలువైన చైనా ఉత్పత్తులపై ఆయన 25 శాతం పన్నులు విధించారు. దీనికి ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై చైనా కూడా భారీగా సుంకాలు విధించింది. అయితే ప్రపంచంలో ముద్రణ అయ్యే బైబిల్స్‌లో సగం చైనాలోనే ముద్రణ అవుతాయని అమెరికా కాంగ్రెస్ సభ్యుడు జోష్ హార్డర్ తెలిపారు. తాజాగా ముద్రణ ఉత్పత్తులు సహా మరో 300 బిలియన్ డాలర్ల విలువైన చైనా ఉత్పత్తులపై సుంకాలు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించిన నేపథ్యంలో మత సంస్థలు, చర్చిలు, స్కూళ్లు, స్వచ్ఛంద సంస్థలపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సుంకాల నుంచి బైబిల్‌ను మినహాయించకపోతే, చర్చిలు, మత పాఠశాలలు, ఇతర సంస్థలపై అధిక భారం పడుతుందని చెప్పారు.



# కేంద్రంలో ఖాళీ పోస్టులు 6.84 లక్షలు

2019-2020లో 1.03 లక్షల పోస్టుల భర్తీ

లోక్‌సభలో వెల్లడించిన ప్రభుత్వం

**న్యూఢిల్లీ, జూన్ 26:** కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో 6.84 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో వెల్లడించింది. వివిధ ప్రభుత్వ విభాగాలలో మంజూరైన పోస్టులు 38.02 లక్షలు కాగా, గత ఏడాది మార్చి ఒకటో తేదీ నాటికి 31.18 లక్షల పోస్టులు భర్తీ అయ్యాయని కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. పదవీ విరమణ, పదోన్నతులు, మరణాలు తదితర కారణాల వల్ల పోస్టులు ఖాళీ అయ్యాయని చెప్పారు. నిబంధనల ప్రకారం వాటిని భర్తీ చేయాల్సి ఉన్నదని అన్నారు. వివిధ మంత్రిత్వ శాఖలలో ఖాళీగా ఉన్న 1,03,266 పోస్టుల భర్తీకి 2019, 2020 సంవత్సరాలలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలు నిర్వహించనుందని ఆయన మరో ప్రశ్నకు బదులుగా చెప్పారు. గత ఐదేండ్ల కాలంలో.. అవినీతికి పాల్పడిన ఇద్దరు ఐఏఎస్ అధికారులను విధుల నుంచి తొలగించామని, తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేశామని మంత్రి జితేంద్రసింగ్ చెప్పారు. 23 మంది ఐఏఎస్‌లు, నలుగురు ఐపీఎస్‌లకు వ్యతిరేకంగా అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరిపేందుకు అనుమతి మంజూరు చేశామని తెలిపారు.

# మీరు ఓడితే దేశమే ఓడినట్టా?

ఓటమిని ఒప్పుకోకపోవడం అహంకారానికి నిదర్శనం



బుధవారం రాజ్యసభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

- గెలుపును నిలుపుకోలేరు.. ఓటమిని అంగీకరించరు
- ఈవీఎంలను సందేహిస్తూ ఓటర్లను అవమానిస్తున్నారు
- కాంగ్రెస్ వైఖరిని దుయ్యబట్టిన ప్రధాని మోదీ
- ప్రతిపక్షాలు విమర్శించాలి.. కానీ అడ్డుపడకూడదని సూచన

**రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన రాజ్యసభ**

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన ఓటమిని అంగీకరించకపోవడం దాని అహంకారానికి నిదర్శనమని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) పనితీరును అనుమానిస్తూ ప్రజలిచ్చిన తీర్పును ఆ పార్టీ నేతలు అవమానిస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీ ఓడితే భారతదేశమే ఓడినట్టా అని నిలదీశారు. పార్లమెంట్ వేదికగా ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై వరుసగా రెండో రోజు విరుచుకుపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు ప్రధాని బుధవారం సమాధానం ఇచ్చారు. దాదాపు గంటసేపు ప్రసంగించిన ఆయన వివిధ అంశాల మీద కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. బీజేపీ గెలుపును దేశానికి, రైతులకు, ప్రజాస్వామ్యానికి అపజయంగా కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారని ఆరోపించారు. 'రైతులు రూ.2వేలకు అమ్ముడుపోయారని, ఎన్నికలను మీడియా సాయంతో గెలుచుకున్నామని అంటున్నారు. ఇది రైతులను అవమానించడమే' అని ప్రధాని పేర్కొన్నారు. 'మీడియా పక్షపాతం చూపిందని అంటున్నారు.. మరి కేరళ, తమిళనాడులో కూడా అమ్ముడుపోయిందా?' అని మోదీ ప్రశ్నించారు. ఆ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గెలుపొందిన సంగతి తెలిసిందే. 'కాంగ్రెస్ పార్టీ విజయాన్ని జీర్ణించుకోలేదు.. ఓటమిని అంగీకరించలేదు. ఇటీవలే మూడు రాష్ట్రాల్లో (మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో) ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ ఆ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు అంతర్గత కుమ్ములాటలతో తలమునకలై ఉన్నారు. ఓటమికి ఇతరులను నిందించే ముందు.. ప్రజాస్వామ్యం ఓడిపోయిందని వ్యాఖ్యానించే ముందు.. ఆత్మవిమర్శ చేసుకోవాలి. మొన్నటి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి నష్టం.. దేశానికి నష్టం అంటున్నారు. వారికి ఓ ప్రశ్న వేస్తున్నాను.. వయనాడ్‌లో భారత్ ఓడిపోయిందా? రాయబరేలీలో దేశం ఓడిందా? కాంగ్రెస్ ఓడిపోతే దేశం ఓడిపోయినట్టా? ఇండియా అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే ఇండియానా? అహంకారానికి కూడా ఒక హద్దు ఉండాలి' అంటూ ప్రధాని నిప్పులు చెరిగారు.

**ఓడిపోయారు గనుకే ఈవీఎంలపై నిందలు**

'ఒక కొత్త వ్యాధి విస్తరిస్తున్నది.. ఈవీఎంల పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈవీఎంలను కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ నేతలే ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ పాలనలోనే ఈవీఎంలకు చట్టాలను రూపొందించారు. ఇప్పుడు వారు ఓడిపోయారు గనుక ఈవీఎంలపై నిందలు వేస్తున్నారు' అంటూ విమర్శించారు. అలాగే డిజిటల్ లావాదేవీలను, ఆధార్‌ను, జీఎస్టీ, భీమ్‌యాప్‌ను కూడా వారు వ్యతిరేకిస్తున్నారని దుయ్యబట్టారు. 'ఎందుకింత ప్రతికూలత? ఈ ప్రతికూల వైఖరి వల్లనే కొన్ని పార్టీలు ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోయాయి' అని చెప్పారు. 'యోగాను ఎగతాళి చేశారు.. మేక్ ఇన్ ఇండియాను ఎగతాళి చేశారు.. ఇది వారి హీన మనస్తత్వాన్ని వ్యక్తం చేస్తున్నది. ఇలా ప్రవర్తించే బదులు.. చేతనైతే.. మా మీద పైచేయి సాధించి చూపండి' అని ఆయన కాంగ్రెస్ నేతలను సవాల్ చేశారు. ఎన్ఆర్సీ (నేషనల్ రిజిస్టర్ ఫర్ సిటిజన్స్)ను కాంగ్రెస్ తన ఘనతగా ఎందుకు చెప్పుకోవడం లేదని మోదీ ప్రశ్నించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సంతకం చేసిన అసోం ఒప్పందంలో ఎన్ఆర్సీ కూడా ఒక భాగమని ఆయన గుర్తు చేశారు. ఎన్ఆర్సీ జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే తాము పౌరుల జాబితాను రూపొందిస్తూ, విదేశీయులను తొలగిస్తున్నామని తెలిపారు. జమిలి ఎన్నికలపై దేశవ్యాప్తంగా చర్చ అవసరమని చెప్పారు. నవ భారత నిర్మాణాన్ని వ్యతిరేకించడం ద్వారా ప్రతిపక్షాలు ప్రజలను ప్రతికూలత వైపు నడిపించవద్దని, అది పాపమని చెప్పారు. మంత్రివర్గ ప్రతిపాదనలను మీడియా సమావేశాల్లో చించివేసే ఆ పాత భారతదేశమే కావాలా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు విమర్శించవచ్చుని.. కానీ అడ్డుపడకూడదని హితవు చెప్పారు. ప్రధాని ప్రసంగం అనంతరం రాజ్యసభ రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని మూజువాణి ఓటుతో ఆమోదించింది.

### బీహార్‌లో బాలల మరణాలు అవమానకరం

జార్ఖండ్‌లో ముస్లిం యువకుని హత్య బాధించింది



జార్ఖండ్‌లో ముస్లిం యువకుడి హత్యకు నిరసనగా బుధవారం ఢిల్లీలో విద్యార్థుల ప్రదర్శన

బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో మెదడువాపు (ఎక్యూట్ ఎన్సెఫలైటిస్ సిండ్రోమ్) వ్యాధితో 130మందికి పైగా బాలలు మరణించడం సిగ్గుపడాల్సిన విషయమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా మెదడువాపు వంటి వ్యాధులు బాలలను బలిగొనటం మన ఏడు దశాబ్దాల వైఫల్యమని వ్యాఖ్యానించారు. వ్యాధిని అరికట్టేందుకు కేంద్రం అన్ని విధాల సహాయం చేస్తున్నదని చెప్పారు. జార్ఖండ్‌లో ఇటీవల మూకదాడిలో ఓ ముస్లిం యువకుడు మరణించడంపై ప్రధాని ఎట్టకేలకు స్పందించారు. ఆ ఘటన తనను ఎంతో బాధించిందని చెప్పారు. ముస్లిం యువకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. హింస ఎక్కడ జరిగినా, అది జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ లేదా కేరళ అయినా సరే ఒకే విధంగా పరిగణించాలని చెప్పారు. దేశంలో ప్రతి పౌరునికి భద్రత కల్పించడం తమ రాజ్యాంగ విధి అని తెలిపారు. కొందరు రాజ్యసభ సభ్యులు జార్ఖండ్‌ను మూకదాడులకు అడ్డా అని పేర్కొనడాన్ని ప్రధాని తప్పుపట్టారు. ఇతర రాష్ట్రాలలో కూడా హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. కేరళ లేదా బెంగాల్‌ను కూడా అదే దృష్టితో చూడాలని ఆయన పేర్కొన్నారు. కేరళ, బెంగాల్ రాష్ట్రాలలో తమ కార్యకర్తలు రాజకీయ హింసకు గురవుతున్నారని బీజేపీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

### మోదీ హయాంలో మైనారిటీలు సురక్షితం: ఆల్ఫోన్స్

దేశంలో మైనారిటీలు మునుపెన్నడూ లేనంతగా, ప్రధాని మోదీ హయాంలో సురక్షితంగా ఉన్నారని బీజేపీ నాయకుడు కేజే ఆల్ఫోన్స్ పేర్కొన్నారు. రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, తనకు ముందున్న ప్రధాన మంత్రులందరికన్నా మోదీ గొప్ప ప్రజాస్వామ్యవాది అని కొనియాడారు. 'బీజేపీ అధికారంలోకి వస్తే క్రైస్తవులపై దాడులు జరుగుతాయి, చర్చిలను దగ్ధం చేస్తారు అని 2014లో చెప్పారు. బీజేపీ అధికారానికి వచ్చిన తరువాత ఎక్కడైనా ఓ క్రైస్తవునిపై దాడి జరుగడం కానీ, చర్చిని దగ్ధం చేయడం కానీ చూశారా?' అని ఆల్ఫోన్స్ ప్రశ్నించారు.

## ముస్లింలపై మోదీ కపట ప్రేమ

ఎంఐఎం నేత అసద్ ధ్వజం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రధాని నరేంద్రమోదీ మాటలు వేరు, చేతలు వేరని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ముస్లింలను అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాని.. అప్పుడప్పుడు వారిపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. షాబానో కోసం మాట్లాడుతున్న ప్రధానికి దారుణ హత్యలకు గురైన అలీముద్దీన్ అన్సారీ, ఫీలాఖాన్ యాదికి రాలేదా? అని ప్రశ్నించారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముస్లింలపై మోదీకి నిజంగా ప్రేమ ఉంటే వెంటనే రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌చేశారు. తెలంగాణ వంటి రాష్ట్రాలు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించినా వాటికి ఎందుకు ఆమోదముద్ర వేయడంలేదని నిలదీశారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు దివంగత ప్రధాని పీవీ నరసింహారావు ఎంత బాధ్యుడో ముస్లింపై దాడులకు ప్రస్తుత ప్రధానిది అంతే బాధ్యతని స్పష్టంచేశారు.

**దేశ రక్షణలోనూ విఫలం**

శత్రుదేశాలను చిత్తుచేస్తామని గొప్పలు చెప్తున్న ప్రధాని.. దేశ రక్షణవ్యవస్థను బలహీనపరుస్తున్నారని అసదుద్దీన్ ఆరోపించారు. కొన్నేండ్లుగా వాయుసేనకు చెందిన ఏఎన్-32 విమానాలు కూలిపోయి 76మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇటీవల మరో విమానం కూలి 13 మంది దుర్మరణం పాలైనా చాలారోజుల వరకు జాడ కనుక్కోలేక పోయారన్నారు.

# ఎస్-400 క్షిపణులపై రాజీ లేదు!

విదేశాంగ విధానంలో జాతి ప్రయోజనాలకే పెద్దపీట

అమెరికా విదేశాంగ మంత్రితో భేటీలో జైశంకర్ స్పష్టీకరణ

ముడి చమురు దిగుమతుల్లో భారత్‌కు సహకరిస్తామన్న పాంపియో



అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియోతో విదేశాంగ మంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ, జూన్ 26:** రష్యా నుంచి ఎస్-400 క్షిపణుల కొనుగోలు విషయమై గతంలో తాము నిర్దేశించుకున్న విధానానికనుగుణంగా ముందుకే వెళతామని అమెరికాకు భారత్ తేల్చిచెప్పింది. వివిధ దేశాలతో సంబంధాల విషయమై తమ దేశ ప్రయోజనాలే ప్రధానమన్నది. భారత్ పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగమంత్రి మైక్ పాంపియో బుధవారం విదేశాంగమంత్రి జై శంకర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్-400 క్షిపణులపై మన వైఖరిని పాంపియోకు జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా నుంచి ఎస్-400 క్షిపణుల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్న భారత్‌పై అమెరికా ఆంక్షల ముప్పు పొంచి ఉంది. అయితే, ఆంక్షల విషయమై భారత్‌కు మినహాయింపు ఇస్తామంటూ అమెరికా ఇప్పటికే సంకేతాలిచ్చింది. ఢిల్లీ పర్యటనలో పాంపియో దీనిని పునరుద్ఘాటించారు. ఎస్- 400 క్షిపణుల విషయంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కాగా, ఇరాన్ నుంచి ముడి చమురు దిగుమతిపై తాము ఆంక్షలు విధించడంతో భారత్‌కు కష్టకాలమేనని అంగీకరించారు. ఇతర దేశాల నుంచి ముడి చమురు దిగుమతి వ్యయ భరితమని, తాము భారత్ ముడి చమురు అవసరాల పరిష్కారానికి అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. జై శంకర్, పాంపియో విస్తృత స్థాయి చర్చల తర్వాత సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. రష్యా నుంచి ఎస్-400 క్షిపణుల కొనుగోలుపై అమెరికా ఆంక్షల ప్రభావం ఉంటుందా? అన్న మీడియా ప్రశ్నలపై జైశంకర్ స్పందిస్తూ.. 'పలు దేశాలతో భారత్‌కు సంబంధాలు ఉన్నాయి. రష్యాతో ఉన్న సంబంధాలకు కొంత చరిత్ర ఉన్నది. వివిధ దేశాలతో సంబంధాల కొనసాగింపులో దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నాం' అని చెప్పారు. వాణిజ్య సంబంధాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నా మిత్ర దేశాలుగా వాటిని పరిష్కరించుకుంటామని చెప్పారు.

**నూతన శిఖరాలకు భారత్- అమెరికా బంధం**

ఉగ్రవాదం మధ్యప్రాచ్యానికి మాత్రమే కాక యావత్ ప్రపంచానికి ముప్పుగా పరిణమించిందని మైక్ పాంపియో అన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని ఇరాన్ పెంచి పోషిస్తున్నదన్నారు. తమకు ముఖ్య భాగస్వామి అయిన భారత్‌తో గల ద్వైపాక్షిక సంబంధాలు నూతన శిఖరాలకు చేరుకుంటాయని పాంపియో చెప్పారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీతోనూ పాంపియో భేటీ అయ్యారు.

### మత స్వేచ్ఛకు కట్టుబడి ఉండాలి: పాంపియో

నాలుగు ప్రధాన మతాలకు జన్మస్థలమైన భారత్, తమ పౌరులందరికీ మత పరమైన స్వేచ్ఛకు కట్టుబడి ఉండాలని మైక్ పాంపియో హితవు పలికారు. ఇండియా పాలసీ స్పీచ్' అనే అంశంపై ఢిల్లీలో జరిగిన చర్చాగోష్టిలో పాంపియో మాట్లాడారు. మైనారిటీ మతస్థుల హక్కులపై దాడి జరిగితే పరిస్థితులు దారుణంగా మారతాయని హెచ్చరించారు. 2018 నుంచి భారత్‌లో మైనారిటీలకు ప్రత్యేకించి ముస్లింలకు వ్యతిరేకంగా మూక దాడులు జరుగుతున్నాయని అమెరికా విదేశాంగశాఖ ఇటీవల విడుదల చేసిన '2018 అంతర్జాతీయ మత స్వేచ్ఛ నివేదిక'లో పేర్కొంది. దీనిపై బీజేపీ తీవ్రంగా మండి పడింది.

# రా, ఐబీకి కొత్త అధిపతులు

- ఇంటెలిజెన్స్ బ్యూరోకి అరవింద్ కుమార్
- రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్‌కు సామంత్ కుమార్ గోయెల్
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం



అరవింద్ కుమార్



సామంత్ గోయెల్

**న్యూఢిల్లీ, జూన్ 26:** దేశ భద్రతకు కీలకంగా పరిగణించే ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ), రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్(రా) విభాగాలకు కొత్త అధికారులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ ఐపీఎస్ అధికారులైన అరవింద్ కుమార్‌ను ఐబీకి, సామంత్ కుమార్ గోయెల్‌ను 'రా'కు అధిపతులుగా నియమిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర నియామక కమిటీ ఆదేశాలు జారీ చేసింది. వీళ్ళు ఈ పదవుల్లో రెండేండ్ల పాటు కొనసాగుతారని మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుతం ఐబీ డైరెక్టర్‌గా కొనసాగుతున్న రాజీవ్ జైన్ పదవీకాలం ఈనెల 30తో ముగుస్తున్నది. ఆయన తర్వాత, ఐబీ బాధ్యతలను అరవింద్ కుమార్ ఆ రోజు నుంచే చేపట్టనున్నారు. ప్రస్తుతం 'రా' అధిపతిగా కొనసాగుతున్న అనిల్ కే దస్మానా నుంచి ఈ శనివారం సామంత్ కుమార్ గోయెల్ పగ్గాలు చేపట్టనున్నారు. జైన్ మరియు దస్మానాను రెండేండ్ల కాలానికి గానూ 2016లో ఆయా విభాగాలకు అధిపతులుగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. గత ఏడాది డిసెంబర్‌లో ఇద్దరి పదవీ కాలాన్ని మరో ఆరు మాసాలా పాటు పొడిగించింది.

**నక్సల్ సమస్యపై నైపుణ్యం.. అరవింద్ కుమార్**

అసోం-మేఘాలయ క్యాడర్ 1984 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన అరవింద్ కుమార్ ప్రస్తుతం ఐబీలో ప్రత్యేక డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 1991 ఆగస్టు నుంచి ఆయన ఐబీకి వివిధ స్థాయిల్లో సేవలు అందించారు. దీంతో పాటు రష్యా రాజధాని మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో విధులు నిర్వహించారు. కశ్మీర్ నిపుణుడిగా, నక్సల్ సమస్యను దీటుగా ఎదుర్కొనే వ్యక్తిగా ఆయనకు పేరుంది. దేశానికి అందించిన విశిష్ట సేవలకు గానూ రాష్ట్రపతి పోలీస్ మెడల్ అందుకున్న అరవింద్ కుమార్.. ఐబీ విభాగంలో జైన్ తర్వాత సీనియర్ అధికారిగా నిలిచారు.

**బాలాకోట్, మెరుపు దాడుల వ్యూహకర్త.. సామంత్ కుమార్ గోయెల్**

అనిల్ కే దస్మానా తర్వాత 'రా' బాధ్యతలు చేపడుతున్న సామంత్ కుమార్ గోయెల్ పంజాబ్ క్యాడర్ 1984 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఈయన 'రా'లో ప్రత్యేక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరిలో జరిగిన బాలాకోట్‌పై వైమానిక దాడులు, 2016లో మెరుపు దాడుల (సర్జికల్ స్ట్రైక్స్) వ్యూహ రచనలో సామంత్ కీలకంగా వ్యవహరించారు. ఇంటెలిజెన్స్ మరియు సైనిక ఆపరేషన్లలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. 2000 మరియు 2001లో పంజాబ్ ముఖ్యమంత్రి భద్రతా బాధ్యతలను కూడా ఈయనే చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక పదవుల్ని నిర్వర్తించిన ఈయనకు పంజాబ్‌లో తీవ్రవాదం, పాకిస్థాన్ సమస్యలపై మంచి పట్టున్న అధికారిగా పేరుంది. 1990లో పంజాబ్‌లో తీవ్రవాదం అరికట్టడంలో ఈయన ప్రముఖ పాత్ర పోషించారు. 2001 మార్చిలో 'రా'లో చేరిన గోయెల్.. విశిష్ఠ, శౌర్య విభాగాల్లో పోలీసు మెడల్స్‌ను అందుకున్నారు.

## నీతి ఆయోగ్ సీఈఓ పదవీకాలం పొడిగింపు



**న్యూఢిల్లీ, జూన్ 26:** నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) అమితాబ్ కాంత్ పదవీ కాలాన్ని మరో రెండేండ్లు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2021, జూన్ 30 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. రెండేండ్ల కాలానికి గానూ అమితాబ్ కాంత్‌ను 2016, ఫిబ్రవరి 17న నీతి ఆయోగ్‌కి సీఈఓగా ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత 2019, జూన్ 30 వరకు ఆయన పదవీ కాలాన్ని పొడిగించింది. ప్రస్తుతం ఆయన పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. నీతి ఆయోగ్‌కి సీఈఓగా పని చేయటానికి ముందు అమితాబ్ కాంత్ పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగానికి కార్యదర్శిగా పనిచేశారు.

## డెన్మార్క్‌లో కొలువుదీరనున్న లెఫ్ట్ ప్రభుత్వం

**కొపెన్‌హెగెన్:** డెన్మార్క్‌లో సోషలిస్టు డెమొక్రాట్ ప్రభుత్వం కొలువుదీరనున్నది. మూడు లెఫ్ట్, సెంటర్ లెఫ్ట్ పార్టీలతో కొన్ని వారాలుగా జరిపిన చర్చల్లో ఒప్పందానికి వచ్చిన సోషలిస్టు డెమొక్రాట్ నేత మెట్టె ఫ్రెడెరిక్‌సేన్ (41) మీడియాతో మాట్లాడుతూ త్వరలో మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. డెన్మార్క్‌లో మైనారిటీ ప్రభుత్వాలు ఏర్పాటు కావడం సాధారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం వివిధ పార్టీల మధ్య మూడు వారాల సంప్రదింపులు జరుగడం 1988 తర్వాత ఇదే మొదటిసారి. గురువారం నూతన ప్రభుత్వం ఏర్పాటవుతుందని భావిస్తున్నామని మెట్టె ఫ్రెడెరిక్ సేన్ చెప్పారు. ఆమె దేశ ప్రధానిగా బాధ్యతలు చేపడితే డెన్మార్క్‌లోనే అధికార పగ్గాలు చేపట్టిన అతి పిన్న వయస్కురాలు కానున్నారు.

### 40 ఏండ్ల తర్వాత శ్రీలంకలో ఉరిశిక్ష!

**కొలంబో:** ఉరిశిక్షల అమలుపై 40 ఏండ్ల క్రితం విధించిన నిషేధాన్ని శ్రీలంక ప్రభుత్వం బుధవారం ఎత్తివేసింది. మాదక ద్రవ్యాల (డ్రగ్స్) అక్రమ రవాణా కేసులో నలుగురు దోషులకు ఉరిశిక్ష అమలుకు ఆ దేశ అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ఆదేశాలు జారీ చేశారు. 43 ఏండ్ల క్రితం 1976 జూన్‌లో చివరిసారిగా శ్రీలంకలో పేరొందిన నేరగాడు సిరిపాల అలియాస్ మరుసిరాకు ఉరిశిక్ష అమలు చేశారు. దేశంలో శరవేగంగా విస్తరిస్తున్న నార్కోటిక్స్ అనుబంధ నేరాలపై కఠిన వైఖరి ప్రదర్శించేందుకే ఉరిశిక్షను తిరిగి అమలు చేయాలని నిర్ణయించినట్లు సిరిసేన తెలిపారు. ఈ నెల 23 నుంచి జూలై 1 వరకు 'డ్రగ్స్ నిరోధక వారం'గా పాటిస్తున్న నేపథ్యంలో నలుగురు దోషులకు ఉరిశిక్ష అమలు చేయాలని సిరిసేన నిర్ణయించారు.

## అమర్‌నాథ్ యాత్ర సజావుగా సాగాలి

జమ్ముకశ్మీర్‌లోని భద్రతా సంస్థలకు

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశం

కశ్మీర్ లోయలో భద్రతపై అధికారులతో సమీక్ష



హోం మంత్రి అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న గవర్నర్ మాలిక్

**శ్రీనగర్:** వచ్చేనెల 1 నుంచి ప్రారంభమయ్యే అమర్‌నాథ్ యాత్ర సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని జమ్ముకశ్మీర్‌లోని వివిధ భద్రతా సంస్థల అధినేతలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశించారు. ఆయన జమ్ముకశ్మీర్‌లో రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం శ్రీనగర్‌కు చేరుకున్నారు. హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అమిత్ షా తన మొదటి పర్యటనకు కశ్మీర్‌ను ఎంచుకోవడం ద్వారా.. ఆ రాష్ట్రానికి మోదీ సర్కార్ ప్రాధాన్యం ఇస్తుందన్న సంకేతాలిచ్చారు. రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ కూడా ప్రొటోకాల్ నిబంధనలను పక్కనబెట్టి ఉన్నతాధికారులతో కలిసి శ్రీనగర్ విమానాశ్రయంలో అమిత్‌షాకు స్వాగతం పలికారు. సాధారణంగా ప్రధాని పర్యటించినప్పుడు మాత్రమే గవర్నర్ స్వాగతం పలుకుతారు. గవర్నర్, ఆయన సలహాదారులు, భద్రతా సంస్థల అధిపతులతో అమిత్ షా సమావేశమై కశ్మీర్ లోయలో భద్రతపై సమీక్షించారు. పుల్వామా ఉగ్రదాడి తర్వాత రాష్ట్రంలో భద్రతా పరిస్థితిపై అమిత్‌షాకు అధికారులు నివేదించారు. అమర్‌నాథ్‌లోని మంచు శివలింగాన్ని అమిత్‌షా సందర్శించనున్నారు. అమరులైన పోలీసుల కుటుంబాలను కూడా పరామర్శించనున్నారు.

## ఓటు మోదీకి.. సాయానికి నేనా?

రాయ్‌చూర్‌లో ఆందోళనకారులపై

కర్ణాటక సీఎం కుమారస్వామి మండిపాటు

నిరాశా నిస్పృహలతో సహనం కోల్పోయిన సీఎం: బీజేపీ



**బెంగళూరు:** సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలిపిన ప్రజలపై కర్ణాటక సీఎం హెచ్‌డీ కుమారస్వామి సహనం కోల్పోయి మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన 'గ్రామ బస' కార్యక్రమంలో పాల్గొనేందుకు కారెగుడ్డ గ్రామానికి బస్సులో వెళుతున్న కుమారస్వామిని రాయ్‌చూర్ జిల్లాలో కొందరు అడ్డుకున్నారు. నినాదాలు చేశారు. దీంతో ఆయన ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. బస్సు కిటికిలో నుంచి చూస్తూ.. ఆందోళనకారులపై చిటపటలాడారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి ఓటేసిన మీకు సాయం చేయాలా? అని ప్రశ్నించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్‌ను స్థానిక టీవీ చానెళ్లు ప్రసారం చేశాయి. నిరసన తెలుపుతున్న వారిని ఉద్దేశించి కుమారస్వామి మాట్లాడుతూ.. 'మిమ్మల్ని నేను గౌరవించాలా? మీ మీద లాఠీచార్జి చేయించాలా? మీరు మోదీకి ఓటేశారు. మళ్లీ మీరు సాయం చేయమని నన్ను అడుగుతున్నారు' అన్నారు. ఆందోళనకారులు నిరసన కొనసాగించడంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని పక్కకు తప్పించారు. సీఎం వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. కుమారస్వామి ప్రతిస్పందించిన తీరు ఆయన ఆవేశం, నిరాశా నిస్పృహలను తెలియజేస్తున్నదని పేర్కొంది. సామాన్యుడి మాదిరిగా సీఎం ఆవేశపడడం మంచిది కాదని, సీఎంగా కొనసాగడం ఇష్టం లేకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవడం మంచిదని సూచించింది.

నమస్తే తెలంగాణ ఆట
క్రికెట్ సమరం WORLD CUP
కరీంనగర్ | WWW.NTNEWS.COM | గురువారం 27 జూన్ 2019 | 10

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ఆస్ట్రేలియా | 7 | 6 | 1 | 0 | +0.90 | 12 |
| 2. | న్యూజిలాండ్ | 7 | 5 | 1 | 1 | +1.09 | 11 |
| 3. | భారత్ | 5 | 4 | 0 | 1 | +0.80 | 9 |
| 4. | ఇంగ్లండ్ | 7 | 4 | 3 | 0 | +1.05 | 8 |
| 5. | బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | -0.13 | 7 |
| 6. | పాకిస్థాన్ | 7 | 3 | 3 | 1 | -0.97 | 7 |
| 7. | శ్రీలంక | 6 | 2 | 2 | 2 | -1.11 | 6 |
| 8. | వెస్టిండీస్ | 6 | 1 | 4 | 1 | +0.19 | 3 |
| 9. | దక్షిణాఫ్రికా | 7 | 1 | 5 | 1 | -0.32 | 3 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 7 | 0 | 7 | 0 | -1.63 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు,

**వరల్డ్‌కప్‌లో నేడు** భారత్ X వెస్టిండీస్ - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

**అత్యధిక పరుగులు** 500 వార్నర్ (ఆస్ట్రేలియా)

**అత్యధిక వికెట్లు** 19 స్టార్క్ (ఆస్ట్రేలియా)

# కరీబియన్లు కాస్కోండి


కోహ్లీ

## నేడు వెస్టిండీస్‌తో భారత్ పోరు

### ఆత్మవిశ్వాసంతో టీమ్ఇండియా.. గెలిస్తే సెమీస్ బెర్తు ఖరారు

**ప్రపంచకప్‌లో అప్రతిహత విజయాలతో దూసుకెళుతున్న టీమ్ఇండియా మరో పోరాటానికి సర్వ సన్నద్ధమైంది. అజేయ జోరును కొనసాగిస్తూ సెమీస్‌కు చేరువవ్వాలనే కసితో నేడు వెస్టిండీస్‌ను ఢీకొననుంది. పరాజయాలు.. నిలకడలేమితో ఒత్తిడిలో ఉన్న కరీబియన్లను మట్టికరిపించి టోర్నీలో ముందంజ వేసేందుకు తహతహలాడుతున్నది. విండీస్ భారీ హిట్టర్లను కట్టడి చేసేందుకు బుమ్రా అండ్ కో అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటుంటే... ప్రత్యర్థి పేసర్ల బౌన్సర్లను చీల్చిచెండాడేందుకు రోహిత్, కోహ్లీ బ్యాచ్ బ్యాట్లకు పదునుపెడుతున్నది. కరీబియన్ జట్టు మాత్రం ఆఫ్ఘనిస్థాన్‌ను స్ఫూర్తిగా తీసుకొని టీమ్ఇండియా బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేస్తామనే ధీమాతో బరిలోకి దిగుతుంటే... టోర్నీలో మేటి జట్లను మట్టికరిపించిన ఆత్మవిశ్వాసంతో కోహ్లీసేన కదనరంగంలో కాస్కోండి అంటూ సవాలు విసురుతున్నది. మరి అన్ని విధాలా ఒత్తిడిలో ఉన్న విండీస్‌ను చిత్తు చేసి టీమ్ఇండియా జైత్రయాత్రను నిర్విఘ్నంగా కొనసాగిస్తూ సెమీస్ రేసులో దూసుకెళ్లాలని చూస్తున్నది.**


హోల్డర్

### పిచ్, వాతావరణం

ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పులేదు. పిచ్ పొడిగా ఉన్న కారణంగా స్పిన్నర్లకు అనుకూలించే అవకాశముంది. ఈ టోర్నీలో ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్‌పై ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ మొదట బ్యాటింగ్ చేసిన జట్టే గెలిచింది. అందుకే టాస్ గెలిచిన జట్టు ప్రత్యర్థికి ఫీల్డింగ్ ఇచ్చేందుకు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**మాంచెస్టర్:** ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, పాకిస్థాన్ లాంటి జట్లను సునాయాసంగా ఓడించి కొండంత ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమ్ఇండియా... ఓటముల భారాన్ని మోయలేక బరువు దించుకుందామని ఆరాటపడుతున్న వెస్టిండీస్‌తో గురువారం తలపడనుంది. చిరకాల ప్రత్యర్థి పాక్‌ను మట్టికరిపించిన ఇక్కడి ఓల్డ్‌ట్రాఫోర్డ్ మైదానంలో విండీస్‌తో పోరుకు సిద్ధమైంది. పసికూన ఆఫ్ఘన్‌పై చెమటోడ్చి గెలిచిందని.. నత్తనడక బ్యాటింగ్ అంటూ వచ్చిన విమర్శలకు సమాధానం చెప్పాలని పట్టుదలగా ఉంది. నిలకడలేమికి నిదర్శనంగా ఉన్న విండీస్‌పై భారీ విజయాన్ని సాధించి నెట్‌రన్ రేట్‌ను మెరుగుపరుచుకోవాలని ఆశిస్తున్నది. ఐదు మ్యాచ్‌ల్లో ఒకటి రద్దు కాగా నాలుగింట గెలిచి 9పాయింట్లతో టీమ్ఇండియా సెమీస్‌కు చేరువలో ఉంటే.. ఆరు మ్యాచ్‌ల్లో ఐదు ఓడి 3పాయింట్లతో వెస్టిండీస్ నాకౌట్ ఆశలను దాదాపు గల్లంతు చేసుకుంది. అంచనాలకు తగ్గట్టు దుమ్మురేపి కోహ్లీసేన విండీస్‌ను మట్టికరిపిస్తే ఇక సెమీస్‌బెర్త్ దాదాపు ఖరారైనట్టే.

#### బ్యాటింగ్‌లో అదుర్స్... కానీ

ఆస్ట్రేలియా భీకర వేగానికి అదరలేదు.. దక్షిణాఫ్రికా బౌన్స్‌కు బెదరలేదు.. ఆమిర్ మెరుపు బంతులకు చెదరలేదు.. దీటుగా ఎదుర్కొని బంతులను బాదేసి జట్టును విజయపథంలో నడిపింది భారత బ్యాటింగ్ దళం. అయితే గత మ్యాచ్‌లో ఆఫ్ఘన్ స్పిన్‌కు మాత్రం టీమ్ఇండియా బ్యాట్స్‌మెన్ కంగారు పడ్డారు. ఏదో విధంగా మ్యాచ్ గెలిచినా.. విమర్శలను మూటగట్టుకున్నారు. సేనాని కోహ్లీ తప్ప ఎవరూ స్వేచ్ఛగా ఆడలేకపోయారు. టోర్నీ హీరో రోహిత్ సహా అందరూ చతికిలపడ్డారు. జాదవ్(68బంతుల్లో52) అర్ధశతకం చేసినా నెమ్మదిగా ఆడి నిరాశపరిచాడు. ఇక ధోని(52 బంతుల్లో 28) అయితే అభిమానులు సైతం అసహనం చెందేలా ఆడాడు. లోయర్‌ఆర్డర్‌లో పాండ్య సహా అందరూ పెవిలియన్‌కు క్యూ కట్టారు. వెరిసి పసికూనగా అందరూ పరిగణిస్తున్న ఆఫ్ఘన్‌పై టీమ్ఇండియా 224 పరుగులే చేసింది. అయితే, బుమ్రా మెరుపులు, షమీ హ్యాట్రిక్‌తో కొద్దిలో పరాభవం నుంచి తప్పించుకుంది. వెస్టిండీస్‌కు ఆఫ్ఘన్ అంత పటిష్ఠమైన స్పిన్ లేకున్నా కాట్రెల్, రోచ్, థామస్‌తో కూడిన సమర్థమైన పేస్ దళముంది. ఆఫ్ఘన్‌పై బ్యాటింగ్ తీరును మరిచి విండీస్ బౌలర్లను ధాటిగా ఆడి కోహ్లీసేన వేగంగా పరుగులు చేయాల్సిన అవసరం ఉంది.

#### రోహిత్ జబర్దస్త్..

ఈ టోర్నీలో ఆఫ్ఘన్‌తో మినహా అన్ని మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టి రెండు శతకాలు, ఓ అర్ధశతకంతో రోహిత్ శర్మ(320) వీరవిహారం చేశాడు. రోహిత్ రెచ్చిపోతే విండీస్ బౌలర్లకు కష్టాలు తప్పవు. ధవన్ గైర్హాజరీలో రాహుల్‌ కూడా ఓపెనింగ్‌లో సెటిలైపోయి హిట్‌మ్యాన్‌కు మంచి మద్దతిస్తున్నాడు. పేస్‌బౌలింగ్ ప్రధానాస్త్రంగా బరిలోకి దిగుతున్న విండీస్‌ను మొదట్లో వీరిద్దరూ ఆటాడుకుంటే ఇక టీమ్ఇండియా పైచేయి సాధించినట్టే. ఆ తర్వాత సారథి కోహ్లీ, ధోనీ, హిట్టర్లు జాదవ్, పాండ్య భారీ స్కోరు దిశగా జట్టును నడిపించేందుకు ఎలాగూ ఉన్నారు. అయితే విండీస్ హిట్టర్లను దృష్టిలో ఉంచుకొని... గత మ్యాచ్ చేదు అనుభవాన్ని ధోనీ, జాదవ్ సహా భారత బ్యాటింగ్ దళం మొత్తం గుణపాఠంగా తీసుకొని మొదటి బ్యాటింగ్ వస్తే వేగంగా పరుగులు రాబట్టి భారీ స్కోరు చేయాల్సిన అవసరం ఉంది. మిడిల్‌ఆర్డర్ గాడిలో పడడం ముఖ్యం.

#### బౌలింగ్ మస్త్..

విశ్వటోర్నీలో తొలిసారి అడుగుపెట్టినా.. భారత స్పీడ్‌స్టర్ బుమ్రా, స్పిన్ ట్విన్స్ చాహల్, కుల్‌దీప్ అదరగొడుతున్నారు. బుమ్రా ప్రతీమ్యాచ్‌లో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను కట్టిడి చేస్తూ.. జట్టుకు అవసరమైనప్పుడుల్లా వికెట్లు తీస్తూ రాణిస్తున్నాడు. గత మ్యాచ్‌లో ఓ దశలో లక్ష్యాన్ని ఆఫ్ఘన్ ఛేదించేస్తుందా అని అందరికీ అనుమానమొచ్చిన తరుణంలో బుమ్రా అద్భుత బంతులతో రహ్మత్ షా, హష్మతుల్లాను ఔట్ చేసి టీమ్ఇండియాకు విజయబాటలు వేశాడు. ఇక భువనేశ్వర్‌కు గాయంతో గత మ్యాచ్‌లో జట్టులోకి వచ్చిన షమీ ఆగమనాన్ని ఘనంగా చాటుతూ జోరుగా ఆడుతున్న నబీని ఔట్ చేయడం సహా హ్యాట్రిక్ నమోదు చేశాడు. ఇక చాహల్.. టోర్నీ తొలిమ్యాచ్‌లో సఫారీల నాలుగు వికెట్లతో దెబ్బకొడితే.. పాక్‌తో మ్యాచ్‌లో రెండు మ్యాజిక్ బంతులతో టీమ్ఇండియాను కుల్‌దీప్ పటిష్ఠ స్థితికి తెచ్చాడు. అయితే ఒకవేళ విండీస్ బ్యాట్స్‌మెన్ బాదినా.. లైన్ అండ్ లెంగ్త్ తప్పకుండా భారత బౌలింగ్ దళం బంతులేయడం చాలా ముఖ్యం.

**ప్రపంచ కప్‌లో..**

| | |
|---|---|
| ఆడిన మ్యాచ్‌లు | 8 |
| భారత్ గెలిచినవి | 5 |
| వెస్టిండీస్ గెలిచినవి | 3 |

#### హిట్టర్లపైనే భారం

వెస్టిండీస్ ఆశలు మొత్తం భారీ హిట్టింగ్ చేసే గేల్ అండ్ కోపైనే. ఇప్పటి వరకు గేల్ రెండు మ్యాచ్‌ల్లో రాణిస్తే.. మిగతా మ్యాచ్‌ల్లో ఘోరంగా విఫలమయ్యాడు. హోప్ పరిస్థితీ అంతే. ఇక బ్రాత్‌వైట్ గత మ్యాచ్‌లో కివీస్‌కు విశ్వరూపమే చూపాడు. హిట్మైర్, పూరన్ లాంటి యువసంచనాలు ఉన్నారు. వారిలో ఏ ముగ్గురు రాణించినా భారత్‌కు కష్టాలు తప్పవు. కానీ విండీస్ బ్యాట్స్‌మెన్ ప్రధాన బలహీనత నిలకడలేమి. టోర్నీలో ఏ ఒక్కరూ వరుసగా రాణించిన దాఖలాలు లేవు. మరి ఇంతటి అస్థిరతతో బలమైన, వైవిధ్యమైన టీమ్ఇండియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటారో.. చతికిలపడతారో చూడాలి. ఆల్‌రౌండర్ రస్సెల్ దూరం కావడం కరీబియన్ జట్టుకు పెద్దఎదురుదెబ్బ. విండీస్ బౌలర్లు తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై అదరగొట్టినా ఆ తర్వాత తేలిపోయారు. కాట్రెల్ ఒక్కడే కాస్త నిలకడ ప్రదర్శిస్తున్నాడు. స్పిన్‌లో నర్స్ ఉన్నా.. ఏ మాత్రం ప్రభావం చూపలేకపోతున్నాడు.

**37**

**కోహ్లీ మరో 37 పరుగులు చేస్తే అంతర్జాతీయ క్రికెట్ (టెస్టులు, వన్డేలు, టీ20లు)లో వేగంగా 20వేల పరుగుల మైలురాయిని చేరిన బ్యాట్స్‌మన్‌గా నిలుస్తాడు.**

#### జట్లు అంచనా..

**భారత్:** కోహ్లీ(కెప్టెన్), రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, శంకర్, జాదవ్, ధోనీ, పాండ్య, షమీ, చాహల్/జడేజా, కుల్దీప్ యాదవ్, బుమ్రా.

**వెస్టిండీస్:** క్రిస్ గేల్, లెవిస్/అంబ్రిస్, హోప్(వికెట్ కీపర్), పూరన్, హిట్మైర్, హోల్డర్(కెప్టెన్), బ్రాత్‌వైట్, నర్స్, కాట్రెల్, కీమర్ రోచ్, థామస్.

# పాక్ పోటీలోనే..

- ఆజమ్ అజేయ సెంచరీ
- కివీస్‌పై అద్భుత విజయం
- సెమీస్ రేసు రసవత్తరం

**ప్రపంచకప్ రసపట్టులో పడింది. ఇన్ని రోజులు చప్పగా సాగుతున్నట్లు కనిపించిన మెగాటోర్నీ ఆఖరి అంకానికి చేరుకునే సరికి అసలు మజా మొదలైంది. సెమీస్ రేసులో నిలువాలంటే ప్రతీ మ్యాచ్ కీలకమైన తరుణంలో జట్లన్నీ సర్వశక్తులు కూడదీసుకుని కొట్లాడుతున్నాయి. నాకౌట్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించిందనుకున్న దాయాది పాక్..దెబ్బతిన్న బెబ్బులిలా అదరగొడుతున్నది. 1992 ప్రపంచకప్‌ను పునరావృతం చేస్తూ వరుస విజయాలతో పోటీలో మేమున్నమంటూ ప్రత్యర్థులకు దీటైన హెచ్చరికలు పంపుతున్నది. అజేయ కివీస్‌కు దిమ్మతిరిగే ఝలక్ ఇచ్చింది. కివీస్‌ను తక్కువ స్కోరు కట్టడి చేసిన సర్ఫరాజ్ సేన.. ఆజమ్ అజేయ సెంచరీతో గెలిచింది.**


ఆజమ్ (101*)

**బర్మింగ్‌హామ్:** ప్రపంచకప్‌లో మరో మ్యాచ్ అభిమానులను అలరించింది. బుధవారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై పాక్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో 7 పాయింట్లతో ఆరో స్థానంలోకి దూసుకురాగా, కివీస్ 11 పాయింట్లతో రెండులో ఉంది. కివీస్ నిర్దేశించిన 238 పరుగుల లక్ష్యాన్ని ఆజమ్(127 బంతుల్లో 101 నాటౌట్, 11 ఫోర్లు) సెంచరీకి తోడు సోహైల్(76 బంతుల్లో 68, 5 ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీతో 49.1 ఓవర్లలో 241/4 పరుగులు చేసింది. తొలుత అఫ్రిదీ(3/28) ధాటికి కివీస్ నిర్ణీత ఓవర్లలో 237/6 స్కోరుకు పరిమితమైంది. నీషమ్(112 బంతుల్లో 97 నాటౌట్, 6 ఫోర్లు, సిక్స్), గ్రాండ్‌హోమ్(71 బంతుల్లో 64, 6ఫోర్లు, సిక్స్) రాణించారు. సెంచరీతో జట్టును గెలిపించిన ఆజమ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**ఆజమ్ అదుర్స్:** నిర్దేశిత లక్ష్యఛేదనకు దిగిన పాక్‌కు జమాన్(9) రూపంలో అవాంతరం ఎదురైంది. కివీస్ స్పీడ్‌స్టర్ ట్రెంట్ బౌల్ట్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన జమాన్ తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత బాబర్ ఆజమ్, ఇమాముల్ హక్(19) ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. కివీస్ పదునైన పేస్ దాడిని అంతే దీటుగా ఎదుర్కొంటూ క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ఆజమ్ చూడచక్కని షాట్లతో అలరించాడు. పిచ్‌పై దూసుకొస్తున్న బుల్లెట్‌లాంటి బంతులను అంతే వేగంగా బౌండరీలకు తరలిస్తూ స్కోరుబోర్డును పరిగెత్తించాడు. ఎక్కడా వెనుకకు తగ్గని నైజంతో ఆట కొనసాగించారు. అయితే ఫెర్గుసన్ అనూహ్య బౌన్సర్‌కు ఇమాముల్ హక్ ఔట్ కావడంతో పాక్‌కు కష్టాలు మొదలయ్యాయా అనిపించింది. కానీ హఫీజ్(32)వచ్చి రావడంతోనే దూకుడు ప్రదర్శిస్తూ కివీస్ బౌలర్లకు ఎక్కడా అవకాశమివ్వకపోవడంతో కలిసొచ్చింది. ఇదే జోరులో ఆజమ్, హఫీజ్ ఇన్నింగ్స్‌ను నిర్మించుకుంటూపోయారు. అయితే కెప్టెన్ విలియమ్సన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన హఫీజ్..ఫెర్గుసన్ చేతికి చిక్కడంతో మూడో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. హరిస్ సోహైల్(68)..ఆజమ్‌కు జత కలిసిన తర్వాత ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. వీరిద్దరు సమయోచిత ఆటతీరుతో కివీస్ బౌలర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారు. ముఖ్యంగా ఆజమ్ మైదానం నలువైపులా చూడచక్కని షాట్లతో అలరించాడు. ఈ క్రమంలో ప్రపంచకప్‌లో తన తొలి సెంచరీని నమోదు చేసుకున్నాడు. ఆఖర్లో లేని పరుగు కోసం సోహైల్ రనౌటైనా..ఆజమ్‌తో కలిసి కెప్టెన్ సర్ఫరాజ్ బౌండరీతో జట్టు గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు.

**ఆదుకున్న నీషమ్, గ్రాండ్‌హోమ్:** యువ స్పీడ్‌స్టర్ షాహిన్ షా అఫ్రిదీ(3/28) ధాటికి కివీస్ టాపార్డర్ కకావికలమైంది. తన తొలి ఓవర్ మొదటి బంతికే మహ్మద్ ఆమిర్..గప్టిల్(5)ను తొలి వికెట్‌గా పెవిలియన్ పంపాడు. దూకుడు కనబరిచిన కొలిన్ మున్రో(12)తన జోరును కొనసాగించలేకపోయాడు. అఫ్రిదీ బౌలింగ్‌లో సోహైల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఇక్కణ్నుంచి కివీస్ ఇన్నింగ్స్ పేక మేడను తలపించింది. సూపర్ ఫామ్‌మీదున్న కెప్టెన్ విలియమ్సన్(41) సాధికారిక షాట్లతో ఆకట్టుకున్నాడు. లయను దొరకబుచ్చుకున్న అఫ్రిదీ.. రాస్ టేలర్(3) వికెట్‌ను తన ఖాతా లో వేసుకున్నాడు. లాథమ్(1)మరోమారు నిరాశ పరుచగా, విలియమ్సన్, నీషమ్ (97 నాటౌట్) ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. అయితే షాదాబ్ ఖాన్ బౌలింగ్‌లో విలియమ్సన్ ఔట్ కావడంతో కివీస్ 83 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది.నీషమ్, గ్రాండ్‌హోమ్(64) ఆదుకున్నారు. వీరిద్దరు స్కోరుబోర్డుకు ఒక్కో పరుగు జోడించుకుంటూ పోతూ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశారు. ఓవైపు పిచ్ నుంచి అంతగా సహకారం లేకపోయినా..సహనంతో బ్యాటింగ్ చేస్తూ స్ట్రైక్ రొటేట్ చేస్తూ పోయారు. క్రీజులో కుదురుకున్న నీషమ్...గ్రాండ్‌హోమ్‌ను అండగా చేసుకుంటూ పాక్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. దీనికి తోడు పాక్ పేలవ ఫీల్డింగ్‌ను తమకు అనుకూలంగా మలుచుకుంటూ నీషమ్, గ్రాండ్‌హోమ్ కీలక పరుగులు జోడించారు. గ్రాండ్‌హోమ్ రనౌట్ కావడంతో ఆరో వికెట్‌కు 132 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆఖర్లో నీషమ్.. సాంట్నెర్ జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు.

### స్కోరు బోర్డు

**న్యూజిలాండ్:** గప్టిల్(బి)ఆమిర్ 5, మున్రో(సి)సోహైల్(బి)అఫ్రిదీ 12, విలియమ్సన్(సి)సర్ఫరాజ్(బి)షాదాబ్‌ఖాన్ 41, టేలర్(సి) సర్ఫరాజ్(బి)అఫ్రిదీ 3, లాథమ్(సి)సర్ఫరాజ్(బి)అఫ్రిదీ 1, నీషమ్ 97 నాటౌట్, గ్రాండ్‌హోమ్(రనౌట్) 64, సాంట్నర్ 5 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 9; **మొత్తం:** 50 ఓవర్లలో 237/6; **వికెట్ల పతనం:** 1-5, 2-24, 3-38, 4-46, 5-83, 6-215; **బౌలింగ్:** హఫీజ్ 7-0-22-0, ఆమిర్ 10-0-67-1, అఫ్రిదీ 10-3-28-3, వసీం 3-0-17-0, షాదాబ్ 10-0-43-1, రియాజ్ 10-0-55-0.

**పాకిస్థాన్:** ఇమాముల్(సి)గప్టిల్(బి)ఫెర్గుసన్ 19, జమాన్ (సి)గప్టిల్(బి)బౌల్ట్ 9, బాబర్ ఆజమ్ 101 నాటౌట్, హఫీజ్ (సి)ఫెర్గుసన్(బి)విలియమ్సన్ 32, సోహైల్ (రనౌట్) 68, సర్ఫరాజ్ 5 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం:** 49.1 ఓవర్లలో 241/4; **వికెట్ల పతనం:** 1-19, 2-44, 3-110, 4-236; **బౌలింగ్:** బౌల్ట్ 10-0-48-1, హెన్రీ 7-0-25-0, ఫెర్గుసన్ 8.1-0-50-1, గ్రాండ్‌హోమ్ 2-0-12-0, సాంట్నర్ 10-0-38-0, నీషమ్ 3-0-20-0, విలియమ్సన్ 8-0-39-1, మున్రో 1-0-9-0.

### అచ్చం.. అలాగే..



| మ్యాచ్ | 1992 | 2019 |
|---|---|---|
| 1 | ఓటమి | ఓటమి |
| 2 | గెలుపు | గెలుపు |
| 3 | రద్దు | రద్దు |
| 4 | ఓటమి | ఓటమి |
| 5 | ఓటమి | ఓటమి |
| 6 | గెలుపు | గెలుపు |
| 7 | గెలుపు | గెలుపు |

#### సొంతగడ్డపైనే

# గేల్ రిటైర్మెంట్



**మాంచెస్టర్:** ప్రపంచకప్ తర్వాత సొంతగడ్డపై భారత్‌తో జరిగే సిరీస్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్ నుంచి వెస్టిండీస్ డాషింగ్ బ్యాట్స్‌మెన్ క్రిస్ గేల్ రిటైరవ్వనున్నాడు. ఆగస్టు 30న తన సొంత నగరమైన జమైకాలోని కింగ్‌స్టన్‌లో జరిగే టెస్టుతోనే గేల్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ముగించే అవకాశముంది. ప్రపంచకప్ తర్వాతే వీడ్కోలు పలుకుతానని గత నెల ప్రకటించినా.. మనసు మార్చుకున్నాడు 39ఏళ్ల గేల్. ఈ విషయాన్ని భారత్‌తో మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించాడు. 'ప్రపంచకప్ తర్వాత నా ప్రణాళిక అంటే.. నేను కచ్చితంగా భారత్‌లో ఓ టెస్టు మ్యాచ్ ఆడతా.. వన్డేలోనూ తలపడతా. ఇక టీ20లు ఆడను. ఇదే నా ప్లాన్' అని గేల్ చెప్పాడు. అనంతరం గేల్ రిటైర్మెంట్ సమాచారాన్ని విండీస్ మీడియా మేనేజర్ ఫిలిప్ స్పూనర్ ధ్రువీకరించారు. 'అవును, క్రిస్ తన చివరి సిరీస్‌ను భారత్‌తో ఆడనున్నాడు' అని ప్రకటించాడు. ప్రపంచకప్ తర్వాత టీమ్ ఇండియా.. విండీస్‌లో పర్యటించనుంది. ఆతిథ్య జట్టుతో మొత్తం మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. వీటిలో తొలి టీ20లు అమెరికాలోని ఫ్లోరిడాలో జరగనున్నాయి.

#### దవాఖాన నుంచి

# లారా డిశ్చార్జ్

**ముంబై:** వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ఛాతి నొప్పితో దవాఖానలో చేరిన లారా ప్రస్తుతం తాను ఆరోగ్యంగా ఉన్నానంటూ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. జిమ్‌లో వర్క్‌ఔట్స్ చేస్తుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో ముందస్తు జాగ్రత్తగా ముంబైలోని గ్లోబల్ దవాఖానలో లారా చేరిన సంగతి తెలిసిందే. పూర్తి స్థాయి పరీక్షల అనంతరం వైద్యులు ప్రమాదమేమీలేదని స్పష్టం చేశారు. 'నేను ప్రస్తుతం ఫిట్ అండ్ ఫైన్‌గా ఉన్నాను. ఎలాంటి సమస్యలేదు. త్వరలోనే క్రికెట్ కామెంటరీలో భాగమవుతాను' అని లారా అన్నాడు. ప్రపంచకప్‌లో భాగంగా అధికారిక బ్రాడ్‌కాస్టర్ చానెల్ తరఫున ఈ 50 ఏండ్ల విండీస్ దిగ్గజం అనలిస్టుగా సేవలందిస్తున్నాడు.

## ఏసీ బ్యాడ్మింటన్ కోర్టులకు అంకురార్పణ

### భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, క్రీడా మంత్రి శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** బ్యాడ్మింటన్ క్రీడకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా విరాజిల్లుతున్నది. సైనా నెహ్వాల్, పీవీ సింధు, శ్రీకాంత్‌ను స్ఫూర్తిగా తీసుకుంటూ మరింత మంది ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిభ కల్గిన షట్లర్లను తీర్చిదిద్దేందుకు జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అకాడమీ పూనుకుంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఎయిర్ కండీషన్(ఏసీ) బ్యాడ్మింటన్ కోర్టుల నిర్మాణం ప్రారంభించింది. బుధవారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ నరసింహన్, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ 'అంతర్జాతీయ టోర్నీలన్నీ ఏసీ కోర్టుల్లోనే జరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా ఇక్కడి ఆటగాళ్ల కోసం ఆరు ఏసీ కోర్టులు నిర్మాణం జరుపుతున్నాం' అని గోపీ అన్నాడు. అంతర్జాతీయ స్థాయి టోర్నీలకు ప్రభుత్వ సహకారం తప్పనిసరిగా ఉంటుందని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ సింధు, కశ్యప్ పాల్గొన్నారు.

## 'విమర్శించండి..తిట్టొద్దు'

**బర్మింగ్‌హామ్:** భారత్‌పై మ్యాచ్ ఓడిపోయాక పాకిస్థాన్ జట్టుపై ఆ దేశ అభిమానులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. పాక్ కెప్టెన్ సర్ఫరాజ్ తన కుమారుడితో కలిసి ఇటీవల ఇంగ్లండ్‌లోని ఓ మాల్‌కు వెళితే అక్కడ కలిసిన ఓ అభిమాని తీవ్రవ్యాఖ్యలు చేశాడు. ఈ ఘటనపై పాక్ కెప్టెన్ సర్ఫరాజ్ బుధవారం స్పందించాడు. 'ప్రజలు మా గురించి ఏమనాలో నియంత్రించడం నా చేతుల్లో లేదు. గెలుపోటములు ఆటలో సర్వసాధారణం. మా ఆటను విమర్శించండి. వ్యక్తిగతంగా దూషించొద్దు' అని సర్ఫరాజ్ కోరాడు.

## భువనేశ్వర్‌కే మాస్టర్ ఓటు

**ముంబయి:** ఆఫ్ఘన్‌తో మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి హ్యాట్రిక్ సాధించిన టీమ్ఇండియా బౌలర్ మొహమ్మద్ షమీని కాకుండా.. వెస్టిండీస్‌తో తలపడే మ్యాచ్‌కు తానైతే భువనేశ్వర్ వైపే మొగ్గు చూపుతానని మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ బుధవారం అన్నాడు. భువీ.. తనదైన స్వింగ్ బౌలింగ్‌తో విండీస్ హిట్టర్ క్రిస్ గేల్‌ను ఇబ్బందులు పెట్టగలడని అభిప్రాయపడ్డాడు. 'భువనేశ్వర్ కుమార్ ఫిట్‌నెస్ సాధించడం భారత్‌కు శుభవార్త. అతడిని నెట్స్‌లో చూశా. చాలా విశ్వాసంతో ఉన్నాడు. భారత్, వెస్టిండీస్ మ్యాచ్‌కు షమీ, భువనేశ్వర్‌లలో ఒకరిని ఎంచుకోమంటే.. నేనైతే భువీని తీసుకునేందుకే ఇష్టపడతా. ఇందుకు ఒకే కారణముంది, భువీ అయితే క్రిస్ గేల్‌కు ఔటర్ యాంగిల్‌లో బంతులు వేయగలడు. వాటిని ఆడేందుకు గేల్ ఇబ్బందులు పడతాడు. నేను ఆడిన చివరి టెస్టులో గేల్‌ను భువీ ఎలా ముప్పు తిప్పలు పెట్టాడో నాకు గుర్తుంది' అని సచిన్ అన్నాడు.




**ఈనెల 30న ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌లో టీమ్ఇండియా ధరించే జెర్సీ ఇది. బీసీసీఐ ప్రతిపాదనకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆమోదముద్ర వేసింది. దీంతో ఇన్నాళ్లు నీలిరంగు జెర్సీలో ఆడిన మనోళ్లు..ఇంగ్లండ్‌తో ఆరెంజ్ కలర్‌లో బరిలోకి దిగనుంది.**

## కబడ్డీ ప్రపంచకప్ ప్రసార హక్కులు సోనీకి

**హైదరాబాద్:** ప్రతిష్ఠాత్మక కబడ్డీ ప్రపంచకప్ ప్రసార హక్కులను సోనీ పిక్చర్స్ ఇండియా దక్కించుకున్నది. వచ్చే నెల 20న మలేషియాలో మొదలవనున్న ప్రపంచకప్ ప్రసారాలు భారత్‌తో సహా పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మాల్దీవులు, భూటాన్, ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రేక్షకులకు అందుబాటులో ఉంటాయి. ఇన్నాళ్లు కొన్ని దేశాలకే పరిమితమైన గ్రామీణ క్రీడ కబడ్డీ..లీగ్‌ల ద్వారా ప్రపంచానికి పరిచయమైంది. కబడ్డీ ప్రపంచకప్‌లో మొత్తం 32 పురుషుల జట్లు, 16 మహిళల జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి భారత్ తరఫున సునీల్ జైపాల్, నవీన్ కుమార్, సందీప్ చిల్లార్, సురేశ్ కుమార్ బరిలోకి దిగనున్నారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,592 | 11,847 |
| ↗157 | ↗51 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 65.77 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 34,170 |
| 22 క్యారెట్లు | 34,000 |
| వెండి (కిలో) | 38,700 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.50 | 72.00 |
| యూరో | 75.40 | 83.40 |
| బహ్రెయిన్ దినార్ | 175.00 | 189.00 |
| కువైట్ దినార్ | 219.50 | 234.50 |
| సౌదీ రియాల్ | 17.50 | 19.30 |
| యూఏఈ దిర్హామ్ | 17.90 | 19.50 |

**చికెన్ ధరలు** (రూ.లలో)

| | |
|---|---|
| ఫారం ధర | 110.00 |
| రిటైల్ లైవ్ | 132.00 |
| డ్రెస్డ్ | 191.00 |
| స్కిన్‌లెస్ | 218.00 |

**నెక్ (వంద గుడ్లకు)** (రూ.లలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 415-00 |
| రంగారెడ్డి | 415-00 |
| మెదక్ | 415-00 |
| కరీంనగర్ | 418-00 |
| వరంగల్ | 418-00 |
| రిటైల్ ప్రైస్ | 4-75 |

# రూ.9,778 కోట్ల ఆస్తులు జప్తు

## ఆంధ్రా బ్యాంక్ రుణ ఎగవేత కేసులో ఈడీ దూకుడు

## విదేశాల్లోని ఆయిల్ రిగ్గులు, ఓడలు, ప్రైవేట్ జెట్ స్వాధీనం

**న్యూఢిల్లీ, జూన్ 26:**

స్టెర్లింగ్ బయోటెక్ బ్యాంక్ మోసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం భారీ స్థాయిలో ఆస్తులను జప్తు చేసింది. ఏకంగా దాదాపు రూ.10,000 కోట్ల స్థిర, చరాస్తులను అటాచ్ చేసింది. దీంతో ఇప్పటిదాకా వివిధ కేసుల్లో ఈడీ పెద్ద ఎత్తున జప్తు చేసిన ఆస్తుల జాబితాలో ఇది కూడా చేరింది. ఇక తాజాగా ఆటాచ్ చేసిన ఆస్తుల్లో అధికం విదేశాల్లోనే ఉండటం గమనార్హం. నైజీరియాలోని ఆయిల్ రిగ్గులు, ఓడలు, ఓ బిజినెస్ జెట్, లండన్‌లోని మరో ఖరీదైన ఫ్లాట్ తదితర ఆస్తులు.. ఈడీ స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయి. వీటన్నిటి విలువ రూ.9,778 కోట్లుగా ఓ ఈడీ సీనియర్ అధికారి అంచనా వేశారు. ఇప్పటికే ఈ కేసులో రూ.4,730 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దీంతో మొత్తం రూ.14,500 కోట్లకుపైగా ఆస్తులను స్వాధీన పర్చుకున్నట్లైంది. మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈ అటాచ్‌మెంట్లు జరిగినట్లు ఈడీ స్పష్టం చేసింది. కాగా, ఈ ఆస్తుల జప్తు కోసం మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ప్రొవిజనల్ ఆర్డర్‌నూ జారీ చేశామని ఈడీ తెలిపింది. ఆంధ్రా బ్యాంక్ నేతృత్వంలోని రుణదాతల కూటమి నుంచి స్టెర్లింగ్ బయోటెక్ రూ.5,383 కోట్లకుపైగా రుణాలను తీసుకుని ఎగవేసిందన్న ఆరోపణలున్నాయి. అసలు, వడ్డీ, జరిమానాలతో ఈ మొత్తం ప్రస్తుతం రూ.8,100 కోట్లకు చేరిందని, ఇది మొండి బకాయి (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)గా ఉన్నదని ఈడీ చెబుతున్నది. ఇక ఈ సంస్థ ప్రధాన ప్రమోటర్లు నితిన్ సందేసరా, చేతన్ సందేసరా, దీప్తీ సందేసరాలు పరారీలో ఉండగా, వీరికి బడా రాజకీయ నాయకులతో సంబంధాలున్నట్లు తెలుస్తున్నది. దీంతో ఈడీతోపాటు సీబీఐ ఈ కోణంలోనూ విచారణ చేస్తున్నాయి. నైజీరియా చమురు వ్యాపారానికి ఫైనాన్స్ చేయడానికేగాక, వ్యక్తిగత అవసరాలకూ ఈ రుణాల సొమ్మును సందేసరాలు వాడుకున్నట్లు ఈడీ చెబుతున్నది. దేశంలో 249, విదేశాల్లో 99 షెల్ కంపెనీలను స్టెర్లింగ్ బయోటెక్ ప్రధాన ప్రమోటర్లు సృష్టించారని తెలిపింది. సీబీఐ ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఓ క్రిమినల్ కేసునూ ఈడీ నమోదు చేసింది. ఇటు సంస్థ ఉద్యోగులను, అటు బ్యాంక్ అధికారులను మోసం చేశారన్నది. ప్రస్తుతం సందేసరాలు నైజీరియాలోనే ఉన్నట్లు సమాచారముందని ఈడీ అంటున్నది. మరోవైపు ఆదాయం పన్ను (ఐటీ) శాఖ సైతం అవినీతి, పన్ను ఎగవేతల అభియోగాలపై వివిధ నేర సెక్షన్ల కింద ఈ గుజరాత్‌లోని వడోదరకు చెందిన ఔషధ రంగ సంస్థపై దర్యాప్తు చేస్తున్నది.




**జప్తు చేసిన ఆస్తుల్లో..**

స్టెర్లింగ్ బయోటెక్ కేసులో ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో నైజీరియాలోని నాలుగు ఆయిల్ రిగ్గులు, 'ఓఎంఎల్ 143' అనే చమురు క్షేత్రం ఉన్నాయి. అలాగే పనామా నమోదిత 'తుల్జా భవానీ', 'వరిందా', 'భవ్య', 'బ్రాహ్మనీటిక్' అనే నాలుగు ఓడలున్నాయని ఈడీ ఓ ప్రకటనలో వివరించింది. అట్లాంటిక్ బ్లూ వాటర్ సర్వీసెస్ కంపెనీ కింద ఈ ఓడలు తిరుగుతున్నాయి. ఇక ఎస్‌ఏఐబీ ఎల్‌ఎల్‌సీ పేరుతో అమెరికాలో రిజిస్టరైన ఓ గల్ఫ్‌స్ట్రీమ్ జెట్ కూడా ఉన్నది. లండన్‌లోని ఓ ఖరీదైన అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను కూడా జప్తు చేసినట్లు ఈడీ పేర్కొన్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిబంధనలను ఉల్లంఘించి స్టాండ్‌బై లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎస్‌బీఎల్‌సీ)లను వాడుకుని రూ.4,500 కోట్లను స్టెర్లింగ్ బయోటెక్ ప్రమోటర్లు పొందారని ఈడీ తెలిపింది.

## పరేఖ్ అల్యూమినెక్స్‌పై ఈడీ దాడులు

**హైదరాబాద్‌లో రూ.47 కోట్ల విలువైన 47 ఎకరాల భూమి జప్తు**

Parekh Aluminex Limited

పరేఖ్ అల్యూమినెక్స్ లిమిటెడ్ సంస్థకు చెందిన 10 చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. పీఎంఎల్‌ఏ కింద ఈ సంస్థపై ఓ క్రిమినల్ కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. ముంబైకి చెందిన ఈ అల్యూమినియం రోల్స్ తయారీ కంపెనీపై ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ), ఇతరులను రూ.2,297 కోట్లు, ఫెడరల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లను దాదాపు రూ.390 కోట్లు మోసం చేసిందన్న ఆరోపణలున్నాయి. కాగా, హైదరాబాద్ శివారులో ఈ కంపెనీకి ఉన్న 47.39 ఎకరాల భూమిని ఈడీ జప్తు చేసింది. దీని విలువ సుమారు రూ.46.97 కోట్లుగా ఉంటుందని ఈడీ వెల్లడించింది.

**నిధుల దారి మళ్లింపు**

తయారీ రంగ కార్యకలాపాల నిమిత్తం పొందిన రుణాలను తయారీయేతర రంగాలకు మళ్లించిందని ఈడీ చెప్పింది. ఇలా సుమారు రూ.1,557.45 కోట్ల నిధులు వివిధ సంస్థల్లోకి దారి మళ్లాయని ఇప్పటిదాకా చేసిన తమ దర్యాప్తులో తేలినట్లు వివరించింది. ఈ కంపెనీపై సీబీఐ ఆరు క్రిమినల్ ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేయగా, ముంబై పోలీస్ శాఖలోని ఆర్థిక నేరాల విభాగం కూడా ఓ ఎఫ్‌ఐఆర్‌ను దాఖలు చేసిందని ఈడీ వర్గాలు ఓ ప్రకటనలో తెలియజేశాయి.

## హైదరాబాద్‌లో హోగార్ అసెంబ్లింగ్ ప్లాంట్

### పరిశోధన కేంద్రాన్ని కూడా ప్రారంభించిన అమెరికా కంపెనీ



**హైదరాబాద్, జూన్ 26:** అమెరికాకు చెందిన స్మార్ట్‌హోమ్, బిల్డింగ్ ఆటోమేషన్ పరికరాల తయారీ సంస్థ హోగార్ కంట్రోల్స్..హైదరాబాద్‌లో అసెంబ్లింగ్ ప్లాంట్‌ను ప్రారంభించింది. 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన ఈ యూనిట్ కోసం రూ.100 కోట్ల వరకు పెట్టుబడిగా పెట్టింది. యేటా 6 లక్షలకుపైగా ఉత్పత్తులు తయారవనున్న ఈ యూనిట్‌ను ప్రపంచ స్థాయి ఎలక్ట్రానిక్ తయారీ పరికరాల యూనిట్‌గా తీర్చిదిద్దినట్లు కంపెనీ సీఈవో విష్ణు రెడ్డి చెప్పారు. దేశీయ అవసరాల నిమిత్తం హైదరాబాద్‌లోనే పరిశోధన కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేసినట్లు, తద్వారా ఇక్కడి వారి ఆలోచనలు, అభిప్రాయాలకు తగ్గట్టుగా నూతన శ్రేణి ఉత్పత్తులను రూపొందించవచ్చునని ఆయన చెప్పారు. మెట్రో నగరాల్లో స్మార్ట్ పరికరాలకు విపరీతంగా డిమాండ్ ఉన్నదని, ముఖ్యంగా గృహాల నిర్మాణంలో ఆధునిక పరికరాలు అత్యంత కీలకంగా మారాయని, వీటికోసం ఎంతైనా ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ ప్లాంట్‌లో 70 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, ఈ ఏడాది చివరి నాటికి రెండింతలు పెంచే అవకాశం ఉందన్నారు. నూతన టెక్నాలజీతో వచ్చిన ఏ ఉత్పత్తికైనా ఆదరణ ఉంటుందన్న అంచనాతో ఈ నూతన శ్రేణి స్మార్ట్ పరికరాలను తయారు చేసినట్లు చెప్పారు.

**ఇక్కడి నుంచే ఇతర దేశాలకు ఎగుమతి**

ఈ యూనిట్‌లో తయారవనున్న ఉత్పత్తులను దేశీయంగా విక్రయించడంతోపాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసే ఆలోచనలో సంస్థ ఉన్నది. వచ్చే మూడేండ్లకాలంలో ఆసియాలోని మిగతా దేశాలకు, యూరప్, అమెరికా, కెనడా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు ఎగుమతి చేయాలనుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. హోగార్ బ్రాండ్‌తోనే విడుదల చేసిన 11 రకాల ఉత్పతులను వై-ఫై, బ్లూటూత్ ద్వారా కనెక్ట్ చేసుకోవచ్చును. దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టిన తమ సంస్థ.. తొలి ఏడాదిలోనే రూ.30 కోట్ల విక్రయాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

## ఐదేండ్లలో రూ.3,500 కోట్లు

### భారత్‌లో పెట్టుబడి పెట్టనున్న కూల్‌ప్యాడ్



**న్యూఢిల్లీ, జూన్ 26:** చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ కూల్‌ప్యాడ్ టెక్నాలజీ..భారత్‌లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించడానికి భారీ పెట్టుబడులకు సిద్ధమైంది. వచ్చే ఐదేండ్లకాలంలో 500 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్లు బుధవారం ప్రకటించింది. మన కరెన్సీలో ఇది రూ.3,500 కోట్లకు పైమాటే. ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని, అమ్మకాలను పెంచడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు కూల్‌ప్యాడ్ టెక్నాలజీస్ ఇండియా సీఈవో ఫిషర్ యువన్ తెలిపారు. దేశీయ మార్కెట్లోకి కూల్‌ప్యాడ్ కూల్ 3 ప్లస్ స్మార్ట్‌ఫోన్లను విడుదల కార్యక్రమంలో ఆయన భవిష్యత్తు పెట్టుబడులను ప్రకటించారు. ఎనిమిది నెలల తర్వాత తిరిగి ఆన్‌లైన్లో విక్రయాలను ప్రారంభించిన సంస్థ..బుధవారం విడుదల చేసిన రూ.5,999, రూ.6,499 విలువైన స్మార్ట్‌ఫోన్లు కూడా ఆన్‌లైన్లో మాత్రమే లభించనున్నాయన్నారు. ఇప్పటికే దేశీయంగా పదిలక్షల మొబైళ్లను విక్రయించిన సంస్థ..ఆన్‌లైన్ సంస్థ అమెజాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో ఈ ఏడాది చివరినాటికి విక్రయాలు 30 లక్షలకు చేరుకునే అవకాశం ఉన్నదన్నారు. 5.71 అంగుళాల టచ్‌స్క్రీన్ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్లో 13 మెగాపిక్సెల్ రియర్ కెమెరా, ముందుభాగంలో 8 మెగాపిక్సెల్ కెమెరా, మీడియా టెక్ 6761, క్వాడ్ కోర్ 2.0 గిగాహెడ్జ్ ప్రాసెసర్, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ కలిగిన ఈ ఫోను రెండు రకాల్లో లభించనున్నది. వీటిలో 2జీబీ ర్యామ్ కలిగిన ధర రూ.5,999గా నిర్ణయించిన సంస్థ, 3జీబీ ర్యామ్ మొబైల్‌ను రూ.6,499కి విక్రయిస్తున్నది.

## స్థానికంగానే భద్రపరుచాలి

### డాటా లోకలైజేషన్‌పై తేల్చి చెప్పిన ఆర్బీఐ ■ చెల్లింపుల వివరాలు భారత్‌లోనే ఉండాలని స్పష్టీకరణ



**ముంబై, జూన్ 26:** చెల్లింపులకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని దేశీయంగానే భద్రపరుచాలంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) స్పష్టం చేసింది. గూగుల్ తదితర విదేశీ సంస్థలకు చెందిన ఆన్‌లైన్ పేమెంట్ సర్వీసులు.. భారత్ వేదికగా నడుస్తున్న నేపథ్యంలో పేమెంట్ డాటా స్టోరేజీ తప్పక స్థానికంగానే ఉండాలని బుధవారం ఆర్బీఐ ప్రకటించింది. ఒకవేళ డాటా ప్రాసెసింగ్ విదేశాల్లో జరిగితే.. దాన్ని కూడా 24 గంటల్లోగా భారత్‌కు తీసుకురావాల్సిందేనని తేల్చి చెప్పింది. 'పేమెంట్ డాటాను పూర్తిగా దేశంలోనే నిల్వ చేయాలి' అని పేమెంట్ సిస్టమ్ ఆపరేటర్లు (పీఎస్‌వోలు) లేవనెత్తిన వివిధ అంశాలు అమలుపై విడుదల చేసిన ఎఫ్‌ఏక్యూలో ఆర్బీఐ చెప్పింది. భారత్‌లో ఓ వ్యవస్థను ఏర్పాటు చేసి అక్కడ మాత్రమే ఇక్కడి పేమెంట్ డాటా మొత్తాన్ని భద్రపరుచుకోవాలంటూ గతేడాది ఏప్రిల్‌లో 'స్టోరేజ్ ఆఫ్ పేమెంట్ సిస్టం డాటా'పై ఆర్బీఐ ఓ సూచన ఇచ్చిన విషయం తెలిసిందే. ఆరు నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలంటూ కూడా చెప్పింది.

**ఈ-కామర్స్ పాలసీలో భాగం చేయాలి**

ప్రతిపాదిత జాతీయ ఈ-కామర్స్ విధానంలో డాటా లోకలైజేషన్ నిబంధనలను అంతర్భాగం చేయాలని అఖిల భారత వర్తక, వ్యాపార సమాఖ్య (సీఏఐటీ).. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌కు విజ్ఞప్తి చేసింది. గత వారం గోయల్‌తో జరిగిన సమావేశంలో వివిధ ఈ-కామర్స్ సంస్థలు డాటా లోకలైజేషన్ అంశాన్ని ప్రస్తావించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఈ-కామర్స్ పాలసీ ముసాయిదాలో డాటా లోకలైజేషన్ నిబంధనను పేర్కొనాలని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ అన్నారు. ఏడాదిలోగా జాతీయ ఈ-కామర్స్ విధానాన్ని తీసుకొస్తామని కేంద్రం చెబుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే భాగస్వాములతో గోయల్ సంప్రదింపులు జరుపుతున్నారు.

**అన్ని నాణేలు చెల్లుతాయ్**

చలామణిలో ఉన్న అన్ని నాణేలు చెల్లుతాయని ఆర్బీఐ స్పష్టం చేసింది. కొన్ని నాణేల చెల్లుబాటుపై ప్రజల్లో నెలకొన్న గందరగోళం, అనుమానాలను నివృత్తి చేయడంలో భాగంగా బుధవారం పైవిధంగా రిజర్వ్ బ్యాంక్ స్పందించింది. 'వివిధ రకాల విలువల్లో ఉన్న కొన్ని నాణేలను కొందరు దుకాణదారులు, వినియోగదారులు తీసుకోవడానికి అయిష్టత చూపుతున్నట్లు గత కొద్ది నెలలుగా మాకు సమాచారం ఉన్నది. దీనివల్ల నాణేల చలామణి స్వేచ్ఛగా జరుగడం లేదు ' అని ఆర్బీఐ వివరించింది. నాణేల చెల్లుబాటుపై ఎలాంటి వదంతులను నమ్మవద్దని, సంశయం లేకుండా వాటిని ఇచ్చిపుచ్చుకోవచ్చని తెలిపింది. ప్రస్తుతం 50 పైసలు, రూపాయి, 2 రూపాయలు, 5 రూపాయలు, 10 రూపాయల విలువతో ఉన్న నాణేలు చలామణిలో ఉన్న విషయం తెలిసిందే. వీటిలో రూ.10 నాణేలను తీసుకునేందుకు కొందరు వెనుకాడుతున్న నేపథ్యంలో ఆర్బీఐ ఇలా ప్రకటించింది. నిజానికి గతంలోనూ ఈ తరహా ప్రకటననే ఆర్బీఐ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ నాణేలను ఆర్బీఐ చలామణిలోకి తీసుకొస్తుంది.

## మెరుపు తగ్గిన పసిడి

### రూ.300 దిగిన తులం ధర



**న్యూఢిల్లీ, జూన్ 26:** పసిడి మెరుపులు క్రమంగా తగ్గుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రెండ్, ప్రాంతీయ ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపకపోవడంతో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.300 తగ్గి రూ.34,170కి పరిమితమైనట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. పసిడితోపాటు వెండి మరింత దిగజారింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో కిలో వెండి ధర రూ.500 దిగొచ్చి రూ.38,700కి జారుకున్నది. అతి విలువైన లోహాలకు డిమాండ్ లేకపోవడం వల్లనే ధరలు దిగొచ్చాయని బంగారం వర్తకుడు వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో మంగళవారం ఆరేండ్ల గరిష్ఠ స్థాయిని తాకిన ధరలు ఆ మరుసటి రోజు ఔన్స్ గోల్డ్ ధర 1,408.57 డాలర్లకు తగ్గగా, వెండి 15.22 డాలర్ల వద్ద ముగిసింది.

**మూడేండ్ల కనిష్ఠస్థాయికి డిమాండ్!**

గరిష్ఠ స్థాయికి అతి విలువైన లోహాల ధరలు చేరుకోవడంతో కొనుగోలు చేయడానికి ప్రజ లు జంకుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటి వరకు పసిడి డిమాండ్ 10 శాతం తగ్గి మూడేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోందని ఓ సర్వేలో వెల్లడించింది. పసిడి వినిమయంలో రెండో అతి పెద్ద దేశమైన భారత్‌లో కొనుగోళ్లు భారీగా నిలిచిపోయాయని పేర్కొంది. 2018 లో వినిమయం 1.5 శాతం తగ్గి 760.4 టన్నులకు జారుకున్నది.

## గిరిజన ఔత్సాహికులకు దన్ను

### సీఎం ఎస్టీ పారిశ్రామికవేత్తల పథకానికి కార్యరూపం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అత్యున్నత అవకాశాలు కల్పించడానికి సీఎం కేసీఆర్ నడుం బిగించారు. 'సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అండ్ ఇన్నోవేషన్' అనే పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని, ఆ మేరకు బడ్జెట్ కేటాయింపులు కూడా జరిగాయని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా బుధవారం ఇక్కడ తెలిపారు. కాగా, ఈ పథకంలో భాగంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ.. 100 మంది గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మూడు నెలలు శిక్షణ ఇస్తుంది. అలాగే ఆసక్తి గల రంగాల్లో వ్యాపారాలు చేయాలనుకునేవారికి ఎస్బీఐ సమన్వయంతో ప్రాజెక్టు రిపోర్టులను తయారు చేయిస్తుంది. వీటిని ఎక్కా నేతృత్వంలో ఏర్పాటైన రాష్ట్ర స్థాయి ఉన్నత కమిటీనే ఆమోదిస్తుంది. బుధవారం హైదరాబాద్‌లో ఈ కమిటీనే సమావేశమై 24 మంది గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వివరణాత్మక ప్రతిపాదనలు విని, చర్చించి ఆమోదించింది. ప్రతిపాదిత పెట్టుబడులకు రాయితీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తే.. బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయని ఎక్కా తెలియజేశారు.

## ఆటోపై జీఎస్టీ తగ్గితే వృద్ధికి ఊతం: మహీంద్రా



**న్యూఢిల్లీ, జూన్ 26:** ఆటోమొబైల్స్‌పై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గితే.. దేశ ఆర్థిక వ్యవస్థకు అది లాభిస్తుందని మహీంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహీంద్రా అన్నారు. గత కొంతకాలంగా వాహన విక్రయాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో జీఎస్టీ భారం దిగాల్సిన అవసరం ఉందని బుధవారం ఆయన ట్విట్టర్‌లో అభిప్రాయపడ్డారు. గత నెల మేలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 18 ఏండ్ల కనిష్ఠాన్ని తాకిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే విద్యుత్ ఆధారిత వాహనాల పూర్తిస్థాయి వినియోగం అనేది ప్రణాళికాబద్ధంగా జరుగాలని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. 2025కల్లా టూవీలర్లు, త్రీవీలర్లు ఎలక్ట్రిక్ ఆధారంగానే నడువాలన్న నీతి ఆయోగ్ సిఫార్సుపై ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు.

## రాయితీలు ఇవ్వండి..

### సోలార్ మాడ్యూల్ తయారీదారులు



సోలార్ మాడ్యూల్ తయారీదారులు కూడా వచ్చే బడ్జెట్‌పై గంపెడు ఆశ పెట్టుకున్నారు. వచ్చే గురువారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో తమకు రాయితీలు ఇవ్వాలని, దిగుమతి సుంకం ఎత్తివేయాలని, వడ్డీని ఉపసంహరించాలని, తరుగుదల ప్రయోజనాలు కల్పించాలని ఆల్ ఇండియా సోలార్ ఇండస్ట్రీస్ అసోసియేషన్(ఏఐఎస్ఐఏ) వర్గాలు కోరుతున్నాయి. సోలార్ మాడ్యుల్స్ తయారీని ప్రోత్సహించడానికి ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని అప్పుడే ఇండస్ట్రీ బాగుపడనున్నదని ముందస్తు-బడ్జెట్ సిఫారస్సుల్లో భాగంగా ఈ సూచనలు చేసింది. విద్యుత్, క్యాపిటల్, వడ్డీ, ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న పరికరాలపై దిగుమతి సుంకాన్ని ఎత్తివేయాలని కేంద్రానికి అందించిన నివేదికలో పేర్కొన్నాయి. అలాగే ఎగుమతులను ప్రోత్సహించడంలో భాగంగా పరికరాలపై ఇస్తున్న 2 శాతం రాయితీలను కనీసంగా 10 శాతానికి పెంచాలని కోరుతున్నాయి. తద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మేక్ ఇన్ ఇండియాకు ఊతమిచ్చినట్లు అవుతున్నదని పేర్కొంది. గతేడాది సోలార్ మాడ్యుల్స్ తయారీదారులకు మరిచిపోలేని సంవత్సరంగా నిలిచిపోయిందని, ముఖ్యంగా చైనా, మలేషియా దేశాల నుంచి చౌక ధర కలిగిన ఉత్పత్తులు దిగుమతి అవడంతో దేశీయ పరిశ్రమ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొన్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సోలార్ మాడ్యుల్స్‌ను 18 సంస్థలు ఉత్పత్తి చేసి, విక్రయిస్తున్నాయి

## రూ.5 లక్షల కోట్లకు ప్లాస్టిక్ పరిశ్రమ!

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి పలు రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ వాడకం మాత్రం తగ్గడం లేదు. 2025 నాటికి ఈ రంగం రూ.5 లక్షల కోట్ల స్థాయికి చేరుకోనున్నదని ప్లాస్టిక్ ఇండస్ట్రీ బాడీ అంచనావేస్తున్నది. ప్రస్తుతం రూ.2.25 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ఈ పరిశ్రమతో 45 లక్షల మంది ఉపాధి పొందుతున్నట్లు ఆల్-ఇండియా ప్లాస్టిక్ తయారీదారుల సంఘం తెలిపింది. మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్‌పై నిషేధం విధించడంతో స్వల్పంగా విజయం సాధించారు. 2022 నాటికి కేంద్ర ప్రభు త్వం కూడా ప్లాస్టిక్‌పై నిషేధం విధించేయోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఒకవేళ ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తే సరఫరా వ్యవస్థ దెబ్బతిననున్నదని, ముఖ్యంగా దేశవ్యాప్తంగా 50 వేల తయారీ యూనిట్లు మూతపడి లక్షలాది మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నదని వ్యాఖ్యానించింది.




## పసిడి దిగుమతిపై సుంకాన్ని తగ్గించండి

### జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌పై పారిశ్రామిక వర్గాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ బడ్జెట్‌లోనైనా పసిడి దిగుమతిపై విధిస్తున్న సుంకాన్ని నాలుగు శాతానికి తగ్గించాలని జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ రంగ ప్రముఖులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దిగుమతి సుంకాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచడంతో అక్రమ రవాణా ఊపందుకున్నదని, దీంతో వెంటనే సుంకాన్ని 10 శాతం నుంచి నాలుగు శాతానికి తగ్గించాలని ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యూవెల్లరీ డొమెస్టిక్ కౌన్సిల్(జీజేసీ) వర్గాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. కరెంట్ ఖాతా లోటు(క్యాడ్) అధీనంలోకి రావడంతో అతి విలువైన లోహాలపై విధిస్తున్న దిగుమతి సుంకాన్ని నాలుగు శాతానికి తగ్గించాలని జీజేసీ చైర్మన్ అనంత పద్మనాభన్ డిమాండ్ చేస్తున్నారు. అలాగే డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా బ్యాంక్ కమిషన్లను ఎత్తివేయడం లేదా 0.20 శాతానికి తగ్గించాల్సిన అవసరం ఉన్నదని ఆయన సూచించారు. 2019-20 ఏడాదికిగాను వచ్చే నెల 5న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్‌కు జీజేసీ కోర్కెల చిట్టా...




- ప్రస్తుతం క్రెడిట్ కార్డు లావాదేవీపై ఒక్కో బ్యాంక్ 11.5 శాతం కమిషన్‌ను వసూలు చేస్తుండటంతో ఆభరణాల ధరలు పెరిగి కొనుగోలుదారులపై భారం పడుతున్నదన్నారు.
- క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్‌ను ఎత్తివేసి ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్న ఆభరణాల రంగాన్ని ఆదుకోవాలని సూచించింది.
- జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఇండస్ట్రీకి ఇచ్చే ఈఎంఐ కాలపరిమితిని పొడిగించాలని కోరుతున్నది.
- పాన్ కార్డు పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి
- పెళ్లి కూతురుకు సంబంధించిన మంగళసూత్రం, నాలుగు గాజులు, చిన్న ముక్కుపుల్ల, ఉంగరం కలిపి మొత్తం 100 గ్రాముల కంటే అధికంగా ఉంటుంది. వీటి విలువ రూ.3-4 లక్షల లోపు ఉంటుంది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి చెందిన వారిలో అత్యధిక మంది వద్ద పాన్ కార్డు లేకపోవడంతో వీరు ఆభరణాలు కొనుగోలు చేయడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.
- పాలిష్ డైమండ్లపై విధిస్తున్న దిగుమతి సుంకాన్ని 7.5 శాతం నుంచి 2.5 శాతానికి తగ్గించాలి.
- విదేశీ మైనింగ్ కంపెనీలు నేరుగా ట్రేడింగ్ జరుపడానికి అనుమతిని ఇవ్వాలి.
- డైమండ్ల హబ్‌గా కొనసాగుతున్న సూరత్‌ను ప్రత్యేక జోన్‌గా గుర్తించాలి.

## బ్యాంకులకు ఆ వివరాలివ్వండి

### రుణ ఎగవేతదారుల ఆస్తులు, ఖాతాలపై ఐటీ శాఖకు సీబీడీటీ సూచన

**న్యూఢిల్లీ, జూన్ 26:** రుణ ఎగవేతదారుల ఆస్తులు, ఖాతాల వివరాలను బ్యాంకులతో పంచుకోవాలని ఆదాయం పన్ను (ఐటీ) శాఖకు ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) సూచించింది. బ్యాంక్ రుణాలను ఎగ్గొడుతున్న వ్యక్తులు, సంస్థల నుంచి ప్రజాధనాన్ని తిరిగి వసూలు చేయడంలో భాగంగా ఈ మేరకు బుధవారం ఆదేశించింది. దీంతో మదుపరుల ఐటీ రిటర్నుల నుంచి ఇకపై ఈ సమాచారాన్ని ఐటీ శాఖ సేకరించనున్నది. కాగా, రుణ ఎగవేతదారుల స్థిరాస్తుల వివరాలను చెప్పాలంటూ ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి పెద్ద ఎత్తున వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రజా ప్రయోజనార్థమే సీబీడీటీ తాజా ఆదేశాలను జారీ చేసింది. దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికినే మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) ప్రశ్నార్థకం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రుణ ఎగవేతదారుల భరతం పట్టడానికి బ్యాంకులకు ఇతోధికంగా సాయం చేయాలని సీబీడీటీ ఈ నిర్ణయానికొచ్చింది. అయితే ఈ వివరాలు దుర్వినియోగం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఐటీ శాఖ అధికారులకు సీబీడీటీ చెప్పింది.

## చిన్నారి వరేణ్య చికిత్సకు
# సింగపూర్ తెలుగువారి సాయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి వరేణ్య (6)కు సాయం అందించడానికి సింగపూర్‌వాసులు ముందుకొచ్చారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం పిప్రికి చెందిన దుర్గి నరేందర్‌గౌడ్ కుమార్తె వరేణ్య తీవ్రమైన మైలాయిడ్ లుకేమియా వ్యాధితో బాధపడుతున్నది. అత్యవసరంగా కీమోథెరపీ చేయించాలని డాక్టర్లు సూచించారు. తమ చిన్నారిని కాపాడాలని పేద తల్లిదండ్రులు పలువురిని వేడుకున్నారు. విషయం తెలుసుకున్న సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు జ్యోతీశ్వర్‌రెడ్డి చొరవతో విరాళాలు ఇవ్వడానికి గ్రూపు సభ్యులు ముందుకొచ్చారు. రూ.3 లక్షలను చిన్నారి చికిత్స కోసం తండ్రికి విరాళంగా అందించారు. విరాళాలు అందించిన వారికి తండ్రి నరేందర్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. వరేణ్య చికిత్సకు మరింత డబ్బు అవసరం ఉందని, ఇంకా దాతలు సాయంచేయాలని తండ్రి బ్యాంక్ ఖాతా వివరాలు తెలిపారు. ఎస్బీఐ, భీమ్‌గల్‌శాఖ ఖాతా నంబర్ 62168175707, ఐఎఫ్‌ఎస్సీ కోడ్ ఎస్బీఐఎన్0020374కు సాయం డబ్బులు పంపాలని కోరారు.



చిన్నారులకు నోట్‌పుస్తకాలను అందజేస్తున్న టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు

# పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు

**వెంగళరావునగర్:** క్రమశిక్షణ, పట్టుదలతో చదివి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. టీఎస్ఎస్పీడీసీఎల్ బంజారాహిల్స్ విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, జామెట్రీ బాక్సులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఉపవిద్యాశాఖ అధికారి చిరంజీవితో కలిసి సీఎండీ ప్రభాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతోనే గొప్పవారిగా ఎదుగుతారని, విద్యను కష్టపడి కాకుండా, ఇష్టపడి చదివి ఉన్నతి సాధించాలని సూచించారు. జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉంటూ నాణ్యమైన, గుణాత్మకమైన విద్యనందించి వారి ఉజ్వల భవితకు బంగారు బాటలువేసేది గురువులేనని ఉపవిద్యాశాఖ అధికారి చిరంజీవి అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సరస్వతమ్మ, రత్నకుమారి, ఉపాధ్యాయులు సింహాచలం, హేమలత, బంజారాహిల్స్ విద్యుత్ శాఖ డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



# సమిష్టి కృషితోనే సింగరేణి విజయం

శిక్షణ ఐఏఎస్‌లతో సింగరేణి సీఎండీ శ్రీధర్



బుధవారం హైదరాబాద్‌లో సింగరేణి సంస్థ సీఎండీ శ్రీధర్‌తో ట్రైనీ ఐఏఎస్ అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి దేశంలోని మహారత్న కంపెనీలకు సమానంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోపాటు సింగరేణీయుల సమిష్టి కృషే ప్రధానకారణమని ఆ సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ చెప్పారు. దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థలో లేనన్ని సంక్షేమ కార్యక్రమాలు సింగరేణిలో అమలవుతున్నాయన్నారు. ట్రైనీ ఐఏఎస్‌లతో బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి ఐదేండ్ల కాలంలో సాధించిన విజయాలను స్ఫూర్తిదాయకంగా వివరించారు. ఏటా 660 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితోపాటు 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో దేశాభివృద్ధికి తోడ్పడుతున్నట్టు తెలిపారు. 129 ఏండ్ల చరిత్ర గల సింగరేణి గత ఐదేండ్లలో మునుపెన్నడూ లేనంతగా వృద్ధి చెందిందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఎస్ చంద్రశేఖర్, ఎన్ బలరాం, జీఎం ఆంటోనిరాజా పాల్గొన్నారు. ట్రైనీ ఐఏఎస్‌ల బృందం లో అనుదీప్ దురిశెట్టి, కోయ శ్రీహర్ష, అభిలాష అభినవ్, కుమార్ దీపక్, బోర్ఖాడే హేమంత్ సహదేవ్‌రావ్, మసంద మార్గ్దలిన్ పెర్టిన్, తేజస్ నందలాల్ పవార్, ఆదర్శ్ సురభి ఉన్నారు.



అగ్రి వర్సిటీ భూముల్లో తోటల పెంపకం కోసం వీసీ ప్రవీణ్‌రావు సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలుచేస్తున్న రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, ఐటీసీ పేపర్‌బోర్డ్స్‌సీఈవో సంజయ్‌సింగ్

# వ్యవసాయ వర్సిటీ భూముల్లో తోటల పెంపకం

- ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ కళాశాల ఖాళీ భూముల్లో అటవీ సాగులో భాగంగా తోటలు పెంచాలని వర్సిటీతోపాటు ఆగ్రోఫారెస్ట్రీ ప్లాంటేషన్స్, ఐటీసీ లిమిటెడ్ నిర్ణయించాయి. వర్సిటీ వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు సమక్షంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్, ఐటీసీ లిమిటెడ్ పేపర్‌బోర్డ్స్, స్పెషాలిటీ పేపర్స్ డివిజన్ సీఈవో సంజయ్‌సింగ్ బుధవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ప్రాథమికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో, మహబూబాబాద్ మల్యాల కృషి విజ్ఞానకేంద్రంలో అటవీ వ్యవసాయం చేపట్టాలని వీసీ సూచించారు. సమావేశంలో ఐటీసీ లిమిటెడ్ పేపర్‌బోర్డ్స్, స్పెషాలిటీ పేపర్స్ డివిజన్ సీఈవో సంజయ్‌సింగ్, ఐటీసీ ప్రతినిధి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో పీసీఐ చైర్మన్ జస్టిస్ చంద్రమౌళికుమార్ ప్రసాద్ నేతృత్వంలో కేసులను విచారిస్తున్న సభ్యులు

## జర్నలిస్టుల సంక్షేమ నిధికి..
# రూ.25 లక్షలు చెల్లించండి

- పెయిడ్ న్యూస్ కేసులో డీసీకి పీసీఐ ఆదేశం
- 19 కేసుల విచారణ.. 11 కేసుల్లో తీర్పు వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 19 కేసులను విచారించిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ).. 11 కేసుల్లో తీర్పునిచ్చింది. పీసీఐ చైర్మన్ జస్టిస్ చంద్రమౌళికుమార్ ప్రసాద్ నేతృత్వంలో సభ్యులు తొలిరోజు బుధవారం హరితప్లాజా హోటల్‌లో కేసులను విచారించారు. దక్కన్ క్రానికల్ (డీసీ) పెయిడ్ న్యూస్ ప్రచురించిందని నిర్ధారించారు. కేసు విచారణ సందర్భంగా పెయిడ్ న్యూస్‌కు సంస్థ ఎంత తీసుకున్నదని డీసీ ప్రతినిధిని పీసీఐ ప్రశ్నించింది. దానికి డీసీ ప్రతినిధి సుమారు రూ.25 లక్షల వరకు అవుతుందని సమాధానం ఇచ్చారు. ఆ మొత్తాన్ని ఏదైనా జర్నలిస్టు సంక్షేమ నిధికి ఇవ్వాలని, దీనిపై యాజమాన్యాన్ని అడిగి సమాధానం చెప్పాలని కేసును గురువారానికి వాయిదా వేసింది. తమిళనాడులో ఒక పత్రిక కార్టూనిస్ట్ మీద క్రిమినల్ కేసులు నమోదుచేయడం సరి కాదని పేర్కొన్నది. తమిళనాడుకు చెందిన ఫొటోగ్రాఫర్ కేఆర్ సుబ్రమణ్యం ఒక ధర్నాలో ఫొటోలు తీస్తుండగా కెమెరాను పగులగొట్టిన విషయంలో రూ.50 వేలు చెల్లించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. గురువారం రెండోరోజు సైతం పీసీఐ విచారణను కొనసాగించనున్నది.

# హాస్టళ్లలో పెరిగిన పర్యవేక్షణ

సన్నబియ్యంతో భోజనంతో పెరిగిన విద్యార్థుల సంఖ్య

టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి



తెలంగాణ వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి రామారావు, కార్యదర్శి హాషీం గౌస్‌లను సన్మానిస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో పర్యవేక్షణ పెరిగిందని, సన్నబియ్యంతో భోజనం పెడుతుండటంతో విద్యార్థుల సంఖ్య కూడా ఎక్కువైందని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం (టీఎన్జీవో అనుబంధం) రాష్ట్ర కార్యవర్గ సమావేశం టీఎన్జీవోభవన్‌లో బుధవారం జరిగింది. అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన తుమ్మలపల్లి రామారావు, కార్యదర్శిగా సంగారెడ్డికి చెందిన హాశీం గౌస్‌ను నియమించారు. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, సిటీ అధ్యక్షుడు రాయకంటి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట జిల్లా టీఎన్జీవో కార్యవర్గం ఎన్నిక**

టీఎన్జీవో సూర్యాపేట జిల్లా కార్యవర్గాన్ని అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ ప్రకటించారు. యూనియన్ కార్యదర్శిగా శ్యామ్, పబ్లిసిటీ సెక్రటరీగా అనంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేశ్, సంయుక్త కార్యదర్శిగా రమేశ్, కార్యాలయం కార్యదర్శిగా విక్రమ్‌ను నియమించారు.

# వైద్యసేవల్లో తెలంగాణ ముందంజ

- సత్ఫాలిస్తున్న ప్రభుత్వ చర్యలు
- నీతి ఆయోగ్ నివేదికతో మరింత ఉత్సాహం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆరోగ్య తెలంగాణ సాధనదిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రభుత్వ వైద్యసేవలను విస్తృతంచేసి, పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు చేపట్టిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. రాష్ట్రంలో కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభించిన నాటినుంచి ప్రభుత్వ దవాఖానల్లో ప్రసూతి సంఖ్య పెరుగుతున్నది. నవజాత శిశువుల మరణాలు, ఐదేండ్లలోపు చిన్నారుల మరణాలు తగ్గుముఖం పట్టాయి. నీతి ఆయోగ్ విడుదలచేసిన తాజా నివేదిక కూడా ఇదే అంశాన్ని స్పష్టంచేసింది. దవాఖానల్లో ప్రసూతిసేవలు అందించడంలో తెలంగాణకు దేశంలోనే మొదటిస్థానం దక్కింది. నీతి ఆయోగ్, ప్రపంచబ్యాంకు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమమంత్రిత్వశాఖ సంయుక్తంగా హెల్త్‌స్టేట్స్ ప్రోగ్రెసివ్ ఇండియా పేరిట పలు అంశాల్లో నివేదికను రూపొందించింది. ఆయా రాష్ట్రాల్లో అందుతున్న వైద్యసేవల ఆధారంగా రాష్ట్రాలవారీగా ర్యాంకులను నిర్ణయించారు. తెలంగాణలో దవాఖానల్లో ప్రసవాల నమోదు 2015-16లో 85.4శాతం ఉండగా.. 2017-18లో 91.68శాతానికి పెరిగి దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. వైద్య, ఆరోగ్య సేవల్లో భాగంగా అన్నిరకాల వైద్య సేవల్లో రాష్ట్రం దేశంలో పదో స్థానాన్ని సాధించింది.




**వివిధ అంశాలపై దేశవ్యాప్త నివేదిక**

నీతి ఆయోగ్ ద్వారా ఆయా రాష్ట్రాల్లో అందిస్తున్న వైద్యసేవల ఆధారంగా ర్యాంకులు నిర్ధారించారు. అందులో ప్రధానంగా నవజాత శిశుమరణాలు, ఐదేండ్లలోపు చిన్నారుల మరణాలు, కుటుంబనియంత్రణ, తక్కువ బరువుతో శిశువుల జననం, స్త్రీ-పురుష నిష్పత్తి, క్షయవ్యాధి చికిత్సలో విజయాలు, ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యతా ప్రమాణాల గుర్తింపు, జాతీయ ఆరోగ్య మిషన్ పథకాల నిధుల వినియోగం, రోగనిరోధక టీకాలు, శిశుజననాల నమోదు, సర్కారు దవాఖానల్లో ప్రసవాలు వంటి 23 అంశాల ఆధారంగా వైద్యసేవలకు మార్కులు నిర్ణయించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పనితీరుపై రూపొందించిన నివేదికను తాజాగా నీతిఆయోగ్ విడుదలచేసింది. 2015-16 నుంచి 2017-18 మధ్య వైద్య, ఆరోగ్య సేవల్లో పనితీరును పరిగణనలోకి తీసుకొన్నది. అందులో దేశంలోని రాష్ట్రాల్లోకెల్లా అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన కేరళ రాష్ట్రం తొలిస్థానాన్ని కైవసం చేసుకొన్నది.

**నీతిఆయోగ్ నివేదిక ప్రకారం ఆయా అంశాల్లో తెలంగాణ రాష్ట్రానికి దక్కిన ర్యాంకుల వివరాలు**

- ప్రభుత్వ దవాఖానల్లో ప్రసూతి సేవల్లో తెలంగాణ ముందంజలో నిలిచింది.
- క్షయవ్యాధిని గుర్తించడం, మైక్రోబయాలజీ విభాగం ద్వారా 90.40శాతం విజయవంతంగా టీబీకి చికిత్స అందించడంలో రెండోస్థానంలో నిలిచింది.
- ఏటా మెరుగుపడుతున్న వైద్యసేవలకుగాను ఆరోస్థానాన్ని దక్కించుకున్నది.
- అన్నిరకాల వైద్యసేవల్లో 2015-16లో 62.57 మార్కులతో 11వ స్థానంలో ఉండగా, 2017-18లో 64.80 మార్కులతో 10స్థానానికి చేరింది.
- 2016లో నవజాత శిశు మరణాల సంఖ్య ప్రతి వెయ్యి జననాలకు 23 ఉండగా 2017లో ఆ సంఖ్య 21కి తగ్గింది.
- ఐదేండ్లలోపు చిన్నారుల మరణాల్లో 2016లో ప్రతి వెయ్యి జననాలకు తెలంగాణలో 34 నమోదయ్యాయి.
- తెలంగాణలో ఇమ్యునైజేషన్ 90.31శాతంగా నమోదైంది.



## టీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే
# వీవోఏలకు గుర్తింపు

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే వీవోఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్)లకు గుర్తింపు వచ్చిందని వీవోఏల సంఘం గౌరవాధ్యక్షుడు, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ రూప్‌సింగ్ అన్నారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం మంచికంటి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రూప్‌సింగ్ మాట్లాడుతూ.. శ్రీనిధి బ్యాంకు స్నేహ పేరుతో నియమించే సిబ్బందితో వీవోఏలకు ఎటువంటి ప్రమాదం లేదని, పైగా మరింత మేలు జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వాలు వీవోఏలను గుర్తించలేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం గుర్తించి నెలకు రూ.3 వేల గౌరవవేతనాన్ని అమలు చేస్తుందని తెలిపారు. సమావేశానికి వివిధ జిల్లాల వీవోఏలు హాజరయ్యారు.

# పూర్తయిన ప్రజావేదిక కూల్చివేత

- స్టేకు నిరాకరించిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానది కరకట్టపై మాజీ సీఎం చంద్రబాబు నివాసాన్ని ఆనుకొని నిర్మించిన ప్రజావేదిక భవనం కూల్చివేత దాదాపుగా పూర్తయింది. మంగళవారం సాయంత్రం మొదలైన కూల్చివేత ప్రక్రియ బుధవారం సాయంత్రం వరకు కొనసాగింది. ప్రజావేదిక కూల్చివేతను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ప్రకాశం జిల్లాకు చెందిన పోలూరి శ్రీనివాసరావు మంగళవారం రాత్రి హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలుచేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రజావేదిక అక్రమ నిర్మాణమేనంటూ తన వ్యాజ్యంలో పలుమార్లు పేర్కొనడంతో ఆ భవనం అక్రమమా? కాదా? అని పిటిషనర్‌ను కోర్టు ప్రశ్నించింది. అక్రమమేనంటూ పిటిషనర్ అంగీకరించడంతో అలాంటప్పుడు ఇందులో ప్రజాప్రయోజనం ఏముందని ప్రశ్నించింది. కూల్చివేతను నిలిపివేస్తూ స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ శ్రీరాం వాదనలు వినిపించారు.

ఏపీలో ప్రజావేదిక భవనం కూల్చివేత దృశ్యం



## విద్యార్థులకు
# 'గ్రీన్ స్కూల్' పోటీలు

- ఐజీబీసీ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యార్థుల్లో హరిత సూత్రాలపై అవగాహన పెంచేందుకు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) జాతీయస్థాయిలో 'గ్రీన్ యువర్ స్కూల్' పోటీలను నిర్వహిస్తున్నది. 8 నుంచి 10 తరగతుల విద్యార్థులు హరిత సూత్రాలపై ఆలోచనలను తెలుపాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లో జరిగే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్‌లో మొదటి మూడు స్కూళ్లవారు తమ ఆలోచనల్ని వివరించే అవకాశం కల్పిస్తారు. పాఠశాలకు రూ.4 లక్షల చొప్పున నగదు బహుమతిని ఇస్తారు. మిగతా ఐదు స్కూళ్లకు రూ.1.5 లక్షల చొప్పున అందిస్తారు. పోటీలో పాల్గొనాలని ఆశించే స్కూళ్లు జూలై 15లోగా ఇం డియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వద్ద నమోదు చేసుకోవాలి. ఆగస్టు 30లోగా తమ ఆలోచనల్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమర్పించాలి. వివరాలకు 040-44185127లో సంప్రదించాలి.

## అంతర్జాతీయ ప్రమాణాలతో
# విద్యనందించాలి

- టెమ్రీస్ టీచర్ల వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో కార్యదర్శి షఫీఉల్లా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యను బోధించాలని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ (టెమ్రీస్) కార్యదర్శి షఫీఉల్లా సూచించారు. 34 మంది టెమ్రీస్ ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్, న్యూఢిల్లీలోని యూ ఎస్ ఎంబసీ, టెమ్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన 'కమ్యూనికేటివ్ లాంగ్వేజ్ టీచింగ్'పై రెండ్రోజుల వర్క్‌షాపు బుధవారం ముగిసింది.

# 2,636 కోట్లు రికవరీ చేయండి



- విద్యుత్, ఇంధనశాఖ సమీక్షలో అధికారులకు ఏపీ సీఎం జగన్ ఆదేశం
- అక్రమాలపై క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు
- ఆరునెలల్లోగా నివేదిక సమర్పించాలని నిర్ణయం
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై జగన్ సమీక్ష
- మూడునెలల్లోగా నివేదిక ఇవ్వాలని కమిటీ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని, బిడ్డింగ్ ధరల కన్నా అధిక రేట్లకు కొనడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.2,636 కోట్ల నష్టం వాటిల్లిందని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. వెంటనే ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. అసలు బిడ్డింగ్ ధరల కన్నా అధిక రేట్లకు ఎందుకు కొనుగోలుచేశారని అధికారులను ప్రశ్నించారు. సోలార్, పవన విద్యుత్ సంస్థలతో తిరిగి సంప్రదింపులు జరుపాలని, సంస్థలు దారికి రాకపోతే ఒప్పందాలు రద్దు చేయాలని బుధవారం విద్యుత్, ఇంధనశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో జగన్ సూచించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం చేపట్టిన ప్రధాన పాలసీలు, ప్రాజెక్టులను సమీక్షించేందుకు ఐదుగురు మంత్రులు, ఒక సీనియర్ ఐఏఎస్ అధికారితో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటుచేశారు. మొత్తం 30 అంశాలపై ఈ కమిటీ అధ్యయనం చేసి ఆరు నెలల్లోగా నివేదిక సమర్పించాలని సీఎం జగన్ సూచించారు. ఇకపై జరిగే విద్యుత్ ఒప్పందాలు పారదర్శకంగా ఉండాలన్నారు.

**నేటినుంచి రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా**

ఆంధ్రప్రదేశ్‌లో గురువారం నుంచి 60 శాతం ఫీడర్లలో వ్యవసాయ పంపుసెట్లకు తొమ్మిది గంటలపాటు పగటి పూట నిరంతర విద్యుత్ అందించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. మిగిలిన 40 శాతం ఫీడర్లకు రూ.1700 కోట్లు విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఫీడర్లలో పనులు వేగంగా పూర్తిచేయాలని, 2020 జూలై 30 నాటికి మిగిలిన 40 శాతం ఫీడర్ల కింద కూడా తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వాలని ఆదేశించారు.

**ఆర్టీసీ విలీనంపై ఏపీ సీఎం జగన్ సమీక్ష**

ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకుగాను ఏపీ ప్రభుత్వం నియమించిన కమిటీ తన కసరత్తును మొదలుపెట్టింది. ఇందులో భాగంగా బుధవారం తొలిసారి భేటీ అయిన కమిటీ.. అంతకుముందు సీఎం జగన్‌ను కలిసింది. ఈ సందర్భంగా ఏపీ సీఎం జగన్.. పలు అంశాలపై సూచనలు చేశారు. దేశంలోనే ఏపీఎస్ ఆర్టీసీని అత్యుత్తమంగా నిలపాలన్నదే తమ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా అధ్యయనంచేసి నిర్దేశిత మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు.

**సీఆర్‌డీఏపై ఏపీ సీఎం జగన్ సమీక్ష**

ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్‌డీఏ)పై ఏపీ సీఎం జగన్ బుధవారం ఉదయం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతి పరిధిలోని అక్రమ నిర్మాణాలు, బలవంతపు భూసమీకరణతోపాటు రాజధాని నిర్మాణాలకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు.

# పీపీలు సమన్వయంతో పనిచేయాలి

- పబ్లిక్ ప్రాసిక్యూటర్ల శిక్షణ శిబిరంలో ఎన్‌ఐఏ డీజీ యోగేశ్‌చంద్ర మోదీ




బుధవారం హైదరాబాద్‌లోని నల్సార్ లా వర్సిటీలో ఎన్‌ఐఏ ప్రాసిక్యూటర్స్ ఐదురోజుల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శాంతి

**శామీర్‌పేట:** క్రిమినల్ కేసుల విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పీపీ) ఇన్వెస్టిగేషన్ అధికారితో ఉంటూ పనిచేసినట్లయితే సరైన సాక్ష్యాలు సేకరించడం సులభమవుతుందని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ) డైరెక్టర్ జనరల్ యోగేశ్‌చంద్ర మోదీ, సమన్వయకర్త కేవీకే శాస్త్రి చెప్పారు. ఎన్‌ఐఏ కేసుల్లో 93 శాతం శిక్షలు ఖరారు కావడం కేవలం పీపీల కార్యదీక్షత, వృత్తిపట్ల వారికున్న నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో నల్సార్-ఎన్‌ఐఏ సౌజన్యంతో ఎన్‌ఐఏలోని పీపీలకు న్యాయ సాధికారత అంశాలపై ఐదురోజుల శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైం ది. సందర్భంగా వారు మాట్లాడుతూ నేర పరిశోధనలో డిజిటల్ ఎవిడెన్స్, ఫోరెన్సిక్ సైన్స్ విషయాల పట్ల ఎప్పటికప్పుడు జ్ఞానసముపార్జన ప్రాసిక్యూటర్లకు అత్యంత అవశ్యకమని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కేసీ భాను, న్యాయ సలహాదారు ఎస్కే శర్మ, ప్రొఫెసర్ డాక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులతో జాగ్రత్త

- ఆహార ఉత్పత్తులపై పెను ప్రమాదం
- గ్రీన్‌ఎనర్జీపై దృష్టి సారించాలి: ఎన్‌ఐఆర్డీ డీజీ డబ్ల్యూఆర్ రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచవ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులతో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐఆర్డీ) డైరెక్టర్ జనరల్ డబ్ల్యూఆర్ రెడ్డి చెప్పారు. కాలంతో సంబంధం లేకుండా వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని, ఇవి ఆహార ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎన్‌ఐఆర్డీడీలో 'వాతావరణ మార్పులు- తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై ఆసియా పసిఫిక్ దేశాల జాతీయ సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సముద్రంలో భారీ అలలు, వరద లు రావడం వాతావరణ మార్పులకు ప్రధాన కారణమన్నారు. కేం ద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. సదస్సు కు ఆయాదేశాల నుంచి ప్రతినిధు లు, పర్యావరణ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. మారుతున్న వాతావరణం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

# ప్రేమికులే లక్ష్యంగా దోపిడీ

- రెండేండ్లలో 30 జంటల వద్ద దోపిడీ
- నకిలీ పోలీస్ అరెస్టు.. రూ.6 లక్షల సొత్తు స్వాధీనం



బుధవారం చోరీ సొత్తును మీడియాకు చూపుతున్న సీపీ మహేశ్‌భగవత్.. నిందితుడు చందు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రేమ జంటలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్న నకిలీ పోలీస్ ఎట్టకేలకు చిక్కాడు. ఓ యువకుడిని ప్రేమించి సోదరి మోసపోవడంతో లవర్స్‌పై ద్వేషం పెంచుకొన్న డ్రైవర్.. నిర్మానుష్య ప్రాంతంలో ఉండే ప్రేమికులను బెదిరిస్తూ దోపిడీలకు పాల్పడ్డాడు. రెండేళ్లలో 30 జంటలను దోచుకున్నాడు. ఇటీవల ప్రేమ జంటల ఫిర్యాదుతో అప్రమత్తమైన రాచకొండ పోలీసులు.. బుధవారం నిందితుడిని అరెస్టుచేశారు. అతని నుంచి 9.5 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నేరేడ్‌మెట్ రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ మహేశ్‌భగవత్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి బుద్ధనగర్ ప్రాంతానికి చెందిన చింత చందు అలియాస్ చంద్రశేఖర్ ఆరేండ్లు డ్రైవర్‌గా పనిచేశాడు. పెండ్లి చేసుకున్న తర్వాత మేడిపల్లి ప్రాంతంలో సొంతంగా మహాలక్ష్మి ట్రావెల్స్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. చందు సోదరి ఓ యువకుడిని ప్రేమించి మోసపోయింది. అప్పటినుంచి ప్రేమికుల మీద కోపం పెంచుకొని.. మొదట్లో నిర్మానుష ప్రాంతంలో ప్రేమ జంట కనపడితే వారిని బెదిరించి మోసపోతారని హెచ్చరించాడు. కొద్దికాలం తర్వాత తాను పోలీస్ అని బెదిరించడం మొదలుపెట్టాడు. అవకాశం దొరికినప్పుడు యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. చాలా సందర్భాల్లో ప్రేమికులు భయపడి నగదు, నగలు ఇచ్చేవారు. అప్పటి నుంచి చందు ట్రావెల్స్ నిర్వహణలో భాగంగా బుకింగ్‌ల మీద వెళ్లి వచ్చే సమయంలో కీసర, ఓఆర్‌ఆర్ సమీప ప్రాంతాలు, చౌటుప్పల్‌తో పాటు మరికొన్ని ప్రదేశాల్లో ప్రేమ జంటలను చూసేవాడు. తర్వాత బైక్‌పై వెళ్లివారిని స్టేషన్‌కు తీసుకెళ్తానంటూ బెదిరించి దోపిడీలకు పాల్పడ్డాడు. చందు బెదిరింపులకు గురైన ప్రేమికులు ఇటీవల అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్ పీఎస్‌లలో ఫిర్యాదు చేశారు. నాలుగు ఫిర్యాదులు రావడంతో సీపీ మహేశ్‌భగవత్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి లభించిన ఆధారాలతో చందును అరెస్టు చేశారు. విచారణలో 2012లో కూడా ఇదే తరహా కేసులో చందు అరెస్టయి జైలుకు వెళ్లి వచ్చినట్టు తేలింది. తర్వాత నల్లగొండ జిల్లా సొంతూరు మల్లాపూర్‌కు వెళ్లి చేపల వ్యాపారం చేసి నష్టపోయాడు. మళ్లీ ప్రేమికులను టార్గెట్ చేసి చందు దోపిడీలకు స్కెచ్ వేసి దోపిడీలకు పాల్పడుతూ పట్టుబడ్డాడు.

గురుకుల టీచర్స్ TGT/PGT/PET/LIBRARIANS TET TM EM Paper - I&II
S.I/కానిస్టేబుల్స్ TM EM
FREE DEMO: 30-06-2019 at 10.08 am
RAMAIAH COMPETITIVE COACHING CENTRE Opp: Konark Theatre Dilsukhnagar, Hyd Cell :8885555202 9246208422

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 27 జూన్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

# రోల్.. టేస్టీ వసూల్!

**తిన్న కాస్తయినా టేస్టీగా ఉండాలనుకుంటాం.. కానీ చూడగానే బాగాలేకపోతే పక్కకు నెట్టేస్తాం.. టేస్ట్ అప్పుడు సెకండ్ ప్రియారిటీగా మారుతుంది.. అలా కాకుండా ఉండాలంటే.. దేన్నైనా అందంగా రోల్ చుట్టేస్తే సరిపోతుంది.. అవును.. టేస్టీగా చేసిన వాటిని చపాతీల్లా చేసి.. చుట్టేసి గుటకాయ స్వాహా చేస్తే.. ఆహా.. ఏమి రుచి అనకమానరు! అందుకే ఆ టేస్టీ రోల్స్‌ని మీ ముందుంచుతున్నాం..**



## పన్నీర్ రోల్

**కావాల్సినవి :**

**మైదా :** ఒక కప్పు, **పన్నీర్ ముక్కలు :** ఒక కప్పు
**గ్రీన్ క్యాప్సికం ముక్కలు :** ఒక కప్పు,
**ఎర్ర క్యాప్సికం ముక్కలు :** ఒక కప్పు,
**జీలకర్ర :** అర టీస్పూన్, **ఉల్లిపాయ ముక్కలు :** ఒక కప్పు
**టమాట :** 1, **అల్లం, వెల్లుల్లి పేస్ట్ :** ఒక టీస్పూన్
**పసుపు :** అర టీస్పూన్, **కారం :** ఒక టీస్పూన్
**ధనియాల పొడి :** అర టీస్పూన్, **కొత్తిమీర :** ఒక కట్ట
**క్యాబేజీ తురుము :** 2 టేబుల్‌స్పూన్స్,
**వెనిగర్ :** ఒక టీస్పూన్, **పచ్చిమిరపకాయలు :** 2
**నూనె :** 3 టేబుల్‌స్పూన్స్, **ఉప్పు :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** మైదా, ఉప్పు, నూనె, కొద్దిగా నీళ్లు పోసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. పది నిమిషాల పాటు అలాగే పక్కన పెట్టాలి.
**స్టెప్ 2 :** కడాయిలో నూనె పోసి జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి బాగా వేయించాలి. టమాటాలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, పసుపు వేసి రెండు నిమిషాలు కలుపుతుండాలి.
**స్టెప్ 3 :** ఇందులో కారం, ధనియాల పొడి, రెండు రకాల క్యాప్సికం ముక్కలు వేసి సన్నని మంట మీద మరో రెండు నిమిషాలు వేగనివ్వాలి. ఆ తర్వాత పన్నీర్, కొత్తిమీర వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి.
**స్టెప్ 4 :** ఇప్పుడు మైదాతో సన్నగా చపాతీలు చేసుకోవాలి. వీటిని పెనం మీద నూనె వేసి రెండు వైపులా కాల్చుకోవాలి. ఇలా కాల్చిన చపాతీ మీద క్యాబేజీ తురుము వేసి పన్నీర్ స్టఫ్‌ని పెట్టాలి.
**స్టెప్ 5 :** పై నుంచి పచ్చిమిర్చి ముక్కలు, వెనిగర్, ఉల్లిపాయ ముక్కలు వేసి గుండ్రంగా రోల్ చేసి ఇవ్వాలి. కావాలనుకుంటే మయోనీస్‌తో తింటే మరింత టేస్టీగా ఉంటాయి.

## చికెన్ స్ప్రింగ్ రోల్

**కావాల్సినవి :** **చికెన్ కీమా :** 250 గ్రా., **అల్లం, వెల్లుల్లి పేస్ట్ :** పావు టీస్పూన్, **పసుపు :** పావు టీస్పూన్, **కారం :** పావు టీస్పూన్, **ఆమ్‌చూర్ పొడి :** పావు టీస్పూన్, **గరం మసాలా :** ఒక టీస్పూన్, **కొత్తిమీర :** చిన్న కట్ట, **మైదా :** 3/4 కప్పు, **బటర్ :** అర టీస్పూన్, **ఉప్పు, నూనె :** తగినంత



**తయారీ :**

**స్టెప్ 1 :** చికెన్ కీమాలో అల్లం, వెల్లుల్లి పేస్ట్, పసుపు, కారం, ధనియాల పొడి, ఆమ్‌చూర్ పొడి, గరం మసాలా, కొత్తిమీర వేసి కలిపి కాసేపు పక్కన పెట్టాలి.
**స్టెప్ 2 :** కడాయిలో నూనె పోసి ఈ చికెన్‌ని బాగా వేగనివ్వాలి. ఇది వేగే లోపు.. ఒక గిన్నెలో మైదా, ఉప్పు, బటర్, కొన్ని నీళ్లు పోసి పది నిమిషాలు అలాగే ఉంచాలి.
**స్టెప్ 3 :** చికెన్ మిశ్రమం వేగితే దాన్ని దించి పక్కన పెట్టుకోవాలి. మైదా మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలు చేసి పెట్టుకోవాలి. వీటిని చపాతీల్లా చేసుకోవాలి. వీటిలో కీమా మిశ్రమం పెట్టి ఉండల్లా చుట్టాలి.
**స్టెప్ 4 :** ఆ తర్వాత చివరలను కొన్ని నీళ్లతో మూసేయాలి. కడాయిలో నూనె పోసి వీటిని గోల్డెన్ కలర్ వచ్చేవరకు వేయించాలి. వేడి వేడి రోల్స్ రెడీ!

## హల్వా ఖీర్ స్ప్రింగ్‌రోల్



**కావాల్సినవి :**

**క్యారెట్స్ తురుము :** ఒక కప్పు, **పాలు :** 1000మి.లీ., **చక్కెర :** ఒక కప్పు, **నెయ్యి :** 4 టీస్పూన్స్, **కాజు :** 10, **కిస్మిస్ :** 10 **సేమియా :** ఒక కప్పు, **కోవా :** అర కప్పు, **యాలకుల పొడి :** ఒక టీస్పూన్, **గోధుమ పిండి :** అర కప్పు, **కార్న్ స్టార్చ్ :** పావు కప్పు, **కొబ్బరి తురుము :** ఒక కప్పు, **చక్కెర :** ఒక టేబుల్ స్పూన్, **దాల్చిన పొడి :** ఒక టీస్పూన్, **నూనె :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** కడాయిలో నెయ్యి వేసి క్యారెట్ తురుముని వేయించి పెట్టాలి. పాలను బాగా వేడి చేసి చక్కెర వేసి చిక్కగా అయ్యేంత వరకు ఉంచాలి. ఇందులో క్యారెట్ తురుము వేసి కలుపాలి. ఇది మరుగనివ్వాలి.
**స్టెప్ 2 :** ఈలోపు ఒక గిన్నెలో నెయ్యి వేసి జీడిపప్పు, కిస్మిస్ వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే గిన్నెలో సేమియా వేసి వేయించాలి. ఇప్పుడు మరుగుతున్న పాలు ఈ సేమియాలో పోసి కలుపాలి. ఇందులోనే కోవా, యాలకుల పొడి వేసి కాసేపు ఉంచి దించేయాలి. ఇది చిక్కగా ఉంటుంది.
**స్టెప్ 3 :** మరో గిన్నెలో గోధుమ పిండి, కార్న్ స్టార్చ్, ఉప్పు, పాలు, నీళ్లు పోసి మరీ లూజుగా కాకుండా చపాతీ పిండిలా కలుపుకోవాలి. ఈ పిండిని కొద్దిగా వేడి నూనెతో చపాతీల్లా ఒత్తుకోవాలి.
**స్టెప్ 4 :** ఇలా పిండి మొత్తం చేసుకున్నాక. వీటిలో ఆ ఖీర్‌ని కూరి రెండు వైపులా బయటకు రాకుండా మూసేయాలి. మిశ్రమం మొత్తం ఇలా చేసి పెట్టుకోవాలి.
**స్టెప్ 5 :** కడాయిలో నూనె ఎక్కువగా పోసి.. వీటిని గోల్డెన్ కలర్ వచ్చేవరకు వేయించాలి. వీటిని మామిడి పండు ప్యూరీతో తింటే యమ టేస్టీగా ఉంటాయి.

## థాయినీ రోల్స్

**కావాల్సినవి :**

**మైదా :** ఒక కప్పు, **బటర్ :** పావు కప్పు, **కార్న్‌ఫ్లోర్ :** ఒక టేబుల్‌స్పూన్, **థాయినీ పేస్ట్ :** ఒక కప్పు, **ఉప్పు :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** ఒక గిన్నెలో మైదా, ఉప్పు, కొద్దిగా బటర్, కొన్ని నీళ్లు పోసి బాగా కలుపాలి. అరగంటపాటు దీన్ని పక్కన పెట్టాలి.
**స్టెప్ 2 :** ఒక చిన్న గిన్నెలో కార్న్‌ఫ్లోర్, మైదా వేసి కలిపి పెట్టుకోవాలి. మైదా మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి.
**స్టెప్ 3 :** కార్న్‌ఫ్లోర్‌ని డస్టింగ్ చేస్తూ వాటిని మందం లేకుండా పూరీల్లా ఒత్తుకోవాలి. ఇలా నాలుగు చేసి పెట్టుకోవాలి. ఒక్కోదానికి బటర్ రాసి పైన ఇంకో పూరీని పెట్టాలి. ఇలా నాలుగింటినీ చేయాలి.
**స్టెప్ 4 :** దీంట్లో థాయినీ పేస్ట్ చేసి చక్కెరని చల్లుకోవాలి. ఇప్పుడు చివరలను కట్ చేసి వీటిని రోల్‌లాగా చుట్టుకోవాలి.
**స్టెప్ 5 :** బేకింగ్ షీట్‌లో పెట్టి 200 డిగ్రీల వద్ద పావుగంట పాటు బేక్ చేయాలి. తియ్యని థాయినీ రోల్స్ మీ ముందుంటాయి.





**సంజయ్ తుమ్మ**
సెలబ్రిటీ చెఫ్

## క్యాన్సర్ కారకాలివే



- క్యాన్సర్ కారక ఆహారాల్లో రిఫైన్డ్ ఫుడ్ అండ్ ఆర్టిఫిషియల్ స్వీటేనర్స్ ప్రథమమైనవి. రిఫైన్డ్ షుగర్లు శరీరంలో ఇన్సులిన్ లెవెల్స్‌ను పెంచుతాయి. క్యాన్సర్ సెల్స్ పెరగడానికి కారణమవుతాయి. వీటికి బదులు బెల్లం, తేనె, వంటివి వాడడం మంచిది.
- ప్రాసెస్డ్ మీట్స్ మనమెందుకు వాడుతాం అని అనుకుంటుంటారు. కానీ మాంసం ఫ్రెష్‌గా వివిధ జీవుల నుంచి తీస్తున్నప్పటికీ కొన్ని రకాల ఫాస్ట్‌ఫుడ్స్‌లో చాలా రోజులు నిల్వ ఉంచిన, పాడైపోయిన అవశేషాలతో ఫాస్ట్ ఫుడ్ తయారు చేస్తుంటారు. రుచి పెంచడానికి వాడే నైట్రేట్స్, ఎక్కువ రోజులు నిల్వ ఉంచడానికి వాడే ప్రిజర్వేటివ్స్ అన్ని క్యాన్సర్‌కు కారకాలే.
- చేపలు సహజంగా చెరువుల్లో, సముద్రంలో పెంచుతారు. కానీ ఇటీవల పెద్ద పెద్ద గోళాల్లో నీళ్లు పోసి రసాయనాలు వేసి పెంచుతున్నారు. ఇలా ఇంటి వద్దే పెంచడం వల్ల త్వరగా, ఎక్కువ వెయిట్‌తో పెరిగినప్పటికీ ఇవి తింటే ఆరోగ్యానికి హానికరం. క్యాన్సర్ కారకం.
- చాలా వరకు బేకరీ, హోటళ్లలో వాడే పిండిని రిఫైన్డ్ చేస్తారు. ఇలా చేయడం ద్వారా ఇందులో ఉండే న్యూట్రిషన్లు తీసివేయబడతాయి. ఫలితంగా పిండి మెత్తగా తయారవుతుంది. రిఫైన్డ్ పిండితో తయారు చేసిన పదార్థాలు తినడం వల్ల ఏం ప్రయోజనం లేకపోగా ఆహార పదార్థాలు త్వరగా జీర్ణమవవు. క్యాన్సర్‌కు దారి తీస్తాయి.

## పేదరికం అడ్డుకాదని నిరూపించింది!





**ప్రతిభ విషయంలో పేద, ధనిక అనే తేడాలుండవు. కొంతమందికి సరైన ప్రోత్సాహం కొరవడడంతో సత్తా చాటలేకపోతున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన సరిత గైక్వాడ్ అనే క్రీడాకారిణి ఆసియా క్రీడల్లో విజయ దుందుభి మోగించి ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది.**

గుజరాత్‌లోని మారుమూల గ్రామమైన డాంగ్‌కు చెందిన సరిత గైక్వాడ్ ఆసియా క్రీడల్లో రన్నింగ్ రేసులో బంగారు పతాకాన్ని సాధించి భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. తన లక్ష్యం కోసం అహర్నిశలు శ్రమించి అవలీలగా స్వర్ణ పతకాన్ని అందుకున్నది. ఆమె తండ్రి లక్ష్మణ్ భాయ్, తల్లి రాముబెన్‌లిద్దరూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెక్కాడితేగాని డొక్కాడే పరిస్థితుల్లో పుట్టిన సరిత గైక్వాడ్ తాను కన్న కలలను సాకారం చేసుకోవడంపై దృష్టి సారించింది. పేదరిక కుటుంబంలో పుట్టానని, అంత పెద్ద లక్ష్యాన్ని సాధించలేనని అనుకోలేదు. పట్టుదల, అంకితభావంతో శ్రమించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నది. 2016, 2017ల్లో జాతీయ స్థాయిలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో రజతంతోపాటు మూడు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నది. గుజరాత్‌లోని డంగ్ జిల్లా కరాడి అంబా అనే కొండ ప్రాంతంలోని గిరిజన తెగకు చెందిన సరిత గైక్వాడ్ జాతీయ స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో ఎన్నో పతకాలు సాధించింది. సవాళ్లే తనను మరింత దృఢంగా మార్చాయని, తాను ఇంతటి విజయాన్ని అందుకోవడానికి అదే కారణమని చెబుతున్నది. తనలా పేదరికంలో ఉన్న వారు ఏమాత్రం కుంగిపోకుండా తమ లక్ష్యం వైపు ఆత్మవిశ్వాసంతో దూసుకుపోవాలని అంటున్నది. జకార్తాలో జరిగిన 2018 ఆసియన్ గేమ్స్ పరుగు పందెంలో స్వర్ణ పతకాన్ని సాధించిన గిరిజన పుత్రిక సరిత గైక్వాడ్ అందరికీ ఆదర్శమయింది.

## వంటింటి చిట్కాలు



- రాత్రిపూట మిగిలిన అన్నాన్ని మిక్సీ జారులో వేసి మూడు స్పూన్ల శనగ పిండి, బియ్యం పిండి, ఉప్పు, మజ్జిగ చేర్చి రుబ్బుకొని వడియాలుగా ఎండనివ్వాలి.
- ఫలహారాలు క్రిస్పీగా ఉండాలంటే.. వీటిని ఉంచే పాత్రల అడుగున ఉప్పును చేర్చితే సరిపోతుంది.
- మెంతికూర వండేటప్పుడు కాసింత బెల్లం చేర్చుకుంటే అందులోని చేదు తొలిగి తీపి రుచి చేకూరుతుంది.
- తురిమిన కొబ్బరి, జీడిపప్పు ఫ్రిజ్‌లో ఉంచితే పురుగు పట్టదు
- తేనె శుభ్రంగా నిల్వ ఉండాలంటే మంచి సీసాలో పోసి రెండు, మూడు లవంగాలు దానిలో వెయ్యాలి.
- పసుపు, కారం, కరివేపాకు పొడిలాంటివి నిల్వ చేసేటప్పుడు చిటికెడు ఇంగువ కలిపి కాగితంలో భద్రం చేస్తే ఏడాదిపాటు నిల్వ ఉంటాయి.






నమస్తే తెలంగాణ
విశేష
[ కరీంనగర్ ]
గురువారం 27 జూన్ 2019

# ప్రపంచంలోనే అతిపెద్ద ముత్యం!



ఈ ముత్యం బరువెంతో తెలుసా? 27 కిలోలు. అంత పెద్ద ముత్యం ఉందంటే నమ్మశక్యంగా లేదు కదా! ఇది మామూలు ముత్యం కాదు మరి. వారసత్వ సంపదగా ఒకరి నుంచి మరొకరికి వచ్చిన ముత్యం తెలుసా?

కెనడాకు చెందిన ఫిలిపినో అబ్రహాం రెయెస్ దగ్గర ఉన్నది. ఇది ఆయనకు వాళ్ల అత్త నుంచి వారసత్వంగా సంక్రమించింది. 1950లో అబ్రహాం రెయెస్ వాళ్ల తాత ఫిలిప్పీన్స్‌లో ఒక భారీ ఆల్చిప్పను కనుగొన్నాడు. ఇందులో మొలస్కా జాతి జీవులు ఆల్చిప్పలో ఇరుక్కుపోయాయట. అయితే ఆ ఆల్చిప్ప లోపల ఇంత పెద్ద ముత్యం ఉందనే విషయం మొదట ఆయన కూడా గ్రహించలేదు. కొన్నాళ్లకు ఆల్చిప్పలో ఉన్న ముత్యం బయటపడింది. దీని ధర వింటే ఆశ్చర్యం కలుగకమానదు. ఈ ముత్యాన్ని దక్కించుకోవడానికి చాలామంది ఎన్నో ప్రయత్నాలు చేసి, విఫలమయ్యారు. రెయెస్ దీని గురించి అందరూ తెలుసుకోవాలనే ఆలోచనతో ఓ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచాడు. ఇటువంటి అరుదైన ముత్యానికి ఉన్న చరిత్రను అందరూ తెలుసుకునేలా ఏర్పాట్లు చేశాడు. దీని విలువ రూ.1,400 కోట్లపైనే ఉంటుందని చెబుతున్నారు పరిశోధకులు. నిపుణుల ధ్రువీకరణ తర్వాత దీని విలువను బీమా సంస్థలు లెక్కగట్టాయి. కెనడాకు చెందిన వారు దీని విలువను రూ. 400 కోట్ల నుంచి రూ. 600 కోట్ల మధ్య ఉంటుందని నిర్ధారించారు. హాంకాంగ్‌కు చెందిన బీమా సంస్థ దీని విలువను రూ. 1,000 నుంచి 1,400కోట్ల మధ్య ఉంటుందని అంచనా వేసింది.

## ట్వీట్



**ఆలియా భట్**
@aliaa08

**కొంత కొత్తదనం, కొంత నవ్వుల కంటెంట్, సరికొత్తగా నా యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభిస్తున్నాను. ఇది దానికి సంబంధించిన లింక్.**

ఆలియా భట్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

19,299,661

## జంతువుల కోసం ప్రత్యేక వంతెనలు!



**అరణ్య ప్రాంతాల్లోని రహదారులపై వేగంగా దూసుకెళ్లేటప్పుడు జంతువులు ఒక్కసారిగా అడ్డువస్తే వాహనాలను ఆపడం చాలా కష్టం. అకస్మాత్తుగా బ్రేకులు వేస్తే వాహనం అదుపుతప్పి, జంతువులు కూడా మృత్యువాత పడుతున్నాయి. అందుకే జంతువుల సంరక్షణ కోసం పలు దేశాలు ప్రత్యేక వంతెనలు నిర్మిస్తున్నాయి.**

అటవీ ప్రాంతాల్లోని భారీ రహదారులపై దూసుకెళ్లే వాహనాల కింద పడి జంతువులు మృత్యువాత పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇటువంటి ప్రమాదాల వల్ల కొన్ని జీవజాతుల మనుగడకు ముప్పు వాటిల్లుతున్నది. అటవీ ప్రాంతాల ద్వారా వెళ్లే రహదారులపై జంతువుల ప్రాణాలు కాపాడేందుకు ఈ వంతెనలు ఉపయుక్తంగా మారుతున్నాయి. భూగోళం మనుషులది మాత్రమే కాదు. కోటానుకోట్ల జీవరాసులది కూడా. అది విస్మరించి మానవుడు భూమి తనదేనన్నట్లు స్వార్థంగా వ్యవహరిస్తున్నాడు. అరణ్యాల్లోని జీవుల మనుగడకు ఇబ్బందులు సృష్టిస్తున్నాడు. ఆవాసం కోల్పోయి చాలా జీవరాసులు అంతరించిపోతున్నాయి. అడవుల గుండా ఉన్న రహదారులు కూడా జంతువుల మరణాలకు ఎక్కువగా కారణమవుతున్నాయి. రోడ్డు దాటే ప్రయత్నంలో ప్రమాదానికి గురై చాలా జంతువులు మృత్యువాతపడుతున్నాయి. జంతువులు రోడ్డు దాటేందుకు వీలుగా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఇలాంటి ప్రత్యేక వంతెనలు నిర్మిస్తున్నారు. వాటి వల్ల జంతువుల యాక్సిడెంట్లు 80 శాతం మేర తగ్గాయి.

## పానీపూరీ మిషన్లు వచ్చేశాయి!

**రుచికరమైన పానీ పూరీలను అందించే యంత్రాలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. పానీపూరీ అమ్మేవాళ్లు చేతులతో పాత్రల్లో ఉండే నీటిని ముంచి ఇస్తుంటారు. ఇక నుంచి ఆ పని మనుషులు కాకుండా, యంత్రాలు చేస్తాయి.**



సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత మనుషులకు శ్రమ చాలా తగ్గింది. చిన్న పని, పెద్ద పని అనే తేడాల్లేకుండా మనుషులు చేయాల్సిన పనులను యంత్రాలు చేసే విధంగా వాటిని రూపొందిస్తున్నారు. చేతులతో పానీపూరీని అందించడం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అటువంటి సమస్యలను పరిష్కరించేందుకు పానీపూరీ వెండింగ్ మిషన్లను తొలిసారిగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రవేశపెట్టారు. పానీపూరీ వ్యాపారులు వీటిని ఉపయోగించడం మొదలు పెట్టినప్పటి నుంచి కొనుగోలుదారుల సంఖ్య విపరీతంగా పెరిగిందట. వెండింగ్ మిషన్ల వచ్చిన దగ్గర నుంచి పరిశుభ్రంగా ఉండడం వల్ల రోజు రోజుకూ వినియోగదారుల సంఖ్య మరింతగా పెరుగుతున్నారని పానీపూరీ వ్యాపారి చెబుతున్నాడు. వాటర్ షాట్స్ అనే సంస్థ ఈ పానీపూరీ వెండింగ్ మిషన్లు రూపొందించింది. ఒకేసారి వరుసగా ఐదుమందికి పానీపూరీ అందించే విధంగా దీనిని తయారు చేశారు. ఈ యంత్రాలు బెంగళూరు, చెన్నైల్లో ఇప్పటికే అందుబాటులోకి రాగ, త్వరలో తెలుగురాష్ట్రాల్లోని పలు నగరాలకు రానున్నాయి. విశేషమేమిటంటే పానీపూరీలో నింపుకునే నీటిలో మూడు రకాలుంటాయి. స్పైసీ, మీడియం, స్వీటు ఇలా మూడు రకాల్లో ఎవరికి కావల్సిన రుచిని వారు మిషన్‌పై ఉండే బటన్‌ను నొక్కి పొందవచ్చు.



**మనుషులకు మాత్రమే రెస్టారెంట్లా..? మనుషులు మాత్రమే బర్త్‌డే పార్టీలు చేసుకోవాలా..? వాళ్లు మాత్రమే మంచి స్పాట్‌లో కూర్చుని చిల్ అవ్వాలా..? ఇవన్నీ గతం.. ఇప్పుడు కుక్కలకు కూడా రెస్టారెంట్ ఉంది. అక్కడ కూర్చుని ముచ్చట్లు పెట్టుకోవచ్చు.. కొత్త కుక్కలతో దోస్తానా చేయొచ్చు.. హైదరాబాద్‌లో వెలసిన కేఫే ద లోకో శునకాలకు ప్రత్యేకంగా ఆహ్వానం పలుకుతున్నది.**

café de Loco

# శునకాలకు ఆహ్వానం

**గచ్చిబౌలిలోని** డైమండ్ హిల్స్ ప్రాంతం. చుట్టూ అద్దాల మేడలు, ఆకాశహర్మ్యాలు మధ్యలో ఒక బస్తీ.. ఇండ్ల మధ్యలో పెద్ద ఖాళీ స్థలంలో కెఫే ద లోకో రెస్టారెంట్ ఉన్నది. వెళ్లగానే కుక్క పిల్లల శబ్దాలు, అరుపులు వినిపిస్తాయి.. దాడి చేస్తాయా అన్నంత గట్టిగా అరుస్తుంటాయి. గేటు తెరుచుకొని లోపలికి వెళ్లగానే పది కుక్కలు ఒకేసారి చుట్టుముడతాయి. కానీ ఏమీ అనవు. దగ్గరికి వచ్చి వాసన చూస్తాయి. వాటితో ఫ్రెండ్‌షిప్ చేస్తే అక్కడి నుంచి వెళ్లే వరకు అవి మనతోనే ఆడతాయి. బయటి నుంచి మనం కుక్కని తీసుకెళ్తే వాటితో కూడా ఫ్రెండ్‌షిప్ చేయిస్తారు అక్కడి సిబ్బంది. ఆడుకోవడానికి బంతులు, ఆట బొమ్మలుంటాయి. హైవేలపై దాబాలను తలపించేలా ఉంటుందీ రెస్టారెంట్. నెల రోజుల కుక్క పిల్లలు మొదలు.. పదేళ్ల కుక్కలు కూడా వస్తుంటాయి. కుక్కలే కాకుండా పిల్లులు కూడా ఇక్కడ ఒక గదిలో ఉన్నాయి. అక్కడ ఉన్న కుక్కలైనా, పిల్లులైనా అన్నీ భారతీయ జాతులకు చెందినవే. చివరకు క్యాష్ కౌంటర్ ఉంటుంది. టీకాలు వేయించిన కుక్కలకు మాత్రమే లోపలికి ప్రవేశం ఉంటుంది. గేటు దగ్గర నోట్‌బుక్ ఉంటుంది. అక్కడ కుక్క పేరు సంబంధిత వివరాలను రాయాల్సి ఉంటుంది. సిబ్బంది వచ్చి కుక్కను మచ్చిక చేసుకుంటారు. ఎలాంటి ఆహారం తీసుకుంటుంది. శాఖాహారమా? మాంసాహారమా అని అడిగి ఆర్డర్ తీసుకుంటారు. సుమారు 30 రకాల ఆహార పదార్థాలున్నాయి.

### బర్త్‌డే బమ్స్..

పుట్టిన రోజులంటే సంవత్సరానికి ఒకసారి చేసుకుంటారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. డబ్బున్న వాళ్లు ప్రతినెల బర్త్‌డే చేసుకుంటున్నారు. కుక్కలకు కూడా ప్రతీ నెల బర్త్ డే చేస్తున్నారు. కుక్కల పుట్టిన రోజు వేడుకలు జరుపడం కోసం కేఫే ద లోకోకి వెళ్లి కేక్ కట్ చేస్తున్నారు. ఇక్కడ కుక్కల కోసం ప్రత్యేకంగా ఐదు రకాల కేకులు తయారు చేస్తున్నారు. ఫ్యామిలీ గెట్ టు గెదర్ కార్యక్రమాలు, కార్పొరేట్ మీటింగ్స్ వంటివీ ఇక్కడ నిర్వహిస్తున్నారు. కుక్కల రెస్టారెంట్ అంటే కేవలం కుక్కలకే కాదు.. కుక్కల యజమానులకు కూడా ఆహారం దొరుకుతుంది. చదువుకోవడానికి పుస్తకాలు, చూడడానికి స్క్రీన్ టీవీ కూర్చోవడానికి సోఫాలు, మంచాలు ఇలా అన్నీ ఉన్నాయి.



**ఆడుకోవడానికి బంతులు, ఆట బొమ్మలుంటాయి. హైవేలపై దాబాలను తలపించేలా ఉంటుందీ రెస్టారెంట్. నెల రోజుల కుక్క పిల్లలు మొదలు.. పదేండ్ల కుక్కలు కూడా వస్తుంటాయి. కుక్కలే కాకుండా పిల్లులు కూడా ఇక్కడ ఒక గదిలో ఉన్నాయి.**



బ్యాడ్మింటన్ స్టార్ గుత్తా జ్వాల మొదలు, సినిమా, క్రీడా రంగాలు సంబంధించిన చాలామంది తారలు ఇక్కడికి రెగ్యులర్‌గా వస్తుంటారు. తమ కుక్క పిల్లలను తీసుకొచ్చి కాసేపు సేదతీరుతారు. వారానికొకసారి ఇక్కడ మ్యూజికల్ నైట్స్, ఈవెంట్స్ కూడా జరుగుతుంటాయి. కుకీస్, కేక్స్, బిర్యానీ వంటి ఫుడ్‌ని ఎక్కువ మంది తమ కుక్కలకు తినిపించడానికి ఇష్టపడుతున్నారు.

### దత్తత.. బాధ్యత

లోకో రెస్టారెంట్ యజమానులు పెంచుతున్న కుక్కలన్నీ భారతీయ బ్రీడ్‌లకు సంబంధించినవే. ఈ కుక్క పిల్లలన్నీ రోడ్లపై దొరికిన అనాథ పిల్లలే. ఇప్పటి వరకు ఇలాంటి 84 పిల్లల్ని దత్తతకు ఇచ్చారు. ఎవరికైనా కుక్క పిల్లలు కావాలనుకుంటే వెళ్లి సంప్రదిస్తే దత్తతకు ఇస్తారు. ఇదొక సామాజిక బాధ్యత అంటున్నారు. కేఫే ద లోకో వ్యవస్థాపకురాలు రుచిరా సకర్వాల్. ప్రతి నెలా కుక్కల డాక్టర్ వచ్చి అక్కడున్న కుక్కల ఆరోగ్య పరిస్థితిపై సమీక్ష జరిపి వాటి బాగోగుల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టగ్రామ్ ద్వారా తమ కుక్కల బర్త్‌డే వేడుకల వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. రెండేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన హేమంత్ సకర్వాల్ తన భార్య రుచిరా సకర్వాల్‌తో కలిసి దీన్ని ప్రారంభించారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. కుక్కల ఆహారాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ తీసుకొని హోమ్ డెలివరీ చేస్తున్నారు. జోమాటో, ఉబర్ ఈట్స్ ద్వారా నగరంలో పలు ప్రాంతాలకు ఫుడ్ డెలివరీ సదుపాయం కల్పించారు. 2016లో సినీనటి, జంతు సంరక్షకురాలు అక్కినేని అమల చేతుల మీదుగా దీన్ని ప్రారంభించారు.

### క్రమశిక్షణ..

లక్షలు పెట్టి కొన్న కుక్క పిల్లలు కూడా బాగా అల్లరి చేస్తాయి. క్రమశిక్షణ మరిచి అరవడం, కరవడం చేస్తుంటాయి. ఇదొక పెట్స్ ప్లే స్కూల్ లాంటిది. రోజంతా అక్కడ పెడితే అన్ని కుక్కలతో కలిపి ఆడిస్తారు. క్రమశిక్షణ నేర్పుతారు. కుక్కలకు సంబంధించిన రెస్టారెంట్ తెలుగు రాష్ట్రాల్లోనే ఇది మొదటిది. నగరం నడిబొడ్డున గచ్చిబౌలిలో ఉన్న ఈ రెస్టారెంట్ ఏదో పల్లెటూరులో ఉన్నట్టు ఉంటుంది. చుట్టూ పచ్చని మొక్కలు, మధ్యలో మైదానం, గుడిసెలను పోలి ఉన్న రెస్టారెంట్ కట్టడం ఇలా ప్రకృతికి దగ్గరగా ఉన్న ఫీలింగ్‌ను తీసుకొస్తాయి.

... అజహర్ షేక్

## కామన్‌మ్యాన్ వాయిస్

మల్లేశంకు మహా అద్భుతం అంటూ రివ్యూలు.. కానీ డబ్బులు రావట్లే? కబీర్‌సింగ్‌కు పరమ చెత్త అంటూ రివ్యూలు.. కానీ వారంలో వందకోట్ల వసూళ్లు!? వై దిస్ కొలవెరి!
– Prasen Bellamkonda

ఆధిపత్య భాషగా మారుతున్న హిందీ భాషని తెలుగు రాష్ట్రాలలో నిషేధించాలి. తెలుగు ప్రజలు స్వచ్ఛంద నిషేధం పాటించాలి.
– కాళోజి ప్రసాద్

కట్టుబట్టలతో పంపడం అంటే ఏమిటో కరకట్ట మీద ఉన్న ఇల్లు కూలిన తర్వాత బాబుకు క్లియర్‌గా అర్థమైతది. సొంత రాష్ట్రం కంటే తెలంగాణ వాళ్లే నయం నాలుగు జతల బట్టలైన తీసుకొనిచ్చారు. జగన్ అన్యాయంగా బట్టలు తీసుకునే సమయమైనా ఇవ్వకుండా కూల్చేశాడు అని బజారుకెక్కుతాడు.
– Raju Arige

## వైరల్ వీడియో





**పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్లతో సినిమాలు వచ్చి ఎంత కాలం అయింది..? రాజశేఖర్ పోలీస్ క్యారెక్టర్‌లో కనిపిస్తే అంతకన్నా పవర్‌ఫుల్ ఏముంటుంది? కల్కి ట్రైలర్ వచ్చేసింది. ఈ యూట్యూబ్ ట్రెండింగ్ వీడియోపై ఓ లుక్కేయండి.**

Kalki Honest Trailer | Dr Rajashekar | Adah Sharma | Prasanth Varma | Madhura Audio

Total views : 616,826+
Published on Jun 25, 2019

## సుడోకు

డైలీ సుడోకు 75 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 1 | 9 | 5 | 6 | 3 | 7 | 2 | 4 |
| 6 | 5 | 2 | 8 | 4 | 7 | 3 | 9 | 1 |
| 3 | 7 | 4 | 2 | 9 | 1 | 8 | 5 | 6 |
| 7 | 4 | 1 | 3 | 5 | 6 | 9 | 8 | 2 |
| 2 | 9 | 6 | 1 | 7 | 8 | 5 | 4 | 3 |
| 5 | 8 | 3 | 9 | 2 | 4 | 1 | 6 | 7 |
| 4 | 6 | 8 | 7 | 3 | 9 | 2 | 1 | 5 |
| 9 | 2 | 7 | 6 | 1 | 5 | 4 | 3 | 8 |
| 1 | 3 | 5 | 4 | 8 | 2 | 6 | 7 | 9 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -76

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | 4 | | | | |
| | | | 5 | | 9 | 6 | 2 | |
| | | | 1 | 2 | | 9 | | 4 |
| | 6 | | | | | 2 | | |
| | | 5 | 7 | 6 | 2 | 3 | | |
| | | 8 | | | | | 1 | |
| 9 | | 3 | | 5 | 8 | | | |
| | 8 | 7 | 3 | | 4 | | | |
| | | | | 1 | | | | |

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## హార్టికల్చరల్ కోర్సుల్లో ప్రవేశాలు

**శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, డిప్లామా కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.**





- **కోర్సు:** ఎమ్మెస్సీ (హార్టికల్చర్)
- **సీట్ల సంఖ్య:** 30
- **విభాగాల వారీగా సీట్ల సంఖ్య:** ఫ్రూట్ సైన్స్-6, వెజిటబుల్ సైన్స్-12, ఫ్లోరికల్చర్&ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్-9, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ క్రాప్స్-3 సీట్లు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత అంశంలో బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ లేదా బీఎస్సీ హార్టికల్చర్‌లో కనీసం 5.5 జీపీఏతో ఉత్తీర్ణత.
- **కోర్సు:** పీహెచ్‌డీ (హార్టికల్చర్)
- సీట్ల సంఖ్య-4
- **అర్హత:** కనీసం 6.5 జీపీఏతో సంబంధిత అంశంలో పీజీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019, జూలై 1 నాటికి 40 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక:** పీజీ కోర్సుల్లో ప్రవేశానికి బీఎస్సీలో వచ్చిన మార్కులకు 40 శాతం, విశ్వవిద్యాలయం నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మార్కులకు 60 శాతం వెయిటేజీ ఇచ్చి తుది ఎంపిక చేస్తారు.
- **కోర్సు:** ఉద్యాన పాలిటెక్నిక్ (డిప్లొమా)
- మొత్తం సీట్ల సంఖ్య-50
- **కాలేజీల వారీగా సీట్లు:** ఆదిలాబాద్ దసనాపూర్‌లో -25, కరీంనగర్ రామగిరి ఖిల్లా కాలేజీలో-25 సీట్లు ఉన్నాయి.
- **అర్హతలు:** తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాల అకడమిక్ విద్యాసంవత్సరాల్లో కనీసం నాలుగేండ్లు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో (నాన్ మున్సిపల్) పరిధిలోని పాఠశాలలో చదివి ఉండాలి.
- పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులు.
- ఇంటర్/డిగ్రీ తదితర ఉన్నత చదువులు చదివినవ వారు అర్హులు కారు.
- **ఎంపిక:** గ్రేడ్ పాయింట్ యావరేజ్ ఆధారంగా
- **వయస్సు:** 2019, ఆగస్టు 31 నాటికి 15-25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **కోర్సు కాలవ్యవధి:** రెండేండ్లు
- **మాధ్యమం:** తెలుగు మీడియంలో కోర్సు ఉంటుంది
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** జూలై 25
- **వెబ్‌సైట్:** http://skltshu.ac.in

## మేనేజర్లు

**మైసూర్‌లోని బ్యాంక్ నోట్ పేపర్ మిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**



- ఇది రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ.
- **పోస్టులు-ఖాళీలు:**
- జనరల్ మేనేజర్ (టెక్నికల్)-1, జనరల్ మేనేజర్ (హెచ్ఆర్&అడ్మిన్)-1, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్)-1 ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** జూలై 30
- **వెబ్‌సైట్:** www.bnpmindia.com

## నిట్‌లలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు

**వరంగల్, సూరత్‌కల్, హమీర్‌పూర్, దుర్గాపూర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) లలో కింది పోస్టుల భర్తీకి ప్రకటనలు విడుదలయ్యాయి.**



నిట్-వరంగల్:
- **పోస్టు:** అడ్‌హక్ ఫ్యాకల్టీ
- **విభాగాలు:** ఇంజినీరింగ్, సైన్స్ అండ్ హ్యుమానిటీస్.
- **అర్హతలు:** ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ/ఎంటెక్ (గేట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యం ఇస్తారు)తో పాటు యూజీ, పీజీలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగాల్లో పోస్టులకు పీహెచ్‌డీ/యూజీ, పీజీ స్థాయిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత.
- **జీతభత్యాలు:** పీహెచ్‌డీ చేసిన వారికి నెలకు రూ.60,000/, ఎంటెక్ చేసినవారికి నెలకు రూ.50,000/- ఇస్తారు.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో దరఖాస్తును పూర్తిచేసి సంబంధిత కాపీలను recruitadhoc@nitw.ac.inకి జూలై 12లోగా పంపాలి.
- వెబ్‌సైట్: www.nitw.ac.in

నిట్-దుర్గాపూర్:
- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (గ్రేడ్-1,2, ,లెవల్ 12,11,10)
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** జూలై 19
- **వెబ్‌సైట్:** http://nitdgp.ac.in

నిట్-సూరత్‌కల్:
- **పోస్టులు:** టీచింగ్ అసిస్టెంట్/జూనియర్ ఇంజినీర్, లైబ్రెరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్-32, సూపరింటెడెంట్-9, సీనియర్ టెక్నీషియన్-17, టెక్నీషియన్-32, సీనియర్ టెక్నీషియన్-10, జూనియర్ అసిస్టెంట్-10, జూనియర్ అసిస్టెంట్-19, ఆఫీస్ అటెండెంట్/ల్యాబ్ అటెండెంట్-18 పోస్టులు ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** జూలై 17
- **వెబ్‌సైట్:** https://recruit.nitk.ac.in

నిట్-హమీర్‌పూర్:
- **పోస్టులు:** రిజిస్ట్రార్-1, డిప్యూటీ రిజిస్ట్రార్-1, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-1, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్-2 ఖాళీలు ఉన్నాయి.
- అర్హతలు, ఎంపిక, దరఖాస్తు తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **చివరితేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.nith.ac.in

## సోలార్ ఎనర్జీలో

**న్యూఢిల్లీలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఇంజినీర్లు, అకౌంటెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**



- **పోస్టులు:** ఇంజినీర్ (సివిల్-3,ఎలక్ట్రికల్-3, విండ్ పవర్-1, సోలార్ పవర్-1, ఓ అండ్ ఎం-1), ఆఫీసర్ (సేఫ్టీ &ఈహెచ్ఎస్)-1, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్-1, అకౌంటెంట్ ఆఫీసర్-2, సూపర్‌వైజర్ (సివిల్-4, ఎలక్ట్రికల్-3), అకౌంట్స్ అసిస్టెంట్-1 పోస్టు ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 31 (సాయంత్రం 5 వరకు)
- **వెబ్‌సైట్:** www.seci.co.in

III.

నమస్తే తెలంగాణ

రైతుబడి

[ కరీంనగర్ ]

గురువారం 27 జూన్ 2019

raithubadi@ntnews.com

# నారుమడుల్లో జాగ్రత్తలు

**ప్రస్తుతం వానలు పడుతున్నాయి. రైతులు సాగు చేయడానికి సిద్ధం అవుతున్నారు. కూరగాయలు సాగు చేసే రైతులు కూడా సాగుకు సన్నద్ధం అవుతున్నారు. అయితే ప్రధాన పంటలో మేలైన దిగుబడులు సాధించాలంటే నారుమడుల దశ నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.**

**కూరగాయలలో:** ఈ పంటలు నారుమడులలో ఉన్నప్పుడు ప్రధానంగా రసంపీల్చే పురుగులు ఆశించి నష్టపరుస్తాయి. దీని నివారణకు 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి లేదా థయోమిథాక్సామ్ 4 గ్రాముల 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. భూమి ద్వారా వ్యాప్తి చెందే నారు కుళ్లు, కాండం కుళ్లు, ఎండు కుళ్లు, వడలు తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మొదళ్ల వద్ద బాగా తడుపాలి. నులి పురుగుల నివారణకు ఎకరానికి 8 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను దుక్కిలో వేయాలి.

## పూల తోటల్లో ..

**బంతి:** బంతి తోట నాటుకునే ముందు ఎకరాకు 30 కిలోల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్‌ను ఇచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. 27రోజుల వయస్సు ఉన్న నారును 60X45 సెం.మీ. దూరంలో నాటుకోవాలి.



**కనకాంబరం:** 45 రోజుల వయసున్న కనకాంబరం నారును ప్రధాన పొలంలో 60X45 సెం. మీ. ఎడంలో నాటుకోవాలి. ఆఖరి దుక్కిలో 20 టన్నుల పశువుల ఎరువును 15 కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరం 25 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి.

**చామంతి :** పిలకలు లేదా కొమ్మ కత్తిరింపులు సేకరించి ప్రధాన పొలంలో 30X30 సెం.మీ దూరంలో ఎకరానికి 40 వేల మొక్కలు సాంద్రత ఉండే విధంగా చూసుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 8–10 టన్నుల పవుశుల ఎరువు, 50 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి.

**నేలసంపంగి:** నేల సంపంగిలో సుమారు 2.5 సెం.మీ వ్యాసం ఉన్న దుంపలను ఎంపిక చేసి 30X20 సెం.మీ దూరంలో నాటుకోవాలి. ఎకరాకు 8–10 టన్నుల పశువుల ఎరువు, పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి.

**ఉల్లిలో:** ఉల్లిలో నారుకుళ్లు ఆశించే అవకాశం ఉన్నప్పుడు దాని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి. నారుమడి తయారైతే ప్రధాన పొలాన్ని 2–3 సార్లు దుక్కి దున్ని పశువుల ఎరువుతో కలియదున్నాలి. ఉల్లి నాటే ముందు ఫ్లుక్లోరాలిన్ అనే కలుపు మందును 45 శాతం ఎకరాకు ఒక లీటరు చొప్పున పిచికారీ చేయాలి. ఆ తర్వాత కలుపును భూమిలో కలియదున్నాలి. లేదా పెండిమిథాలిన్ 30 శాతం ఎకరాకు 1.3 నుంచి 1.5 లీ లేదా ఆక్సీఫ్లోరోఫిన్ 23.5 శాతం 200 మి.లీ. చొప్పున ఏదో ఒక దానిని నాటే ముందు పిచికారీ చేయాలి. ప్రధాన పొలం తయారీ అయ్యాక ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 30–40 కిలోల నత్రజని, 24–32 కిలోల భాస్వరం 12 కిలోల నత్రజని, 24–32 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులను వేయాలి. ఇందులో 12 కిలోల మొత్తం భాస్వరం, పొటాషియం ఎరువులు దుక్కి తయారీలోనే వేయాలి.

**మద్దెల లక్ష్మయ్య,** 9010723131, ఖమ్మం వ్యవసాయం



# టమాటాలో విత్తనోత్పత్తి

**రాష్ట్రంలో సాగవుతున్న కూరగాయల్లో ప్రధాన పంట టమాటా. వానకాలంలో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంట సాగవుతుంది. చిన్న, సన్నకారు రైతులు కూడా ఎక్కువగా ఈ పంటను సాగుచేస్తారు. తమకు కావాల్సిన విత్తనాలను సొంతంగా ఉత్పత్తి చేసుకునే వీలున్నది. దీనికి కొన్ని కిటుకులు పాటించాలి.**

**వాతావరణం:** టమాటా ఉష్ణమండల పంట. విత్తనోత్పత్తికి సుమారు నాలుగు నెలల పాటు మంచురహిత వాతావరణం అవసరం. 16 నుంచి 29 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత విత్తనం మొలకెత్తడానికి అనుకూలం. మొక్కల అభివృద్ధికి, కాయలు ఏర్పడటానికి 20 నుంచి 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండాలి. 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ, 32 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే పుప్పొడి రేణువులు చనిపోతాయి. కాబట్టి కాయలు కట్టే అవకాశం తగ్గుతుంది. అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కాయలు ఏర్పడే శాతాన్ని తగ్గిస్తాయి. అధిక ఉష్ణోగ్రత, వేడి గాలుల వల్ల పిందె, పూత రాలుతుంది. వెచ్చని, సూర్యరశ్మితో కూడిన వాతావరణం కాయలు ఏర్పడటం, విత్తన అభివృద్ధికి అత్యంత అనుకూలం.

రాష్ట్రంలో సాధారణంగా వానకాలం, యాసంగి, ఎండా కాలాల్లో సాగు చేసే అన్ని సూటి రకాల విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. విత్తనోత్పత్తిలో టమాటా పూత, సంపర్కం చెందే లక్షణాలపై అవగాహన అవసరం.
ఒక గుత్తిలో సరాసరి 4–5 పూలు ఉంటాయి. పూలు విచ్చుకోవడం, నేలలో తేమ, ఉష్ణోగ్రతను బట్టి ఉంటుంది. పొద్దుగాల 8–10:30 మధ్య పూలు విచ్చుకుంటాయి. 9–10:30 గంటల మధ్య పుప్పొడి రేణువులు విడుదల అవుతాయి. 8:30–11:30 గంటల మధ్య సమయంలో కీలాగ్రం పుప్పొడి రేణువులు స్వీకరించడానికి సిద్ధంగా ఉంటుంది. కీలాగ్రం చుట్టూ పుప్పొడాశయాలు ఉండటం వల్ల టమాటా ప్రధాన స్వపరాగ సంపర్కం చెందే పంట. అయితే 'బంబుల్ ఈగలు పూలను తరచూ సందర్శించడం వల్ల 3.8 శాతం వరకు పరపరాగ సంపర్కం చెందే అవకాశాలున్నాయి.

**వేర్పాటు దూరం:** ఒక టమాటా రకం నుంచి మరో టమాటా రకం పంట పొలానికి ఫౌండేషన్ విత్తనోత్పత్తికి 50 మీటర్లు, ధృవీకరణ విత్తనోత్పత్తికి 25 మీటర్ల వేర్పాటు దూరం ఉండాలి.

**నేలలు:** మేలైన మురుగు నీటి పారుదల సౌకర్యం ఉన్న ఒండ్రు మట్టినేలలు, ఎర్రనేలలు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు ఈ పంట సాగుకు అనుకూలం. ఉదజని సూచిక 6–7 మధ్య ఉండి, తేమ నిలుపుకునే సామర్థ్యం ఉన్న నేలలు అనుకూలం.

**ఎరువులు:** హెక్టారుకు 25 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు, 100 కిలోల నత్రజని, 50 కిలోల చొప్పున భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను వాడాలి. మొత్తం భాస్వరం, పొటాష్‌లు, ముప్పై శాతం సిఫార్సు నత్రజని ఎరువును దుక్కి సమయంలో, మిగతా నత్రజనిని రెండు దఫాలుగా ప్రధాన పొలంలో నాటిన 30,50 రోజుల తర్వాత పంటకు అందించాలి. పైపాటు ఎరువులు వేసిన తర్వాత, బోదెలు సరిచేసిన తర్వాత కచ్చితంగా తేలిక పాటి నీటి తడులు ఇవ్వాలి.

**విత్తన మోతాదు:** హెక్టారుకు 500–600 గ్రాములు.

**విత్తే సమయం:** ఏడాది అంతా విత్తుకోవచ్చు. వాన కాలం విత్తిన పంటకు అయితే జూన్ 7లోగా, చలి కాలంలో అయితే అక్టోబర్‌లోపు, అదే ఎండాకాలమైతే మార్చి మొదటి వారం వరకు విత్తుకుంటే విత్తనోత్పత్తి ఎక్కువ. అయితే సాగు నీటి సౌకర్యం కచ్చితంగా ఉండాలి.






**ఎక్కువ మొత్తంలో విత్తన సేకరణకు వాణిజ్యంగా టమాటా పల్పర్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాలు గుజ్జు మిశ్రమం నుంచి గింజలను నేరుగా వేరు చేస్తాయి. ఒక రాత్రి యంత్రంలో ఉంచిన తర్వాత కొళాయి నీటితో కడిగి శుభ్రపరుచాలి.**

**విత్తన దిగుబడి:** హెక్టారుకు 10–15 క్వింటాళ్ల దిగుబడి.

విత్తన ప్రమాణాలు: (నిర్ణయించిన)

భౌతిక స్వచ్ఛత (గరిష్ఠం): 97 శాతం

జడపదార్థం (గరిష్ఠం): 2 శాతం

ఇతర పంటల విత్తనాలు (గరిష్ఠం): 0.10 శాతం

మొలక శాతం (కనీసం): 70 శాతం

**తేమశాతం:** సాధారణ సంచుల్లో 8 శాతం, తేమ చేరని సంచుల్లో 6 శాతం ఉండాలి.

**నారుమడి:** ఎత్తైన నారుమడులలో మాత్రమే నారు పెంచాలి. నీటి క్యాన్లతో రోజూ నారుమడులను తడుపాలి. చలికాలం (యాసంగి)అయితే పాలిథీన్ షీట్లతో కప్పి అధిక చలి తీవ్రత నుంచి కాపాడుకోవాలి. మొక్క లు 4–5 సెం.మీ ఎత్తు పెరిగినప్పుడు, ఆరోగ్యవంతమైన వాటిని ఉంచి, తెగులు సోకిన, అంతగా ఎదగని మొక్కలను తీసివేయాలి. 12–15 సెం.మీ ఎత్తున్న 4–5 వారాల మొక్కలను ప్రధాన పొలంలో నాటాలి. మార్చి చివరి నాటికి ప్రధాన పొలంలో నాటాలి. చలి తగ్గిన తర్వాత నాటాలి. బోదెల చివర్లో 60–70 సెం.మీ దూరంలో తయారుచేసి నాటాలి. మొక్క మొక్కకు మధ్య 45–60 సెం.మీ. దూరం ఉండాలి. నాటు వేసిన 20–25 రోజులు, 40–45 రోజులకు రెండుసార్లు కలుపు నివారణ చేపట్టాలి. హెక్టారుకు ఒక కిలో చొప్పున పెండిమిథాలిన్, 650 లీటర్ల నీటిలో కలిపి మొక్కలు నాటిన 4,5 రోజుల లోపు పిచికారీ చేసి కూడా నివారించవచ్చు.

**నీటి యాజమాన్యం:** విత్తనోత్పత్తిలో నీటి యాజమాన్యం అత్యంత కీలకం. అధిక, అల్ప నీటి తడులు ప్రమాదం. 7–15 రోజుల మధ్య నీటి తడులు ఇవ్వాలి. నీటి ఎద్దడి ఏర్పడితే పూత, పిందె రాలిపోతుంది. ఆ తర్వాత ఒకేసారి ముమ్మరంగా నీటి తడులు ఇచ్చినా కాయ అభివృద్ధి తగ్గిపోతుంది. కాబట్టి తక్కువ వ్యవధిలో ఎక్కువ సార్లు నీటిని అందించాలి.

**కల్తీలు:** స్వచ్ఛమైన విత్తనోత్పత్తికి టమాటాలో మూడు సార్లు కల్తీలు ఏరివేయాలి. శాఖీయ దశ, పూర్తి పూత దశ, కాయలు ముదిరే దశలో భౌతిక లక్షణాల ఆధారంగా కల్తీలు గుర్తించాలి. వీటితో పాటు ఆకుమచ్చ, మెజాయిక్ తెగుళ్లు, ఎర్లీ బ్లైట్ సోకిన మొక్కలను ఏరివేయాలి. విత్తన పొలంలో కల్తీలు 0.5 శాతం కంటే ఎక్కువగా ఉండరాదు. అలాగే విత్తన జనన తెగుళ్లు సోకిన మొక్కలు కూడా 0.50 శాతానికి మించి ఉండకూడదు.

**కోత, విత్తన సేకరణ:** విత్తన సేకరణకు బాగా ఎరుపుగా పండిన పండ్లన మాత్రమే ఎంచుకోవాలి. నాణ్యత బాగుండేందుకు, చివరి దశలో వచ్చిన పండ్ల నుంచి గింజలు సేకరించరాదు.

**విత్తన సేకరణ పద్ధతులు:** మూడు పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. 1) పులియబెట్టే పద్ధతి: ఎర్రగా పండి పండ్లను పిసికి ఇనపేతర గిన్నెలలో పులియబెట్టా లి. ఎండాకలంలో అయితే 24–48 గంటలు, యాసంగిలో అయితే 48–72 గంటలు పులియబెట్టాలి. ఈ విధానం పూర్తయ్యేసరికి గుజ్జుపై నురుగు ఏర్పడుతుంది. గింజలు మిగతా పదార్థం నుంచి వేరు అవుతాయి. ఆ తర్వాత నీటిలో ఉంచితే విత్తనం అడుగు భాగానికి చేరుతుంది. గుజ్జు, ఇతర పదార్థాలు పైన తేలుతాయి. విత్త నం వేరుగా కడిగి శుభ్రపరుచాలి. ఎక్కువ సమయం పులియకుండా చూడాలి.
**ఆమ్ల శుద్ధి పద్ధతి:** వాణిజ్య హైడ్రోక్లోరికామ్లం 11 కిలోల టమాటా గుజ్జుకు 100 మి.లీ. చొప్పున బాగా కలిపి, 30 నిమిషాల పాటు ఉంచాలి. ఆ తర్వాత నీటితో శుభ్రపరిచి నిల్వ చేసుకోవాలి.

**డాక్టర్**
**పిడిగెం సైదయ్య**
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన
విశ్వవిద్యాలయం
7780509322



# నగరవాసుల సమస్యలకు సమాధానం

# ఈ శాంతివనం




**ఇంటా బయటా..లోపలా వెలుపలా**
**అనుక్షణం పోరాటమే..**
**కాలరేఖ కనుచూపుమేరా**
**జీవన అస్తిత్వ తీరాన**
**ఆహారం కోసం, ఆవాసం కోసం**
**ఆరోగ్యం కోసం, కాసింత ఆనందం కోసం**
**అనంత కాలంగా, అవిరామంగా**
**జరుగుతున్న సమరం.**
**ఈ నిరంతర సంగ్రామంలో**
**ఆధునిక జీవన సంఘర్షణలో**
**అక్కడక్కడా చిన్న చిన్న ఆశలు**
**ఎండిన మోడుల్ని చిగురించే ఆకుపచ్చ స్వప్నాలు.**
**అలాంటి అనుభూతుల ఆనవాళ్లే**
**మనకు భాగ్యనగరంలోని**
**బోడుప్పల్‌లో కనిపిస్తాయి.**

శాంతి ధీరజ్..
పేర్లకు వేరైనా ఒకటిగా కలిసే, ఒక్కటిగా పలికే ముచ్చటైన జంట.
వాళ్ల మిద్దెతోటకు మల్లే..
1350 చదరపు అడుగుల్లో నిర్మించుకున్న వీళ్ల మిద్దెతోటను చూసి ఒక్కక్షణం ఆశ్యర్యపోయాను.
ఎంతకాలమైందీ అంటే..కేవలం పదినెలలే అన్నారు.
నిజమా..సాధ్యమా..అనిపిస్తుంది.
నారపల్లిలోని మిద్దెతోట రైతు తుమ్మేటి రఘోత్తమరెడ్డి గారి స్ఫూర్తితో తమ ఈ దంపతులు తమ ఇంటిపై మిద్దెతోట మొదలుపెట్టారు. మొదట వాడిపారేసిన కూలర్ టబ్బులు, 20 లీటర్ల వాటర్ క్యాన్లు, 5 లీటర్ల ఆయిల్ క్యాన్‌లు, థర్మాకోల్ డబ్బాలు, పాత సూట్‌కేస్‌లతో మిద్దెతోట మొదలుపెట్టారు. మామిడి, దానిమ్మ, అంజీర్, సపోటా, జామ వంటి పండ్ల మొక్కలకు సిమెంట్ కుండీలు వాడుతున్నారు. సిమెంట్ టబ్స్‌లో (2.5X 2X 8) తీగజాతి కూరగాయ మొక్కలు (పప్పు దోస, బీర, నేతి బీర, బచ్చలి), దానిచుట్టూ మిరప వాటికింద ఆకుకూరలు పెంచుతున్నారు. వేప, అరటి, మునగ మొక్కలకు గ్రోబ్యాగ్స్ (12X 12 ఇంచులు) వాడుతున్నారు. 8 ఇంచుల లోతు ఉన్న సిమెంటు కుండీలో గోరుచిక్కుడు 7 అడుగులు పెరిగింది. గోడ నుంచి 3 అడుగుల పొడవు ఉండే కర్టెన్ రాడ్స్‌ను 2 అడుగుల చొప్పున నాటుకుని, అడ్డంగా ఇన్సులేటెడ్ జి.ఐ వైర్‌ను (బట్టలు ఆరవేసే తీగ) అడుగు దూరానికి ఒకటి 3 వరుసలుగా కట్టారు. ఈ అడ్డ వైర్లకు నిలువుగా కొబ్బరితాళ్లు కట్టారు. ఈ వర్టికల్ పందిరిలకు దోస, బీర తీగలు పాకించారు. దీనివల్ల స్పేస్ యుటిలైజేషన్ జరుగుతుంది కదా అంటారు. అయితే ఇక్కడ ఒకే కుండీలో ఒకే మొక్క పెంచకుండా,రకరకాల మొక్కలు పెంచుతున్నారు. మునగ కుండీలో తోటకూర, మిర్చి, ప్యాషన్ ఫ్రూట్ నాటిన టబ్‌లోనే ఉల్లి, మామిడిలో తోటకూర, సపోటా టబ్‌లో నేతి బీర, జీడిమామిడిలో తీగబచ్చలి, టమాటా, వంగ, తోటకూర ఒకే కుండీలో పెంచుతున్నారు. నిమ్మ కుండీలో గంగవాయిలి వేశారు. ఎటుచూసినా కుండీలలో గుత్తులుగుత్తులుగా ఆకుకూరలు, కూరగాయలు.. బయట కొనే పనే లేదు.
చిన్న టబ్‌లో గోంగూర వేస్తే విపరీతంగా వచ్చింది. తెల్లవంగ గుత్తులుగుత్తులుగా కాస్తున్నాయి. మిద్దెతోటలో పండ్లమొక్కలు ఎత్తుగా పెరగకుండా,చిన్నసైజులో కాయడానికి అనువైన ఎన్నో మొక్కలను (బోన్సాయ్) పెంచుతున్నారు. ఇందుకు మొదటగా నర్సరీ నుంచి పండ్ల మొక్క తెచ్చి, తరువాత 3–4 రోజుల తరువాత నీటిలో ముంచి మట్టిని తొలిగించి, తల్లి వేరును పూర్తిగా కత్తిరించి,ఆ భాగంలో తెగుళ్ల సోకకుండా దాల్చిన చెక్క పౌడర్‌ను అద్దాలంటారు. తరువాత 1X 1X 1 కంటెయినర్‌లో నాటి 3 రోజులపాటు నీడలో ఉంచి తరువాత 3 రోజులపాటు సెమి షేడ్, ఆ తరువాత పూర్తిగా ఎండలోకి తీసుకరావాలి. ఈ రకంగా మార్పు చేసిన మొక్కలు తక్కువ ఎత్తులోనే కాయలు కాస్తాయన్నది వీరి అనుభవం. గులాబీ రంగు,తెలుపు రంగు మొక్కలను గ్రాఫ్టింగ్ చేసి, ఒకే మొక్కకు తెలుపు, గులాబీ, తెలుపు గులాబీ కలగలిసిన రంగు పూలు పూయిస్తున్నారు.
మరి ఎరువు సంగతి ఏమిటంటే..? రెండు వంతుల ఎర్రమట్టి, రెండు వంతుల పశువుల ఎరువు, ఒక వంతు ఇసుక లేదా ధాన్యం పొట్టు లేదా రంపపుపొట్టు (2: 2: 1) చొప్పున వాడాము. ఐతే, ఎరువు ఘనరూపంలో వాడితే కంటెయినర్స్ నిండిపోతాయి. ద్రవ రూపంలో మొక్కలకు కూడా మంచిదంటారు. 1 కేజీ మాగిన పశువుల ఎరువును 4 లీటర్ల నీటిలో 48 గంటలపాటు నానబెట్టి దానికి 1:5 నీరు కలిపి చిన్న మొక్కకు 50 ఎం.ఎల్, పెద్ద మొక్క 250



ఎం.ఎల్, సాయంత్రం పూట నీళ్లు పోసిన తరువాత దీనిని మొక్కల మొదళ్లలో పోస్తున్నారు. ఇక తోటలోంచి వచ్చిన ఎండుటాకుల మీద మట్టి వేసి దానిని కుళ్లబెడుతున్నారు. దీనివల్ల ప్రతిసారీ కుండీల్లో మట్టి వాడాల్సిన అవసరం లేదంటారు. అసలు మొదట కలుపుకున్న మట్టి, ఎరువు మిశ్రమం బలమే మొదటి 7–8 నెలలు సరిపోతుందని వీళ్ల అభిప్రాయం. కొన్ని కుండీలలో వేప ఆకులు, కాయలు, బెరడు ఏది దొరికితే దానిని నిలువ చేసుకుని పాటింగ్ మిక్స్‌లో కలుపుకుంటే తెగుళ్ల నియంత్రణ చేయవచ్చని అన్నారు.

మరి మీ మిద్దెతోటకు చీడపీడల సమస్యలేమీ లేవా అంటే, ఎందుకు లేవూ..ఐతే, దీనికి చేతిని మించిన సాధనం లేదు.
ఎక్కువగా మిద్దెతోటలపై 5రకాల చీడసమస్యలు ఎదురవుతుంటాయి. ప్రారంభ దశలోని ఏ చీడనైనా చేతితో నివారించుకోవచ్చు.
మరీ సమస్య తీవ్రమైనపుడు, నల్లపేనుకు 1లీటర్ నీటికి 10 ఎం.ఎల్. వేపనూనె కలిపి పిచికారీ పిండినల్లికి 1లీటర్ నీటిలో 10ఎం.ఎల్. కుంకుడు కాయ రసం కలిపి పిచికారీ, పాముపొడకు 1లీటర్ నీటికి 10ఎం.ఎల్. ఆవు మూత్రం పిచికారీ చేసుకోవాలి. వ్యాధి తీవ్రతను బట్టి వారానికి రెండు లేదా మూడుసార్లు పిచికారీ చేయాలి. పండుదోమకు ఎల్లో ట్రాపర్స్ (గ్రీజు పూసిన ఎల్లో ప్లాస్టిక్ షీట్స్ ) పెట్టుకోవాలి. వేరు తొలిచే పురుగు సమస్యకు కుండీల్లో మట్టి ఎరువు, రంపపు పొట్టు వేసుకున్నపుడే వేపపిండి, పిడికెడు నుంచి 100 గ్రాముల వరకు కుండీల సైజును బట్టి కలుపుకోవాల ని తమ మిద్దెతోట అనుభవాలను వివరించారు. కొద్దిసమయంలోనే చాలా అనుభవాల్ని ఒడిసిపట్టిన వీరు కొత్తగా మిద్దెతోట చేసేవారికి కొన్ని సూచనలు చేస్తున్నారు. ఐతే, ఒకే మొక్కను మిద్దెతోటలో పండించడానికీ, నేల మీద సాగు చేయడానికీ మధ్య కొంచెం తేడా ఉంటుందనే విషయం ప్రధానంగా గుర్తించాలంటారు.

- ఇళ్లు కట్టేటపుడే సిమెంట్, ఇసుక మిశ్రమంలో వాటర్ ప్రూఫ్ లిక్విడ్ కలుపాలి. దీనివల్ల నీరు నిలిచినా మిద్దెకు ఎలాంటి సమస్య రాదు. • వాటర్‌ట్యాంక్‌లకు వ్యతిరేక దిశ నుంచి కుండీలు ఎక్కువ పెట్టుకుంటూ రావాలి. దీనివల్ల మిద్దెమీద బరువును సులువుగా మేనేజ్ చేయవచ్చు. • కంటెయినర్ నిండా ఎరువు, మట్టి మిశ్రమం నింపకూడదు. పైన 2 ఇంచుల గ్యాప్ ఉంచాలి. దీనివల్ల పోసిన నీరు బయటకు రాదు. • కంటెయినర్‌కు అడుగు భాగంలో రంధ్రం ఉండాలి. ఎండిన ఆకులుగానీ, పెంకుగానీ పెట్టడం వల్ల ఎక్కువైన నీరు సులభంగా బయటకు పోతుంది. • కంటెయినర్స్‌కు, మిద్దెకు మధ్య కొంత గ్యాప్ ఉండాలి. దీనివల్ల కింద నీరు నిలువదు. అలా లేకపోతే కింద నీరు నిలువ ఉండి స్లాబ్ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉన్నది. • గార్డెన్ అంతా ఒకే సారి నాటకూడదు. ఎప్పుడూ ఒక 25 శాతం కుండీ లు ఖాళీగా ఉంచాలి. ఒక పంట కోసుకునే సమయంలో అదే మొక్కలు ఖాళీ కుండీల్లో తిరిగి నాటుకోవాలి. దీనివల్ల సంవత్సరం పొడవునా అన్నిరకాల కూరగాయలు మనకు అందుబాటులో ఉంటాయి. • మిద్దెతోటలలో పాలినేషన్ కోసం పొద్దుతిరుగుడు, ఆవాలు, బంతి వంటి పసుపు పచ్చని మొక్కలు నాటాలి • మొక్కకు ఎప్పుడూ సాయంత్రం నాటుకోవాలి. దీనివల్ల రాత్రంతా అది చల్లగా ఉండి కోలుకునే అవకాశం ఉంటుం ది. • తేమ ఉన్నప్పుడు నీళ్లు అవసరం లేదు. తేమ లేకపోతే నీరు కచ్చితంగా పోయాలి. ఆకు వడబడితే నీళ్లు వెంటనే అందించాలి. నీరు ఎక్కువైతే వేరు కుళ్లిపయి మొక్క వెంటనే చచ్చిపోతుంది. • మొక్కలకు సాయంత్రం వేళల్లో నీరు పెట్టడం మంచిది. • నేతిబీర, అంజీర్, గోంగూర, మునగకు ఉదయం, సాయంత్రం నీళ్లు పోయాలి. వీటికి ఎక్కువ నీరు అవసరం. • ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కూరగాయల నార్లు పోసుకోవాలి. • కూరగాయలు, తీగజాతి ఒక్కొక్క రకం కనీసం 30 విత్తనాలు పెట్టుకుంటే కనీసం 15 మొక్కలు బతుకుతాయి. కొన్ని ఎక్కువ కాసినా మరికొన్ని తక్కువ కాసినా ఒకరోజు ఇంటికి సరిపోయే ఉత్పత్తి వస్తుంది. • ఎండాకాలం చివరలో పెద్ద చెట్లకింద నారు పోసుకోవచ్చు. దీనివల్ల మొలకశాతం రాదనే సమస్య ఉండదు. • మిద్దెతోటలో రకరకాల టెర్రాకోట బొమ్మలు, ముఖ్యంగా కుండలు ఎత్తుకున్న స్త్రీల బొమ్మలు పెట్టుకుంటే, వాటిలో నీరు, విత్తనాలు వేస్తే పక్షులు వస్తాయి. దీనివల్ల పురుగుల సమస్య తగ్గుతుంది. • మరువం ఆకులకు ఎండ తగలాలిగానీ, కాండానికి కాదు. అందుకే దీన్ని పెద్ద మొక్కల మధ్య నాటుకోవాలి.• కలుపు మొక్క కూడా దేవుడు కావాలనే సృష్టించాడనిపిస్తుంది. ఎందుకంటే కలుపు పీకితే అక్కడ నేల గుల్లబారుతుంది. దీనివల్ల మొక్కవేరుకు గాలిప్రసారం జరుగుతుంది. చివరగా,వచ్చేతరం ఆరోగ్యం. ఆనందం లక్ష్యంగా ఇంటిపంటల ఉద్యమం ముందుకు సాగాలి అనేదే మా అభిమతం అంటారు ఈ మొక్కల ప్రేమికులు.

## శాంతి ధీరజ్ మిద్దె మీద ఒదిగిన మొక్కలు



**కూరగాయలు:** టమాట,వంకాయ (నలుపు,తెలుపు)బెండ (2 రకాలు),గోరుచిక్కుడు,చెట్టు చెమ్మ,చెట్టు చిక్కుడు,మిరప, కాప్సికం,బజ్జి మిర్చి, మునగ

**ఆకుకూరలు:** పాలకూర,తోటకూర (ఆకుపచ్చ,ఎరుపు,పెరుగు తోటకూర), కోడిజుట్టుకూర, పుదీనా, పొన్నగంటి కూర, ఎర్ర బచ్చలి, పచ్చ బచ్చలి, గంగవావిలి, గోంగూర, ఎర్ర గలిజేరు, తెల్ల గలిజేరు, కరివేపాకు

**పండ్ల మొక్కలు:** యాపిల్, మామిడి, దబ్బ నిమ్మ, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, అంజీర్, స్టార్‌యాపిల్, సపోటా, జామ, తైవాన్ జామ, బొప్పాయి,అరటి (అమృతపాణి), ఆరెంజ్ ,అల్ల నేరేడు, ప్యాషన్ ఫ్రూట్(ఎరుపు,పర్పుల్),జీడి మామిడి,పెద్ద ఉసిరి, సీతాఫలం, మల్బరీ (బొంత పళ్లు), పైన్ యాపిల్, వాటర్ యాపిల్,ఆపిల్ బేర్, ద్రాక్ష( పచ్చ,ఎరుపు)

**పూల మొక్కలు:** కనకాంబరం (3రకాలు), కాగితం పూలు (బోగన్ విల్లియా),పొద్దుతిరుగుడు (చిన్నవి), గులాబీ (5– 6 రకాలు), సన్నజాజి, మందార, మల్లె,కాస్మోస్,అల్మండా (2రకాలు),టేబుల్ రోజెస్,లావెండర్ బెల్స్,డయాంథస్, బ్రహ్మ కమలం, బంతి, యామ్ రిల్లీస్, రాధా మనోహరం
**దుంపజాతులు:** ఉల్లి,చేమ,పసుపు (ముద్ద పసుపు,కస్తూరి పసుపు)

**తీగజాతులు:** దొండ,కాకర,బీర,నేతి బీర,చెమ్మ కాయ,పప్పు దోస,అలసంద

**ఔషధ మొక్కలు:** కలబంద, తులసి, కర్పూర తులసి, సబ్జ, నిమ్మ గడ్డి, వాము, తిప్ప తీగ, తెల్ల వీసర

**సుగంధ ద్రవ్య మొక్కలు:** బిరియాని ఆకు, మిరియాలు, యాలకులు

**బోన్సాయ్ మొక్కలు:** సపోటా,సలాడ్ నిమ్మ,అంజీర్, జువ్వి, అడేనియమ్,దానిమ్మ ఆక్సిజన్‌ను ఎక్కువగా అందించే మొక్కలు స్పైడర్ ప్లాంట్,స్నేక్ ప్లాంట్,రబ్బర్,డౌస్,జడ్ జడ్ ప్లాంట్, ఫైకస్, పీస్ లిల్లీ,రెడ్ పోయన్,గ్రౌండ్ ఆర్కిడ్, సెటియా, మనీ ప్లాంట్ (3రకాలు), డ్రాగన్ ప్లాంట్, జేడ్, ఫైకస్, అగ్లోనియం, రెడ్ లిప్‌స్టిక్,కోలియస్ వీటితోపాటు కంది,బేబీకార్న్ వంటి పంటలు, వేప, జువ్వి వంటి మహావృక్షాలు,తమలపాకు వంటివి ఇక్కడ పెరుగుతున్నాయి.

**ఇతర వివరాలకు.. వెంకటకృష్ణను సంప్రదించాల్సిన**
**98667 51439**

**కె.క్రాంతికుమార్‌రెడ్డి,** 9603214455
నేచర్స్‌వాయిస్




## వెంకీ అభిమానిగా కనిపిస్తా

''బ్రోచేవారెవరురా' చిన్న సినిమానా?పెద్ద సినిమా అవుతుందా అనేది విడుదల తర్వాతే తెలుస్తుంది. ప్రతిభావంతుడైన దర్శకుడు, చక్కటి అభినయసామర్థ్యాలు కలిగిన నటీనటుల కలయికలో రూపొందుతున్న చిత్రమిది' అని అన్నారు హీరో రామ్. శ్రీవిష్ణు, నివేథా థామస్, నివేథా పెతురాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్రోచేవారెవరురా'. వివేక్ ఆత్రేయ దర్శకుడు. విజయ్‌కుమార్ మన్యం నిర్మించారు. రేపు ఈ చిత్రం విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నారా రోహిత్ మాట్లాడుతూ 'సినిమాకు మంచి టీమ్ కుదిరింది. సక్సెస్ కళ ఇప్పుడే అందరిలో కనిపిస్తున్నది' అని తెలిపారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ 'హీరోల్లో వెంకటేష్ అంటే నాకు ఇష్టం. ఈ సినిమాలో ఆయన అభిమానిగా నటిస్తున్నాను. మిత్ర అనే పాత్రను నమ్మి చేసిన సినిమా ఇది. నిత్యజీవితంలో ప్రతి ఆడపిల్లకు ఎదురయ్యే సమస్యల్ని చర్చిస్తూ దర్శకుడు చిత్రాన్ని రూపొందించారు. వినోదంతో పాటు చక్కటి సందేశం మిళితమై ఉంటుంది. ఈ సినిమా కోసం నివేథా థామస్ నృత్యాల్లో శిక్షణ తీసుకొని నటించింది' అని తెలిపారు. మంచి సినిమాలో భాగమవ్వడం ఆనందంగా ఉందని రాహుల్ రామకృష్ణ పేర్కొన్నారు. మహిళలందరూ చూడాల్సిన సినిమా ఇదని నివేథా థామస్ చెప్పింది. ఈ కార్యక్రమంలో వివేక్‌సాగర్, వివేక్ ఆత్రేయ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంపదను కాపాడాలి




'సమాజ హితం కోసం నారాయణమూర్తిలా పరితపించే వ్యక్తులు సమకాలీన సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తారు' అని అన్నారు మాజీ శాసనసభాధిపతి మధుసూదనాచారి. ఆర్.నారాయణమూర్తి కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'మార్కెట్లో ప్రజాస్వామ్యం'. సెన్సార్ పూర్తయింది. జూలై 12న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో మధుసూదనాచారితో పాటు పలువురు రాజకీయ, ఉద్యమసంఘాల నాయకులు ఈ చిత్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ 'ధనస్వామ్యంగా మారిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని చాటిచెప్పే సినిమా ఇది. దేశ ఖనిజ సంపద ప్రైవేటు పరం కావడంతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. జాతి వనరులు ప్రజలకే చెందాలని ఇందులో చూపించాం. దేశంలో పదిశాతం మంది చేతుల్లో అధికారం ఉంటే మిగిలిన తొంభై శాతం మంది బడుగు బలహీనవర్గాలు పాలింపబడుతున్నారు. నిజమైన ప్రజాస్వామ్యం రావాలంటే పేదప్రజల్లో ఐక్యత రావాలి. అంబేద్కర్, జ్యోతిబాపూలే బాటలో నడవాలి. విమలక్క, గోరటి వెంకన్న, తేలు విజయ, నాగూర్‌బాబు, వందేమాతరం శ్రీనివాస్ ఆలపించిన పాటలకు మంచి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు.

## డబ్బు కూడా రావాలి!

**'మూసధోరణితో కూడిన సినిమాల్లో నటించడం కంటే కొత్త ప్రయత్నాలు చేయడం ఉత్తమం. సినిమా పరాజయం పాలైనా రిస్క్ చేశాడనే పేరు దక్కుతుంది' అని అన్నారు ఆది సాయికుమార్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'బుర్రకథ'. డైమండ్ రత్నబాబు దర్శకుడు. ఈ నెల 28న విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో ఆదిసాయికుమార్ సినిమా విశేషాల్ని పాత్రికేయులతో పంచుకున్నారు..**




రెండు బ్రెయిన్‌లతో పుట్టిన ఓ యువకుడి కథ ఇది. అభి, రామ్ అనే పేర్లతో పిలవబడే అతడి జీవితగమనంలో ఎదురయ్యే సంఘటనలు నవ్విస్తూనే భావోద్వేగానికి లోను చేస్తాయి. నా కెరీర్‌లో వైవిధ్యమైన సినిమా అవుతుందనే ఆలోచనతో అంగీకరించాను. వినూత్నమైన పాత్రలు చేస్తున్నప్పుడు భయంతో పాటు సవాళ్లు ఎదురవుతుంటాయి. అభి, రామ్ పాత్రల మధ్య వైవిధ్యతను నేను సరిగా చూపించగలనా?లేదా? అనే భయం సినిమా మొత్తం వెంటాడింది. ఇప్పటికీ ఆ భయం అలాగే ఉంది.

**నవతరానికి ప్రతీక..**

అభి పాత్ర నవతరానికి ప్రతీకగా సరదాగా సాగితే రామ్ మాత్రం వివేకానందుడు, అబ్దుల్ కలాం మాదిరిగా పేరుతెచ్చుకోవాలని కలలు కంటుంటాడు. క్లిష్టమైన కథను ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా సింపుల్‌గా రత్నబాబు తెరపై ఆవిష్కరించారు. దర్శకుడిగా ఇదే తొలి సినిమా అయినా రచయితగా తనకున్న అనుభవన్నంతా ఉపయోగించి తెరకెక్కించారు. ప్రాసలతో కూడిన సంభాషణలు అలరిస్తాయి.

**అలాంటి విజయం కోసం**

ప్రస్తుతం ప్రేక్షకులు రొటీన్ సినిమాల్ని ఇష్టపడటం లేదు. అందుకే కథాంశాల పరంగా వైవిధ్యతకే ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించుకున్నాను. ప్రేమకావాలి, లవ్‌లీ తర్వాత మళ్లీ ఆ స్థాయి విజయం నాకు రాలేదు. పేరు, డబ్బుతో పాటు ప్రశంసలు లభించడమే నా దృష్టిలో అసలైన విజయం. అలాంటి సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నాను. పెళ్లి తర్వాత ప్రేమకథల్లో నటించే విషయంలో ఎలాంటి ఆంక్షలు లేవు. అయితే లిప్‌లాక్‌లు, రొమాన్స్ ఎక్కువగా ఉండే సినిమాలు చేయను. ఇదివరకు నేను తిరస్కరించిన సినిమాలు పెద్ద విజయాల్ని సాధించగా మరికొన్ని పరాజయాల పాలయ్యాయి. కొన్ని సార్లు మన జడ్జిమెంట్ తప్పువుతుంది.అది సహజం. కథల ఎంపికలో నా అభిరుచులు సరిగా ఉండవని సోదరి ఎప్పుడూ చెబుతుంటుంది.

**కశ్మీర్ పండిట్ల ఆధారంగా**

ప్రస్తుతం 'ఆపరేషన్ గోల్డ్‌ఫిష్' సినిమా చేస్తున్నాను. కశ్మీర్ పండిట్ల సమస్యలను ఆవిష్కరిస్తూ యథార్థ సంఘటనల ఆధారంగా దర్శకుడు అడివి సాయికిరణ్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఇందులో అర్జున్ పండిట్ అనే ఆర్మీ మేజర్‌గా కనిపిస్తాను. అలాగే 'జోడీ' పేరుతో ఓ ప్రేమకథలో నటిస్తున్నాను. దీనితో పాటు ఓ ద్విభాషా సినిమా చేస్తున్నాను.




